


మౌనంలో మాతాజీ



మారిషస్‌లో మాతాజీ



నయాగరా జలపాతమువద్ద మాతాజీ



మాతాజీ మారిషస్ యాత్ర

పూజ్యశ్రీ జ్ఞానేశ్వరి మాతాజీ వారి దివ్యసందేశములు - దేశ విదేశీయ పర్యటనలు

# పూజ్యశ్రీ జ్ఞానేశ్వరి మాతాజీ

వారి

# దివ్యసందేశములు - దేశ విదేశీయ పర్యటనలు

ॐ



ద మిషన్ ఆఫ్ పీస్

**శ్రీ శాంతి ఆశ్రమము**

తూ॥గో॥జిల్లా. 533 446

# పూజ్యశ్రీ జ్ఞానేశ్వరి మాతాజీ వారి
# దివ్య సందేశములు
# దేశ విదేశీయ పర్యటనలు



**భగవంతుడు ఒక్కడే**
**వివిధ నామ రూపములలో ఆరాధించబడుచుండును.**


ద మిషన్ ఆఫ్ పీస్

**శ్రీ శాంతి ఆశ్రమము**

**తోటపల్లి కొండలు, వయా శంఖవరం–533 446**

తూ॥గో॥జిల్లా, ఆంధ్రప్రదేశ్

ఫోన్ : 7382009962

ప్రథమ ప్రచురణ : 13-10-2016
పూజ్య జ్ఞానేశ్వరి మాతాజీవారి 87వ జన్మదినం
( శ్రీ శాంతి ఆశ్రమ శతజయంతి ఉత్సవాలు
21.1.2016 -21.1.2017 సందర్భంగా )

సంకలనం : ఆశ్రమవాసులు (శాంతి పత్రిక నుండి)

ప్రతులు : 1000
సర్వహక్కులు : శ్రీశాంతి ఆశ్రమం, తోటపల్లి కొండలు

ప్రకాశకులు
ద మిషన్ ఆఫ్ పీస్
**శ్రీ శాంతి ఆశ్రమము**
**తోటపల్లి కొండలు, వయా శంఖవరం-533 446**
తూ॥గో॥జిల్లా, ఆంధ్రప్రదేశ్
ఫోన్ : 7382009962

ముద్రణ పర్యవేక్షణ : **మోహన్ పబ్లికేషన్స్, కోటగుమ్మం,**
mohanpublications.com
**రాజమహేంద్రవరం - 533 101.**
www.Granthanidhi.blogspot.in

---

**కృతజ్ఞతాభి వందనములు**

ఈ పుస్తక ముద్రణకు ఆర్థిక సహాయం అందించిన,
మాతృ ఆశ్రమ వాసులు
**శ్రీమతి దాసరి శేషారత్నం, శ్రీమతి అల్లూరి లక్ష్మీనరసమ్మ,**
**శ్రీ కొల్లి ప్రసాద్‌గార్లకు**
భగవంతుని ఆశీస్సులతోపాటు, పరమపూజ్య శ్రీ ఓంకార్‌స్వామి,
పూజ్యశ్రీ జ్ఞానేశ్వరి మాతాజీవారు అనుగ్రహించుగాక !

**-ఆశ్రమ యాజమాన్యం**

# పూజ్యశ్రీ జ్ఞానేశ్వరి మాతాజీ వారి
# దివ్య సందేశములు - దేశ విదేశీయ పర్యటనలు

## విషయసూచిక

### భాగము - 1


| | | |
|---|---|---|
| | మున్నుడి | 05 |
| | సోహం భావనే | 07 |
| 1. | మహాత్యాగము | 09 |
| 2. | ఇతరుల తప్పులు వెదుకకుము | 13 |
| 3. | స్వామీజీ నుండి నేను ఏమి నేర్చుకున్నాను ? | 14 |
| 4. | ఇహపర సుఖములకు ద్వాదశ సూత్రములు | 17 |
| 5. | అద్భుతమైన దివ్యానుభవము | 18 |
| 6. | మానవ జీవిత పరమావధి | 21 |
| 7. | వైకుంతపాళి (పరమపద సోపాన పటము) | 23 |
| 8. | మురళి - దాని మధుర గానము | 26 |
| 9. | హోళీ పండుగ | 30 |
| 10. | పూజ్యశ్రీ స్వామీజీ బోధలవలన - నేను ఏమితెలుసుకొనగలిగితిని | 31 |
| 11. | ఆరోగ్యమే - మహాభాగ్యము | 32 |
| 12. | పూజ్యశ్రీ స్వామీజీ చివరి రోజులు | 34 |
| 13. | నిత్యానందం | 42 |
| 14. | కాలం యొక్క విలువ | 43 |
| 15. | సంకీర్తన | 45 |
| 16. | దైవాజ్ఞ | 46 |
| 17. | ఈక్షణమే మనది | 47 |
| 18. | సాధువుల లక్షణము | 48 |
| 19. | పూజ్య స్వామీజీ జన్మదినం-మనందరి జన్మదినం-21.1.2001 | 49 |
| 20. | అమూల్య మానవ జీవిత ధ్యేయము | 50 |
| 21. | పనియే ఆరాధన | 53 |
| 22. | సత్సాంగత్యం (కాపవ్యుడి కథ) | 53 |
| 23. | సుప్రేమ - విశ్వ ప్రేమ | 54 |
| 24. | పూజ్యశ్రీ ఓంకార స్వామీజీ గురించి మాతాజీ వారి అనుగ్రహ భాషణం - 13.5.2006 | 56 |
| 25. | మాతాజీ వారి అనుగ్రహ భాషణం - 30.05.2006 | 59 |
| 26. | పూజ్య స్వామీజీ వారి 114వ జన్మదిన సందర్భంగా పూజ్యశ్రీ మాతాజీవారి సందేశం | 62 |

| | | |
|---|---|---|
| 27. | మనోవిజయసాధనే దుఃఖాలను దూరం చేస్తుంది–14.5.2008 | 63 |
| 28. | సాధనా శిబిరంలో ఇచ్చిన సందేశం - 30.5.2008 | 64 |
| 29. | పూజ్య శ్రీ స్వామీజీవారి 120వ జన్మదిన సందర్భంగా పూజ్య శ్రీ జ్ఞానేశ్వరి మాతాజీవారి సందేశం | 66 |
| 30. | పూజ్య శ్రీ స్వామీజీ వారి 121వ జన్మదిన సందర్భంగా పూజ్య శ్రీ జ్ఞానేశ్వరి మాతాజీవారి సందేశం | 67 |
| 31. | భారతదేశము యొక్క విలువ | 68 |
| 32. | భారతీయుల కర్తవ్యం | 70 |
| 33. | జీవిత ధ్యేయం | 71 |
| 34. | శాంతి ఆశ్రమము | 73 |


## భాగము - 2


| | | |
|---|---|---|
| 1. | శ్రీరామ నవమి సందేశముల సారాంశము | 83 |
| 2. | వాల్మీకి జయంతి | 87 |
| 3. | శ్రీకృష్ణ జన్మాష్టమి సందేశముల సారాంశము | 89 |
| 4. | గీతాజయంతి సందేశముల సారాంశము | 103 |
| 5. | హిమాలయ - ఆనంద కుటీర - దివ్యజ్యోతి | 109 |
| 6. | పూజ్యశ్రీ వినోబాజీ సందర్శన భాగ్యము | 111 |
| 7. | శ్రీ అవతార్ మెహర్‌బాబా జయంతి సందేశములు | 113 |
| 8. | గాంధీమహాత్ముని జయంతి సందేశములు | 117 |
| 9. | మాతృశ్రీ శారదాదేవి - పవిత్ర జనని | 121 |
| 10. | బుద్ధుడు | 124 |
| 11. | శ్రీ శంకరాచార్యుల జయంతి | 126 |
| 12. | శ్రీ వినోబాజీ భూదాన యజ్ఞం | 128 |
| 13. | మహర్షి శ్రీ సద్గురు మలయాళ స్వాములవారు | 129 |
| 14. | పూజ్యశ్రీ చిదానంద స్వామివారికి హృదయ పుష్పాంజలి | 131 |


## భాగము - 3


| | | |
|---|---|---|
| 1. | నా బొబ్బిలి యాత్ర | 133 |
| 2. | శ్రీ జ్ఞానేశ్వరి మాత గారి దక్షిణాఫ్రికా యాత్ర | 136 |
| 3. | మా హిమాలయ యాత్ర | 148 |
| 4. | మా బెంగుళూరు పర్యటన | 159 |
| 5. | పవిత్ర హిమాలయాలలో మా మండల నివాసం | 163 |
| 6. | పూజ్య శ్రీ మాతాజీ వారితో బొంబాయి ప్రయాణం | 170 |
| 7. | కెనడా యాత్ర | 171 |
| 8. | మా మారిషస్ పర్యటన | 181 |

# మున్నుడి

నేను శ్రీ వ్యాసాశ్రమమునందంతేవాసిగా ఉన్నరోజులలో 1959లో పరమ పూజ్య శ్రీ ఓంకారస్వామి వారి బృందము శ్రీ వ్యాసాశ్రమమున కేతెంచినప్పుడు నేను పూజ్యశ్రీ జ్ఞానేశ్వరి మాతాజీవారిని ప్రప్రథమముగా దర్శించితిని. అటు పిమ్మట నేను "శాంతి" మాసపత్రికకు "సత్యంమాతా"–"పితాజ్ఞానం" వంటి వ్యాసములను పంపగా పత్రిక సంపాదకులు వాటిని ప్రచురించడం కూడా జరిగింది. అనంతరం నేను శ్రీ శివానందాశ్రమములో 1965లో ప్రవేశించిన తదుపరి 1968లో పరమ పూజ్యశ్రీ ఓంకారస్వామి బృందము శ్రీ శివానందాశ్రమునకేతెంచిన సందర్భము నందు కూడా పూజ్యశ్రీ జ్ఞానేశ్వరి అమ్మగారిని దర్శించడం జరిగింది. అనంతరము 1990లో అక్టోబరు 2వ తేదిన పూజ్యశ్రీ మాతాజీ బృందము శ్రీ శివానందాశ్రమము నకు వచ్చి యమునోత్రి, గంగోత్రి, కేదార్‌నాథ్, బదరీనాథ్‌లను దర్శించినప్పుడున్నూ, వారిని దర్శించడమైనది. ఈ ప్రకారముగా ఎన్నో సందర్భములలో పూజ్యశ్రీ జ్ఞానేశ్వరి అమ్మగారి దర్శనభాగ్యము నాకు లభించుట ఆనందదాయకముగా నున్నది.

శ్రీరామకృష్ణ పరమహంస గారి దివ్య సందేశమును శ్రీస్వామి వివేకానందులెట్లు నలుదిశలలో వ్యాపింపజేసిరో, శ్రీ సద్గురు శివానంద స్వాములవారి దివ్య సందేశ మును పరమపూజ్యశ్రీ చిదానందస్వాములవారెట్లు ప్రాగ్పశ్చిమములలో వ్యాపింపి జేసిరో, పప్పారామదాసుగారి దివ్యసందేశమును మాతా కృష్ణాబాయిగారెట్లు విశ్వవ్యాప్త మొనర్చిరో, అట్లే పూజ్యశ్రీ జ్ఞానేశ్వరి అమ్మగారు పరమపూజ్యశ్రీ ఓంకారస్వామివారి శాంతి సందేశమును దేశ–విదేశములలో వ్యాపింపజేసినారనుట అతిశయోక్తి కాజాలదు. పూజ్యశ్రీ జ్ఞానేశ్వరి అమ్మగారు శాంతి స్వరూపిణి. ఈ కారణముచే కేవలము తమ అస్తిత్వముచేతను, మృదుమధురములగు పలుకులచేతను, మంద గమనముచేతను సకలచరాచర జగత్తునకు శాంతిసందేశము నొసంగు చుండుట ద్వారాను అందరికి అమందానందమును ప్రసాదించుచున్నారు. కేవలము జ్ఞానియే! శాంతి నొందుటకు అర్హతను కలిగియుండును. కావున అజ్ఞానమును తొలగించి, మనుజునికి జ్ఞానము నొసంగు మాతయే ! పూజ్యశ్రీ జ్ఞానేశ్వరీ మాత. అజ్ఞానము, అశాంతి తొలగింపబడి జ్ఞానము, శాంతి లభించినప్పుడు మనకు ఆనందము ప్రాప్తించును. కాబట్టి శ్రీ జ్ఞానేశ్వరీ మాత ఆనంద ప్రదాయిని కూడా. ఐతే ఇక ఇవన్నీ ఉన్నప్పుడు గర్వము, అహంకారములు ఆవరించుటయున్నూ సహజమే !

కాని ఈ రెండున్నూ లేకుండా విధేయత, లేక వినమ్రతను కలిగియున్న మాతయే! జ్ఞానేశ్వరీ మాత. నమ్రత సామాన్య లక్షణము. వినమ్రత విశేష లక్షణము. నమ్రత లౌకికులకు ఆభరణము వంటిది. ఇక వినమ్రత ఆధ్యాత్మిక క్షేత్రమునందున్న వారికి సువర్ణాభరణము వంటిది. ఇట్టి వినమ్రతను కలిగియున్న జ్ఞానేశ్వరీమాత వినమ్ర స్వరూపిణి. కావున మనమందరమున్నూ శాంతి, జ్ఞానము, ఆనందము, వినమ్రత ఇత్యాది సద్గుణములను పూజ్యశ్రీ జ్ఞానేశ్వరీ మాతనుండి నేర్చుకొనవలసియున్నది.

13-10-2016వ తేదిన పూజ్యశ్రీ జ్ఞానేశ్వరి అమ్మగారి 87వ జన్మదినోత్సము జరుగనున్నది. ఈ సందర్భమునందు శ్రీశాంతి ఆశ్రమ యాజమాన్యము "పూజ్యశ్రీ జ్ఞానేశ్వరి మాతాజీవారి దివ్య సందేశములు - దేశ విదేశీయ పర్యటనలు" అను గ్రంథమును ముద్రణ చేయించుచుండుట ముదావహమైన విషయము. ఈ పుస్తకము యొక్క సంగ్రహ-సంకలనములను గావించినట్టి శ్రీ వాసవి గారికి అనేక ధన్యవాదములను తెలుపుకొనుచున్నాను. ఈ గ్రంథము ప్రచురింపబడుటకై సహకరించిన వారందరికి అనేక ధన్యవాదములు. ఈ గ్రంథములోని విషయములను పఠించిన సాధకులు, భక్తులు, జిజ్ఞాసువులు, ముముక్షువులందరున్నూ పూజ్యశ్రీ జ్ఞానేశ్వరి అమ్మగారి హృదయ కమలమునందున్న శాంతి, జ్ఞానము, ప్రేమ, వినమ్రత ఇత్యాది సద్గుణముల నలవరచుకొని తమ జీవితములను బ్రహ్మానందధామములు గావించుకొని తరించెదరు గాక !

ఓం తత్ సత్

ఓం శాంతిః శాంతిః శాంతిః

తేది : 24-9-2016 ఇట్లు

శ్రీ చిదానందస్వామివారి **స్వామి హంసానంద**

జన్మశతాబ్దిమహోత్సవము

ఓం శ్రీ ఓంకారాయ నమః

## సోహం భావేన పూజయేత్

**పరమపూజ్య ఓంకార స్వామీజీ** వారి బాల్యదశ యందే **స్వామిరామతీర్థ** బోధనలచే అంతర్ముఖమై వివేక వైరాగ్యములతో హిమాలయ పర్వత శ్రేణులలో ఓంకార ధ్యానముచే సోహం భావనాతత్పరులై, తత్వజ్ఞానాన్ని అనుభవించిన మహా యోగీశ్వరులు. స్వామివారు పొందిన పరమశాంతిని విశ్వశాంతికై, విశ్వకల్యానార్థమై సాధకులు ధ్యాన సాధనలు కొనసాగించుటకుగాను, నిరక్షరాస్యులు విద్యను కొనసాగించుటకుగాను, దీనులపట్ల కల్పతరువై పరమాత్మ సంకల్పంచే తోటపల్లి కొండలు కీకరారణ్యంలో 1917వ సం॥లో శాంతి ఆశ్రమము స్థాపించిరి. 2017వ సంవత్సరం జనవరిలో శాంతి ఆశ్రమ శతాబ్ధి ఉత్సవాలు పూర్తి అవుతాయి.

**'యస్యామతం తస్యమతం'** ఎవరైతే అనిర్వాచ్యమైన పరమాత్మ గురించి బోధించి మౌనం వహిస్తారో ఆ మౌనభాషయే దివ్యమైన ఉపదేశము. విజ్ఞాన నిధి అయిన ఆ మౌన భాషయే అజ్ఞానమనే నైర్మాల్యమును తొలగించును. **'మహత్ సంగస్తు దుర్లభః అగమ్యోఽ మోగశ్చ'** (నారద భక్తి సూత్రాలు) మహాత్ముల సాంగత్యం లభించడం చాలా అరుదైనది. అది లభించినా వారిని తెలుసుకోవడం చాలా అరుదు. అది తెలుసుకొన్న వారికి సాధ్యం కానిది ఏదియులేదు. దాని ఫలితము అమోఘమైనది.

పూజ్య జ్ఞానేశ్వరి మాతాజీవారి గురించి వ్రాయాలి అంటే ముత్యపుచిప్ప సముద్రజలాన్ని తోడివెయ్యడానికి సాహసించినట్లే! **పరమాత్మ అనుగ్రహంచే పూజ్య మాతాజీవారికి 12 సం॥ల చిరుప్రాయంలోనే శ్రీ ఓంకార స్వాములు వంటి మహ నీయుల సాంగత్యం లభించినది.** ఎవరి హృదయాంతరాలలో సర్వకామనలు తమం తట తాముగా వదలిపోతామో అటువంటి పవిత్రత కలిసిన వారకే సాధు సాంగత్యం లభిస్తుంది. **ఓంకార స్వామివారి ఉత్తమ శిష్యురాలిగా స్వామీజీ వారికి సుమారు 40 సం॥రాలుగా సేవలు అందించిన గురుపాదరేణు.** ఓంకార స్వామివారు కైలాస గిరిలో 6సం॥ మౌనంగా ఉన్నపుడు, ప్రతిదినం విశాఖ శాంతి ఆశ్రమ సముద్రతీరం నుండి గతుకులు, రాళ్ళు కలిగిన కొండలనెక్కి 12 కి.మీ. కాలినడకన స్వామీజీవారి శారీర, స్థల, భావ, ఆత్మ శుశ్రూష చేసిన మహాయోగిని. స్వామీజీ **వారు మౌన భాషలో అందించిన సోహం తత్వాన్ని, ప్రతి అణువణువులో ఓంకారతత్త్వాన్ని అనుభ వించిన మహాతపస్సంపన్నురాలు.** 'సోహం భావేన పూజయేత్' అదియే వారు మనసా వాచా కర్మణా సమర్పించిన గురుదక్షిణ. శాంతి ఆశ్రమమే తన శ్వాసగా ఇప్పటికి 75 సం॥లుగా ఎంతో శాంతంగా మౌనంగా ప్రేమతో ఆశ్రమ బాధ్యతను నిర్వర్తిస్తూ,

ఆశ్రమాన్ని ఆశ్రయించిన దీనులకు, సాధకులకు ఎంతో ఆప్యాయత ప్రేమతో అందరి యోగక్షేమాల్ని చూస్తూ, అందరికీ శాంతి తరంగములను అందిస్తున్న శాంతమూర్తి. ప్రత్తి ఎండినదై వడకబడుతూ ఎన్నో కష్టములను సహిస్తూ ఇతరుల ఛిద్రములను కప్పివేస్తూ కీర్తి సంపాదిస్తుందో అదేవిధంగా పూజ్యమాతాజీ వారు ఎన్నో కష్టములను ఎదుర్కొని ఇతరుల బాధలను తనవిగా భావించిన కరుణామూర్తి.

**శాంతి ఆశ్రమ శతాబ్ధి ఉత్సవాలలో భాగంగా పూజ్యమాతాజీవారు 75 సం॥ లుగా తమ సర్వస్వాన్ని అర్పించి సేవలందించిన సందర్భంగా ప్లాటినం జూబ్లీ కూడ జరుపుకుంటున్నట్లు భావన కలుగుతోంది.** గురుపాద పద్మములందు భక్తి కలిగి ఉండుటచే వారికింతటి శక్తిసామర్థ్యములు లభించినది. గురుకృపచే ఇంతటి మహత్తరమైన సేవలను వారందిస్తున్నారు. అనిర్వచనీయమైన సేవలు అందించిన మాతృమూర్తికి మనమేమి అందించగలము ?

**చంద్రునికి నూలుపోగు అందించినట్లు 1954-2016 వరకు వారు అందించిన ఉపదేశములు, వారు చేసిన యాత్రలు, పర్యటనలు అనే జ్ఞాన విజ్ఞాన ములు కలిగిన చిన్న శాంతి పుష్పగుచ్ఛమును వారియొక్క 87వ జన్మదిన కానుకగా సమర్పిస్తున్నాం.** వారి జీవిత అనుభవాలు రాబోయేతరం సాధువులకు, బ్రహ్మచారులకు ఆధ్యాత్మిక అన్వేషకులకు మార్గదర్శకమై శాంతి బాటగా పరమశాంతినిచ్చి అజ్ఞాన మనే నైర్మాల్యమును తొలగించి సోహంభావంకు సోపానమౌతుంది. **పూజ్యశ్రీ మాతాజీ వారి దివ్య సందేశములు దేశ విదేశీయ పర్యటనలు** అనే ఈ పుస్తకం. (శాంతి పరిమళ పుష్పగుచ్ఛం). ఈ వ్యాసాల సంకలనం ఈ శతజయంతి సందర్భంగా పుస్తకరూపంలో రావాలన్నది స్వామి ఓంకార్ సంకల్పం. ఆ సంకల్పానికి ఉపకరణా లుగా ఆశ్రమవాసు లైన **బ్రహ్మచారిణి వాసవిగారు, శ్రీమతి వాగ్దేవు శారదగారు శ్రీ ఆలూరు మోహనశర్మ గారు** ఉపయోగించబడినారు. సేకరించి జిరాక్స్‌లు తీయుట, సవరణచేయుట, అచ్చు తప్పులు దిద్దుటవంటి అన్ని పనులను పరస్పర సహకారంతో నిర్వహించారు సవరణలో తప్పులేమైన ఉంటే క్షమించగలరు. మరియు **రాజమహేంద్ర వరం మోహన్‌పబ్లికేషన్స్** వారు ఎంతో ఓర్పుతో, నేర్పుతో ముద్రించి నారు. వీరందరికి భగవంతుని ఆశీస్సులతోపాటు పరమ పూజ్య ఓంకారస్వామీజీ, పూజ్యజ్ఞానేశ్వరి మాతాజీవారు శాంతి సౌభాగ్యములు, ఆధ్యాత్మిక ధీశక్తి ప్రసాదించు దురు గాక !

గురుసేవలో

18.9.2016 **స్వామిని వినమ్రానంద**

# భాగము - 1

## 1. మహోత్యాగము

పూర్వము ఒకప్పుడు అర్జునుడు కూడా తనకంటె గొప్ప భక్తుడు లేడని గర్వించెను. సత్యమునకు, భక్తికి తనతో సమానమైనవారు ఎవరు లేరని, ఆయన తనలో తాను అనుకొనుచుండెడివాడు. అప్పుడు భగవానుడైన శ్రీకృష్ణుడు యిది కనిపెట్టి, పరమ దయాళుడగుటచే ఆ గర్వమునకు సంబం ధించిన మాయను త్వరలో తేలికగ, తన ప్రియభక్తుని నుంచి తొలగించ దలచెను. అప్పుడే శ్రీ మయూర ధ్వజ రాజుయొక్క ప్రతిభనుకూడ, శ్రీపర మాత్మ ప్రపంచమునకు వెల్లడి చేయదలచెను.

ఇందుకుగాను, శ్రీకృష్ణభగవానులు ఒక వృద్ధ బ్రాహ్మణ వేషము దాల్చి, అర్జునుని ఒక అందమైన బాలునిగజేసి, తనవెంట శ్రీ మయూరధ్వజ రాజు వద్దకు తీసుకు వెళ్లెను.

ఆ రాజు మన బ్రాహ్మణులను జూచి అతి భక్తితో నమస్కరించి, మీ ఆజ్ఞప్రకారము నడుచుకొనుటకు సిద్ధముగా నున్నానని అతి వినయముతో చెప్పెను. అంతట, శ్రీకృష్ణభగవాను లిట్లనెను. "ఓరాజా! మేము మామూ లుగా యాచించుటకు రాలేదు. గాని, మాకు నిజముగ కావలసినది, నీతో చెప్పుటకు ధైర్య సాహసములు చాలకున్నవి. నీవు దానిని తప్పక ఎట్లైనను యిచ్చెదనని ముందుగ వాగ్దానము చేసినగాని, అడిగి ప్రయోజనము లేదని సందేహించు చుంటిమి." అంతట రాజు, "తప్పక నేను యిచ్చెదను. మీకు ఏమికావలెనో సందేహించక వెంటనే చెప్పుడు, నన్ను ధన్యుని చేయుడు" అని నుడివెను. అటుపై వృద్ధ బ్రాహ్మణు డిట్లనెను.

ఓ రాజా ! నా కుమారునికి ఒక గొప్ప ఆపత్తు సంభవించనున్నది. దాని నుండి నీవు కరుణించిన, తప్పక రక్షించగలవు. ఈ ఉదయము మేము అరణ్యమార్గమున వచ్చుచుండగ, ఒక సింహము కనుపించెను. అది నా పిల్లవానిని పట్టుకొనెను. ఆ సింహము అతనిని ముక్కలు, ముక్కలు జేసి భుజించెడిదే. దాని కాళ్లమీద నేనుపడి, యిట్లుప్రార్థించితిని, "నాకు లేక లేక ఒక పుత్రుడు మాత్రమే జనించెను. అతనిని రక్షించి, అతని స్థానే నన్ను తినుము" అని అనేక విధములుగ ప్రాధేయపడితిని. ఆ సింహము తేలికగ ఒప్పుకొనలేదు. చివరకు యిట్లు జెప్పెను. తనకు, తరచూ ఒక రాజు మాంసమును తినవలెనని యున్నదనియు, నా కుమారునికి బదులుగ, ఒక రాజు శరీరములో సగము తనకు యిచ్చిన యెడల, నా కుమారుని విడచిపెట్టెదననియు చెప్పెను. కాని, యీ ప్రపంచములో తన శరీరములో సగ భాగము నిచ్చి, ఏ రాజు ఒక దిక్కులేని వృద్ధ బ్రాహ్మణ పుత్రుని రక్షించ గలడు? అనెను.

ఆ రాజు, మీరిదివరకే నా వాగ్దానమును బొందితిరి కదా! సందేహింప నక్కరలేదు.మీరెంత మాత్రము అధైర్యముతో బాధపడ నక్కరలేదు. శ్రీహరి సేవకులకు, మృత్యుభయమెన్నడు లేదు. నేను నా శరీరములో సగముకోసి, సింహమునకిచ్చి,

మీ కుమారుని రక్షించెద ననెను. తరువాత బ్రాహ్మణు డిట్లనెను. అంత మాత్రము చాలదు. సంతోషముతో హృదయ పూర్వకముగ నిచ్చిన గాని, దానమును బ్రాహ్మణుడు స్వీకరించకూడదు. కావున ఓ రాజా సంతోష పూర్వకముగ నీవు దానమునిచ్చినట్లు నిదర్శనము చూపవలెననెను.

అంతట రాజు యిట్లనెను “మీకు ఏమి నిదర్శనము కావలెనో కోరు కొనుడు. నేను అతి సంతోషముతో యిచ్చెదను” బ్రాహ్మణుడిట్లు కోరెను.
నీ శరీరమును ఒక రంపముతో, పాదము నుండి శిరస్సు వరకు రెండుగా కోయవలెను. అప్పుడు నీవు కన్నీరు కార్చకూడదు. నీ శరీరములో ఒక నరము కూడ బాధపడినట్లు కనిపించరాదు. అట్లిచ్చిన, నీవు యిష్ట పూర్వకముగ, ఎంత మాత్రము కష్టము లేకుండ, దానమిచ్చిన వాడవని తాను గ్రహించగల ననెను.

ఆ రాజు, నేనట్లే అంగీకరించితిని. రంపమును తీసుకొనిరండనెను. గాని బ్రాహ్మణుడు మరియొక మాటనెను. రాజా ! నీవు సంతోష పూర్వక ముగ యివ్వవచ్చును. గాని, నీ మీద హక్కుగలవారి తరులున్నారు గదా! వారందరి వద్దనుంచి  కూడ, యీ దానము నీవెంత సంతోష పూర్వకముగ యిచ్చుచున్నావో అంత సంతోషముతో రావలెననెను. నీ రాణీ, నీకుమారుడు న్నారు, వారు కూడ హృదయ పూర్వకముగ యీ దానము యిచ్చినట్లు తెలియుటకు, వారే రంపము పట్టుకొని నీ శరీరమును కోయవలసి యున్న దనెను. ఇది చాల భయంకరమగు కోరిక. గాని,రాజు సందేహించలేదు. తన కుమారునికి, రాణీకి కబురుచేసెను. వారు ఏమైనా సందేహించినారా? దుఃఖించినారా? విలపించినారా? రాజు వాగ్దానము నుంచి తప్పించి, రాజు ప్రాణమును రక్షించ దలచినారా? లేదు. లేదు. సత్యము వారి కీ ప్రపంచ ములో నున్నవాటి కన్నిటి కంటెను హెచ్చు విలువైనది. వారు, తమకు కూడ యీ మహాదానములో కొంత అవకాశము దొరికినందులకు, గొప్ప అదృష్టవంతులమని తలచిసంతోషించిరి. రాజు ప్రశాంతముగ, ఒక స్థాన ములో కూర్చొనెను. రాణి ఒకవైపున రాజకుమార్డు మరియొక వైపున రంపమును పట్టుకొని, రాజును కోయనారంభించిరి. స్వర్గములో దేవతలీ మహా దానమును చూచి, కన్నీరు కార్చుచు, అత్యాశ్చర్యకరమైన ఈ రంగము పై పుష్పవర్షము కురిపించిరి. రాజుతలను, ముఖమును, దేవతలు, మాన వులు చూచి దుఃఖపడుచుండగా, వారు నెమ్మదిగా రంపముతో కోయు చుండిరి.

బ్రాహ్మణుడతి జాగ్రత్తగా రంపపు కోతను చూచుచు, ముందుకు దుమికి కోతను హఠాత్తుగా ఆపమని, అతికోపముతో యిట్లనెను. “ఓ దుర్మార్గుడా! నీవద్దదానముపట్టదలచి వచ్చినబ్రాహ్మణునికి, వ్యసనముతో ఈయ దగునా?

నీ కంటిలో కన్నీరు కారుచున్నది, నీవు మాట తప్పిపోయినావు. నీ కన్నీటితో నాకమర్యాద చేసినావు. దుఃఖముతో అపవిత్రము చేయబడిన దానమును, నా కివ్వ సాహసించు చుంటివా? అబద్ధీకుడవు, మోసగాడవు. ఇప్పుడు నీ సంగతిఅంతయు తెలిసినది. నీ దానము నీవే యుంచుకొనుము. నన్ను పోనిమ్ము. నా కుమారుని, సింహమున కిచ్చి, నా మాట నిల్పుకొన నిమ్ము." అంతట రాజు యిట్లనెను. "బ్రాహ్మణోత్తమా! అట్లుకాదు. నా కంటి దుఃఖ బాష్పములు నీవు అర్థము చేసుకొనలేదు. బాగా చూడుము. కుడికన్ను సంతసించుచుండగా, ఎడమ కన్ను మాత్రము దుఃఖపడుచున్నది. నా శరీరములోని కుడిభాగము, తమకు సేవనొనర్చెడు సదవకాశము లభించి నందులకు, బ్రహ్మానంద పడుచుండ, ఎడమభాగము మాత్రము కష్టములో నున్న బ్రాహ్మణునకు సేవజేయు సదవకాశము తనకు లభించక పోయెనే, నే నెంత నిర్భాగ్యురాలను, బ్రాహ్మణుడు నన్ను తీసుకొనలేదే యని తలచి దుఃఖించెను." ఇట్లు రాజు చెప్పుచుండగా, దేవతలు, మానవులు విని దుఃఖించిరి. గాని, ఆ వృద్ధ బ్రాహ్మణుడు, తన పిల్లవానితో అదృశ్య మాయెను. వారి స్థానే శ్రీకృష్ణ భగవానులు, అర్జునుడు, రాజుకు ప్రత్యక్షమైరి.

రాజు, శ్రీకృష్ణభగవానుని పాదములపై బడగా, "ఓ మహారాజా! నీకు మహాకీర్తి కలుగుగాక! ఈ పుడమి నీలాంటి సత్యము, భక్తి గలవారినెన్నడు చూచియుండలేదు. దేవతలు, మానవులు సదా నీమహాత్యాగమును, సంతోషముతో స్మరించుచు, వారి వారి పాపముల నుండి విముక్తులై ధన్యులయ్యెదరు గాక ! అని శ్రీకృష్ణభగవానులనెను. ఆ కాలములో నింతటి మహాత్యాగములు, మన పవిత్రమైన భారత దేశములో జరిగినవి. మన కాలములో కూడ అట్టి త్యాగములు కొంత జరుగక పోలేదు. మీరందరు స్వయంగా చూడగలిగినను లేకపోయినను, శ్రీ పూజ్యులగు మన ఓంకార స్వాములవారు కూడ తన శరీరములో ఒక ఎముక దానమిచ్చుట మీ కందరకు తెలిసిన విషయమేగదా ! వారిని దాన మెవ్వరడుగలేదు. అయాచితముగ, వారే గొప్ప దానమివ్వ నంగీకరిం చిరి. ఒక ఎముకను, ఒక బాలికకు అత్యవసరము కాగా, ఆమె బంధుమిత్రు లెవరు ఎముకను దానము చేయుటకు సాహసించని సమయమందు, స్వాముల వారు అతి ధైర్యముతో, సంతోషముతో సుమారు ఎనిమిది అంగుళ ముల పొడవుగల ఎముకను, రంపముతో తన కాలును కోయించి, విశాఖ పట్టణం కె.జి.ఆసు

పత్రిలో 1950వ సంవత్సరము ఆగస్టు నెల 30వ తేదీన, ఒక చిన్న బిడ్డకు దానము చేసిరిగదా! ఈ సంగతి మీ అందరికి జ్ఞాపకమున్న మంచి విషయమే గదా! మనము ఎంతగొప్ప అదృష్టవంతులము, అట్టి మహాత్యాగు లైన శ్రీ పూజ్యులగు స్వాములవారి సేవాభాగ్యము, మనకందరకు లభించి నది. వారు సర్వదా మౌనములో నుండియు, ప్రతి ఆదివారము మనమంద రము తరించుటకుగాను, అమూల్యమగు సందేశములను, విసుగు విరామము లేక మనమీద నెంతయో ప్రేమతో, నిచ్చుచునే యున్నారు. మనము వానిని శ్రద్ధగావిని, బాగుగా అర్ధము చేసుకొని, వాని సారాంశ ములను సదా మననము చేసుకొనుచు, ఆచరణలో పెట్టుకొనుటకు, హృదయ పూర్వకముగ ప్రయత్నించిన యెడల, మన మందరము ఈశ్వరాను గ్రహముచేత తప్పక తరించగలము. మనము, మంచి విషయము లను చక్కగ ఆచరణలో పెట్టుకొన్నప్పుడే, మన గొప్ప అమూల్యమగు మానవ జీవితములలో, శ్రీపూజ్యులగు స్వాముల వారు తరచు మనకు జెప్పుచున్నట్లు, మన మతమును, జీవితమును రెండుగాక ఒకటిగా జేసుకున్నవార మయ్యే దము. అప్పుడే మన జీవితములు ధన్యమగును. మనము మన గమ్య స్థానము గుర్తెరిగి తరించగలము.

శ్రీపరమేశ్వరానుగ్రహము చేత మన మందరము జీవితము,మతము, అతి త్వరలో ఒకటిగా జేసుకొని, సత్య ప్రేమలతో, ఆదర్శప్రాయములగు జీవితములను గడుపుకొనుచు, ఆశ్రమమునకు మంచి సేవచేయుచు, లోక శాంతికి తోడ్పడి, తరించెదముగాక ! లోకాస్సమస్తా సుఖినోభవంతు-ఓంతత్‌సత్.

**(శాంతి - జూలై 1954)**

**సంస్కారములు**

మనలో కొంతమంది వ్యక్తులు మహాత్ముల వద్దనే వుంటారు. ఎన్నో తీర్ధయాత్రలు, వ్రతములు చేస్తూవుంటారు. అయినప్పటికి వారిలో ఏమాత్రము సద్గుణములు కలుగవు. వారి స్వభావము మారదు. మనము అంటూవుంటాము, చూడండి పలానా వ్యక్తి ఎప్పుడు మహాత్ముల దగ్గర వుంటాడు కాని ఏమీ మారలేదండి అని. దీనికి తుకా రామ్ మహరాజ్‌వారు చేదు దోసకాయ తీర్థయాత్రలు చేసిన కథను ఉదాహరణ చెప్పారు.

## ౨. ఇతరుల తప్పులు వెదుకకుము

ఇతరులు నీయందలి దోషముల నెన్నకుండ నుండవలెనన్న నీవు వారి తప్పులను వెదుకకుమను సందేశమెంత మనోహరము! ఎంత అనుభవ ప్రసిద్ధము. ప్రతిచోట లోకులెవరినో యొకరిని విమర్శించు చుండుట మనము గాంచుచున్నాము. ఇతరుల దొసగు (తప్పు) లెన్నువారు మూఢులే, వివేకు లెప్పుడును నిశ్శబ్దముగనే యుందురు. కాని లోకము మూఢత్వముచే నిండి యున్నది. బుద్ధిశాలులరుదుగా నుందురు. కావుననే పూర్వ,పశ్చిమ ఖండములలో దొసగులెన్ను విద్యకు విసుగు లేదు.

తన తోటి మానవునియందు తప్పులు నెన్నుటమాని, తన తప్పులను తాను తెలుసుకొనువాడు ధన్యుడు. వస్తువుల యంతరంగమును పరిశీలిం చుటకన్నా బహిః ప్రకృతిపై తన అభిప్రాయమును వెల్లడించుట మానవునకు నైజము. పై మెరుగులకు మనస్సు సంతోషించును. చంచలమగు మానస మును అంతరంగిక తత్వా న్వేషమునకు త్రిప్పుట కష్టసాధ్యము. కావుననే ప్రపంచమున, అభిప్రాయ భేదములును, దుర్విమర్శనమును, దూషణము మిక్కుటముగా నున్నవి. ఎవ్వడు చేసికొనిన కర్మమును వాడే యనుభవిం చును, అను సిద్ధాంతము సత్య సమ్మతము. ఇతరులను గూర్చి మన యాంతర్యమును వెల్లడించిన, వారును తమ అభిప్రాయమును జెప్పెదరు. కావున అన్యదూషణ భూషణము లను మానవలయును. విమర్శించు చున్నంత వరకు మనము దాని ఫలితమును మనమే అనుభవింపవలసి వచ్చును. అడుసు త్రొక్కనేల ? కాలుకడగనేల ? ఇంతకు పూర్వము చెప్పిన విధమున తప్పులెన్నువారు మూఢులే. వారొక్క నిమిషమైన నూర కుండలేరు. ఎవరియందో ఒకరియందు దోషము లెన్నుట వారికి పరమ సంతోషము.

ఈ కాలమును, ఈశక్తిని తమలోని తప్పులను తెలిసికొని వానిని నిర్మూలించుటకు యత్నించినచో వారి జీవితము ధన్యమగుటయే కాక వారు లోకవంద్యులగుదురు గదా ! కొందరు వేగపడి విమర్శించి నిలకడమీద పశ్చాత్తాపపడుదురు. కల్ల నిజము లెరుగక అన్యోపదేశముగా పలుకు పలుకులును, ద్వంద్వార్థములు గల మాటలు హానికరములు, నిష్ప్రయోజన కరములయి యున్నవి.

ఇంతకు నొకనిని విమర్శించుటకు మన మెవరము? సర్వసాక్షి జగ ద్రక్షకుడొక్కడే న్యాయమును జెప్పగల సమర్థుడు. అట్టి శక్తి మర్త్యుని కెక్కడిది? ఎవరి పనిని వారు చూచుకొనుట ఉత్తమోత్తమము. ఇతరుల జోలి మన కేల? దుర్విమర్శమునకు ముఖ్యకారణ మతివాగుడు. అతివాగుడు యం త్రము లనదగు కొందరేదో యొకదానిని గురించి మాటలాడుచునే యుం దురు. అతివాడుగు వలన ఫలితము ఆయుక్షీణము. మౌనము లాభదాయ కము.

శాంతి పాఠకులారా ! ఒక నిమిషము మౌనమువహించి మీ జీవిత ములో మీరెవరినైన తెలిసియో, తెలియకో, వారియందు దోషముల నెంచి, నొప్పించిరేమో

జ్ఞప్తికి తెచ్చికొనుడు. పరిపూర్ణ జ్ఞానముచే నలవడు శాంతితో, సత్యమార్గమున నడువ దలతురేని మీ తప్పులను మీరు తెలుసుకొనుడు. మూఢత్వము చేత తనకు తెలిసి తెలియకున్న విషయములపై మానవుడు తనకు తోచిన తీర్పు చెప్పును. ఆత్మజ్ఞానము, భగవంతుని తెలిసినవారు తీర్పు చెప్పుటకు పూనుకొనరు. సర్వాంతర్యామియగు భగవంతుని తెలియ గలిగినది పరమాత్మ. ప్రపంచ మంతయు ఈశ్వరమయమగునపుడు తప్పులు వెదకుటకు తావేది? దీని నెరిగిన మనుజుడే సత్యారాధనమునకు సమర్థుడు. ఇతరులను గూర్చి తీర్పు చెప్పుటయను పాపము నుండి, విముక్తు లగుటకు రండు. అభేద్యమగు సత్య దృష్టికి లొంగిపొండు! సత్యశీలనమే పరమావధిగ నెంచుడు.

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు !

**ఓం ఓం ఓం**

**(శాంతి – సెప్టెంబర్ 1956)**

## 3. స్వామీజీ నుండి నేను ఏమి నేర్చుకున్నాను ?

1. దైవమే ప్రేమ, ప్రేమే దైవం. ఎక్కడ ప్రేమ ఉంటుందో అక్కడ దైవముంటాడని నేను స్వామీజీ నుండి తెల్సుకున్నాను.

2. మతము – జీవితము అనేవి రెండుగా లేవు, అవి ఒక్కటే. అందుచేత నేను కనులు మూసుకొని ధ్యానంలో ఉన్నా, లేక కళ్లుతెరచి సందేశములు టైపుచేయడం గానీ లేక ఏ ఇతర పనిచేస్తున్నా భగవత్ సాక్షాత్కారం సమా నంగా ఒకేరీతిగా ఉంటుందనీ నేను స్వామీజీ నుండి తెల్సుకున్నాను.

3. పనియే ఆరాధన. నేను చేసే ప్రతీపనీ భగవంతుని సేవ, దైవారాధ నలో భాగమే. అని నేను స్వామీజీ నుండి తెల్సుకున్నాను.

4. కాలము యొక్క విలువను నేను స్వామీజీ నుండి తెల్సుకున్నాను. ప్రతీక్షణం చాలా విలువైంది. క్షణాలను వృధాచేయువాడు తన జీవితము నంతా వృధాచేయుచున్నట్లే. కోల్పోయిన దేన్నయినా తిరిగి సంపాదించు కోవచ్చు, కానీ అమూల్యమైన, పవిత్రము అయిన కాలాన్ని పోగొట్టుకుంటే తిరిగి దాన్ని సంపాదించలేము.

5. సోమరితనం అత్యంత ప్రమాదకరమైన వ్యాధి. సోమరి తనకి తాను అపకారం చేసుకోవడమే కాదు ఇతరులకూ అపకారం చేస్తున్నాడు. నిజంగానే, ఎవరైతే సోమరిగా వుండి కనీసం తన ఆహారం కోసం కూడా ఏ పనీ చేయకుండా ఉంటారో వారికి ఆహారం తినే హక్కులేదు అని స్వామీజీ నుండి గ్రహించాను.

6. పరిశుభ్రతయే దైవము. లోపల, వెలుపలా కూడా ఎవరు పరి శుభ్రంగా ఉంటారో వారే భగవంతుని నిజమైన సంతానమని స్వామీజీ నుండి తెలుసుకున్నాను.

7. స్వామీజీ నుండి నేను గ్రహించిన మరొక అంశము పవిత్రతయే. అది ఆధ్యాత్మిక జీవితమునకు పునాది. మనసా, వాచా, కర్మణా ఎవరు పవిత్రులో వారు నిజంగా ధన్యులు.

8. శ్వాసింటేటప్పుడు కూడా ప్రతీ ఉచ్ఛ్వాసంలోనూ నిశ్వాసంలోనూ కూడా శాంతినే నింపాలని శ్రీస్వామీజీ నుండి తెలుసుకున్నాను. అతి తేలికైన సహజమైన ప్రాణాయామ ప్రక్రియ నాడీశుద్ధిచేసి చివరకు నిద్రాణంగా యున్న కుండలిని శక్తిని మేల్కొల్పును. దీని వల్లనే భగవంతుని చైతన్యాను భూతిని పొందవచ్చు. కష్టంతోకూడిన, రహస్య అద్భుత మంత్రాలవంటి అపాయకరమగు, ప్రమాదకరమగు ఇతరమైన వానితో పనిలేదు. ముఖ్యంగా అలాంటివానికి తగిన శిక్షణ అవసరం.

9. ఏసుక్రీస్తు అనుసరించిన మార్గం “నీవలె నీ పొరుగువానిని ప్రేమిం చుము.” “అంతాబ్రహ్మమయమే అన్నింటిలోనూ భగవంతునే దర్శించుము” అను కృష్ణుని ప్రత్యక్ష మార్గాన్ని దయాభావంతో కూడి, ప్రాణికోటి నంతటిని కరుణామయభావంతో గౌరవించుట నేను స్వామీజీ నుండి తెల్సుకున్నాను.

10. స్వామీజీ నుండి సర్వమత సమానత్వమును, విశ్వత్వమును గ్రహించితిని. ప్రతీ మతములోని అవతారపురుషులను, ప్రవక్తలను మహాను భావులను గౌరవించి, పూజించుట, అన్ని మతములలోని సారాంశమును ఆకళింపచేసుకొని, అందలి మంచిని గ్రహించి వివిధ మతములను గానీ, మత ప్రవక్తలనుగానీ పోల్చి చూచుట తగనిపని అని స్వామీజీ నుండి తెలుసుకున్నాను.

11. ఒక నూతిలోని చిరుకప్పవలె అజ్ఞానముతో ఉండక, విశాల దృక్పథము, విజ్ఞతతో విశాల ప్రపంచమునే స్వగృహంగా భావించి అందలి ప్రజలందరినీ నా సోదర, సోదరీ మణులుగా గ్రహించవలెనని స్వామీజీ నుండి తెలుసుకొంటిని. అందరినీ ప్రేమతో ఎట్టి ప్రతిఫలమూ కాంక్షించక సేవ చేయువారు ఎంతటి ధన్యులు, ఇదియే అత్యున్నతమైన నా మతము.

12. అప్పుడప్పుడు అనిగాక దైవానుభూతిని ప్రతీక్షణమూ దైనందిన జీవితంలో పొందగల్గు అభ్యాసం చేయడం భగవదనుభూతి పొందుటకు రహస్యం అని స్వామీజీ నుండి తెలుసుకున్నాను.

13. బాహ్యమైన బోధలు, పెద్ద పెద్ద నామరూపాలపై ఆధారపడక ఆత్మ విశ్వాసంతో ఆంతరంగిక దివ్యజ్యోతి ఘనతమై ఆధారపడుట మేలు అని స్వామీజీ నుండి తెలుసుకొంటిని.

14. మాటలాడుట రజతమైతే, మౌనము స్వర్ణము వంటిది, అని స్వామీజీ నుండి తెల్సుకున్నాను. మౌనమే మానవునకు భూషణం. అది ఆధ్యాత్మిక జీవితపు మకుటం. అనవసరమైన మాటలు అపోహలకు, సమస్య లకు దారితీయును. మౌనం నిజమైన శాంతికి దోహదపడి ఆత్మ జ్ఞానాన్ని కల్గించగలదు.

15. సమస్యలు, చికాకులు భూమిపై పడే దేముని వర్షపు జల్లులు. ఏ సమస్యనీ అది మనలను ఇబ్బందిపెట్టే వరకూ దానితో సతమతమగుట అనవసరం అని స్వామీజీ నుండి గ్రహించాను.

16. దేవుని మరచుటే మరణము. ఆయన ఎరుకను ఎల్లప్పుడూ అనుభవించుటయే దివ్యానుభూతితో కూడిన జీవితం అని స్వామీజీ నుండి గ్రహించితిని.

17. ప్రపంచంలో జీవితంలో ఎదురౌతున్న సమస్యలు, పరీక్షలు వచ్చే పోయే మేఘాలని గ్రహించి దయ, సహనముతో ఎదుర్కొనాలి. భూమిపై జీవితం గులాబిపూల పాన్పుకాదు. తియ్యని పాయసము కాదు. విజ్ఞాన సముపార్జనకు శోధనలుంటాయి అని స్వామీజీ నుండి తెలుసుకున్నాను.

18. ధనంపోతే, ఏమీ పోయినట్లు కాదు. ఆరోగ్యం పాడయినచో కొంత పోయినట్లు కానీ ప్రవర్తన చెడిపోతే సర్వమూ పోయినట్లే. నిజంగానే సత్శీలమే ఆధ్యాత్మిక జీవితపు ఆత్మగా అలరారుచున్నది. అనునది స్వామీజీ నుండి గ్రహించితిని.

19. అంతర్గతమైన, ఆత్మయే సత్యము, నిత్య సంపూర్ణము, బయట నుండి తెలుసుకోవలసిన దేదీలేదు. అసలు వ్యక్తి చెయ్యవలసింది, తాను నేర్చుకొన్నది వదలి వేయుటే, నిజమైన శాంతి పుస్తకాలు వల్లెవేయడం వల్లరాదు.ప్రతీ దానిలో ఉన్న ద్వంద్వత్వాన్ని అధిగమించగల్గినవాడే నిజమైన శాంతిని పొందగలడు. ప్రారంభదశలో ఉపయోగకరముగా కనిపించిన పుస్తకాలే, అత్యున్నత స్థితిలోని ఋషులు, వ్యర్థమైనవిగా పరిగణిస్తారు. అని స్వామీజీ నుండి గ్రహించాను.

20. జీవితమనే నదిని దాటుటకు పడవ అవసరమే,కానీ నది దాటాక శరీరం అనే ఈ పడవని పట్టుకు వ్రేలాడడమెందుకు? భగవంతుడే మహా సాగరం జీవితం ఒక నది. శరీరం ఒక పడవవంటిదని స్వామీజీ నుండి గ్రహించాను.

21. నిస్సారమైన ఎముకలవంటి ఇతరుల పలుకులు చర్విత చరణం చెయ్యడం, ప్రపంచంలోని ఆవులను లెక్కించడం అనవసరం. అంతకంటే కొంచెం అయినా పాలిచ్చే మనదనే ఆవుండడం మేలు. దీర్ఘకాలంలో స్వానుభవమే మనకు ఉపయోగపడేది.

స్వానుభవం పొందిన మహనీయులే భూమాతకు వర ప్రసాదితులు. వారే ప్రపంచపు మార్గదర్శకులు. వారే మనలను చీకటినుండి వెలుగుకి, అసత్యము నుండి సత్యమునకు, నశించే దాని నుండి అమృతత్వమునకు నడిపించగలరు. భగవదనుభూతి అనుభవించుచున్న భూమిపైగల అట్టి మహనీయులకు మనం నమస్కరింతుము గాక.

ఓం ఓం ఓం

**( స్వామి ఓంకార్ ఆత్మదర్శిని)**

# 4. ఇహపర సుఖములకు ద్వాదశ సూత్రములు

1. మాట్లాడుటకు ముందు రెండు పర్యాయములు ఆలోచించాలి. తూచి, బహు జాగ్రత్తగ ప్రేమగ సత్యముగ మాట్లాడుట మంచిది. మానవులకు వాగ్భూషణమే నిజమైన సుభూషణము.

2. తొందరపడి వాగ్దానాలు చేయరాదు. చేసిన వాగ్దానములు నెరవేర్చ గలిగితేనే, వాగ్దానములు చేయుట మంచిది. చేసిన తరువాత వాటిని నెర వేర్చి తీరాలి.

3. ఎవరిలోను ఎప్పుడు తప్పులు చూచుటకు ప్రయత్నించరాదు. శారదాదేవి, తన జీవితములో, ఎప్పుడు ఎవరిలోను, తప్పులు చూడలేదట. ఇతరులలో ఎప్పుడు మంచిని చూచి వారిని ప్రేమించుటయే మన సాధన.

4. ఇతరులవల్ల పొందిన మేలును, సదా మరువక కృతజ్ఞులమై యుం డాలి. ఉపకారికి ప్రత్యుపకారము చేయుటకంటె, అపకారికి ప్రేమతో ఉప కారము చేయవలెను.

5. విమర్శ ఎన్నడు నిందా సహితంగా నుండరాదు. అది సత్యముగను, నిర్భయముగను, ఉపయోగముగను, మానవాభివృద్ధికి తోడ్పడునట్లును వుండవలెను.

6. సదా సంతోషంగా వుండాలి. ధైర్యముగ నుండాలి. ఆశాభంగ ములు, విచారములు మన చిరునవ్వు వెనుక దాచివుంచాలి. మంచి మాటలు, కథలు చెప్పి సంతోషము కలుగజేయాలి.

7. ఆత్మస్తుతి, పరనింద పనికిరావు. మన సుగుణాలు యితరులు తెలుసుకొనవలెను. మనకు మనము పొగడుకొనరాదు. ఇతరులలోని మంచి గుణాలు తెలుసుకొని వాటిని అనుకరించుచు, వారిని సదా అభినందించుట మంచిది.

8. ఇతరుల మనస్సులను ఎన్నడును నొప్పించరాదు. ఇతరుల మనో వ్యధకు మన మెన్నడును కారకులము కారాదు. మనో వ్యధకు మందులేదు. గాన, దానిని ఎన్నడు మనలోను యితరులోను కలుగజేయరాదు.

9. చాడీలు ఎన్నడు చెప్పరాదు. విన్న మాటలను వెంటనే నమ్మరాదు. అది సత్యమని తేలిన తరువాతనే యితరులకు చెప్పవచ్చును. తొందరపడి ఏపని చేయరాదు. పవిత్ర ప్రేమ సాధించలేనిది ఏమియు వుండదు.

10. సత్యంవద – ధర్మం చర. భరతమాతకు సదా సుపుత్రులముగ, సుపుత్రికలముగ నుండుటకు ప్రయత్నించాలి. ఈ పవిత్రమైన కర్మభూమిలో పుట్టినందుకు, సదా సత్కర్మ నిష్కామకర్మ పవిత్ర హృదయంతో చేసి, తరించు టకు ప్రయత్నించాలి.

11. మన కాలములో మహాత్మా గాంధీజీ, వినోబాజీల పవిత్ర బోధలు వినగలుగు చున్నాము. అహింసా సిద్ధాంతము, నిరాడంబర జీవనము, భూదాన మహిమ వగైరాలు తెలుసుకుని ఆచరణలో పెట్టి, దేశ క్షేమమునకు, శాంతికీ, సదా తోడ్పడవలెను. గాంధీజీ శతజయంతి చాల జయప్రదముగ చేయుట, ప్రతిభారతీయుని కర్తవ్యము.

12. ఈ భారతదేశము పుణ్యభూమి, జ్ఞానభూమి. ఎందరో మహ నీయులు జీవన్ముక్తి పొందిన భూమి. మనమందరము మానవ గమ్యస్థాన మును, సకాలములో తెలుసుకొని, దానిని చేరుటకు నిరంతరము కృషి చేయాలి. ఇందులకు సాత్విక మితాహారము, సత్ సంగము ఎంతయో తోడ్పడును. జయ్ జగత్ !

**(శాంతి - అక్టోబరు 1968)**

## 5. అద్భుతమైన దివ్యానుభవము

(తే. 24-5-1974 రాత్రి 8గం॥ జరిగినది)

ఎందరో మహానుభావులు, మహాత్ములు,భక్తులు, సాధకుల జీవితము లలో ఎన్నో చిత్ర విచిత్రమైన ఆధ్యాత్మిక అనుభవములు, అద్భుతమైన నిదర్శనములు కల్గుచుండునని మనము వినుచుందుము. గ్రంథములలో చదువుచుందుము. పరమేశ్వరుడు అనుగ్రహించిన దేనినైనను సాధింప వచ్చును. మానవుడు దేనినైనను తెలిసికొనగలడు,గాని మృత్యువు ఎటుల వచ్చునో తెలుసుకొనజాలడుకదా ! ఆ దివ్య శక్తిముందు మానవుని శక్తి ఎంత అల్పమైనది ?

ఏ అనుభవమునైనను వినుట, చదువుటకన్న, స్వయముగ అనుభవిం చుట, చూచుటలోనే నిజమైన స్వానుభవము కలుగుచుండును. అటులనే శ్రీస్వామీజీ జీవితములో ఎన్నో ఆధ్యాత్మిక అనుభవములు, సంఘటనలు కలిగినవి. వాటిని వారి స్వానుభవముల ద్వారా శాంతిపాఠకులకు, భక్తులకు తెలియబర్చుచునే యుండిరి. ఈ వేసవిలో కోటగిరి శాంతి కేంద్రములో శ్రీవారికి కల్గిన దివ్య అనుభవము అపూర్వమైనది, అద్భుతమైనది. మాతృ ఆశ్రమమునుండి మే 4వ తేదీ బయలుదేరి, 5వ తేదీకి మద్రాసుచేరి రైళ్లు నిలిపివేయబడుటచే అచ్చట 10 దినములు ఆగి 15వ తేదీకి కోటగిరి చేరిరి. వాతావరణము చల్లగ నున్నది. హెచ్చు ఎండలుగల ప్రాంతం నుండి శీతల ప్రాంతమునకు వెళ్ళిన శారీరక మార్పులు వచ్చుట సహజముకదా ! శ్రీ స్వామీజీకి కొంత అనారోగ్యము కలిగినది, కాని దైవ కృపచే వెంటనే ఆరోగ్యము చేకూరి వచ్చిన భక్తులకు సేవచేయుచు తోడ్పడు చునే యుండిరి.

మే 24వ తేదీ శుక్రవారము రాత్రి నమ్మశక్యముగాని, మానవ జీవితములలో ఎన్నడూ, కని విని ఎరుగని అద్భుతమైన సంఘటన జరిగినది. ప్రార్థనమందిరంలో ప్రార్థన జరుగుచుండెను. నేను కూడ ప్రార్థనలో పాల్గొంటిని. కొంతసేపు గడచిన

వెనుక ఏలనో మనస్సున శ్రీస్వామీజీ సన్నిధికి వెళ్లవలయుననిపించుటచే, ప్రార్ధన నుండి లేచి శ్రీవారి సన్నిధికి వెళ్లితిని. తక్కినవారు ప్రార్ధన ముగించుకొని ఎవరి పనులకు వారు వెళ్ళుచుండిరి. నేను వచ్చుసరికి శ్రీ స్వామీజీ స్టూలుమీద కూర్చుని యుండిరి. దాహముగ నున్నది త్రాగుట కేమైన ఇమ్మని అడిగిరి.అప్పుడు ఒక కప్పుసూపు ఇవ్వగా దానిని తీసుకొనిరి. 5,6 ద్రాక్షపండ్లను కూడ తీసుకొనిరి. అప్పటివరకు మామూలుగ మాటలాడు చునే యుండిరి. దగ్గరలోనున్న మంచము మీదకు వెళ్లి పరుండి ధ్యానము చేసుకొందుననిరి. అంతలో మెడ క్రిందకు వాల్చిరి. మామూలుగ వాల్చి యుందురని తలచితిని. కాని 2,3 నిమిషముల వరకు కదలక ఆ విధము గానే యుండుటచే, స్వామీజీ ! స్వామీజీ ! అని పిలువగ మాట్లాడలేదు. ఇంతలో చి॥ రామచంద్రుడను బాలుడు రాగా శ్రీ రాజాజీని పిలువమంటిని. వారు వెంటనే వచ్చిరి. శ్రీ స్వామీజీని ఎత్తి మంచముపై పరుండబెట్టవలయు నని తలచితిమి. మాకు శక్యము కాలేదు. అంతలో మరి ఇద్దరు ఆశ్రమ భక్తులు కూడ వచ్చి, శ్రీ స్వామీజీ శరీరమును అతికష్టము మీద మంచముపై జేర్చిరి.

ఏ చలనమును లేదు. శరీరమంతా చల్లబడెను. నాడి కొట్టుకొనుట కూడ లేదు. శ్వాస కూడ నిలిచెను. నిద్రించుచున్నట్లుండిరి. ఆ స్థితి ఏమను కొనవలెను. లక్ష్మీవిహార్ అంధకార బంధురమైపోయెను. మృతప్రాయమగు ఆ శరీరమును గాంచుచు "శ్రీరామ జైరామ జై జైరామ ఓం" అనెడు మహా మంత్రమును స్మరింప మొదలిడితిమి. మా మనస్సులు మాకు తెలియకనే పరమాత్మ సన్నిధికి చేరుకొన్నవి. ఆ దివ్య నామమును స్మరించు చున్నవి. అది తప్ప అప్పుడు చేయవలసిన కర్తవ్య మేమున్నది ? సాధు మార్కండేయ ప్రాణము పోయినది కదా అయినా డాక్టరు వద్దకు , వెళ్ళుట అవసరమని తనపని తాను చేయవలయునని తలచి, చీకటిలో చలిలో డాక్టరుకై పరుగెత్తిరి. ఆ విధముగ ఒక అరగంట గడిచెను. నేను, శాంతి వారి ప్రక్కనే కూర్చుని వారి ప్రతిబింబమునే ధ్యానించుచుంటిమి. హఠాత్తుగ కండ్లయందు చిన్న చలనము కలిగెను. నెమ్మదిగా బలవంత ముగా తెరుచు చున్నట్లు కనిపించెను. స్వామీజీ ! స్వామీజీ అని పిలిచితిమి. అప్పుడు కన్నులు తెరచి "నేను ఎచ్చటవుంటిని ?" అని ప్రశ్నించిరి. ఆ ప్రశ్న తప్ప మొదట మరేమాటయు లేదు. తర్వాత వెంటనే "శ్రీరామ జై రామ జై జై రామ ఓం" అని బిగ్గరగా నాలుగైదుసార్లు స్మరించి ఆ తరువాత మీరందరు ఏల కంగారు పడుచుండిరి ? నేను క్షేమముగానే యుంటిని అనిరి. ఆ తరువాత, రెండు సంవత్సరముల క్రిందట దైవానుగ్రహముచే శ్రీస్వామీజీకి పునర్జన్మ ఇచ్చిన శ్రీడాక్టరు పిచ్చయ్య గారిని గురించి అడిగిరి. పిచ్చయ్యగారు ఎచ్చటనుండిరో, ఎటులవుండిరో అనిరి. శ్రీవారి సంకల్ప బలముచే, దైవ ప్రేరణచే ఈ సంఘటన జరిగిన ఒక వారము దినములకే డా॥ పిచ్చయ్య గారు యీ శాంతికేంద్రమునకు తలవని తలంపుగా వచ్చుట కూడ ఒక అద్భుతమైన మహత్యమే కదా !

హఠాత్తుగ శ్రీ స్వామీజీ శరీరము విడచి ఎచ్చటకు వెళ్ళిరో ఎవ్వరికీ తెలియదు. సర్వజ్ఞుడైన దైవమునకే తెలియవలయును. ఆ అరగంట వారి ఆత్మ ఎచ్చటకు వెళ్ళెను ? పురాణ గ్రంథములలో పరకాయ ప్రవేశమని వినుట, చదువుట జరుగును. హఠాత్తుగ జరిగిన యీ విచిత్ర అనుభవము ఎన్నడు కని వినినది లేదు. ఏదో ఒక అపూర్వ శక్తివల్లనే అటుల జరిగి, మరల ఆ దివ్యశక్తి వల్లనే ఇట్లు జరిగినదని తలచితిమి. ఆ కరుణామయుడైన పరమాత్ముని లీలలు ఎవరికీ, ఏవిధముగనూ గ్రహించుశక్తి లేదుకదా !

ఈ సంఘటనను ఏవిధముగాను ఊహించుటకు ఈ అల్ప మనస్సు నకు శక్తి జాలక, దైవము అనుగ్రహించి కాపాడిన యీ అనుభవమును, ఈ శోధనను ఒక సోపానముగ చేసుకొని మన జీవితములను ఆ పరమాత్మ సన్నిధికి జేర్చుటకు మరింత అర్హమైన వాటిగా చేసుకొనవలయును.

ఈ అద్భుతమైన ఆధ్యాత్మికానుభవము శ్రీవారి సన్నిధిలో యుండుట, నా కండ్లముందే జరుగుట, నా మహాభాగ్యముగా భావించుచుంటిని. ఆశ్రమ భక్తుల ఉపయోగార్థమై నా అనుభవమును వ్రాయమని శ్రీ స్వామీజీ కోరు టచే, శ్రీవారి ఆజ్ఞప్రకారము వ్రాయుట జరిగెను. కాని అటువంటి అద్భుత మైన సంఘటనలను గురించి నా అల్పబుద్ధితో ఎటుల వర్ణింపగలను? ఆ పరమేశ్వరుని పరిపూర్ణ కటాక్షము ముందు నావంటివారు వ్రాయుట కర్హత ఎచ్చట నున్నది? ఆ దివ్య ప్రేమానుభూతిలో ఇక మాటలు, వ్రాతలు అనవ సరముకదా ? ఆ పవిత్రమైన దివ్యానుభూతిని సర్వకాల సర్వావస్థల యందునూ అనుభవించుచు, ఆ దయామయుని కరుణతో మరింత అర్హతతో జీవించులాగున అనుగ్రహించవలసినదిగ ప్రార్థించుచు మీ అందరి శాంతిని కోరుచు ముగించుచుంటిని.

ఓం తత్సత్ ఓం !

**(శాంతి ఆగస్టు - సెప్టెంబర్ 1974)**

**ఈ ప్రపంచమంతయు ఒకేకుటుంబము**

శ్రీపూజ్య స్వామీజీ యీ ప్రపంచమంతయు ఒకే కుటుంబముగా చూడవలెననే వారు. యిట్లు చూచుటకు అనేకమార్గములున్నవి. "ఆత్మవత్ సర్వభూతాని" అనునది హిందూమత సిద్ధాంతముగదా ! ఒకే విద్యుత్ ప్రవాహం కనబడ కుండా ప్రపంచ మంతయు ఎట్లు వ్యాప్తిచెంది యున్నదో అట్లే భగవంతుడు కూడ కనిపించకుండా సర్వ వ్యాపియై యున్నాడు. హిందువులు ఈ సత్యమును ప్రాచీనకాలము నుండి గుర్తె రుంగుట చేతనే, పరుల వస్తువును ఎవ్వరూ ఎన్నడూ ఆశించరు. ఏ దేశములోనూ కాలుపెట్టి ఈదేశము మాదియని ఎన్నడూ అనరు.

# ౬. మానవ జీవిత పరమావధి

“తండ్రి హరిచేరుమనియెడి తండ్రి తండ్రి” అనెడు భాగవత వచనమును పూజ్యశ్రీ స్వామీజీ తరుచు జ్ఞప్తిచేయుచుందురు. దీనిని ఎవ్వరును ఎన్నడును మరువరాదు.

అసలు హరినిచేరుట యననేమి ? దీనిని తెలుసుకొనుటకు ఎందరు ప్రయత్నించుచున్నారు ? కొందరు అసలు ఎందుకు ప్రయత్నించరు ? అసలు హరిని చేరుటయన నేమో మొదట తెలుసుకొనినకదా తరువాత చేరుటకు తగిన ప్రయత్నము చేయుట కవకాశము కలుగును ? ఈ ప్రపంచ వ్యామోహము హెచ్చుగా యుండును. అందునా ముఖ్యముగా పాశ్చాత్య నాగరికత మన పవిత్ర దేశముపై పడుచున్నకొలది మనము మానవజీవిత పరమావధిని మరచిపోవుచున్నాము. ఈ కాలములో దురదృష్టవశాత్తు ప్రతి వారికి ధనసంపాదనా వ్యామోహం చాల హెచ్చుగుచున్నది.

మనదేశములో ఎందరో అవతార పురుషులు జన్మించిరి. గౌతమ బుద్ధుడు 2500 సం॥ క్రిందట జన్మించెను. శ్రీరామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద, స్వామి రామతీర్థ, మహాత్మాగాంధి, అవతార మెహర బాబా మొదలగు మహనీయులెందరో ఇటీవల జన్మించిరి. వారు చెప్పిన అమూల్య ఉపదేశములను ఎందరు ఆచరణలో పెట్టగలుగు చున్నారు? కొందరు ఎందుకు ఆచరణలో పెట్టుటకు ప్రయత్నమైనా చేయజాలకుండిరి?

కొందరి సమాధాన మిట్లుండును. “ఈ ఉపన్యాసములిచ్చు వారి జీవితములు పరిక్షించిన యెడల ఆచరణ శూన్యమైనవని స్పష్టమగును. ఎవరును ఆచరించజాలనివి మేము మాత్రమెట్లు ఆచరింపగలము. ఆచరణ యందుంచ గలవారెందరుండిరి? చెప్పుట చాల సులభము, కాని చేయుట కష్టము. ఈ చెప్పువారందరును ఆచరించుచుండిరా?”

ప్రస్తుతము రేడియోలు లేని గృహముండదు. కాని అందు సుబోధక మైనవి విను వారెందరు ? ప్రాతఃకాలముననే వెలువడు ప్రార్ధనలుగాని, సూక్తి ముక్తావళినిగాని వినువారు అరుదు. ఏమేమో కార్యక్రమములను విందురుగాని ఉపయుక్తమగువాటిని విన నొల్లరు.

రెండు ముఖ్యమార్గములున్నవి. శ్రేయోమార్గము, ప్రేయోమార్గము. పెక్కురు ప్రేయోమార్గమునే అనుసరింతురు. లోకములో రాజసిక తామసిక ఆహారమును భుజించువారే హెచ్చు. ఎందుకు సాత్వికాహారమును భుజింపరు. పవిత్రమైన భగవద్గీతను చాలమంది చదువుదురు. కొంతమంది నిత్యపారాయణ చేయుదురు. వీరందరు సాత్వికాహారులా ? ఏ ఆహారమును తీసుకొనినను ఫరవాలేదు. గీతను శ్రద్ధగా చదివిన అన్ని పాపములు పోవునను భ్రమలో నుందురు.

వారి వారి కర్మానుసారము చనిపోయిన ప్రతిజీవి తిరిగి జన్మించునని సిద్ధాంతము, కర్మభూమియైన హిందూ దేశములోనే యున్నది. తిరిగిపుట్టుక లేదను నమ్మిక కలవారికి మోక్ష ప్రసక్తికి ఆస్కారమే లేదుకదా, నిజముగా హరిని (దైవమును) చేరగలవారికి తిరిగి జన్మింప వలసిన అగత్యముండదు. గీతలో స్పష్టముగ చెప్పబడినట్లు –

మనుష్యాణాం సహస్రేషు కశ్చిద్యతతి సిద్ధయే

య తతామ పి సిద్ధానాం కశ్చిన్మాం వేత్తి తత్త్వతః

కోటానుకోట్ల జనములో ఏ కొద్దిమందో దైవమును తెలుసుకొనుటకు కోరుదురు. వారిలో ఏ ఒకరో యదార్థముగా తెలిసికొన గలరు. కావున భక్తులు ఎంతమాత్రము నిరుత్సాహపడక దైవమును యీ జన్మలోనే చేరుటకు తీవ్రముగా ప్రయత్నింపుడు. ప్రయత్నము మనకర్తవ్యము, ఫలితము దైవాధీనము.

నిజమైన సత్సాంగత్యము సద్గ్రంథ పఠనములోనే యున్నదని చాలా మంది గ్రహింపలేకుండిరి. వ్యర్థముగా యీ నాటి విజ్ఞాన రహితమైన వార పత్రికల యందలి సీరియల్ కథలు, డిటెక్టివ్ నవలలు మొదలగువాటి పఠనమునందే అనేకమంది యొక్క అమూల్యమగు కాలము వ్యర్థమగు చున్నను, తమ కాలమును ఆనందముగానే గడుపుచుంటిమనెడి భ్రమలో యుండిరి. ఇదియే మాయా ప్రభావము.

చాలమంది ఉద్యోగులు తమకు సమయంలేక దైవమును గురించి తెలుసుకొన లేకుంటిమని చెప్పుచుందురు. కాని పదవీ విరమణానంతరము కూడ తమ కాలమును దైవచింతనలో గడుపలేకపోవుచుండిరి. అట్లుగాక మన పూర్వులు బాల్యమునుండి చదువుటకు చాల నీతివంతమగు గొప్ప శతకములను ఏర్పరచిరి. ఆధ్యాత్మికముగ చిన్ననాటి నుండియు మానవ జీవితమును మలుచుకొన గలిగిన యెడల పునాది సత్యధర్మములపై ఆధారపడి జీవితమంతయు పవిత్రవంతమగుటకు తోడ్పడును.

మానవుడు నీతిపరముగా జీవించుటకు కాల నిర్ణయమనునది ఉండ వలెనా? సాగర తీరమున అలలు కొంచెము ఆగిన వెనుక స్నానము చేయ దలచినట్లు యుండును. అసలు మానవజీవిత పరమావధి దైవమును తెలుసు కొనుటకేయని చాలమంది గ్రహించుటలేదు. కావుననే శ్రీ శంకరులు చెప్పి నట్లు వారు ద్విపాద పశువులవలె నుందురు. మానవజీవిత పరమావధి దైవమును తెలుసుకొనుటయే అని గమనింపవలెను.

ఓం తత్సత్ ఓం.

**(శాంతి – జూలై 1977)**

## 7. వైకుంఠపాళి (పరమపద సోపాన పటము)

పవిత్రమైన హిందూదేశములోని ఆటపాటలన్నియు పరమేశ్వరుని చేరు మార్గములనే సూచించును, అనగా ముక్తి మార్గము. క్యారంబోర్డువంటి విదేశపు ఆటలు అర్ధరహితంగా నుండుటేగాక, అమూల్యమగు కాలమును వ్యర్థము చేయుచుండును. వైకుంఠపాళిని ప్రతివారు నాలుగు గవ్వలతో ఆడవచ్చును. ప్రపంచ మంతయు ఈ పటములో చిత్రించబడియున్నది. దీనిని మామూలు ఆటల వలెగాక రహస్యం తెలిసి ఆడగల్గినచో భగవద్గీత సారమంతయు యీ ఆటలో స్పష్టముగ తెలియగలదు. మంచి తలంపులు గల్గి మంచి చేయువారు నిచ్చెనలు ఎక్కి పైకి (పరమపదము) చేరగలరు. చెడుతలంపులతో, చెడు కార్యములు చేయువారు పాముల నోటిలోపడి క్రిందకు (అధఃపతనము) జారుచుందురు.

మానవ జీవితములో అనుక్షణం శోధనలు ఎదుర్కొనవలసి వచ్చును. వాటిని ఓర్పుతో, ధైర్యంతో జయించగల్గినచో నిచ్చెనలు ఎక్కి పైకి వెళ్ళ గలము. లేనియెడల పతనము తప్పదు. ఎల్లవేళల అడుగడుగున పాములు నోళ్లు తెరచుకొనియే యుండును. మన కర్మ ఫలములు మనమే అనుభ వింతుము. పూజ్యశ్రీ స్వామీజీ సదా జ్ఞాపకం చేయుచున్నట్లు స్వార్థత్యాగులు పైకి, స్వార్థులు అధోగతికి పయనింతురు. ఆశ్చర్యమైన విషయ మేమనగా, మనబుద్ధులు, కోరికలెట్లుండునో, అట్టి జన్మలనే మనము సంపాదించెదము. ఈ జన్మలో పగ హెచ్చుగా నున్న, మరుజన్మలో పాములై పుట్టుచుందుము. దీనికి మంచి ఉదాహరణ ముగా షిర్డి సాయిబాబా జీవితములో ఒక మంచి సంఘటన తెలుపబడి యున్నది.

ఒకసారి బాబా దారిలో నడిచి వెళ్లుచుండగా ఒక పాము ఒక కప్ప మీదకు పగతో చంపబోవుటచూచి, ఆ పాము పూర్వజన్మ వృత్తాంతము బాబాకు తెలుసునుగాన ఇట్లనెను. “ఓ బసవప్పా ! ఇంకను నీకు క్రోధము పోలేదుగదా?” బాబా మాటలను విని, పాము తల క్రిందకొట్టుకొని వెనుకకు తిరిగి మరలిపోయెనట. పగ, క్రోధము యిట్టి జన్మలను మనకు సంపాదించును. మన చిత్త వృత్తుల ననుసరించియే కర్మఫల ప్రదాతయైన పరమాత్మ మనకు జన్మలను ప్రసాదించును. ఉదాహరణకు ఒకరు – యీ ప్రపంచములో తనకు రెండే కోరికలున్నవని చెప్పెనట–అవి ఏమగా, వేళాపాళా లేకుండా ఎల్లప్పుడు తినుటకు ఆహారము–అట్లే స్త్రీ సంగమము కూడాను. పరమేశ్వరుడు బాగా ఆలోచించి ఆ జీవికి పంది జన్మను ప్రసాదించెను. అతను పంది జన్మను కోరలేదుగాని, ఆ శరీరములో ఆ జీవి తన రెండు కోరికలను యీడేర్చుకొనుటకు అనువైన పంది జన్మను భగవంతుడిచ్చెను.

అందుచేతనే శ్రీకులశేఖరాళ్వారు – ముకుందమాలలో శ్రీకృష్ణుని నిట్లు ప్రార్థించెను.

శ్లో॥ నాస్థా ధర్మే న వసునిచయే నైవ కామోపభోగే
యద్యద్భవ్యం భవతు భగవన్ పూర్వకర్మానురూపమ్
ఏతత్ పార్థ్యం మమబహుమతం జన్మజన్మాంతరేఽపి
త్వత్పాదామ్భోరుహ యుగగతా నిశ్చలాభక్తిరస్తు

ఓ పరమాత్మా ! నీవు నా జన్మలను తప్పించలేవు. అది నాకర్మ ఫలము లచే లభించును. గాని ఏ జన్మలోనైనను నీ పాదారవింద ధ్యానము మాత్రము నాకు లభించునట్లు అనుగ్రహింపుము.

ఆ పరమేశ్వరుడు ధర్మపరిపాలన చేయును. మనము ఏ విత్తనం వేసిన, దాని ఫలితమునే పొందెదము గదా ! వరి విత్తనమునకు గోధుమ పంటరాదు కదా! ఆశ్చర్యము ! వైకుంఠపాళిలో, పూజ్యశ్రీ స్వామీజీ తరచు జ్ఞాపకం చేయుచున్నట్లు– నూరు నోములు నోచి పైకి వెళ్ళగలిగి, ఒక్క అంగలో వైకుంఠములో కాలు పెట్టగలిగినప్పుడు గూడ, ఒక్క పొరపాటు చేసిన యెడల ఒకే ఒక్క అబద్ధమాడిన యెడల ఆ పెద్దపాము నోటిలోపడి–తల్ల క్రిందుగాపోయి, తిరిగి మొదటికె చేరుకొనక తప్పుటలేదు. గాని హిందూ మతములోయున్న గొప్ప సదుపాయమేమన, ఎంతటి ఘోరపాప ములు చేసినను, నిజముగా పశ్చాత్తాపపడి,జీవితము క్రమపద్ధతిలో మార్చు కొన గల్గిన యెడల అట్టివాడు తనవాడని భగవంతుడు అభయ హస్తమిచ్చెను.

అపిచేత్ సుదురాచారో భజతే మా మనన్యభాక్ ।
సాధురేవ స మంతవ్యః సమ్యగ్వ్యవసితోహిసః॥ భ.గీ.9–30

మిక్కిలి దురాచారుడైనను అనన్యభక్తితో నన్ను భజించినచో అతనిని సత్పురుషునిగానే భావింపదగును. ఏలనన యదార్థముగా అతడు నిశ్చయ బుద్ధి గలవాడు. అనగా పరమాత్ముని సేవించుటతో సమానమైనది మరి యొకటి ఏదియును లేదని గట్టిగా నిశ్చయించుకొనినవాడు.

కనుక ఇతర మతములలోవలె శాశ్వత నరకము యిచ్చుట లేదుగాన ఎవరును, ఎన్నడును నిరుత్సాహ పడనక్కరలేదు. ఈ సత్యమును వేమన–వాల్మీకి వంటి వార్ల పూర్వ జీవితములు నిరూపించుచున్నవి. ప్రతివారు జీవిత గమ్యస్థానము చేరుటకు, ఈ జన్మలోనే భగవదైక్యము అనుభవించి తరించగోరువారు తీవ్రమగు సాధన చేయవలెను. చెడు సాంగత్యమును విడచుట, సప్తవ్యసనములను దరికి చేరనీయకుండుట, ప్రేయో మార్గమును విడిచి, అతికష్టమైనను శ్రేయోమార్గమునే అవలంభించవలెను. ఆసురీ సంపత్తులను విడిచి, దైవీ సంపత్తులు చేపట్టవలెను. ముఖ్యముగ యీ జన్మలోనే ముక్తిని పొందగోరువారు, పదునైన మంగలికత్తి అంచుపై నడకగా – జీవితము యొక్క విలువను బాగుగా గ్రహించి అతి జాగ్రత్తగా సత్యమార్గ మున అనుక్షణమును పయనించుటకు దృఢసంకల్పులై సాధన చేయవలసి యుండును. అట్టివారికి సత్యము ననుసరించుట అతి సులభము. సత్యము యొక్క

విలువ అసమాన్యమైనది. ఎన్ని కష్టములు వచ్చినను సత్య పంథాలో నడచు మానవులు తమను తాముద్ధరించుకొనుటే గాక, తాము నివసించు వాతావరణమును, తమ సన్నిహితులను, తమ దేశమును పవిత్రవంతము చేయుటయేగాక, అట్టివారి పేరు చిరస్థాయిగా నుండుననుటకు, మనదేశ ములో పూర్వ, ప్రస్తుత యుగములలో, జన్మించిన సత్య హరిశ్చంద్రుడు, మహాత్మాగాంధీ వంటి సత్యకాముల జీవితములే మనకు ప్రబల తార్కాణము.

భూదేవి "ఏ పాపమునైనను భరించెదనుగాని, అసత్యమును మాత్రము భరించలేనని దుఃఖించునట. నూరు అశ్వమేధ యజ్ఞముల ఫలితం త్రాసులో ఒకవైపు నుంచిన రెండవవైపు నుంచబడిన సత్యముతో సరితూగలేవట. 'సత్యాత్ పరం నకించదస్తి' సత్యమున కంతటి విలువ యున్నది.రెండువేల సంవత్సరముల క్రితము చరిత్రకారుడు మెగస్తనీసు మన భారతదేశములో ఒక్క అబద్ధీకుడు కూడ లేడని వ్రాసెను. ఆనాటి మన భారతదేశ మెంత పవిత్రముగ, ఆదర్శ యుతముగా నుండెడిదో ప్రతివారు గ్రహించవలసి యుండును. ఇప్పుడు తారుమారైనది. ఒక్కడైనను సత్యము చెప్పువాడు లేడని చెప్పవలసి వచ్చు దురదృష్టము మన పవిత్ర భారతదేశమున కీనాడు పట్టినది.

వైకుంఠపాళీ పటమును–బహు జాగ్రత్తగ పరిశీలించి అర్థం చేసు కొన్నచో భారతదేశ ధర్మసారమంతయు అందులోనే కనిపించును. ఏదో నిచ్చెనలు, ఏవో పాములేగదా అందు కనిపించునవను కొనరాదు. అందు చిత్రించబడిన ప్రతివానికి తగిన అర్థమున్నది. దీనిని చిత్రించిన వారెంతటి మహనీయులో ! కనుక ప్రతివారు ఈ పటముతో తమ జీవితములను పోల్చి చూచుకొని చక్కగా తీర్చి దిద్దుకొనుచు, ఈ జన్మలోనే తరించి పరమ పదమును చేర ప్రయత్నించవలెను. "వివేకచూడామణి" యను పవిత్ర గ్రంథములో శ్రీ శంకరాచార్యులువారు శతకోటి జన్మల పుణ్యఫలం చేతగాని జీవులకు మోక్షము సిద్ధించదని స్పష్టపరచిరి.

ఓం తత్సత్ ఓం

**(శాంతి – ఆగస్టు 1977)**

# 8. మురళి - దాని మధుర గానము

ప్రశ్న :- మురళి యొక్క గొప్పతనము అందరికి తెలియునా ?

జ :- పూజ్యశ్రీ స్వామీజీ శ్రీకృష్ణునికి అత్యంత ప్రియము, సన్నిహితము నైన మురళిని గూర్చి తరుచుగా ఇట్లు చెప్పుచుందురు.

ప్రశ్న:- ఒకప్పుడు మురళిని భక్తులు ఇట్లు ప్రశ్నించిరి. "నిన్ను భగవం తుడైన శ్రీకృష్ణమూర్తి సదా తన పెదిమలవద్ద ప్రీతిగా ఎందుకు వుంచుకొం దురు?

జ :- నాలోపల ఏమియును లేదు. చూడుడు, నేను ఒట్టికాళీ గొట్టమును మాత్రమే. కామం, క్రోధం, అసూయ, కోరికలు నాలో లేవు. నాకు ఏమియు అవసరంలేదు. సమస్తము త్యాగము చేయగల్గితిని. అందుచేతనే శ్రీకృష్ణునికి అతి సన్నిహితముకాగల్గితిని.

ప్రశ్న :- నీ గానమునకు ఎవరు ఆకర్షింపబడెదరు ?

జ :- ఎవరైతే ఏ కోరికలు లేక, భగవంతుని కొరకే తపించుచుందురో అట్టివారే ఈ మధురగానము ఎప్పుడు వినిపించునాయని సదా పరితపించు చుందురు.

ప్రశ్న :- నీ గానము వినిపించగానే యేమి జరుగును ?

జ :- ఎవరు ఎచ్చట ఏపని చేయుచున్నను, తక్షణం ఆ పనిని విడిచి పెట్టి యీ మధురగానము వినిపించువైపునకే పరుగెత్తుదురు. ఇది గోపికల జీవితములలో స్పష్టముగ కనిపించును.

ప్రశ్న :- వారు అట్లు ఆ మధుర గానమునకు ఆకర్షింపబడినకారణమేమి ?

జ:- గోపికల పూర్వజన్మల పుణ్యమైయుండును.

ప్రశ్న :- గోపికలెవరు ? వారి చరిత్ర ఏమిటి?

జ:- త్రేతాయుగమున శ్రీరామచంద్రమూర్తి దండకారణ్యములో పర్య టించుచుండగా, ఆయన మోహనాకారమునుచూచి అరణ్యంలో తపస్సు చేస్తున్న, మహాఋషులు ఆకర్షింపబడినవారై ఆయనను కౌగలించుకొనుటకు రాగా, శ్రీరాముడు వారించి వారితో నిట్లనెను. "నా వచ్చే అవతారములో మీకందరకు ఈ అవకాశమును కలుగచేసెదనని చెప్పి- వారి నందరను తృప్తి పరచి పంపివేసిరి.

ప్రశ్న:- తరువాత ఏమైనది ?

జ :- భగవంతుని పొందుగోరి తపస్సు చేసిన ఆ మహానీయులందరు, ద్వాపరయుగములో గోపికలుగా జన్మించి శ్రీకృష్ణపరమాత్మను మధురభక్తితో తనివితీర ప్రేమించి సేవించి ఆయనతో కాలము గడుపుచుండెడివారు. ఆయన కనిపించని యెడల చాలా విరహతాపము నొందుచుండెడివారు అట్లు గోపికలవలె సంపూర్ణ

భక్తితో తను, మనో, ప్రాణములను భగవంతు నికి అర్పించుట అందరికి సాధ్యము కాదు.

ప్రశ్న :- మురళీగాన మహిమ- ఈ కాలములో మంచి సంగీత పాఠకుల కచేరీలకు ఆకర్షింపబడుచుండునట్టిదేనా ?

జ:- కాదు కాదు, వారుగొప్ప తపస్సు చేసినవారు కనుకనే. వారు భగవంతుని తప్ప అన్యమును కోరినది లేదు. భగవంతుని సాన్నిధ్యమునే నిత్యము కోరుచు, ఆయన నామమును నిరంతరము స్మరించుచు ముక్తిని పొందగలిగిరి. అందుకనే పూజ్యశ్రీ స్వామీజీ దైవనామస్మరణ యొక్క ప్రభావ మును గూర్చి నిరంతరము, భక్తులకు అమూల్యమగు మానవ జన్మ ఎందుకు లభించినదో తెలుసుకొని తరించుటకు తైలధారవంటి దైవజ్ఞప్తి, నామ సంకీర్తన ముఖ్యసాధనమని బోధించుచుందురు.

ప్రశ్న :- భగవన్నామ ప్రభావమంత గొప్పదా ?

జ :- బృందావనములో గోపికల చరిత్ర చదివిరిగదా! భగవంతుని చేరుటకు, వారేపనినైనను, చివరకు భర్త, బిడ్డలనైనను అతిసులభముగా విడిచి వచ్చెడివారు.

ప్రశ్న:- ప్రవృత్తి మార్గము చాలా ఆకర్షణనీయమైనది గదా ? దాని నెట్లు అధిగమించుట ?

జ:- మనము చేయు ప్రతి పనిని దైవార్పణబుద్ధితో అనగా దైవారాధ నగా సాధన చేయవలెను. కోట్లకొలది ప్రజలలో ఏ కొలదిమందియో భగ వంతుని చేరుటకు పరితపించెదరు. అట్టి వారిలో యదార్థముగా ఒకానొకరే భగవతత్త్వమును తెలుసుకొని, తనలో ఐక్యమవ్వగలరని భగవానుడు గీతలో స్పష్టముగ వివరించెను.

ప్రశ్న :- ఇది అంతకష్టతరమయినదా ?

జ:- అందుచేతనే వివేక చూడామణిలో శ్రీశంకరభగవత్పాదులు శత కోటి జన్మల అనంతరముగాని, అదియైనను వారి వెనుకటి జన్మల పుణ్య ఫలంతోడ్పడినగాని, మోక్షేచ్ఛ కలుగనే కలుగదని స్పష్టముగ చెప్పిరి.

భగవద్గీతలో కూడ శ్రీకృష్ణుడు "అర్జునా! నీవు అసూయారహితుడవు, పాపరహితుడవు గావున నీకు ఈ భగవతత్త్వమును చెప్పగల్గుచున్నానని స్పష్టముగ చెప్పెను.

ప్రశ్న :- భాగవతములో అక్రూరాది భక్తులు గోపికల గురించి ఏమిచెప్పిరి ?

జ:- నేను వృధాతత్త్వజ్ఞుడను, గోపికల పాద ధూళికి గూడా పనికి రానని చెప్పిరి.

ప్రశ్న :- అక్రూరుడు ఎవరు ? ఆయన భక్తి విశేషమేమి ?

జ:–అక్రూరుడు శ్రీకృష్ణభక్తుడు. ఆయన మహాతపస్వి. ఎందరో అర్హు లకు వెనుకటి జన్మలలో దానము చేసినవాడు గావుననే, యోగులు సంవత్సర ములతరబడి తపస్సు చేసినను చూడలేని పరమాత్మను, తాను యీ జన్మలో యీ మామూలు నేత్రములతో చూచు అదృష్టము గల్గినదను సత్యమును గ్రహించి తన్మయత్వము నొందిన మహనీయుడు.

ప్రశ్న :– నారదమహాముని ఒకప్పుడు శ్రీకృష్ణుని, నిజమైన భక్తుడెవరు యని ప్రశ్నించినప్పుడు ఏమి జరిగెను ?

జ:– శ్రీకృష్ణుడు తలనొప్పితో చాలా బాధపడుచున్నట్లు నటించి, నారదునితో "భక్తులపాద ధూళితెచ్చి తన నుదుట పెట్టుకొనిన యెడల విపరీతమైన తలనొప్పి బాధ తగ్గునని" చెప్పెను. అంతట నారదుడు రుక్మిణి, సత్యభామల వద్దకు వెళ్ళి వారి పాద ధూళి నిమ్మని కోరగా, వారు పాపము నకు వెరచి పాదధూళిని యిచ్చుటకు నిరాకరించిరి. ఈ విషయము నారదుడు శ్రీకృష్ణునికి చెప్పగా ఆయన బృందావనము వెళ్ళి గోపికల నడిగి రమ్మని పంపగా నారదుడు వెళ్లి అడిగిన వెంటనే– వారు తమపాద ధూళి నిచ్చుటకు సిద్ధపడిరి. నారదుడు వారితో భగవంతునికి పాద ధూళినిచ్చు టకు ఎవరు సాహసించని పనిని మీరేల చేయుచున్నారు మీ తలలు పగిలి పోవునని హెచ్చరించగా అంతట వారు, "మా తలలు వేయి ముక్కలగు గాక, శ్రీకృష్ణమూర్తి తల నొప్పి తగ్గుటయే మాకు కావలసినదని" చెప్పి ఆతృత హృదయులై వారికాళ్ళ ధూళినంతటిని దులిపి ప్రోగుచేసి సత్వరం వెళ్లి శ్రీకృష్ణుని ముఖమున పెట్టవలసినదిగా తొందరచేసిరి. నారదుడట్లు చేయగా నటన సూత్రధారియగు భగవానుడు వెంటనే నొప్పి తగ్గినదని చెప్పి, నారదుడు వేసిన ప్రశ్నకు వెంటనే జవాబు చెప్పక ఈ విధముగా గోపికల భక్తి ద్వారా ఋజువు చేసెను. భాగవతములో చెప్పబడిన నవవిధ భక్తితో చేయు పూజ ఈ క్రింది పద్యములో చెప్పబడినట్లు, గోపికలు తమ అన్ని అవయవములతో నిత్యము భగవంతుని పూజించి మనకు మార్గదర్శులై నారు. వారు సామాన్య గొల్లభామలని ఎవరు పొరబడరాదు. మహాతపశ్శా లురు గావుననే శ్రీకృష్ణుడంతగా వారిని ప్రేమించెను.

కమలాక్షునర్చించు కరములు కరములు
శ్రీనాధువర్ణించు జిహ్వ జిహ్వ
సురరక్షకుని జూచు చూడ్కులు చూడ్కులు
శేషశాయికి మ్రొక్కు శిరము శిరము
విష్ణు నాకర్ణించు వీనులు వీనులు
మధువైరిదవలిన మనము మనము
భగవంతువలగొను పదములు పదములు
పురుషోత్తముని మీది బుద్ధి బుద్ధి

దేవ దేవుని జింతించు దినము దినము

చక్రహస్తుని ప్రకటించు చదువు చదువు

కుంభినీధవు చెప్పెడి గురుడు గురుడు

తండ్రి హరి జేరుమనియెడి తండ్రి తండ్రి. –భాగవతం

గనుక భగవంతుని మధురగానం వినదలచినవారు– ప్రపంచ వ్యామోహములను పూర్తిగా త్యజించి, మనో, ప్రాణ శరీములను ఆయనకు సర్వార్పణ చేయవలెను. భక్తి నవ విధములు. అవి ఏవనగా శ్రవణం, కీర్తనం, విష్ణోఃస్మరణం, పాదసేవనం, అర్చనం, వందనం, దాస్యం, సఖ్యం, ఆత్మనివేదనం.

ప్రశ్న :– అసూయ లేకుండ చేయుట ఎట్లు ?

జ :– అసూయ అజ్ఞానమువల్లనే కల్గును. ఇతరుల సంపదలు చూచి, అవి వారి పూర్వజన్మ సత్కర్మల ఫలితమని తెలుసుకొన్న ఎడల, మనకు అసూయ జనించకుండుటేగాక, మనము కూడ సత్కర్మలుచేసి, ఈశ్వరాను గ్రహమును సంపాదించుకొని ఎంతటి సుఖమునైనను అనుభవించ గలము.

ప్రశ్న :– పాపములు చేయకుండా నుండుట ఎట్లు ? చేసిన పాపముల నుంచి విముక్తి పొందుట ఎట్లు ?

జ :– పూజ్యశ్రీ స్వామీజీ సదా హెచ్చరించుచున్నట్లు నిరంతర హరి నామసంకీర్తన చేయుచుండినెడల, పాప చింతన రాకుండుటే గాక, నూటికి నూరుపాళ్లు భక్తితోచేసిన, పాపములు తుప్పురాలినట్లు రాలిపోవును. శాంతి ఆశ్రమంలో ఏర్పాటు చేసిన అఖండ నామసంకీర్తనలో భక్తులెల్లరు పాల్గొని తాముతరించుటేగాక, లోక శాంతికి కూడ తోడ్పడమని కోరుచుందురు.

లోకాసమస్తా సుఖినోభవంతు

**(శాంతి – ఫిబ్రవరి 1978)**

జనన మరణ రూపమైన ఈ సంసార సాగరం దుఃఖమని ఎవరైతే తలంతురో అట్టివారే దుఃఖనివృత్తి కొరకు నిరంతరం కృషి చేయవలసి యుండును. సంసార సుఖ వ్యామోహములలో చిక్కుకున్న వారికి దుఃఖము కనిపించనే కనిపించదు. వెనుకటి జన్మల పుణ్యఫలమున్నవారికే యీ దుఃఖ బాధ తెలియగలదు.

సంసారకూపమతి ఘోర మగాధమూలమ్

సంప్రాప్య దుఃఖతసర్ప సమాకులస్య ।

దీనస్య దేవ కృపయా శరణాగతస్య

లక్ష్మీనృసింహ మమదేహి కరావలమ్బమ్॥ –శ్రీలక్ష్మీనృసింహ స్తోత్రం 4 శ్లో.

# 9. హోళీ పండుగ

హోళీపండుగను ఉత్తర హిందూదేశములో ప్రజలు ఎక్కువ ప్రాముఖ్యత నిచ్చి ఆచరించెదరు. దీని ముఖ్య ఉద్దేశము ఆంధ్రులకు చాలమందికి తెలియదు.

హోళిక రాక్షసరాజైన హిరణ్యకశిపుని సోదరి. ఈమెకు అగ్నిలోపడినను తగులబడని శక్తియున్నది. ఈ శక్తివలన ఈమె ద్వారా అనేకమంది అగ్ని హోత్రమున కర్పింపబడిరి. బాలభక్తుడగు ప్రహ్లాదుడు హరిస్మరణ మాన నందున, అతని తండ్రి (హిరణ్యకశిపుడు) ఆ బాలుని అనేకవిధముల చంప ప్రయత్నించి, విఫలుడగుట లోకవిదితమే. ఏనుగులచే త్రొక్కించియు, పాములచే కరిపించియు, పర్వతముల మీదనుండి క్రిందికి త్రోయించియు ఎన్ని విధముల ప్రయత్నించియు చంపబడనం దున, చివరకు హోళిక వడిలో కూర్చొనబెట్టి అగ్ని ముట్టించినచో, ఎప్పటివలె తన సోదరి బ్రతికి, ప్రహ్లా దుడు మాత్రమే కాలి బూడిదయగునని తలంచి, హిరణ్య కశిపుడు అట్లు చేయించగా అత్యాశ్చర్యమైన విషయమేమనగా, హోళిక మాత్రం అగ్ని హోత్రంలో భస్మమైపోయి ఆమె వడిలో నుంచబడిన బాలుడు బ్రతికి సుఖముగ బయటకు వచ్చెను. ఎంతమందియో మృత్యువునకు కారకురాలైన హోళిక భస్మమై పోవుట చూచి ప్రజలు ఆనాటితో తమబాధ విరగడైపోయి నందుకు ఎంతో సంతోషించి ఆనందోత్సాహములతో పండుగ జరుపుకొనిరి. ఇది కృతయుగమున జరిగిన సంఘటనయైనను–ఈనాటికిని భారతదేశ ములో ముఖ్యముగ ఉత్తర హిందూస్థానములోని ప్రజలు ఈ హోళీ పండుగ నాడెంతయో సంతోషముతో ఒకరిపై నొకరు బుక్కా చల్లుకొనుట, రంగునీళ్లు చల్లుకొనుట మొదలగువాటితో వేడుకగా గడుపుచుందురు. పండిట్ నెహ్రూ కూడ జీవించి యున్నపుడు ఎంతో సంతోషముతో రంగునీళ్ళు కొట్టించుకొను చుండెడివారట.

ప్రహ్లాదుడు రాక్షస కులములో పుట్టినను, పుట్టుకతోనే హరి భక్తుడగుటే గాక ధర్మస్వరూపి. ఈ ప్రపంచమంతయు హరిమయముగా చూడగల్గెను. అట్టి భక్తుడుగనుకనే ధర్మమేవ జయతే అను ఆర్యోక్తికి నిదర్శనంగా ఆయన అగ్ని పరీక్షలో జయమందుటయు హోళిక మృతి చెందుటయు ఋజువైనది.

అట్లే ద్వాపరయుగంలో నరకాసురుని వలన ప్రజలు ఎంతయో బాధ పడి, దీపావళి ముందురోజున ఆతడు శ్రీకృష్ణునిచే చంపబడినపుడు ప్రజ లెంతయో ఆనందించి, ఆ మరునాడు ఆనంద సూచనగా దీపములు తోరణ ములుగా వెలిగించి బాణాసంచాకాల్చి వేడుకలు చేసుకొనుటచే ఆ ఆచారము నేటికిని భారతదేశములో అన్ని తావులలోను నరకచతుర్దశి, దీపావళి పండు గలు యధావిధిగా జరుపబడు చున్నవి. వీటి నుండి మనము నేర్చుకొనవలసి నది సత్యంవద, ధర్మం చర అనుసూక్తు లను మనము ఆచరణలో పెట్టితి మేని మనచుట్టునున్న దుష్టశక్తులు నశించి మనము శాంతిసుఖములతో నుండుటేగాక, పూజ్యశ్రీ స్వామీజీ సదా బోధించుచున్నట్లు వ్యక్తి శాంతియే లోకశాంతికి మార్గముగాను, మనలోనున్న శాంతి చుట్టుప్రక్కల

ప్రసరించుటే గాక, అది దేశ క్షేమమునకు లోకశాంతికిగూడ తోడ్పడి సర్వ సోదర మానవాళి శాంతి సుఖములతో వర్ధిల్లుచు, మహాత్ముడు కోరిన రామరాజ్యం మనము తిరిగి సంపాదించు అవకాశము గలదు.

ఓం శాంతిః శాంతిః శాంతిః

**(శాంతి - ఏప్రిల్ 1979)**

## 10. పూజ్యశ్రీ స్వామీజీ బోధల వలన నేను ఏమి తెలుసుకొన గలిగితిని

ఈ ప్రపంచమంతయు భగవంతుని గృహము. ఇందులో జీవించు వారందరు ఒకే కుటుంబమునకు సంబంధించినవారము. భగవంతుడు మన తండ్రి, తల్లి, రక్షకుడు, మన సర్వస్వము ఆయనయే !

మన బంధుమిత్రులందరు శాశ్వతముకాదు. ఋణసంబంధమనియే చెప్పవచ్చును. "ఋణాను బంధ రూపేణ పశు పత్ని సుతాలయః" అను సత్యం ప్రతివారికి అనుభవముమీద ఋజువగుచున్నది. ఈ విశాల ప్రపంచ ములో అనేకరకముల మానవులు జీవించుచున్నారు. కొద్దిమంది మాత్రమే శాంతమూర్తులు. కోపం ఆపుకోలేనివారు, మానవత్వం మరచి, పశుతుల్యు లుగ సంచరించెదరు. ఇంకను స్పష్టముగ చెప్పవలెనంటె మత్తెక్కినవారివలె సంచరింతురు. కొంచెముసేపు నిదానించిన వారి మత్తు పోయి కోపం చల్లారి, తొందరపడి అనిన మాటలకు వారే పశ్చాత్తాపపడు చుందురు. భూదేవి నుంచి నేర్చుకొనవలసిన సద్గుణం క్షమ, ఓర్పు, నిదానం, ఎట్టి పరిస్థితులలోను తొందరపడకుండుట.

సుమతీశతకములోని పద్యమును సదా స్మరించుచుండుట చాలా మంచిది.

తన కోపమే తన శత్రువు
తన శాంతమే తనకు రక్ష-దయచుట్టంబౌ
తన సంతోషమే స్వర్గము
తన దుఃఖమె నరకమండ్రు తథ్యము సుమతీ !

మనలను ప్రేమించువారిని ప్రేమించుటలో ఏమి గొప్ప లేదు. మన లను ప్రేమించని వారిని, దూషించువారిని ప్రేమించుటలోనే మన సాధనకు అవకాశముండును. నిదానముగ ఆలోచించి చూచిన యెడల మనలను అనవసరముగ నిందించినవారే మనకు నిజమైన మిత్రులు- వారే మన ఆధ్యాత్మిక సాధనకు తోడ్పడువారు. అట్టి తరుణము వచ్చినప్పుడే, మన శాంతము - నిదానము చూపుటకు అకాశముండును గదా !

మానవత్వము నుండి దైవత్వములోనికి తీసుకు వెళ్ళుటకు మన నైతికాభి వృద్ధికి తోడ్పడుటకెన్నియో శతకములు మన పవిత్రదేశములో రచింపబడినవి.

ఉదాహరణకు సుమతీశతకం, దాశరథిశతకం, వేమన శతకం, నృసింహశతకం, కాళహస్తీశ్వర శతకము వగైరా లెన్నియో వున్నవి. వాటి సారాంశములను తెలుసుకొని ఆచరణలో పెట్టుకో గలిగిన యెడల, ఉత్తమ మానవజీవితమునకెంతగానో తోడ్పడును. అప్పుడు గదా దైవత్వములోనికి వెళ్ళుట కర్హత సంపాదించుకొనగలము. మానవ జీవిత పరమావధి ఏమి? అది జేరుట ఎట్లు ? అని ఎవరూ విచారించుచున్నట్లు కనిపించదు. మన దేశములో అనేక దేవాలయములున్నవి. గాని ఏ దేవుడు మాట్లాడడు. మన మ్రొక్కులు చెల్లించుకొని నిశ్శబ్దముగా తిరిగిరావడం జరుగుచున్నది. స్వామి దర్శనము బాగా చేయగలిగనామని తృప్తిపడుట జరుగుచున్నది. శాంతి ఆశ్రమములో నున్న దైవము (స్వామిఓంకార్)– అందరితో సులభ ముగా మాట్లాడును. క్షణములు వ్యర్థము చేయరాదు. శరీరము క్షణభంగు రముగాన, గమ్య స్థానము చేరుటకు తగిన కృషి సాధన చేయవలసిదని నిత్యము జ్ఞాపకం చేయుచున్నారు.

ఓం శాంతిః శాంతిః శాంతిః

**(శాంతి – డిసెంబర్ 1979)**

## 11. ఆరోగ్యమే – మహా భాగ్యము

ప్రతివారు వారి ఆరోగ్యమునకు వారే ఎట్లు బాధ్యులో అట్లే వారి ఆధ్యాత్మికాభివృద్ధికి కూడా వారే బాధ్యులను విషయమును సదా జ్ఞప్తియం దుంచుకొనవలెను. ఈ ప్రపంచములో మనలను ఎవరూ ఉద్ధరించలేరు. ఎవరి ఉద్ధరణ వారి తీవ్ర కృషిపైననే ఆధారపడియుండునను సత్యమును ఎవరు ఎన్నడూ మరువరాదు. ఇందులకేమి చేయవలెను ?

ప్రతివారు ఎన్నికష్టములు, పరీక్షలు, శోధనలు వచ్చినను ధర్మమును మరువరాదు."ధర్మో రక్షతి రక్షితః" అను మహాభారత సారమును గ్రహించి తమలో జీర్ణింపచేసికొనవలెను. పూర్వజన్మ పుణ్యఫలమువల్లనే మనకు యీ పవిత్రమైన భారతదేశములో అమూల్యమగు మానవజన్మ లభించినది. కనుక మనకు లభించిన ఈ జన్మలో కాలమును ఎన్నడూ వృధాచేయక మానవ జన్మ గమ్యస్థానమైన భగవంతుని చేరుటకు అహర్నిశము కృషిచేయవలసి యుండును.

పూజ్యశ్రీ స్వామీజీ నిత్యము అందరి తరింపునకు యిచ్చుచున్న అమూల్య మగు సలహా ననుసరించుచు భగవంతుడు మన హృదయనివాసి యను జ్ఞప్తితో నిరంతరం తైలధారవలె భగవన్నామమును స్మరించి, తరించు డను– అమూల్య సత్యమును ప్రతివారు గ్రహించి ఆచరణలో పెట్టుకొనుట ముఖ్యము. ఆ దివ్య స్ఫురణ కలిగియున్న ఎడల మన తలంపులు మాటలు చేతలు అతిపవిత్రముగ నుండగలవు.

ఎవరి హృదయము అతి నిర్మలముగ పవిత్రముగ నుండునో వారికే భగవద్దర్శన ప్రాప్తి లభించును. మానవజన్మ లక్ష్యము భగవంతుని అస్తిత్వ మును అనగా ఆ దివ్య ఉనికిని గ్రహించి ఆ శక్తిలో ఐక్యమగుటయేగదా, యిట్టి ప్రయత్నము ప్రతివారు త్రికరణ శుద్ధిగ చేయగలిగిన యెడల శాంతి తప్పక ప్రాప్తించును.

సత్య-అహింసల సారమును గ్రహించి ఆచరణయందుంచుటయే అవినీతి నిర్మూలనమునకు ధర్మోద్ధరణకు మూల సూత్రము. మానవులు ఉద్ధరింపబడుటకు యింతకంటె ఉత్కృష్టమైన సాధన ఏమున్నది. పవిత్రమైన (ప్రతిఫలాపేక్షలేని ప్రేమ) ప్రేమ-శాంతి-సత్యములకు నిలయమైన హృదయ ములు భగవంతునికి నిలయములు. ఆయన ఉనికి వల్లనే మన జ్ఞానేంద్రియ ములు పనిచేయుచున్నవి. ఆయన మన తలంపులను వూహలను కనిపెట్టు చున్నాడను స్పృహ మనకున్ననాడు, మనలో మొలకెత్తుచున్న చెడుతలంపు లన్నియు పటాపంచలై ఆ స్థానమున అతిపవిత్రము, ప్రేమ పూరితములగు తలంపులు ఉత్పన్నమగును. తలంపులే విత్తనములు, విత్తనములు మంచి వైనచో పంట బాగుగా ఫలించును. అట్లే మన తలంపులు పవిత్రముగ నున్నచో మన మాటలు చేతలుగూడ పవిత్రముగ నుండుటేగాక-పరోపకార మునకు స్వార్థరహిత సేవకు అర్హతగా నుండును.

"దేహో దేవాలయ ప్రోక్తో" మన శరీరము ఒక దేవాలయము మన హృదయము దైవమునకు నివాసస్థానము. ఈ దేహము రాతికట్టడమువలే గాక, సజీవమైన కదలే దేవాలయము. మనలోనున్న దైవశక్తిచేతనే మన జ్ఞానేంద్రియములు కర్మేంద్రియములు చక్కగా పనిచేయుచున్నవి. అందు చేతనే పూజ్యశ్రీ స్వామీజీ లోకశాంతి ప్రార్థన శ్రద్ధాభక్తులతో నిత్యముచేసినచో, భగవత్ప్రాప్తిని వెంటనే పొందగలమని అనుభవ పూర్వకముగా చెప్పగల్గు చుండిరి. వారి నిత్యబోధలో దైవమునకు వేరు శరీరము లేదు. నీ శరీరమే ఆయన శరీరము, నీ నేత్రములే ఆయన నేత్రములు, నీ కర్ణములే ఆయన కర్ణములు, నీ హస్తములే ఆయన హస్తములు, నీ పాదములే ఆయన పాద ములు ఈవిధముగా దైవవునికిని నిత్య జీవితములో అభ్యాసపూర్వకముగా జ్ఞప్తి యందుంచుకొని తరించమని శలవిచ్చుచుండిరి. ఈ భావనయే శరీరా రోగ్యమునకు మనో వికాసమునకు తోడ్పడును. ఈ విధముగా ఆయు రారోగ్యములు పొందుటకంటె మహాభాగ్యమే మున్నది ? భగవానుడు సర్వు లను శాంతి ఆరోగ్యములతో బ్రోచుగాక !

ఓం ! ఓం ! ఓం !

**(శాంతి - ఫిబ్రవరి 1982)**

# 12. పూజ్యశ్రీ స్వామీజీ చివరి రోజులు

ఎంతటి మహనీయులు, మహాపురుషులు, మహాయోగులు, మహా భక్తులైనను ఎన్నటికైనా ఒకరోజు స్థూల శరీరమును వదలుట తప్పదని మన శాస్త్రములేగాక శాస్త్రవేత్తలు, పండితులు నిరంతరము ఘోషించుచునే యున్నారు. గాని ఆ మృత్యువు ఎటుల ఎప్పుడు ఎచ్చట ఏవిధముగా రానున్నదో తెలుసుకొనుట దుర్లభము. దైవలీలలు అత్యంత అద్భుతముగ యుండును.

పూజ్యశ్రీ స్వామీజీ తమ 88వ జన్మదినము జనవరి 21-1-82వ తేదీన ఆనందప్రదముగ, పూజ్యులు శ్రీ చిదానంద స్వాములవారి అధ్యక్షత క్రింద వందలాది భక్తుల సమక్షములో జరుపుకొనిరి. ఆశ్రమ అధ్యక్షులైన శ్రీ తెన్నేటి విశ్వనాథం గారు పరమపదించిన తర్వాత ఆ స్థానే శ్రీస్వామి చిదానందుల వారిని గౌరవ అధ్యక్షులుగ వుండవలసిందిగా శ్రీస్వామీజీ వారిని కోరుట, అప్పుడు ఆ పరిస్థితిలో శ్రీ చిదానందులు విదేశపర్యటనలో యుండుటచే, వారి అంగీకారము రాకపోయిననూ, శ్రీస్వామీజీకి మాత్రము వారి యందే కోరిక యుండెడిది.

శ్రీచిదానందులు జనవరి 21న శ్రీస్వామీజీ జన్మదిన సందర్భములో వచ్చినప్పుడు వారంతటవారే "శ్రీస్వామీజీ సంకల్పమును ఇంతవరకు నెరవేర్చ లేకపోతినని, ఏదోపాపము చేసినట్లుగ, నాహృదయము ద్రవించు చున్నదనియు శ్రీవారిని నా పరమ గురువుగా భావించి శ్రీస్వామీజీ సంకల్పప్రకారం ఆశ్రమ అధ్యక్షులుగ యుందునని వారి అంగీకారము తెలుపగానే శ్రీస్వామీజీకి ఎంత ఆనందము, నూతన శక్తి కలిగినదో వేరుగ వ్రాయనవసరములేదు. ఆ ఆనందము తృప్తితోనే శ్రీస్వామీజీ చివరిరోజులు గడచుచున్నవి.

శాంతిఆశ్రమం స్థాపించుటలో వారి సర్వశక్తిని దారబోసి 64 సం॥గ పాటుబడిరి. వారి హృదయము యెంత విశాలమో, వారి ఆశ్రమ స్థాపన అంత విశాలమైనది. వాటి శాఖలుగూడ విశాలముగ అభివృద్ధి గాంచుచునే యున్నవి. గాని శ్రీ స్వామీజీ మాత్రము కొంతకాలము నుండి ఏ ఆశ్రమ తాపత్రయములు లేకుండా నిర్లిప్తతగ, విలక్షణముగ వారి చివరిరోజులలో యుండుట చాల ఆశ్చర్యముగ యుండెడిది. ఇదివరలో ముఖ్యమైన, సన్ని హితులైన భక్తులెవరైనా ఆశ్రమమునకు వచ్చిన, ఆశ్రమాభివృద్ధికి తోడ్పడ వలసినదిగా కోరెడువారుగాని ఈ3,4 సం॥నుండి ఆ కోరిక కూడా లేకుండా, స్వామి మరణించెను. ఓంకారము మీ అందరిలో జీవించుచుండె నన్న మహాభావనలోనే, ఏదో ప్రపంచములో జీవించుచున్నట్లుగ వుండెడివారు.

జనవరి 21వ తేది జన్మదిన సందర్భములో దూరప్రాంతముల నుండి వచ్చిన భక్తులు కొంతమంది ఫిబ్రవరి నెలవరకు వుండి నిత్యము శ్రీ స్వామీజీ సన్నిధిలో ప్రార్థన, ధ్యానాదులు జేసుకొనుచు వారి ఆశీస్సులను పొంది వెళ్లిరి.

మార్చినెల వచ్చెను, కోటగిరి ప్రయాణము దగ్గరపడుచున్నది. ఈలోగా వాల్తేరు ఆశ్రమమునకు వెళ్లి కొద్దిరోజులుండి డాక్టరు పిచ్చయ్యగారిని, డాక్టరు రమణిగారు వగైరా భక్తులందరినీ జూచిరావచ్చు నని ప్రయాణమై మార్చి 5వ తేదీన బయలుదేరి సుఖముగ వాల్తేరు ఆశ్రమమునకు వెళ్లిరి. అచ్చట ఉదయం, సాయంత్రం భక్తులకు దర్శనమిచ్చుచూ, ప్రతిరోజు సాయంత్రము, సత్సంగములో పాల్గొనుచూ, శ్రీవారు ఏమైనా జెప్పవలయు నన్నప్పుడు 2,3 వాక్యములలో భక్తులకు, మీరు వెదకుచున్న దైవము మీలోనే యుండెను. కాలము అమూల్యమైనది. ఈరోజే మనది. రేపు మనదికాదు. గాన నిరంతరము దైవజ్ఞప్తితో యుండి మానవ జన్మను సార్ధకము జేసుకొనె దరుగాక! యని జెప్పుచుండెడి వారు, ఒక్కొక్క రోజు మౌనముగ కూర్చొని అందరిచే నామ సంకీర్తన, శాంతి ప్రార్ధన చేయించెడివారు.

ఈ విధముగా సుమారు రెండు మాసములుగడచినవి. అచ్చట వుండ గానే కొంత అస్వస్తత గల్గినది, డా॥ పిచ్చయ్యగారి ప్రేమ, వైద్య సహాయ ముతో కొంత ఆరోగ్యముగానే యుండిరి. ప్రతి సంవత్సరము శ్రీస్వామీజీ కోటగిరి ప్రయాణము ముందు డాక్టరు పిచ్చయ్యగారి సలహామీదనే ప్రయా ణం జరిగేది. డాక్టరుగారి సలహాను అడిగితే, వారి సంకల్పము మనము కాదని ఎటుల అందుము ? వారి యిష్టప్రకారమే కానిండు అనెడివారు. గాని ఈ సారి శ్రీ డాక్టరు గారికి కూడా శ్రీస్వామీజీ కోటగిరి వెళ్లుటకు ఎంతమాత్రమూ ఇష్టములేదు. అయితే శ్రీ స్వామీజీ సంకల్పమునకు తిరుగు అనేది లేదు. వారు తలచిన కార్యము పూర్తి అయిన గాని వార్కి తృప్తిగ యుండెడిదిగాదు.

డాక్టరు గార్కి శ్రీ స్వామీజీకి జరిగిన సంభాషణ.

డాక్టరుగారు:- శ్రీ స్వామీజీ ! ఈ సారి మీ కోటగిరి ప్రయాణం విర మించుట మంచిది. మీ ఆరోగ్య పరిస్థితినిబట్టి దూరప్రయాణం చాల అలసట అవును, అంత మంచిదిగాదు.

శ్రీస్వామీజీ :- మీ ప్రేమకు కృతజ్ఞుడను, గాని కోటగిరి భక్తులకు వచ్చెదనని వాగ్దానము జేసితిని. ముఖ్యముగా శ్రీ గురుస్వామిగారు (ఆశ్రమ కార్యదర్శి) ఆయన ధర్మపత్ని సరస్వతీదేవి నాకై వేచియుందురు. వారు మహాభక్తులు, అటువంటి భక్తులను నిరాశజెందించరాదు.

డాక్టరుగారు :- ఆ భక్తులకు ఉత్తరములు వ్రాసి ఇచ్చుటకు రప్పించ వచ్చును. వారు ఆనందించెదరు.

శ్రీస్వామీజీ :- మీ సలహాకు ఆనందము, భక్తులందరూ రావచ్చును. గాని వారు అచ్చట కోటగిరి శాఖకు జేయుచున్న బ్రహ్మాండమైన సేవను జూడవలయును గదా !

ఇక డాక్టరు గారు ఏమియు సమాధానము చెప్పలేదు. కోటగిరి శాఖ అన్నను, అచ్చటి భక్తులన్నను శ్రీస్వామీజీకి చాలప్రీతి, ఆనందము. ఆ భక్తులు గూడ ఆ విధముగానే యుందురు. శ్రీస్వామీజీ అచ్చట వున్నంత కాలము వారి సర్వస్వము మరచి శ్రీవారి సేవలో మునిగియుండెడివారు. కోటగిరి ప్రయాణం దగ్గరపడుచున్నది. ఎప్పుడు వెళ్లుట యని రోజూ అడిగెడివారు. ప్రయాణం వున్నదో లేదో? అన్న మీమాంసలో ఇంకా టిక్కెట్లు కొనమని వ్రాయలేదంటిమి. ఈసారికి వెళ్లవలయును టిక్కెట్లుకొని రిజర్వే షను చేయించమని మాతృ ఆశ్రమమునకు వ్రాయమని కోరిరి.

శ్రీస్వామీజీ కోరిక ప్రకారము ఏప్రిల్ 15తేదీకి టిక్కెట్లు కొనమని వ్రాస్తిమి. గాని 15,19 తేదీలలో రిజర్వేషను దొరకలేదు 30వ తేదీన రిజర్వే షను చేయించితిమనిరి. ఎండలలో మరల తోటపల్లి ఎందుకు? ప్రయాణం దగ్గరపడిన తర్వాత వెళ్లవచ్చునని భక్తులుకోరికపై వాల్తేరులోనే వుండిరి. రోజూ డాక్టరుగారు వచ్చి శ్రీస్వామీజీ సన్నిధిలో కొంతతడవు గడిపి వెళ్లు చుండిరి. వృద్ధాప్యములో వుండవలసిన ఏవో చిన్న చిన్న రుగ్మతలు తప్ప అన్నియు సామాన్యముగానే యున్నవి. ఈలోగా ఆశ్రమభక్తులు, అభిమాను లైన శ్రీకరుణాకర్ నంబియార్ (విశాఖపట్నం) వారి ధర్మపత్ని జానకమ్మ శ్రీ స్వామీజీ వాల్తేరు ఆశ్రమమునకు వచ్చిరని విని శ్రీవారి దర్శనమునకై వచ్చిరి. కొంత తడవు ప్రార్థన, ధ్యానాదులు అయిన తరువాత, తమ ఆరో గ్యము ఎటులున్నది స్వామీ! అని ప్రశ్నించగా, మీ అందరకు సేవజేసి మీకు తోడ్పడ గల్గిన అదే నా ఆరోగ్యము అనిరి. ఆ దంపతులు రోజూ ఒకసారి వచ్చి శ్రీస్వామీజీ దర్శనం జేసుకొని వెళ్లుచుండెడివారు. వారు ఒకరోజున కేరళ ఆయుర్వేద వైద్యులలో ప్రసిద్ధిగాంచిన ఒక డాక్టరుగారిని శ్రీ స్వామీజీ దర్శనార్థము తీసుకొనివచ్చిరి. ఆ డాక్టరు గారు కూడ శ్రీస్వామీజీ ఆరోగ్యమునకై కొన్ని సలహాలనిచ్చిరి. ఆ సలహా ప్రకారము శ్రీనంబియారు దంపతులు రోజూ ఉదయం 6 గం॥లకు వచ్చి శ్రీస్వామీజీ శరీరమంతను ఆయుర్వేద మందులతో తయారు చేసిన నూనెతో ఒక గంటసేపు మర్దన చేసెడివారు. శ్రీస్వామీజీ ఒక అవతారమూర్తి, వారిసేవ చేసే భాగ్యము మాకు లభించినది అన్న భావనతో ఎంతో ఆనందముగ భాగవత,రామా యణ శ్లోకములు చదువుచూ 15 రోజులు మర్ధనచేసిరి. దైవము ఎచ్చటనో లేదు, మీలోనే ఆ దైవమును గాంచుచుంటిని. ఎచ్చట ప్రేమ యున్నదో అచ్చటనే దైవముండును. మీ కాలము అమూల్యమైనది దైవమును మరువక సదా ఆ దైవజ్ఞప్తితో నిండి మీ మానవ జీవితములను సార్ధకత జేసుకుని తరించెదరుగాక! యని శ్రీస్వామీజీ వారికి బోధించెడివారు. వారు శ్రీస్వామీజీ ఆశీస్సులనుపొంది ఆనందముగ తృప్తిగ వెళ్లుచుండెడివారు.

ఇక కోటగిరి ప్రయాణం దగ్గరపడుచున్నది. ఏప్రిల్ 30వ తేదీని వాల్తేరు ఆశ్రమం నుండి బయలుదేరి మాతృ ఆశ్రమమునకు సురక్షితముగ జేరితిమి. కోటగిరి ప్రయాణం అయిదురోజులే యున్నది. తీసుకొని వెళ్లవల సిన సామానులు సర్దండి

ఏవి మరచిపోవలదని ఆజ్ఞాపించిరి. ఈ 5 రోజు లలో ఒకరోజున 28వ తేదీని శ్రీస్వామీజీకి నీర్సము జేసినది. నీర్సములో ప్రయాణముచేయుట మంచిదికాదని 30వ తేదీ టిక్కెట్లు రద్దుచేయించితిమి. దైవానుగ్రహముచే 2 రోజులలో ఆరోగ్యము బాగున్నది. మరల కోటగిరి ప్రయాణం ఎప్పుడని అడుగుట ప్రారంభించిరి. మీకు ఆరోగ్యము సరిగ లేదుగదా ? టిక్కెట్లు రద్దు చేస్తిమి మరల రిజర్వేషను 15 రోజుల వరకు దొరకదు. ఇచ్చట దొరికినా, మద్రాసులో కష్టముగాన ఈసారికి విరమించుట మంచిదని అందరూ సలహాయిచ్చిరి. గాని శ్రీస్వామీజీకి మాత్రము దృష్టి అంతా కోటగిరి శాంతి శాఖయందే యున్నది. ఆలస్యమైనను వెళ్లవలసినదే యనిరి. మే నెల వచ్చెను. మరల రిజర్వేషనుకై ప్రయత్నములు జరిగెను. మేనెల 15వ తేదీకి టిక్కెట్లుకొనిరి. ఎండలు అన్నియు యిచ్చటనే అయి పోయెను? ఇప్పుడు అంతదూరము ఎండలో ప్రయాణము ఎందుకు మాని వేయుదము అనిన, మనము ఎండలకు వెళ్లుచుంటిమా ? అచ్చటి భక్తుల సేవకై వెళ్ళుచుంటిమి మరల కోటగిరికి వెళ్లెదనో లేదో? ఇదే ఆఖరిసారిగాన తప్పనిసరిగ వెళ్లవలయుననిరి. ఆశ్రమ జనకులుగయున్న శ్రీరామారావు గారితో గూడ ఈసారే మనము కోటగిరి వెళ్లుటగాన మీరు గూడ తప్పక రావలయునని వారిని గూడ ప్రయాణం జేసిరి. వారికి ఆ విధముగ యున్నప్పుడు యిక ఎవరేమి చెప్పగలరు ? దైవము మీదనే భారమువేసి మే 15వ తేదీన బయలుదేరుట జరిగెను.

కాకినాడ, రాజమండ్రి, నిడదవోలు, తణుకు, గుడివాడ, గుంటూరు, వగైరా స్టేషనులలో భక్తులందరువచ్చి శ్రీస్వామీజీని దర్శించి శ్రీవారి ఆశీస్సులు పొంది వెళ్లిరి. విజయవాడ శాంతిసత్సంగమండలి భక్తులకు మీ వంటి భక్తులకొరకే నేను జీవించుచుంటిని. మీరు చేయుచున్న అపార సేవకు చాల ఆనందము. మనకున్న దానిని ఇతరులతో పంచుకొనుటలోనే మనకు నిజమైన శాంతి, ఆనందము గల్గును. ఇతరుల సుఖశాంతులే మన సుఖశాంతులన్న సత్యమును మీ జీవితములలో వ్యక్తపరచుటలో సార్ధ కము జేసుకొందురుగాక ! నా ప్రార్ధనలు సదా మీ వృద్ధినే కోరుచుండును. మీ అందరకూ కోటగిరికి స్వాగతము అని సెలవిచ్చిరి.

16వ తేది ఉదయం సుమారు 8 గంటలకు మద్రాసు సుఖముగజేరి తిమి. రైలు స్టేషనులో ఆగగానే ఆశ్రమభక్తులు శ్రీస్వామీజీకి అతి సన్నిహితు లైన శ్రీ పి.ఎన్.రామచంద్రన్, సోదరి యోగీశ్వరి స్వాగతమిచ్చుచూ శ్రీ స్వామీజీ సన్నిధికి వచ్చిరి. ఆ రాత్రి మరల రైలు యెక్కువరకు స్టేషనులోనే ఉండుటకు రిటైరింగు రూములో గడిపిరి. అందరి స్నానములు వగైరాలు పూర్తి అయినవి. శ్రీ స్వామీజీ కొంతతడవు విశ్రమించిరి. ఆపై శ్రీస్వామీజీ దర్శనమునకు వచ్చిన భక్తులకు దర్శనమిచ్చి అందరిచే శాంతిప్రార్ధనను చేయించి పంపిరి. రాత్రి 9 గం॥లకు నీలగిరి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణం జరిగెను. మద్రాసులో రిజర్వేషను కొంతసరిగా అవ్వకపోవుటచే, కోయం బత్తూరు కంపార్టుమెంటులో ఎక్కించిరి. ఆ సంగతి ముందు

తెలియలేదు. మరునాడు 17వ తేది ఉదయం మేట్టుపాలెం జేరు సమయం దగ్గరపడు చున్నది. ఇంతలో కోయంబత్తూరు స్టేషనువచ్చినది. ఈ కంపార్టుమెంటు మేట్టుపాలెం వెళ్లదు ఇచ్చటనే వుండిపోవుననిరి. అప్పుడు చేయునది లేక అచ్చటనే దిగవలసి వచ్చినది. శ్రీస్వామీజీరాకకై మేట్టుపాలెం స్టేషనులో భక్తులు వేచియుందురు. మేము యిచ్చటదిగిన సంగతి వారికి తెలియదు. గాన మేము దిగిన వెంటనే మరల ఆ రైలులోనే చి॥ ఆంజనేయులు మేట్టు పాలెం వెళ్లి, అచ్చట వేచియున్న భక్తులకు విషయము తెలుపగానే వారం దరూ కార్లు తీసుకొని కోయంబత్తూరు స్టేషనుకు వచ్చిరి. శ్రీ స్వామీజీకి కల్గిన శ్రమకు విచారించిరి. శ్రీ స్వామీజీకి పూలమలను అర్పించి, ప్రార్ధనలు జేసిరి. కోయంబత్తూరు నుండి కోటగిరికి 40 మైళ్లు. కోటగిరికి సుమారు 12 గం॥ (మధ్యాహ్నం) ప్రాంతములో దైవానుగ్రహముచే సుఖముగ జేరితిమి. అచ్చట చాలామంది భక్తులు వేచియుండిరి. పూలమాలలతో భజనలతో స్వాగతము నొసంగిరి. శ్రీస్వామీజీ కారుదిగి కొంతతడవు ప్రార్ధన మందిరంలో కూర్చొనిరి. భక్తులతో ఎంతో ఉత్సాహముగా మాట్లాడిరి. నేను యిచ్చటకు వచ్చుటకు డాక్టర్లకు, భక్తులకు ఎంత మాత్రమూ యిష్టములేదు. గాని మీ అపారమైన భక్తి, ప్రేమలే నన్ను యిచ్చటకు తీసుకొని వచ్చినవి. నేను యిచ్చట వున్నందులకు మీ అందరూ యిదివరకటికన్నా యిప్పుడు ఇంకా వృద్ధిచెందుచూ,మీరు దైవములో జీవించుచూ, ఇతరులను గూడ ఆ దైవసన్నిధిలో జీవించుటకు తోడ్పడవలయును. ఈక్షణమే మనది, వచ్చెడి క్షణము మనదికాదు. దైవాజ్ఞ లేనిదే గడ్డిపరక కూడ కదలదు. ఆ దైవాజ్ఞ చేతనే నేను యిచ్చటకు రాగల్గితిని. గాన ఈ సత్యమును మీరు బాగుగా గ్రహించి తరించెదరు గాక అని శెలవిచ్చిరి.

కోటగిరి రమణీయమైన ప్రకృతితో, చల్లని వాతావరణముతో నిండి యున్నది. రోజులు ప్రశాంతముగ గడచుచున్నవి. శ్రీస్వామీజీ దూర, దగ్గర ప్రాంతముల నుండి వచ్చిన భక్తులందరకూ దర్శనము యిచ్చుచూ, సత్సంగ ములో పాల్గొనుచు, ఆరోగ్యముగ ఆనందముగ యుండిరి. చల్లని వాతావరణ ములో శ్రీస్వామీజీని దర్శించుకొనుచు వారి పవిత్ర సన్నిధిలో కొన్నిరోజులు శాంతిగా గడిపి వెళ్లవచ్చునని ఆశ్రమ భక్తులు విజయవాడ, మద్రాసు, ప్రొద్దుటూరు, కల్లూరు ఇంకా యితర ప్రాంతముల నుండి వచ్చిరి. ఆశ్రమ మంతా భక్తులతో, భజనలతో, ప్రార్ధనలతో నిండియున్నది.

శ్రీ గురుస్వామిగారు భాగవత సప్తాహము ఏర్పాటు చేసిరి. అన్నికార్య క్రమములు యదావిధిగా, శాంతియుతముగ జరుగుచున్నవి. శ్రీస్వామీజీ అప్పుడప్పుడు ఉదయం బయటకు వచ్చి సూర్యభగవానుని కిరణములలో కూర్చుని రమణీయమైన ప్రకృతిని తిలకించుచూ అందులో లీనమై యుండెడి వారు. శ్రీస్వామీజీ పైకి వెళ్లగనే భక్తులు గూడ కొంతమంది శ్రీవారి సన్నిధిలో కూర్చుని ప్రార్ధన, ధ్యానము చేసుకొనెడివారు. కోటగిరి, శాంతి కేంద్రములో చిన్న వినాయకుని

మండపమున్నది. చుట్టుప్రక్కల భక్తులు పాఠశాల పిల్లలు నిత్యము వచ్చి పూజించుకొని వెళ్లెడివారు. వినాయకునికి చిన్న గుడి,నిర్మించి శాస్త్రోక్తముగ ప్రతిష్టచేయించవలెనని శ్రీగురుస్వామి గార్కి (కార్యదర్శి) సంకల్పముగల్గి శ్రీ స్వామీజీకి తెలియపర్చి వారి ఆశీస్సులనుపొంది, గుడి నిర్మించు ప్రయత్నములు చేసి శ్రీస్వామీజీ కోటగిరి జేరుసరికి ఆ నిర్మాణ మును పూర్తిజేసిరి. జూన్ 3వ తేదిన ప్రతిష్ట, కుంభాభిషేకము వగైరాలు వేదపండితులచే శాస్త్రోక్తముగ జరిపించిరి. వచ్చిన భక్తులు, వేదపండితులు శ్రీస్వామీజీని దర్శనము చేసుకొని వారి పవిత్ర సన్నిధిలో కొంతసేపు వేద గోష్ఠి జరిపి శ్రీవారి ఆశీస్సులను బడసిరి. ఆ రోజు శ్రీస్వామీజీ యెంతయో ఉత్సాహముగా వుండి ఆశ్రమశాఖకు పాతభక్తులైన శ్రీకుమార్ నాయర్, శ్రీరాజన్ (కరణం) గారిని జూచి చాలకాలమునకు మీరు నన్ను చూచుటకు వచ్చినందులకు చాల ఆనందము. తైలధారవలె సదా దైవజ్ఞప్తితో నుండి తరించవలయును, అని నొక్కి చెప్పిరి.

శ్రీగురుస్వామి గారు చాలగొప్ప సేవ జేయుచుండిరి. దానికి కుమార్ నాయరుగారు స్వామీజీ ఈ కోటగిరి శాంతికేంద్రము గురించి మీరేమియు ఆలోచించ నవసరము లేదు. శ్రీగురుస్వామి చాల సమర్థులు. వారి ద్వారా ఈ కేంద్రము చాల అభివృద్ధి గాంచగలదని జెప్పిరి. ఈ విధముగ సుమారు 12 రోజులు గడచినవి. ఆ తరువాత శ్రీస్వామీజీకి కొంచెము జ్వరము తగిలినట్లున్నది అదే తగ్గునని ఆ రోజు విశ్రాంతిగ పరుండి వుండిరి. ఆ మరునాడు కొంచెము తగ్గినది. గాని, సాయంత్రమునకు 102,103 డిగ్రీలు జ్వరము వచ్చినది. ఆశ్రమ భక్తులైన శ్రీ బిల్లిరాజు గారికి కబురు చేయగా వెంటనే వచ్చి తగిన చికిత్స జేసిరి. జ్వరము తగ్గినది. ఊపిరితిత్తుల్లో కొంచెము కఫము పట్టినదనిరి. దానికి చికిత్స జేసిరి. అది సర్దుకొన్నది. బాగానే వుండిరి.గాని, ఆహారము మాత్రము సరిగ తీసుకొనుటలేదు. ఒకరోజు తీసుకొన్నట్లు, ఒకరోజు తీసుకొనే వారు కాదు. ఈ విధముగ 5,6 రోజులు గడచినవి. ఇంకా యిటుల వున్న మరల ప్రయాణమునకు కష్టము. తిరిగి మాతృ ఆశ్రమమునకు వెళ్లుట మంచిదని తలంచి జూన్ 17వ తేదికి టిక్కెట్లు కొని రిజర్వేషను జేయించితిమి. డాక్టరు బిల్లిరాజు గారు రోజూ రెండుపూటలా వచ్చి జాగ్రత్తగ పరీక్ష జేసెడివారు. అన్నియు నార్మల్‌గా వున్నవని సంతోషముగ జెప్పెడివారు. గాని చాలా నీర్సముగా వున్నది ఆహారము ఏదో ఒకటి యివ్వవలయునని వారే స్వయముగ దగ్గర వుండి యిప్పించెడివారు. రాత్రులందు గూడా వారే దగ్గర పరుండెడివారు. వచ్చే భక్తులు దర్శనము జేసుకుని, ఆశీస్సులు పొంది వెళ్లెడివారు. 7వ తేది ఉదయం మధ్యాహ్నం గూడ డాక్టరుగారు పరీక్ష జేసి వెళ్ళిరి. శరీరము నకు కొంతచెమట పట్టినట్లున్నది. అంత చలిప్రదేశములో చెమట ఏమిటా యని అనుకొంటిమి. వెంటనే డాక్టరు గారికి కబురుచేయగా వచ్చిరి, పర్వాలేదనిరి. గాని వారికి ఏదైనా అనుమానము వచ్చినదేమో తెలియదు. రాత్రి సుమారు 12 గం॥లకు కోయంబత్తూరునుండి హార్టు స్పెషలిస్టును తీసుకొనివచ్చిరి. వారు అన్నీ పరీక్షజేసి ఇ.సి.జి గూడ తీసిరి. హార్ట్ అంత తృప్తికరముగ యున్నట్టులేదు. ఈ పరిస్థితిలో

ప్రయాణము చేయించుట గూడ మంచిది గాదు. యిచ్చట చికిత్స చేయుటకు అంత అనుకూలముగ లేదు, 3,4 రోజులైనా కోయంబత్తూరుకు మార్చిన బాగుండును. ఆ తరువాత మీ ఇష్ట మనిరి. ఆ పరిస్థితిలో ఏమి చేయుట ?

శ్రీస్వామీజీ మాత్రము ఏ బాధలు లేకుండా ఏదో సమాధిస్థితిలో యున్నట్లుగ, విలక్షణముగ ప్రశాంతముగ నుండిరి. శ్రీ స్వామీజీని దర్శించుటకు వచ్చిన కొంతమంది స్వాములు, మహాత్ములు, శ్రీస్వామీజీ తేజస్సును, ప్రశాంత స్థితినిజూచి, శ్రీవారిని ఆ విధముగా శాంతిగా గడపనిండు. వారికి అశాంతి గలుగనీయవలదని జెప్పెడివారు. గాని డాక్టర్లు, మేము చూస్తూ శ్రీస్వామీజీని ఆ విధముగ ఎటులవదలగలమనిరి. ఏదో విధముగా అందరి కోరికపై 8వతేది ఉదయమే కోయంబత్తూలో ప్రసిద్ధిగాంచిన శ్రీరామ కృష్ణ ఆసుపత్రిలో జేర్పించిరి. ఆ రోజు చికిత్స చేసిరి. మధ్యాహ్నము నుండి బాగా తేరుకొనిరి. మాటగట్టిగా చెప్పకపోయినా మనము చెప్పేది బాగా గ్రహించెడివారు. ద్రవ పదార్థము యేది యిచ్చినా త్రాగేవారు. ఆ మరునాడు 9వ తేదీన కూడ బాగానేయుండిరి. అంతకుముందే మాతృ ఆశ్రమమునకు వ్యాన్ నిమిత్తం మనిషిని పంపితిమి. తొమ్మిదవ తేది రాత్రి 11 గం॥లకు కోటగిరికి చేరినది. 10వ తేదిన బయలుదేరి మాతృ ఆశ్రమమునకు జేర వలయునని ప్రయాణమైతిమి. ఆ ఉదయమే శ్రీ స్వామీజీకి మరల కొంత కంగారు అయ్యెను. అయినా మధ్యాహ్నము 12 గం॥ల ప్రాంతమున శ్రీస్వామీజీని వ్యాన్‌లో పరుండబెట్టిరి. అందులోకి కావలసిన వైద్య సామాగ్రి అంతా అమర్చిరి. ఆసుపత్రి విడచి సుమారు 18 మైళ్ల వరకూ ప్రయాణం సాగినది. డాక్టరు గారు శ్రీ స్వామీజీ ప్రక్కనే వుండిరి. వారు ఎప్పటికప్పుడు అన్ని పరీక్షలు చేయుచునే యుండిరి. వారికి ఏదో కొంచెము అనుమానము కలిగి వ్యాన్ ఆపుచేయమనిరి. డాక్టరు గారు శ్రీ స్వామీజీ మీద శిరస్సునుంచి 'నారాయణా' అనిరి. ఇక ఏమున్నది? మనస్వామీజీ మహా సమాధి పొందిరి. వారి పవిత్ర ఆత్మ ఈ విశాలమైన ప్రకృతిలో లీనమైనది. ఇక చేయునది లేక వేన్‌లో అమర్చిన సామాగ్రినంతా అచ్చట ఒకరికి అప్పజెప్పి మా ప్రయాణమును సాగించితిమి. 11వ తేది రాత్రి సుమారు 3 గం॥లకు మాతృ ఆశ్రమము జేరితిమి. అంతకు ముందురోజే శ్రీవారి పరిస్థితినిగూర్చి యిచ్చిన తంతి వార్తలకు ఆశ్రమమునకు జేరిన భక్తులందరూ వేచియుండిరి. శ్రీస్వామీజీ కోటగిరి, కోటగిరియని వెళ్లినందులకు కోటగిరి భక్తులకే వారి అంత్యదర్శనము చేసుకొనుటకు, వారికి సేవలను అర్పించుటకు భాగ్యము దక్కినదా యనుటకు ఏ మాత్రము సందేహము లేదు. రాత్రింబవళ్లు కోట గిరిభక్తులు చేసిన సేవ వర్ణనాతీతము. శ్రీస్వామీజీకి కోటగిరి శాంతి శాఖ యన్న, అచ్చటి భక్తులన్నా చాలా యిష్టము. ఆవిధముగానే అచ్చటి భక్తులను ఆనందింపజేసి చివరకు వారిసేవను పొందుటలో శ్రీస్వామీజీ చాల తృప్తి, ఆనందము పొంది వారి భౌతిక కాయమును వదలిరనుటకు సందేహము లేదు. 11వ తేది తెల్లవారు ఝామున వారి భౌతిక కాయమును కోటగిరి భక్తుల చేతులతో శ్రీవారునివసించే గదికి జేర్చిరి. 12వ తేది ఉదయమే 6

గం॥లకు వారిచేతులతోనే శ్రీస్వామీజీకి చేయించవలసిన స్నానములు వగైరాలు గంగ, గోదావరి, కృష్ణ వగైరా పుణ్యనదుల తీర్థముచే చేయించి, వారి భౌతిక కాయమును పూలమాలలచే అలంకరించి శ్రీస్వామీజీ నిర్వాణ మందిరముందు హాలులో నుంచిరి. అంత్య దర్శనమునకై వేచియున్న వంద లాది భక్తులను ఒక్కసారిగా దుఃఖసాగరములో ముంచి వేసినట్లు అయ్యెను. దైవనామస్మరణలతో, భగవద్గీత పారాయణలతో, భాగవత, రామాయణ శ్లోకములతో మారు మ్రోగునట్లు అయ్యెను. ఆ రోజు కార్యక్రమమునకు, శ్రీస్వామీజీ అంత్య దర్శనమునకై ఆతురతగా శ్రీమతి సరస్వతీ దేవిగారు, (జమీందారిణి చిక్కవరం) రాగల్గుట అందరకూ ఆశ్చర్యము, ఆనందము కల్గించినది. ఆమె పరమ పవిత్రమైన భక్తురాలు, మహాతపస్విని, అటువంటి పవిత్రురాలు ఆ అంత్య యాత్రలో మా చెంత నుండి యెన్నో విధములైన ధైర్యవచనముల పల్కుచూ వుండుట, ఆ రోజు కార్యక్రమమునకు చాల విశేషము. ముఖ్యముగ శ్రీవారి పవిత్ర పాదములు ఎంతయో గురుభక్తితో గంగాజలముతో అభిషేకించి, హృదయ స్థానమున గంధపుపొడి అద్ది ప్రణవమును వ్రాసి, భ్రుకుటిస్థానము నందు గంధమునుంచి ఆమెకు కలిగిన దివ్యానుభూతిని భక్తులకు స్పష్టపరచిరి.

మధ్యాహ్నము 2 గం॥లకు శ్రీ స్వామీజీ కోరిక ప్రకారం వారి భౌతిక కాయమునకు దహన సంస్కారములు జరిగెను. వారి భౌతిక కాయము 3 రోజలున్నను ఏవిధమైన మార్పులేకుండా యోగనిద్రలో నున్నట్లుగ, తేజస్సుగ, ప్రశాంతతగా యుండెను. వారి ఆత్మజ్యోతి, విశ్వాత్మ జ్యోతిలో లీనమైపోయెను. వారి కాయము అగ్ని జ్వాలలలో ఆహుతిఅయ్యెను. వారు ఒకే ఆశ్రమమునకు గాని, దేశమునకు గాని కట్టుబడి యుండలేదు. ఈ విశాలమైన ప్రపంచమే వారి గృహము. ప్రపంచములో యున్న జనులందరూ నా సోదర సోదరీమణులనియు, నా ఆఖరిశ్వాస వరకు భక్తులకు సేవ చేసియే వీడవలయునని సదా సెలవిచ్చెడివారు. ఆ విధముగానే ఆఖరి శ్వాస వరకూ సేవ చేయుచునే పవిత్ర దేహమును వదలిరి. అనుకోకుండా దారిలో గూడ కొంతమంది భక్తులకు వారి అంత్య దర్శనము గూడ నిచ్చిరి. వారి పవిత్రాత్మ ఆశ్రమములో అంతా వ్యాపించి యున్నది. గాని శ్రీస్వామీజీ స్థూల శరీరమును జూచు భాగ్యము, వారి పవిత్రమైన ప్రేమ వాక్కులు విను అదృష్టము ఇకమీదట ఆశ్రమవాసులకు, ఆశ్రమ భక్తులకు లేకపోవుట చాలా తీరనిలోటు. కొంతకాలమువరకు దుఃఖమును పారద్రోల లేము. శ్రీస్వామీజీయే అందరికి ధైర్యమొసంగి, శక్తిని ప్రసాదించగలరని ఆశించుచు తెలిసీ, తెలియని మాటలతో హృదయ భారముతో, విచార సాగరములో నిండియుండి వ్రాసిన ఈ చిన్న సందేశమును శ్రీస్వామీజీ పాద పద్మములకు అర్పించుచుంటిని.

ఓం శాంతిః శాంతిః శాంతిః

**(శాంతి - జూన్ & జూలై 1982)**

# 13. నిత్యానందం

ఈ లోకంలో ప్రతివారు సదా ఆనందంగా వుండాలని కోరుతారు. కాని అందుకు తగిన సాధన చేయలేకున్నారు. శ్రీపూజ్య స్వామీజీ శాంతి ఆశ్రమం 1917లోనే ఎందుకు స్థాపించిరి? శాంతి వుంటేనే ఆనందం కలుగును. తాత్కాలిక ఆనందమునకు శాశ్వత ఆనందమునకు చాల వ్యత్యాసమున్నది. దీనిని ఏ కొద్దిమందో గ్రహించ గలుగుచున్నారు.

పశుత్వం నుంచి మానవ జన్మను సంపాదించి, దైవత్వంలోనికి వెళ్ళు టకు ప్రతివారు మానవజన్మ గమ్యస్థానం చేరదలచితే, తగిన కృషిచేయ వలసి యున్నది. శ్రీపూజ్య స్వామీజీ అన్ని జయంతులు ఆశ్రమంలో జరిపించె దరు. దీనికి ముఖ్యమైన కారణం ప్రతివారు ఆదర్శ మానవులుగా వుండి దైవత్వం సంపాదించుకొను ప్రయత్నం చేయుట కొరకే.

గీతాజయంతి ఆశ్రమంలో జరుపబడుచున్నది. ఈలోకోత్తర గ్రంథము నకు మాత్రమే జయంతి ప్రతి సంవత్సరం జరుపబడుచున్నది. పవిత్ర గీతను బాగా అర్థం చేసుకొన్నవార్కి ఈజన్మలో శాశ్వత సుఖం ఆనందం ప్రాప్తించడమే గాక జీవన్ముక్తి కూడ ప్రాప్తించును.

భగవంతుడు మనకు అమూల్యమగు మానవ జన్మను ప్రసాదించిన దెందుకో చాలమంది విచారింపకున్నారు. ఇది తెలుసుకొనుటకు, పూర్వ జన్మ సుకృతం చాల అవసరం. అట్టి సుకృతము చేతనే ఈ పవిత్ర భారత దేశంలో మనకు జన్మ లభించింది. ఈ జన్మను వృధాచేయరాదు. ఎప్పుడు చనిపోవుదుమో చెప్పలేము. కావున ఒక్కక్షణం కూడా వృధాచేయకుండా శ్రీస్వామీజీ వ్రాయించిన సూక్తిప్రకారం "క్షణములు వ్యర్థం చేయువారు జీవితమంతా వృథాచేయుదురు." సదా భగవంతుని తెలుసుకొనుటకే ముక్తిని సంపాదించుకొనుటకే ప్రతిక్షణం సద్వినియోగం చేసుకోవలసి యున్నది. ఇట్టి ప్రయత్నంలో బాహ్యంగా కష్టమున్నను, ఆంతర్యముగ ఆనందమున్నది. భగవంతుని కథలు అసంగమును ఆనందమును తప్పక నిచ్చును.

గీతలో వివరంగా చెప్పబడినట్లు ఆసురీసంపత్తులు విడుచుటకు దైవ సంపత్తులు సంపాదించుటకు నిత్యం ఆధ్యాత్మిక చింతగలవారు ప్రయత్నిం చాలి. ఇది శాశ్వత ఆనంద ప్రాప్తి కొరకే గదా ! శ్రీపూజ్య స్వామీజీ తరచు జ్ఞాపకం చేయునట్లు మన శత్రువులు మనలోపలనే వున్నారు, వారలను జయించుటకే మనము అమూల్యమగు మానవ జన్మను సంపాదించు కొన్నాము. ఒక్క క్షణం కూడా దానిని వృధాచేయరాదు.

సత్యంగాను, హితంగాను, ప్రీతిగాను, మితముగాను, మాట్లాడుట, అభ్యాసం చేసుకోమని, నిత్యం శ్రీ పూజ్యస్వామీజీ బోధించేవారు "నోరు మంచిదైతే వూరు మంచి"దన్న సామెత చాల గొప్పది. ఎంతో సాధన ఉంటేనే గాని నోరు సదా మంచిగ నుంచుకొనలేము.

ఈ పవిత్ర జన్మభూమిలో జన్మించిన ప్రతివారు సదా కాలం యొక్క విలువ గ్రహించాలి. ఈ పవిత్రమైన మానవజన్మ ఎందుకు ? మనం మన పవిత్ర దేశమును, ధర్మంను సదా ప్రేమించి వాటి అభివృద్ధికి నిత్యం కృషి చేయాలి. ధర్మాభివృద్ధి పైననే నిజమైన శాంతి ఆధారపడును. అట్టి శాంతి పైననే ఆనందం ఆధారపడియున్నది.

"పరోపకారార్థ మిదం శరీరం" అన్నారు. నిజమైన, శాశ్వతమైన ఉపకారమేమి? శాశ్వతమైన ఆనందమును అనుభవించుటకు తోడ్పడుటయే నిజమైన, శాశ్వతమైన పరోపకారం. కష్టములో వున్న వానిని ఆదుకొనుట. బీదలకు, దీనులకు సేవచేయుటయే పరోపకారంగా కనిపించును. శాశ్వత సుఖం లభించు మార్గము బోధించుటయే నిజమైన పరోపకారము.

ఆకలి దప్పులు శాశ్వతంగా తీరినప్పుడే అసలైన శాంతి ప్రాప్తించును. మనం సచ్చిదానంద స్వరూపులమే అని గ్రహించగలిగినపుడే నిత్యసుఖం, శాంతి లభించును. అందరిలోను దైవమునేచూచి ప్రేమించ గలిగినపుడు, మానవ జీవిత గమ్యస్థానమైన నిత్యానందము తప్పక అనుభవించు సుఖం లభించును.

లోకాసమస్తా సుఖినో భవంతు !

**(శాంతి - మార్చి 1983)**

## 14. కాలం యొక్క విలువ

అమూల్యమగు కాలంయొక్క విలువను యెరిగినవారు ఒక్కక్షణం కూడా వృధాచేయక నిత్యం భగవంతుని విషయములే అందరూ మాట్లాడు కొనుచు, కాలమును సద్వినియోగము చేయుదురు. వృధా సంభాషణలతో కాలం గడుపరాదు. అట్లు వృధా చేసిన ఆయుర్దాయం వృధాయగుటయేగాక పోయిన కాలం ఎన్నడూ తిరిగిరాదు. క్షణములు వ్యర్థము చేయువారు, జీవితమంతయు వ్యర్థము చేయుదురను అనేక సూక్తులలో ఇదియొక ముఖ్య సూక్తిగా శ్రీ స్వామీజీ వ్రాయించిరి. ఈ విషయమునే గీతాచార్యులు ఈ విధంగా అన్నారు.

మచ్చిత్తా మద్గత ప్రాణా బోధయంతః పరస్పరమ్

కథయంతశ్చ మాం నిత్యం తుష్యంతి చ రమంతి చ -భ.గీ. 10-9

నా భక్తులు నాయందే తమ మనస్సులను లగ్నమొనర్తురు. తమ ప్రాణములను, తమ కర్మలన్నింటిని, తమ సర్వస్వమును నాకే అంకిత మొనర్తురు. వారు పరస్పర చర్చల ద్వారా నా మహత్త్వమును గూర్చి ఒకరికొకరు తెలుపుకొనుచు, కథలు కథలుగా చెప్పుకొనుచూ, నిరంతరము సంతుష్టులగు చుందురు. మరియు వారు నిత్యము నా యందే రమించు చుందురు.

శ్రీపూజ్య పుష్పగిరి శంకరాచార్యులవారు, సూక్తి ముక్తావళిలో కాలం యెన్నడూ వృధా సంభాషణలతో పాడుచేయవద్దని అట్లు చేసిన ఆయుర్దా యం కూడా క్షీణించునని స్పష్టముగా చెప్పుచుందురు. పైన ఉదహరించిన శ్లోకం గురించి ఉపయోగించు మాటలే సదా స్మరించుచు కాలమును ప్రతివారు సద్వినియోగం చేయవలెను. ఇప్పుడు నీతిగా జీవించువారు సుఖమునే అనుభవించక బాధలు అనుభవించుట చూచుచున్నాము. వారు వెనుక జన్మలో చేసిన పుణ్యఫలమే యిప్పుడు సుఖము నిచ్చుచున్నది. మంచి కర్మలు చేయకుండా మంచి ఫలమును అనుభవించ లేము. అట్లే చెడు కర్మఫలం ఎన్నడూ తప్పించు కొనలేము. మనకు నిజమైన శత్రువు మనము వెనుక చేసిన దుష్కర్మయే. నిజమైన మిత్రుడు వెనుక చేసిన సత్కర్మయే. ఈ విషయం శ్రీ స్వామీజీ తరచు జ్ఞాపకము చేయుచుండెడివారు.

ఈ పవిత్రమైన పుణ్యదేశములో మనము జన్మించినందుకు ఫలం సదా భగవత్కథలు వింటూ, చదువుచూ, పరస్పరం చెప్పుకొనుచూ ఆచర ణలో పెట్టుట ముఖ్యమని తెలుసుకొనవలెను. ఇట్లు చేయగలిగిన నాడు కాలం ఎప్పుడూ వృధా పోదు.

## పూజ్య స్వామీజీకి ప్రీతియైన పద్యములు

పానియంబులు ద్రావుచుం గుడుచుచున్ భాషించున్హాసలీ
లానిద్రాదులు సేయుచుం దిరుగుచున్ లక్షించుచున్ సంతత
శ్రీనారాయణ పాదపద్మయుగళీ చింతామృతా స్వాద సం
ధానుండై మరచెన్ సురారిసుతు డేత ద్విశ్వమున్ భూవరా !

కమలాక్షునర్చించు కరములు కరములు
శ్రీనాధువర్ణించు జిహ్వ జిహ్వ
సురరక్షకుని జూచు చూడ్కులు చూడ్కులు
శేషశాయికి మ్రొక్కు శిరము శిరము

విష్ణు నాకర్ణించు వీనులు వీనులు
మధువైరిదవిలిన మనము మనము
భగవంతువలగొను పదములు పదములు
పురుషోత్తముని మీది బుద్ధి బుద్ధి

దేవ దేవుని జింతించు దినము దినము
చక్రహస్తుని బ్రకటించు చదువు చదువు
కుంభినీధవు చెప్పెడి గురువు గురువు
తండ్రి హరి జేరుమనియెడి తండ్రి తండ్రి.

భాగవతములోని ఇట్టి ముఖ్య పద్యములను సదా స్మరించుచు మన జీవితములను సద్వినియోగము చేయవలెను.

ఓం శాంతిః శాంతిః శాంతిః

**(శాంతి - జూన్ 1983)**

## 15. సంకీర్తన

భగవత్ గుణ గణములను కీర్తించుటయే సంకీర్తన యనబడును. శ్రీ శివానంద అంటారు. "Sankirtan yoga is the surest, safest and quickest path to God-Realisation." సంకీర్తన యోగమంటే జీవుడు పరమాత్మలో ఐక్యము చెందుటకు చేయు ప్రయత్నమే అగును. స్వామి రామతీర్థ సంకీర్తన గురించి ఒక ఉదాహరణ చెప్పేరు. "మనము చెట్టుక్రింద నిలబడి చప్పట్లు కొట్టినట్లయితే చెట్టుమీదవున్న పక్షులన్నియు ఎగిరి వెళ్ళిపోతాయి. అదే విధముగా మనము సంకీర్తన చేసినప్పుడు మనలో వున్న క్రామ క్రోధ మద మాత్సర్యములనే దుర్గుణములు నాశనమయిపోతాయి." అంటే పగ లంతా చెడుకర్మలు చేసి సాయంత్రము ఒక గంట సంకీర్తన చేస్తే మనలో చెడుగుణములు పోతాయా ? కాదు. సంకీర్తన ద్వారా మనలోవున్న దుర్గుణములు ఎలా పోతాయంటే, మనము ఎప్పుడయితే భగవంతుని గుణగణములు కీర్తనచేస్తూ వుంటామో, అప్పుడు మన మనస్సు పవిత్ర మొంది, చెడుగుణములు ప్రవేశించుట కవకాశముఇవ్వదు. సంకీర్తన ద్వారా మనకు వచ్చే ప్రయోజనము ఏమిటి అంటే "అంతకాలేచ మామేవ స్మరన్ ముక్త్వా కళేవరం" అంత్యకాలంలో కూడా నన్నే (భగవంతుని) స్మరించు కుంటూ ఎవరు కళేబరాన్ని వదలివేస్తారో అతడు తప్పకుండా భగవంతుని పొందుతాడు, ఇందులో సందేహంలేదు, అని గీతాచార్యులు హామిఇస్తున్నారు. అయితే గీతాచార్యులు అంత్యకాలములో అన్నారుకదా! పదవీ విరమణ అయిన తరువాత అంత్యకాలములో భగవంతుని స్మరించవచ్చు అని కొందరు అంటారు. గీతాచార్యులు ఇచ్చట అంత్యకాలేచ అన్నారు. ఎల్లప్పుడు భగవంతుని స్మరిస్తూ ( చ అంటే మరియు) అంత్యకాలములో కూడ స్మరించమని చెప్పారు కాని చివరి సమయమని కాదు. ఎల్లప్పుడు భగవంతుని గురించిన సంకల్పం వుంటే భగవంతుడ్ని చేరుకుంటాడు.

సంకీర్తన చేయడానికి మాకు సమయము వుండదండి అంటారు. ఎప్పుడు చెయ్యాలి అనే సందేహం వస్తుంది. సంకీర్తనకు దేశకాల, నియమములు లేవు. ఎల్లప్పుడు ఏ స్థితిలో వున్నను, ఏ పని చేస్తున్నను నామ సంకీర్తన చేసుకొనవచ్చును. సంకీర్తన ద్వారా సులభంగా, క్షేమంగా ఆత్మసాక్షాత్కారము పొందవచ్చును. అందరము సంకీర్తన చేస్తూవుంటాము అయినప్పటికి మనకు ఆత్మసాక్షాత్కారము ఎందుకు కలుగుటలేదు అంటే సంకీర్తనలో మన మనస్సు ఏవిధంగా వున్నది అనే విషయాన్ని మనము పరీక్షించు కోవాలి. పాయసము గిన్నెలో గరిట వుంటుంది. పాయసము

యొక్క రుచి మాధుర్యాన్ని అందరూ అనుభవిస్తారు. కాని పాయసములో గరిట పాయసము యొక్క మాధుర్యాన్ని గ్రహించలేదు. పాయసములో గరిట ఏ విధంగా పాయసంలో వుంటూ పాయసము యొక్క మాధుర్యాన్ని గ్రహించ లేదో, అదేవిధంగా మన మనస్సు సంకీర్తనలో లయము కాకపోతే ఎన్ని సంకీర్తనలు చేసినప్పటికి, పాయసములో గరిటలాగనే మనలో ఏవిధ మైన మార్పు వుండదు. దేహతాదాత్మ్యాన్ని విడచి మనస్సులో ఎట్టి సంకల్ప, వికల్పము లేకుండా భగవంతుని స్మరించినప్పుడు మాత్రమే సంకీర్తన ద్వారా సులభంగా ఆత్మసాక్షాత్కారమును పొందవచ్చును.

ఓం శాంతిః శాంతిః శాంతిః

**(శాంతి – జూన్ 1998)**

## 16. దైవాజ్ఞ

దైవాజ్ఞ లేనిదే గడ్డిపోచయైన కదలదు. ఒకానొకప్పుడు దేవతలు వారికి లభించే విజయాలన్నిటికి కారణం, వారి శక్తి సామర్థ్యాలే అనుకుని గర్వ పడ్డారు. ఈ విషయం భగవంతుడు తెలుసుకొని దేవతలయొక్క గర్వాన్ని భంగపరచాలని నిశ్చయించాడు. దేవతల యెదుట ఒక యద్భుతరూపం కనబడింది. ఆ అద్భుత రూపము ఏమిటోవారికి తెలియలేదు. దేవతలందరు అగ్నిని సమీపించి ఓ అగ్ని! ఆ రూపం ఏదో తెలుసుకొని రమ్మన్నారు. అగ్ని ఆ రూపము వైపుకి వెళ్ళాడు. ఆ రూపము అతణ్ణి ప్రశ్నించింది. "ఎవరు నీవు?" అని. అగ్ని నేను అగ్నిని అని సమాధానం ఇచ్చాడు. ఓ అగ్ని! నీయొక్క శక్తి ఏమి అని ఆ రూపము ప్రశ్నించెను. అగ్ని ఈ ప్రపంచ ములో ఉన్న యావత్తును కాల్చివేయగలను అని సమాధానమిచ్చెను.

అగ్నికోసం ఆ బ్రహ్మము ఒక గడ్డిపోచను ఉంచి దీనిని కాల్చు అన్నది. అగ్నిదేవుడు తన సర్వశక్తులను కూడగట్టుకొని గడ్డిపరకను సమీపించాడు. కాని కాల్చలేక పోయాడు. అగ్ని వెనక్కి తిరిగి వెళ్ళిపోయాడు.

అప్పుడు దేవతలు వాయువును సమీపించి ఓ వాయువా ! ఆ అద్భుత రూపుడు ఎవరో తెలుసుకోమని అడిగారు. వాయువు సరేనన్నాడు. వాయువు ఆ రూపమువైపు వెళ్ళాడు. ఆ రూపం అతనిని ఎవరు నీవు అని ప్రశ్నిం చింది. నేను వాయువును అని వాయువు సమాధానం చెప్పాడు. వాయువా! నీ శక్తి ఏమి అని ప్రశ్నించెను. వాయువు ఇట్లు సమాధానము చెప్పెను. ఈ ప్రపంచంలో ఉన్న యావత్తుని నేను ఎగురగొట్టగలను. అలా బదులు చెప్పిన వాయువుకి యక్షుడు ఒక గడ్డిపరకను ఉంచి దీనిని ఎగురగొట్ట మన్నాడు. వాయువు గట్డిపరకను సర్వశక్తులతోను సమీపించి కూడ ఎగుర గొట్టలేక పోయాడు. ఈ యక్షుని తెలుసుకొనే శక్తిలేక అతడు వెనక్కి వచ్చాడు.

అప్పుడు దేవతలు ఇంద్రునిచేరి నీవు యక్షుడు ఎవరో కనుక్కోమని అడిగారు. అలాగేనని ఇంద్రుడు ఆ రూపంవైపు పరుగెత్తాడు. అక్కడ నుండి ఆ రూపం మాయమయినది. ఇంద్రుడు, యక్షుడు మాయమైన ఆ శూన్యం లోనే బహుశోభితు

రాలు హిమవంతుని కుమార్తె అయిన ఉమాదేవిని చూచాడు. అమ్మా ! ఈ అద్భుత రూపం ఎవరిది ? అని అడిగాడు. ఆమె జవాబు చెప్పింది. బ్రహ్మము యొక్క విజయముతో మీ అందరు గొప్పదనము పొందుతున్నారు.

ఈ దేవతలు ఎవరోకాదు మనలోనే వున్నారు. ఇంద్రియ శక్తులని దేవతలంటారు. ఈఇంద్రియ శక్తులు ప్రకృతిలోని రహస్యాలన్నీ కనుగొని విజయం పొందుతున్నాయి. పరబ్రహ్మ శక్తి మనలో వుంటేనే విజయం పొందుతున్నాము. చనిపోయిన వాడికి ఏ జయమూలేదు. మనమే అన్ని చేసాము అనుకుంటాము కాని, దైవాజ్ఞ లేనిదే గడ్డిపోచయైన కదల్చలేము. వెనుకాల సూత్రదారి తోలుబొమ్మలను ఆడించినట్లుగా ఈమట్టి బొమ్మలలో ఆ పరబ్రహ్మ శక్తి వున్నంతకాలము పనిచేస్తూవుం టాయి. కాని అజ్ఞానము వలన మనము చేసాము అని గర్వపడతాము. ఈ గర్వాన్ని భగవంతుడు ఏదో రూపంలో వచ్చి మనకు జ్ఞానోదయము కలిగించి మన గర్వాన్ని అణిచి వేస్తాడు.

ఓం శాంతిః శాంతిః శాంతిః

**(శాంతి – జూన్ 1998)**

## 17. ఈ క్షణమే మనది

కాలము చాలా అమూల్యమైనది మనకోసం వేచియుండదు. ఎప్పుడు చేయవలసినది అప్పుడే చేయవలెను. లేనిచో పశ్చాత్తాపము పొందవలసి వస్తుంది. మహాత్ములు దానినొక ఉదాహరణ ద్వారా సూచిస్తారు.

కాశ్మీర పర్వత ప్రాంతములో నిర్మలానంద స్వామీజీ తపస్సు చేస్తూ నివసిస్తూ వుండేవాడు. అతనివద్ద అనేక సిద్ధులు మహిమలు గలవు. ఆయన వద్దకు అనేకమంది శిష్యులు వస్తూవుండేవారు. అలా వచ్చే శిష్యులలో మూఢబహదూర్ శర్మ అనే శిష్యుడు వచ్చి స్వామీజీకి సేవలన్నీ చేస్తూవుండే వాడు. కొన్ని సంవత్సరములు సేవ చేసిన తరువాత స్వామీజీ ఆయన సేవకు ప్రసన్నుడై చేసిన సేవకు ప్రతిఫలంగా పరుశువేదిని ఇచ్చెను. నేను మూడు రోజులలో తిరిగివచ్చి పరుశువేదిని తీసుకుంటాను. నీ జీవిత మంతటికి కావలసిన బంగారము తయారు చేసుకొమ్మని చెప్పెను.

స్వామీజీ వెళ్ళిన తరువాత శిష్యుడు ఇట్లు ఆలోచించాడు. నాకు కావలసిన బంగారమంతా తయారు చేసుకోవడానికి మూడురోజుల గడువు వుంది, ప్రస్తుతం చాలా అలసటగా వుంది. కాబట్టి ఈరోజు విశ్రాంతి తీసుకుంటాను. రేపు ఉదయం బజారు నుండి ఒక కేజి ఇనుము తీసుకుని బంగారముగా మార్చుకుంటాను. ఈవిధంగా ఆలోచించి ఇంటికివెళ్లి సుఖంగా నిద్రపోయి మధ్యాహ్నం లేచాడు. కాని అప్పుడు బజారుకు వెళ్లే టప్పటికి దుకాణాలు అన్ని మూసేసారు. అప్పుడు అక్కడే ఉన్న భోజనశాలకు వెళ్ళి భోజనం చేసాడు. భోజనము చేసిన తరువాత తిరిగి సుషుప్తి అవస్థ (గాఢనిద్ర) లోనికి వెళ్ళిపోయాడు. అతను మేల్కున్నప్పటికి బాగా చీకటి అయిపోయింది. దుకాణాలు మూసేసారు. రెండు రోజులు గడువు

వుంది కదా అని తనను తాను సమర్ధించుకొని తిరిగి ఇంటికి వచ్చెను. ఈ విధంగా శిష్యుడు మూడు రోజులు గడిపాడు. నాల్గవరోజు ఇచ్చిన మాట ప్రకారం స్వామీజీ వచ్చారు. స్వామీజీని చూసేసరికి శిష్యుడు చాలా నిరుత్సాహపడెను. అతడు స్వామీజీ కాళ్ళుపట్టుకుని మరొక్కరోజు గడువు ఇమ్మని ప్రార్థించెను. గురువు నవ్వి మూఢా ఇనుము కోసము అంతదూరం వెళతారా? ఇంటిలో వున్న ఇనుప వస్తువులని బంగారంగా మార్చుకోవచ్చును కదా ! ఏది చిన్న గడ్డిపరకయైన పరుశువేదితో తాకినట్టులేదు. అనిపలికి పరుశువేదిని గురువు తీసుకొని వెళ్లిపోయెను. ఇచ్చట గురువు ఎవరోకాదు యమధర్మరాజు, పరుశువేదిలాంటి అమూల్యమైన మానవ జన్మపొంది కూడా, ఎవరయితే ఆత్మ జ్ఞానాన్ని పొందడానికి ప్రయత్నించకుండా ఉద్యోగ విరమణ అయిన తరువాత చెయ్య వచ్చులే అని కాలాన్ని వృధాపరుస్తారో వారికి ఆత్మజ్ఞానము కలగదు. యమ ధర్మరాజు మనకోసం వేచి వుండడు. గురువు లాగ వచ్చి అమూల్యమైన జీవితాన్ని తనవశం చేసుకుంటాడు. ఈ క్షణమే మనది. మరుక్షణం మనదికాదు. పరుశువేదిలాంటి ఉత్కృష్టమైన మానవ జన్మపొంది ఎవరయితే ఆత్మజ్ఞానాన్ని పొందుతారో వారే ధన్యజీవులు.

ఓం శాంతిః శాంతిః శాంతిః

**(శాంతి - సెప్టెంబర్ 1998)**

## 18. సాధువుల లక్షణము

బొంతకట్టుకొని, చేత భిక్షాపాత్రమును ధరించినంత మాత్రమున సంతుకానేరడు. తీర్థాటనము, కఠోరతపము, వనవాసము, చక్కని తిలక ధారణము, అక్షమాలా గ్రహణము వీటివల్ల సంతు కానేరడు. తుకారామ్ వారు చెప్పినట్లు మూలవస్తువగు దేహాభిమానమును త్యజించనంత వరకు ఎవడును సంతుకానేరడు, ప్రభువునకు దూరముగనే ఉండును. ఇందొక దృష్టాంతము కలదు.

ఒకపాకీవాడు మురికి బట్టలతో మలపు గంపను నెత్తిమీద పెట్టుకొని మహోత్సాహముతో రాజుగారిని దర్శించుటకు బయలు దేరెను. దారిలో అందరును వేళాకోళము చేయుచుండిరి. చివరకు రాజద్వారమునకు చేరగా ద్వారపాలకులు తరిమివేసిరి. ఇది చూచి ఒకడు నాయనా ! రాజదర్శనము కావాలంటే ఆ గంపను పారవేసి స్నానాదులచే పరిశుద్ధుడవై రమ్ము నీ కప్పుడు రాజదర్శనమగును అని చెప్పెను. అంతట ఆ పాకీవాడు పరిశుద్ధ ముగా వచ్చి రాజదర్శనము చేసెను. అటులనే స్థూల,సూక్ష్మ,కారణ శరీరములనెడి మూడింటి నుండియు, యోగబలమున దేహాభిమానమును పోగొట్టనంత వరకు "నేను సాక్షిని" అని తన స్వరూపము తెలియనంత వరకును పరమాత్ముని దర్శనము చేయుటకు ఎవరును అర్హులుకారు. దేహాభి మానమును విడిచిన వాడే నిజమైన సాధువు.

జయ జయ రామకృష్ణ హరి ఓం!

**(శాంతి - నవంబరు & డిసెంబరు 1998)**

## 19. పూజ్య స్వామీజీ జన్మదినం - మన అందరి జన్మదినం-21.1.2001

భగవంతుని అనుగ్రహంచే మరొక సంవత్సరం పూజ్య స్వామీజీవారి యొక్క 107వ జన్మదినం, ఈ అరుణోదయ సమయంలో మహాత్ముల పవిత్ర సన్నిధిలో, భక్తులందరి సమక్షంలో జరుపుకొంటున్నాము. నిజంగా మనం అదృష్టవంతులము. ఆ భగవంతునకు మనం సర్వదా కృతజ్ఞతలు అర్పించవలసిన అవసరమున్నది. ఆయనకు మన కృతజ్ఞతలు ఏ విధంగా అర్పించడం? ఆ భగవంతుడు మన నుండి ఏమి కోరుతున్నాడు? మనము ఎవరి జీవితాలను వారు పరీక్షించుకొంటే, భగవంతుడు మనల నుండి నిశ్చలమైన మనస్సు, పవిత్రమైన హృదయం కోరుకొంటున్నట్లు గమనించ గలము. నిర్మలమైన మనస్సు, పవిత్రమైన హృదయం కలిగియున్న నాడే మనం భగవంతునకు సన్నిహితం కాగలము.

భక్తులు భగవంతుని ప్రేమిస్తారు. అది సహజం. మనం అంతా భగవంతుని ప్రేమిస్తాము. కాని భగవంతుడు భక్తులను ప్రేమించాలట. అదే ఆయన అనుగ్రహం. మనం ఆ అనుగ్రహాన్ని సంపాదించాలి. ఆయన అనుగ్రహం ఎప్పుడు మనకు కలుగుతుంది? ఆయనకు కావలసింది ఏమిటన్నది నిత్యం ఆలోచిస్తూ ఆయన కృపకు, ప్రేమకు, పాత్రులు కావాలి. కాబట్టి మనం చూసుకోవలసింది ఏమంటే ఆ పవిత్రమైనటువంటి హృదయం, నిర్మలమైనటువంటి మనస్సు మనకు రావాలంటే మనలో ఉన్నటువంటి కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలనే గుణాలను ఒక్కొక్కటి తగ్గించుకుంటే మనకు నిర్మలమైన మనస్సుతోపాటు పవిత్రమైన హృదయం ప్రాప్తిస్తుంది. మన జీవితాలు ధన్యం అవుతాయి. ఆయన అను గ్రహానికి పాత్రులవుతాము.

మనమంతా మన జీవితాన్ని ఇంకా ఏ విధంగా సద్వినియోగం చేయ డమో ఆలోచించండి ? ఆయన సన్నిధిని సర్వదా అనుభవించే శక్తి మన చేతిలోనే ఉన్నది. కావున ఈ పవిత్రమైనటువంటి రోజున మన మందరం ఆ భగవంతునికి సదా కృతజ్ఞులమై ఉండుటకు కృతనిశ్చయులమగు దుముగాక!

మనం అత్యంత భక్తి శ్రద్ధలతో శ్రీస్వామివారి జన్మదినం జరుపుకొంటు న్నాము, కాని ఒకటేలోటు, ఏమంటే పరమ పూజ్యులు స్వామిచిదానంద వారు చూడ రీతిగా మన మధ్యలేకపోవడం, వారి ప్రత్యక్ష పవిత్ర సన్నిధిని మనం అనుభవించలేకపోవడం, వారి ఆశీస్సులను మనం స్వయంగా అందుకో లేకపోవడం. కాని వారు ఎచ్చట ఉన్నప్పటికి వారి ఆశీస్సులు, వారి పవిత్ర సన్నిధి అదృశ్యరూపంలో మన మధ్యనే ఉన్నది. ఇప్పుడే వారు పంపిన సందేశాన్ని మన ఆంజనేయులు చదివి వినిపించాడు. వారి ఆరో గ్యం బట్టి వారు విశ్రాంతిగా ఎక్కడ ఉన్నప్పటికి వారి పవిత్రమైనటువంటి సన్నిధి మనం అనుభవించెదముగాక ! సర్వాంతర్యామి, సర్వజ్ఞుడు, సర్వ శక్తియుతు డైన భగవంతుని ఆశీస్సులతో త్వరలో మనము పూజ్య చిదానంద స్వామి వారి ఆశీస్సులను స్వయముగా ప్రత్యక్షముగా పొందు అవకాశము పొందెదము గాక !

ఇక పూజ్య స్వామీజీ ఎప్పుడు జన్మదిన సందేశం ఇచ్చినా వారి జన్మ దినమే మన జన్మదినమని శలవిస్తుండెడివారు. "నా ఈ జన్మదినం అందరి జన్మదినమని" సందేశాన్ని వ్రాస్తూ భక్తులందరికి చదివి వినిపించేవారు.

మహాత్ముల జన్మదినం జరుపుకోవడంలో మనము ముఖ్యముగా గమనించ వలసినది, వారి పవిత్రమైన జీవితాలను స్మరించుకొంటూ, వారు చేసిన ప్రబోధాన్ని, బోధను మనం ఆచరణలో పెట్టుకొన్ననాడే మనం నిజ మైనటువంటి జన్మదినం జరుపుకొన్నట్లుగా గుర్తించాలి. నాటి వారి భావాలను, వారిబోధలను మనం ఆచరణలో ఉంచుకొన్ననాడే మన జీవితాలు ధన్యం అవుతాయి. జన్మదినం అంటే మనజన్మకు ఆధారంగా ఉన్నటువంటి ఆ గమ్యస్థానమేమిటో మనం తెలుసుకోవడమే. అదే మన నిజమైన జీవితం. కనుక ఆ భగవంతుడు, పూజ్యస్వామీజీ మనకు అటువంటి శక్తిని, ఓర్పును, సహనాన్ని అనుగ్రహించెదరు గాక అని నేటి ప్రార్థన.

హరిః ఓమ్ తత్సత్

**(శాంతి - ఫిబ్రవరి 2001)**

## ౨౦. అమూల్య మానవ జీవిత ధ్యేయము

(మారిషస్ దేశములో పూజ్యశ్రీ మాతాజీ జ్ఞానేశ్వరి వారి సందేశము)

పరమపూజ్య శ్రీ గురుదేవ్ స్వామి శివానంద మహారాజుల వారి పవిత్ర పాద పద్మములకు సాష్టాంగప్రణామములు. భారతదేశ హైకమిషనర్ శ్రీ విజయకుమార్‌గారికి మరియు మారిషస్ దివ్యజీవన సంఘ సోదర సోదరీ మణులకు మా శుభాకాంక్షలు.

దేవుని లీలలు అనూహ్యములు. ఆయన అనుగ్రహముచే అద్భుతమైన మారిషస్‌లో పరమ పూజ్యశ్రీ స్వామి శివానందుల వారి దివ్య సన్నిధిలో మీ వంటి భక్తులు, త్యాగశీలుర మధ్య మనము యుండటం జరిగినది. ఔను! ఇది గురుదేవుల కటాక్షము.

దివ్య జీవన సంఘము మరియు శాంతి ఆశ్రమముల అనుబంధము, అవి రెండు కావనియు, ఒక్కటే అనియు మీలో కొందరికి తెలిసినదే. ఈ రెండు ఆశ్రమములు స్థాపింపక పూర్వము శ్రీస్వామి ఓంకార్ మరియు గురుదేవ్ స్వామి శివానందజీ వారు ఋషీకేష్‌లో గల స్వర్గాశ్రమము నందు సాధన చేయు సమయమున అతి సన్నిహితులుగా నుండిరి, ప్రాణ స్నేహితు లైరి. పిదప శాంతి ఆశ్రమమున స్వామి ఓంకారుల వారితో శ్రీ శివానంద స్వామి వారు గ్రామ గ్రామములకు పోయి సంకీర్తన, సందేశములను వ్యాపింపజేసిరి. శ్రీస్వామి శివానందులవారి దర్శనము మాకు లభ్యమైనం దుకు కూడ మేము భాగ్యవంతులము. 1952వ సం॥లో శ్రీ శివానందుల వారు అఖిల భారత పర్యటన గావించునపుడు, వారు శాంతి ఆశ్రమమునకు ఏతెంచి దర్శనమిచ్చిరి. ఆ పిదప శ్రీ స్వామి ఓంకార్,

నేను మరికొందరు భక్తులతో శ్రీ శివానందుల వారిని మరొకసారి దర్శనము గావించుకొనుటకు ఋషికేష్ వెళ్లితిమి. ఇప్పుడు ఇచ్చట పవిత్రమైన దివ్య జీవన సంఘ యోగాశ్ర మమున మీ అందరితో కలిసి శ్రీ గురుదేవులు శివానందుల వారి జన్మ దినోత్సవములో పాల్గొనుటకు మమ్ములను ఆహ్వానించినందులకు ఎంతో భాగ్యవంతులము, అందుకు మా కృతజ్ఞతలు. ఇట్టి భాగ్యము కల్పించిన దేవునికి జోహార్లు !

ఇప్పుడు మేము మారిషస్‌లో దూరదేశమున యున్నట్లు భావన నాకు కల్గుటలేదు. ఇచ్చట మీ అందరి ప్రేమాభిమానములతో దేవుని సన్నిధిని అనుభవించుచుంటిమి. మారిషస్ మాకు నూతనముకాదు. భౌతికంగా మేము ఇచ్చటయుండలేదు, కాని ఆధ్యాత్మికముగా మీరు మాకు సన్నిహితులు గాను, ప్రియముగా నుండిరి. సోదరి దమయంతి వారి భర్త సోమన 40 సం॥లుగా శాంతి ఆశ్రమమనిన ఎనలేని భక్తితో నుండిరి. వారు శ్రీస్వామి ఓంకారుల వారి శాంతి ప్రార్థన యొక్క మహిమ యందు ప్రగాఢ విశ్వాసము కలిగియుండి, సకల సందర్భములలో ఆ ప్రార్థనను స్మరించుచుండిరి. శ్రీ స్వామి ఓంకారులవారితో వారికిగల ఉత్తరప్రత్యుత్తరములు నాకు స్పష్టముగా గుర్తున్నవి. శ్రీ గురుదేవుల సన్నిహిత శిష్యుడగు పరమపూజ్యశ్రీ స్వామి వెంకటేశానందవారు కూడా శాంతి ఆశ్రమమునకు శ్రేయోభిలాషులు, నారాయణి మాతాజీ, స్వామి ఆనందవారు కూడ శాంతి ఆశ్రమమునకు అత్యంత సన్నిహితులు. వారు శాంతి ఆశ్రమమునకు విచ్చేసియుండిరి. ఇప్పుడు మిమ్ములను చూడటం మా అదృష్టము. నా సోదరులగు మీకు నా అంతర్భావమును అందింప గోరుచుంటిని. మనమిపుడు ఏమిటి కావా లని ఆలోచించుచుంటిమి? మన జీవిత ధ్యేయమేమి? వాస్తవముగా మనకు నూతనముగా కావలసినదేమియు వాంఛించుట లేదు. ఇన్ని సంవత్సరము లుగా ఎందరో మహాత్ములను ఆహ్వానించి ప్రసంగములను శ్రవణము గావించి యున్నాము. గ్రంథములు చదివియున్నాము. కాని వాటిని మన నిత్య జీవితములో అభ్యసించి గమ్యమును చేరుకొనుటలో ఎంతవరకు సఫల మొందియున్నాము ?

ఔను ! మానవ జీవితము అమూల్యమైనదని మహాత్ములందరు చెప్పి యున్నారు. పూర్వజన్మ సుకృతముచే మనకు మానవ జన్మ లభ్యమైనది. కాని మనమెంతవరకు ఈ అమూల్య కాలమును వినియోగించుచుంటిమి? ప్రతి వ్యక్తి మోక్షము కోరును. మోక్షమనగాయేమి? మనము బంధములో నుంటిమి, కనుక ముక్తి కావలెను. మన ధ్యేయము విముక్తి. ఇది చెప్పుట సులభమే,కాని మనకు చాలా కోరికలు యున్నవి. కోరికలు లేకుండ జీవించ టం ఇంచుమించు అసంభవము. కనుక గమ్యమును చేరుటయెట్లు? దేవుడు ప్రేమతో ఇచ్చిన దానితో తృప్తినొంది యుండవలెను. అప్పుడే మనకు శాంత్యానందములు లభ్యమగును.

ఈ రోజులలో ఎటు చూచినా దుఃఖము, బాధలు, క్లిష్ట పరిస్థితులు, తృప్తిలేదు. ఎచ్చటనూ శాంతిలేదు. తృప్తి యున్నచోట శాంతి, ఆనందము నిశ్చయముగా

నుండును. శాంతి అనిననూ ఆనందమనిననూ ఒక్కటే. ఆ శాంతి ఎచ్చటనున్నది ? ప్రతి వ్యక్తి తనకు శాంతి లేదనియే చెప్పును. శాంతి ఎచ్చటనో బాహ్యమున లేదు. శాంతి అంగడిలో వెలకు లభ్యమవదు. దేవాలయములు, చర్చి,మసీదులలో శాంతిని కనుగొనలేము. నిజమైన శాంతి మన పవిత్రమైన హృదయము (హృదయ గుహ)లో గలదు. శాంతి అనగా దైవము. మన పవిత్ర హృదయములో దేవుని గాంచవలెను. అప్పుడు శాంతి యనగా ఏమిటో మనము గ్రహించగలము.స్వామి రామతీర్థవారు ఇట్లు ఉపమానము నుడివియున్నారు. ఒక వృద్ధురాలు సూదిని కోల్పోయెను. దానిని బాహ్యమున ప్రతిచోట వెతుకుచుండెను. ఒకబాటసారి ఆమెను ఉద్దేశించి “అమ్మా దేని గురించి నీవు వెతుకుచుంటివి” అని ప్రశ్నించెను. ఆమె ఇట్లనినెను “నా సూదిపోయినది. దానిని వెతుకుచుంటిని” ఆ బాటసారి కూడా వెతుకుట ఆరంభించి ఆమెకు సహాయపడుచుండెను. కాని ఆయనకు కూడ సూది దొరకలేదు. అప్పుడాయన ఆమెను ఇట్లడిగెను. “నీ సూది ఎక్కడ పోయినది?” అందుకు ఆమె “సూది నా గృహములో పోయినది, కాని వెలుపల కాంతియున్నది గనుక ఇచ్చట వెతుకుచుంటిని.” ఇది చిన్న ఉదాహరణమే కాని విశేష భావము గలది. చీకటిగానున్ననూ, మనము లోపలనే వెతుకవలెను. అదేవిధంగా మనమందరము ఆంతరంగమున గల దైవశాంతిని మరచిపోవుచున్నాము. మనము బాహ్యముననే వెతుకుచుం టిమి. మన జీవిత బాధలకు ఇదియే కారణము. ఔను! హృదయాంతరంగ మున ప్రవేశించి మనలను మనము దర్శించుట కష్టతరమైనదే. కాని ఏదో ఒక రోజు దైవము మనకు అన్యముగా లేదని మనము అవశ్యముగా గుర్తింప వలసి యున్నది, దేవుడు ఆంతరంగమున మాత్రమే గలడు.

ప్రతి నామ రూపముల ఆంతరంగమున గలడు.

ఔను !ఇదియే మన నిజమైన గమ్యము. వాస్తవముగా మనకు కావలసినది ఇదియే. దీనినే మనము నిత్య జీవిత వ్యవహారములలో అభ్యసింపవలసి యున్నది. ఇదియే మన మోక్షము.

శ్రీ శివానంద గురుదేవులు ఇట్లనిరి–“మంచిగా నుండుము. మంచినే చేయుము.”ఈవిధముగా వుండిన మన నిత్యజీవితములో మనము శాంతిని కనుగొనగలము. ఔను ! మనశాంతి ప్రార్థన సకల ఉపనిషత్తుల సారము. స్వామి ఓంకారుల ఆశయము “వ్యక్తిగత శాంతియే లోకశాంతికి మార్గ మగును. ప్రతివ్యక్తి శాంతిగా నుండవలెను.” శ్రీ స్వామి ఓంకారుల శాంతి ప్రార్థన మరియు My Legacy to you అనుఆంగ్ల వ్యాసముల సారము ఇదియే.

భగవంతుడు మన హృదయములకు హృదయము, మనస్సులకు మనస్సు, శ్వాసలకు శ్వాసగా యున్నాడు. మన ప్రతి అణువులో కూడా ఆయన శక్తియే. ఈ శాంతి ప్రార్థనను మనం హృదయ పూర్వకంగా తరచు స్మరించి, శాంతిని యనుభవింతుము గాక ! ఓం శాంతిః శాంతిః శాంతిః

**(శాంతి – నవంబర్ 2001)**

## 21. పనియే ఆరాధన

పనిచేయని వానికి తినుటకు హక్కులేదని పూజ్య ఓంకార స్వామీజీ వారు వచించెడివారు. వారు నిత్యజీవితములో చాల శ్రమించి, పనియే ఆరాధనగా భావించి వారి జీవితమును సమాజ శ్రేయస్సునకు అర్పించిరి. ఇదే విషయమును భీష్మ పితామహుల వారు ధర్మరాజునకు ఒక కథ ఉదాహరణ ద్వారా తెలిపిరి. సోమరితనము కలిగి వుండడము వ్యక్తికి తగదు. సోమరితనము లేనివాడు సుఖంగా వుంటాడు. పూర్వము లొట్టిపిట్ట ఎవ్వరికి సాధ్యంకాని కఠోర తపస్సు చేసింది. ఆ తపస్సునకు మెచ్చి బ్రహ్మ ప్రత్యక్షమయ్యాడు. ఏం వరం కావాలి కోరుకోమని బ్రహ్మదేవుడు అడిగెను. నామెడ నూరు ఆమడల పొడవు పెరగాలని లొట్టిపిట్ట బ్రహ్మదేవుని వరం కోరింది. "తథాస్తు" అని అంతర్ధానమయ్యాడు బ్రహ్మదేవుడు. వరం లభించ డంతోనే అహంకారం పెరిగి ఇక ఏ మాత్రము పని చేయనక్కరలేదు అని అనుకుంది. లొట్టిపిట్ట సోమరియై కూర్చున్నది. ఒకనాడు వాన వచ్చింది. తన మెడ సాగినంత వరకు చాచి ఒక గుహలో తలపెట్టుకుని నిద్రపోయింది. ఇంతలో ఒక నక్క దాని భార్య ఆ గుహలోనికి వచ్చాయి. బాగా ఆకలితో దహించి వున్నవి అవి. లొట్టిపిట్ట మెడ కొరికినవి. మాంసము తినడం ప్రారంభించినవి. తుళ్ళిపడి లేచింది లొట్టిపిట్ట. మిగిలిన మెడ నరాలు కూడా కొరికేశాయి నక్కలు. చచ్చిపోయింది లొట్టిపిట్ట. కనుక లొట్టిపిట్ట వలే సోమరి కాకూడదని భీష్మాచార్యులవారు ధర్మరాజునకు చెప్పిరి. అదే విధముగా పూజ్య ఓంకార స్వామివారు సోమరిగా జీవించకుండా, పనియే ఆరాధనగా భావించి జీవితమును సార్థకము చేసుకొనవలసినదిగా సూచించిరి.

ఓం! ఓం! ఓం!

**(శాంతి - డిసెంబర్ 2001)**

## 22. సత్సాంగత్యం (కాపవ్యుడి కథ)

(మహాభారతం శాంతి పర్వం)

పారియాత్ర పర్వతం మీద కాపవ్యుడు అనే ఒక బోయవాడు నివసించే వాడు. ధర్మసూక్ష్మమును ఎరిగినవాడు. మంచి నేర్పు కలిగిన విలుకాడు. మాతాపితృ భక్తి కలిగినవాడు. సాధు మహాత్ముల యందు భక్తి శ్రద్ధలు కలిగినవాడు. శత్రువులంటే మాత్రం చంపేసే వాడు. యుద్ధంలో ఉగ్రు డయి వొక్కడే వెయ్యిమందిని హతమార్చేవాడు, అతని ప్రతాపం చూసి, ఆ దేశంలో దొంగలందరూ ఆలోచించారు. మనల్ని రక్షించ గల నాయకుడు కావాలి, అంటూ కాపవ్యుడి దగ్గరకు వచ్చారు. బలము, పరాక్రమము కలిగిన వాడివి నువ్వు, సాటిలేని ధర్మ బుద్ధినీది. నీవు మాకు ప్రభువయి మమ్మల్ని పుత్రుల్లా రక్షించు. నీకు కావలసిన సేవ మా చేత చేయించుకో అన్నారు.

మీరు కోరినట్లు నేను మీ నాయకుడుగా వుంటాను. స్నేహంగా మీ యోగక్షేమాలు చూస్తాను. కాని మీరు నేను చెప్పినట్లు వినాలి అన్నాడు కాపవ్యుడు

శిశువుల్ని, మునులను, వృద్ధులను, స్త్రీలను చంపకూడదు. ఎలాంటి వాడైనా సరే అతడు, మీద కలబడకుండా చంపకూడదు. స్త్రీలను చెరపట్ట కూడదు. జంతువులను చంపకూడదు. గోవులను, బ్రాహ్మణుల్ని బాధపెట్ట కూడదు. వాళ్ళ మేలు కోరి యుద్ధం చెయ్యాలి. పైరు పంటలు పాడు చెయ్య కూడదు. ప్రజల్ని బాధపెట్టి జీవించేవాడు, శవాలు దొలుచుకు తినే పురుగు శవంతోనే నాశనమైనట్లు నశిస్తాడు. ఆనందంగా అంగీకరించారు దొంగలు, అతడు చెప్పినట్లే నడుచుకున్నారు. ఈ విధంగా కాపవ్యుడు దొంగల్ని సాధువులుగా మార్చివేసెను. వాళ్ళ పాపపు ఆలోచనలను నశింప చేసాడు. ఇహపరములను అందించాడు.

ఓం శాంతిః శాంతిః శాంతిః

**(శాంతి - మార్చి 2002)**

## 23. సుప్రేమ - విశ్వప్రేమ

“ప్రేమ” అనునది పవిత్రమైనపదం. విషయ సుఖమునకై తహతహ లాడు కామము ప్రేమకాదు. ప్రేమలో పవిత్రత ఉంది. తల్లిప్రేమలో, సోదర ప్రేమలో పవిత్రత ఉంది. అట్టి ప్రేమయే సుప్రేమ. సుప్రేమ త్యాగము యొక్క ఫలితము, సుప్రేమ ప్రకృతి మూలము, మానవ జీవనమునకు అవసరమగు వెలుగును సూర్యుడు ఎట్టి ప్రతిఫలము నాశింపక వెదజల్లు చున్నాడు. నదులు జలమును ప్రతిఫలమును ఆశింపక యిచ్చుచున్నవి. వృక్షములు ఫలములను ప్రతిఫలాకాంక్ష లేకయే మనకు ఇచ్చుచున్నవి. ఈ విధముగా ప్రకృతిమాత ఫలాకాంక్ష లేకయే మానవుని సేవించుచున్నది. ఇట్టి నిస్వార్థసేవయే, ఈఫలాకాంక్షలేని త్యాగమే సుప్రేమ. తల్లిప్రేమ అపూర్వమైన సుప్రేమ, ఆమె తనబిడ్డలను అతి గారాబముతో ప్రతిఫలా కాంక్షలేకయే పోషించును. తనచెల్లి శ్రేయస్సుకు తోడ్పడే సోదర ప్రేమ కూడా సుప్రేమ. కష్టములలో ఉన్న ప్రాణస్నేహితుని రక్షించుటకై ఎంతో ధనము ఖర్చుచేయు స్నేహితుడు కూడా సుప్రేమనే ప్రకటించు చున్నాడు. మాతృదేశ స్వాతంత్ర్య రక్షణకై అసువులు అర్పించు సిపాయిలు కూడా సుప్రేమనే ప్రకటించుచున్నారు. దేశసేవకు జీవితము లర్పించి, నిస్వార్థతతో సంఘసేవచేయు వ్యక్తులంతా సుప్రేమను ప్రకటించు చున్నారు.

నిస్వార్థపరత, త్యాగము, పవిత్రత–ఇవి సుప్రేమ లక్షణములు, సుప్రేమ పరిపక్వము పొందినపుడు విశ్వప్రేమగా మారును. సర్వాంతర్యామియగు భగవంతుని సర్వజీవుల యందు తిలకించుటయే విశ్వప్రేమ. మానవులంతా పరాత్పరుని బిడ్డలు. తనతోటి మానవులను సోదరీ సోదరుల వలె ప్రేమిం చుట విశ్వప్రేమ. మనవ జీవిత పుష్పము యొక్క మకరందము విశ్వప్రేమ. కరుణ, దయ, నిస్వార్థపరత, విశ్వసమైక్యతా భావన, విశ్వకల్యాణ కాంక్ష హృదయమున కల్గిననాడు విశ్వప్రేమ

జనించును. సర్వులను అనగా సర్వ దేశస్థులను, సర్వజాతులను, పండితులను, పామరులను, దుష్టులను, సన్మార్గు లను, బంధువులను, శత్రువులను అందరిని పరమాత్మ యొక్క దివ్యాంశము గల్గినట్టి రూపములుగా ప్రేమించగల్గినట్టి విశాలహృదయము యొక్క స్థితియే విశ్వప్రేమ, నిస్వార్థ మానవసేవ కార్యరూపము దాల్చిన విశ్వ ప్రేమయే. నిర్మల అనే బాలికలో భగవంతుని అంశమే స్వామి ఓంకార్‌కు కన్పించుట చేతనే ఆయన కాలి ఎముకను త్యాగము చేసెను. ఇదియే కార్య రూపము దాల్చిన విశ్వప్రేమ. అట్టి విశ్వ ప్రేమమూర్తి అయిన స్వామీ ఓంకార్‌జీ అనేక సంవత్సరములు తపస్సు సాగించి విశ్వకల్యాణమునకై మానవజాతికి ప్రసాదించిన లోకశాంతి ప్రార్థన విశ్వప్రేమ గానము చేయుచున్నది.

సర్వజీవుల యెడ దయగల్గి ఉండుటయే నిజమైన మతమంటాడు బుద్ధుడు. నీతోటి వానిని నీవలె ప్రేమించు మని బోధిస్తాడు జీసస్. మంచి ఆలోచనలు, మంచి మాటలు, మంచిపనులు ఇవియే స్వర్గమునందు ప్రవే శించుటకు కావలసిన అర్హతలని తెల్పుచున్నాడు మహమ్మద్. ఈ మూడు అర్హతలు కల్గిన వ్యక్తియే ధర్మాత్ముడంటాడు జోరాష్టరు. “సత్యమే భగవానుడు, అహింసయే ఆ భగవానుని చేరుటకు మార్గము. మానవసేవ ద్వారా భగ వంతుని చూచుటకు కృషి చేస్తున్నాను.” అని గాంధీజీ తెల్పెను. దీనజన సేవయే దైవసేవ యని స్వామి వివేకానందుడు, స్వామి రామతీర్థ ప్రకటిం చిరి. ఈ విధముగా సర్వ మతములకు చెందిన మహాత్ములందరు విశ్వప్రేమ యొక్క ఘనతను కొనియాడు చున్నారు. నిజముగా భగవానుడే ప్రేమ. ప్రేమయే దైవము. విశ్వప్రేమయే సర్వమతముల, సర్వనైతిక, ఆధ్యాత్మిక గ్రంథములసారము. నేడు కామము, అసూయ, భయము, ద్వేషము, ఆశ మున్నగు దుష్టగుణముల కారణముగా బయలు దేరుచున్న కలహముల బారినుండి మానవ జాతిని రక్షించగల్గినది ఈ విశ్వప్రేమయే.

విశ్వప్రేమకు హృదయమే స్థానము. హృదయ పవిత్రత కల్గినవారు భగవంతుని చూచెదరు అంటాడు జీసెస్. అందరిలోను ఉన్న భగవానుని సేవించ మని బోధన చేస్తాడు స్వామి శివానందుడు, విశ్వమానవ సౌభ్రాతృ త్వమే ఇస్లాంయొక్క విశిష్ట సందేశము. అహింసా పరమోధర్మః అని ప్రకటిస్తు న్నది బౌద్ధమతము, జైనమతము. లోకశాంతి ప్రార్థననుగాని, లేక ఏదైనా దివ్యనామమును సర్వేషాం స్వస్తిర్భవతు, సర్వేజనా సుఖినోభవన్తు, లోకసమస్తా సుఖినోభవన్తు అను ఉన్నత భావములతో మిళితముచేసి సదా స్మరణచేయుట వలన విశ్వప్రేమ హృదయములలో జనించును. అట్టి విశ్వప్రేమ మంచి మాటల రూపమునను, మంచిపనుల రూపమునను బాహ్యమున ప్రకటి తము కావలెను. బుద్ధుడు, జీసస్, మహమ్మద్, మహా వీరుడు, జోరాష్టరు, గాంధీజీ వంటి మహాత్ములంతా విశ్వప్రేమను తమ నిత్య జీవితములలో ప్రకటించిరి.      ఓం శాంతిః శాంతిః శాంతిః

**(శాంతి - మార్చి 2003)**

# 24. పూజ్యశ్రీ ఓంకార స్వామీజీ వారి గురించి మాతాజీ వారి అనుగ్రహభాషణం - 13.5.2006

(సాధనాశిబిరం, కోటగిరి)

శ్రీవారితో నాకున్న సేవాభాగ్యంలో నా అనుభవాలను మీతో పంచు కొనుటకు ప్రయత్నింతును. శ్రీవారి ఆత్మకథలో వారి ఆధ్యాత్మిక జీవితంలో ఎన్ని వ్యయప్రయాసల కోర్చి శాంతి ఆశ్రమాన్ని 1917లో స్థాపించి అనాధ లకు, సాధకులకు, భక్తులకు ఆశ్రయమిచ్చి, వారి ఆధ్యాత్మిక వృద్ధి, మానవ కళ్యాణానికి, ప్రపంచశాంతికి వారందించిన శాంతి ఆశ్రమ శాఖలు, ముఖ్యంగా కోటగిరి శాంతి కేంద్రం, ఇంకా ఇతర జీవిత విశేషాలను మీరు చదివియుందురు. శ్రీవారి ఇతర గ్రంథములను క్షుణ్ణముగా చదివి గ్రహింతురు గాక ! అట్టి శోధన ద్వారా శ్రీవారి ఆధ్యాత్మిక జీవన విధానము సర్వులకు బోధపడుతుంది. చాలా పిన్న వయస్సులోనే 17 లేక 18 సంవత్సరములందు పవిత్ర హిమాలయ పర్వతములలో ఋషీకేశంవద్ద పవిత్ర గంగానది ఆవలిగట్టునఉన్న స్వర్గాశ్రమంలో పాడైపోయి శిధిలావస్థలో ఉన్న కుటీరంలో 6 సంవత్సరాలు కఠోర తపస్సుచేసి, ప్రణవోచ్చారణచేసి మరియు అందరిచే చేయించుటచేత "ఓమ్‌స్వామి" "స్వామీ ఓంకార్"గా అందరిచేత పూజనీయులై యావత్ ప్రపంచానికి శాంతి దూతయైనారు. ఏకాంతంలో నిశ్శబ్దస్థితిలో వారు జీవిస్తూ, అట్టి అనువైన ప్రదేశాల్లో ఆశ్రమాభి వృద్ధికై శాఖలను స్థాపించి భక్తులు కూడా ఏకాంత వాసంలో నిశ్శబ్ధంగా మౌనం పాటించి శాంతిని పొందాలని శ్రీవారి ఆకాంక్ష. జీవిత ఆశయము కూడాను !

శ్రీవారు 4సార్లు అమెరికాదేశం సందర్శించి ముఖ్యంగా "శాంతా సుసన్నా" పర్వతాల్లో తపమాచరించి, అక్కడి ఇతర ప్రదేశాల్లో శాంతి సందేశాన్ని అందించి, భారతదేశం తిరిగివచ్చి 40 రోజులు ఉపవాస దీక్షలో ఆధ్యాత్మిక మెరుపులు 108 వ్యాసాలుగా, 6 సంవత్సరములు కఠోర మౌన దీక్షతో మౌనపు ఘడియలు 108 వ్యాసాలుగా వ్రాసి వారు వాటిని భక్తులచే సత్ సంఘాలలో చదివించేవారు. శ్రీవారికి ఏకాంత వాసం ప్రీతి. మౌనానికి ప్రాధాన్యత ఇచ్చేవారు అంటే అవసరమైనంతగానే మాట్లాడమని వారి భావన, సూచన. ముఖ్యంగా వారి దైనందిన జీవితంలో వారికి ఉన్న అనుభవాలను వ్యాసాల రూపంలో వ్రాయుట, సత్ సంగ సమావేశాల్లో పాల్గొన్న భక్తులకు వారి అనుభవాలను అందించటం శ్రీవారికి ఆనందం కల్గించును. ప్రపంచ మతాలయందు భేదభావన లేక విశ్వమత చిహ్నంగా సర్వ మత పీఠాన్ని నెలకొల్పినారు. ముఖ్యంగా శాంతియుత ప్రేమ పూరిత శ్రీవారి జీవితమే మానవ జాతికి వారిచ్చిన దివ్యసందేశం. నిజమైన ఆధ్యాత్మిక భావనలు తేలికగా ఉంటాయి. శ్రీవారు ఏ స్థితిలో చెప్పినా ఆశ్రమ భక్తులకు వారి స్థాయిని బట్టి చెప్పేవారు. శ్రీవారెల్లప్పుడూ ఆధ్యాత్మిక ఉన్నతస్థాయిలో ఉన్నా భక్తులచేత భజనలు, కీర్తనలు చేయించేవారు. భక్తుల యోగక్షేమాన్ని కనుక్కొంటూ నామం చెప్పండి, ధ్యానం

చెయ్యండి అని అమూల్యమైనది త్యాగం, దానిని ఆచరణలో పెట్టటం చాలకష్ట సాధ్యం అని, తన జీవితంలో ఆచరించినదాన్నే సర్వులకు చెప్పేవారు.

నిర్మల అనే బాలిక కోసం శ్రీవారి ఎముకకు బోన్ గ్రాఫ్టింగ్ ఆపరేషన్ మత్తుమందు లేకుండా గంటలకొద్ది చేసిన తర్వాత స్వామీజీ ఆ బాలికను దీవించినారు. మేమంతా ఆపరేషన్ సమయంలో ప్రక్క గదిలో వుండి ఆ రంపపుకోత చప్పుడు విన్నాము కూడా. ఈ బాలికకు ఎముక దానం చేస్తానని శ్రీవారు దైవమునకు మాట ఇచ్చినారు గాన దృఢ నిశ్చయంతో ఆపని పూర్తిచేసిరి. అంతా దైవకృపగా భావించి తన యావత్ జీవితం కుంటుతూ, ఆధ్యాత్మిక దివ్య జీవనం గడిపి అందరికి శాంతిని పంచిన త్యాగధనులు. శ్రీవారి సంకల్పం వజ్ర సంకల్పం. దైవానికి మాట ఇచ్చాను. అందుచేత నిర్మల కుమారికి తప్పక నా ఎముకలోని భాగం కొయ్యండి. ఏ భాగమైనా పరవాలేదని, ఆపరేషన్ అవుతున్న సమయంలో చిరునవ్వుతో ఉండిన, అపరదధీచి మహామునివలె త్యాగం చేసినారు. ఇంతకుముందు శ్రీవారికి అమెరికాలో ఎముక విరిగినది అయినా లెక్కచేయలేదు. వారి త్యాగనిరతి అంత గొప్పది. దీన్నిబట్టి మనం తెలుసుకోవలసింది నిజమైన ఆధ్యాత్మిక జీవితానికి పునాది నిస్వార్ధ త్యాగం.

తోటపల్లి, ఆశ్రమంలో మామిడి చెట్టున్నది. (దాని చుట్టూ దిమ్మలు కట్టి ఉన్నారు.) శ్రీవారు ఆ ప్రదేశం దుర్భేద్యమైన పులులు, చిరుతలతో నిండి ఉన్న ఆ కాలంలో అడవి మామిడి చెట్టుపై ఉయ్యాల కట్టుకొని రాత్రులందు అచ్చటనే పరుండేవారు. మల్లికార్జున ధార వద్ద నీరు దొరికేది. అక్కడికి (3 కి.మీ.దూరం) కాలినడకనవెళ్లి నిత్యం స్నానంచేసి అక్కడి నుండి నీరుతెచ్చి మామిడికి నీరు పోసేవారట. అంత వ్యయ ప్రయాసలకు ఓర్చి తపస్సు చేసిన మహా తపస్వి స్వామీజీ వారు. వారి అకుంఠిత కార్యదీక్షా దక్షతతో వారి తపశ్శక్తితో శాంతి ఆశ్రమాన్ని తీర్చిదిద్దారు. అట్టి తపో భూమి శాంతి ఆశ్రమము. "నాపై ఆధారపడవలదు. ఎంత గొప్పవారైనా ఎవ్వరి పైనా ఆధారపడ వలదు. కాని కోటి సూర్య ప్రభాసమైన జ్యోతులకు జ్యోతిపై ఆధారపడండి. అఖండ జ్యోతి ఆత్మ జ్యోతిగా సర్వులయందున్నది. ఆ దివ్య జ్యోతిపై ఆధార పడిన శ్రేయోదాయకము" అని శెలవిచ్చిరి. సద్భక్తుల ద్వారా జీవితాంతం వారు సేవలందించి, వారు చేసి చూపించి ఇతరులకు చెప్పేవారు. "పని చేయని సోమరునకు తినుటకు హక్కు లేదు. దైవస్మరణ చేయని వానికి జీవించుటకు హక్కులేదు" వీటిని అందుకోడం కడు కష్టతరం. ఆయన స్థాయి దురూహ్యం.

ఈ శాంతి ఆశ్రమం బ్రహ్మచారులకు, గృహస్థులకు, వానప్రస్థులకు, సన్యాసులకు సాధన నిమిత్తం జపధాన్యాదులతో జీవితాన్ని శాంతిగా మలచుకోడానికి ఆశ్రయం మిచ్చే శాంతి ధామం. కాని ఆధ్యాత్మిక సాధకులు ఈ రోజుల్లో తక్కువ. శ్రీవారి జీవితం మనం అర్థం చేసుకోవా లంటే వారి అకుంఠిత కార్యదీక్షా దక్షత, మహాసహనము, త్యాగనిరతిని, సర్వ ఆధ్యాత్మిక పిపాసా పరులు అనుకరించి

అనుభవించాల్సివుంది. శ్రీవారు అట్టి అచల పరిపూర్ణ స్థితి యందుండగల్గిన మహాఋషి సత్తములు మహాత్ములు. మాతృఆశ్రమం తోటపల్లి కొండల్లోనూ, మరియు దాని శాఖలు విశాఖపట్నం, కాకినాడ, పిఠాపురం, కోటగిరి, నీలగిరి కొండల్లో ఎలా పోషించబడే వంటే, శ్రీవారనేవారు ఏ దైవం వీటిని తన భక్తులకై నెలకొల్పెనో ఆ దైవము పైనే పోషణభారం ఉంది. వచ్చే దినం ఆహారం ఆ భగవంతుని కృపయే అని చిరునవ్వు నవ్వేవారు. ఇన్ని సంవత్సరాల నుండి ఈవిధంగానే ఆశ్రమాభివృద్ధి జరుగుచున్నది. ఈ రోజు ఎలాగ అనుకుంటే ఒక మని ఆర్డరు వచ్చేది. ఆ పని పూర్తి అయ్యేది. ఆ దైవనమ్మకం తోనే శ్రీవారు ఆ రోజుల్లో ఆశ్రమాన్ని నడిపేవారు. బ్రహ్మశ్రీ ఆంధ్ర వాల్మీకి భాష్యం అప్పలా చార్యులు గారు కాకినాడలో శ్రీవారు ఆస్పత్రిలో ఉండగా చూచుటకు వెళ్లినప్పుడు, స్వామీజీ ఒక పాట పాడమనిరట. ఆశ్రమాలు దైవప్రేరణవల్ల స్థాపింపబడినాయి. అవి ఏ మౌతాయో అన్న చింత నాకులేదు. అవి ఆదైవమే చూచుకుంటాడు అని అన్నారట. ఈ విధంగా చెప్పుకుంటూపోతే ఎన్నో సంఘటనలు ఉన్నాయి. కావున మన జీవిత గమ్యమైన దైవసన్నిధికి చేరాలంటే త్యాగనిరతి, కార్య దీక్షా దక్షత, సహనము లత్యావశ్యకము. సమాన త్వం అంటాము. ఇతరులను మనతో సమానంగా చూడడము మన జీవితంలో చెయ్యగలమా ? అని శల్య పరీక్ష చేసుకుంటే మహాత్మా గాంధీజీ జీవితంలో జరిగిన సంఘటన ఒక్కటి ఇక్కడ ప్రస్తావిస్తాను. మహాత్మాగాంధీజీ మదరాసులో మాట్లాడుచుండగా ఒక వ్యక్తి గాంధీజీని ప్రశ్నించారట. సమానత్వం అంటారుకదా నన్ను మీతో సమానంగా కూర్చోనిస్తారా? దానిని అనుసరించటం ఎలా సాధ్యపడు తుంది ? ఒక వ్యక్తిని తమతో సమానంగా కూర్చోపెట్టుకోవటం సమానత్వం కాదు. అతను ఎవరు? ఏపనిపై వచ్చారు విచారించి, వానిని ఆదరించి సేవించి తృప్తి పరచటం సమానత్వం. ఇదియే సమానత్వానికి సరిఅయిన నిర్వచనం.

ఈ విధంగా మనస్సును స్థిరం చేస్తే, అంతరాత్మ యందు స్థిర చిత్తులై మన జీవిత గమ్యాన్ని తెలుసుకొని వసించుట మన గమ్యము గాన, ఆ విధంగా దైవ ప్రేమను తత్వ విచారణ ద్వారా, ఆచరణద్వారా, అనుభవించి మానవ సేవయే మాధవ సేవ కావున సేవద్వారా దైవప్రేమ అలవడి తరించ వీలున్నది. కాంజ్ఞన్‌గాడు ఆనంద ఆశ్రమ సంస్థాపకులు పరమ పూజ్యశ్రీ స్వామి రామదాసు, శ్రీకృష్ణాబాయి గారు మూడు రోజులు కైలాస గిరిపై శ్రీవారితో గడిపిరి. స్వామీజీ ఎముక దానం ఇచ్చుట గురించి రామదాసుగారు తమ విజన్ అనే ఆధ్యాత్మిక మాసపత్రికలో ప్రత్యేక వ్యాసంగా ప్రచురించిరి. యోగిపుంగవులు, మహాత్ములు పలువురు విచ్చేసి శ్రీవారిని దర్శించిరి. దైవప్రేరణతో స్థాపించబడిన శాంతి ఆశ్రమం, దైవాను గ్రహంతో ఆశ్రమ భక్తులు, శ్రేయోభిలాషుల సహాయ సహకారములతో దిన దినాభివృద్ధి చెందు తోంది. ఇది లోక విదితమే! శ్రీవారు సత్‌సంగ ప్రార్థన సమావేశాల్లో "జయ జయ రామకృష్ణ హరి ఓం" మహామంత్రం యొక్క శక్తిని తరచూ వివరించేవారు ఈ మంత్రాన్ని భక్త తుకారాం తనుజపిస్తూ వేలాది భక్తులచేత చేయిస్తూ ఉండగా, ఒకసారి ఒక ప్రార్థన

సమావేశంలో ఒక తల్లి తన బాలుడు విషజ్వరం చేత బాధపడుతున్నా, భక్తతుకారాం గారి భజనలో పాల్గొనెను. అదే సమయంలో ఆ బాలుడు మరణించగా తుకారాం భజనలో వెయ్యి మంది భక్తులు ఈ పై మహామంత్రాన్ని భజించుచుండగ, భక్త తుకారాం ఆరాధ్య దైవమైన పాండురంగ విఠలుని కృపా కరుణాకటాక్షంతో ఆ చని పోయిన బాలుడు "జయజయ రామకృష్ణ హరి ఓం" అంటూ నృత్యం చేయ సాగాడట.

ఈ మహామంత్రాన్ని ఈవిధంగా శ్రీవారు ఆశ్రమ భక్తులకు బోధించే వారు. ఈ మంత్రంలో మొదటి "జయ"లో కుడి కాలు భాగం, రెండవ "జయ"తో ఎడమకాలంతా, "రామ"తో కుడిచెయ్యి, "కృష్ణ"తో ఎడమచెయ్యి, "హరి"తో శిరస్సు నుండి కాలి బ్రొటన వేళ్లు వరకు, చివరిగా "ఓం"తో పాదముల నుండి సహస్రారం వరకు భగవంతుడైన శ్రీహరి దివ్య తేజస్సుతో నింపి సదా దైవజ్ఞప్తితో మనుదురుగాక! గావున మనమందరము "జయ జయ రామకృష్ణ హరి ఓం" అని సదా జపించి మన శరీరమంతయూ దైవ తేజస్సుచే నింపి శరీర జ్ఞప్తిని వదిలి, ఒక్కక్షణం దైవమునందు విలీనమై తరింతుముగాక !

ఓం శాంతిః శాంతిః శాంతిః

**(శాంతి - ఆగస్టు 2006)**

## 25. మాతాజీ వారి అనుగ్రహ భాషణం-30.05.2006

(సాధనా శిబిరం, కోటగిరి)

భగవంతుని అనుగ్రహంచే పూజ్య స్వామీజీ యొక్క అపార కరుణ, ఆశీస్సులచే ఈ సాధనా శిబిరమును జయప్రదముగా ముగించినందుకు మొదట భగవంతునికి కృతజ్ఞతలు తెలుపుకుంటూ మీరందరూ ఎంతో వ్యయ, ప్రయాసలతో ఈ శాంతి కేంద్రానికి రావడం, చలిని కూడ లెక్క చేయకుండా ఉదయం,సాయంత్రం కార్యక్రమాలలో ఎంతో భక్తి శ్రద్ధలతో పాల్గొనడం చేతనే ఈ కార్యక్రమం జయప్రదంగా జరిగినది. కావున మీకు ముఖ్యంగా ఈ కార్యక్రమాన్ని ఇంత జయప్రదంగా జరిపించిన పూజ్యులు మన సుబ్రహ్మణ్య శర్మగారు మరియు మన వినమ్రానందవారు కూడా విసుగు, విరామం లేకుండా వారి చక్కనైన ఉపన్యాసాలతో ఈ కార్యక్రమాన్ని చక్కగా జరిపించినందుకు వారికి, మా ఆశ్రమం పక్షాన, మనందరి తరుపున ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలుపుకోవాలి. ఏదైనా కారణం లేనిదే కార్యము లేదు. అందుచేత ఈ సాధనా శిబిరం ముఖ్యంగా ఇచ్చట పెట్టడానికి కారణం లేకపోలేదు. మనవైపు ఎండల గురించి ఆలోచించి, ఇక్కడ చల్లగా ఉంటుంది కదా ! అని ఈ కేంద్రానికి కొందరు వస్తే, ఇంకొందరు ఎన్నో సంవత్సరాలుగా ఇక్కడకు రావడం ఆనవాయితి. వీరి కోసం ఉదయం, సాయంకాలం సత్సంగాల్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఆ తర్వాత ఇక్కడకు వచ్చినందకు కాలం వృథాకాకుండా

వారి జీవితాలను కూడా సార్థకం చేసుకుంటారనే ఉద్దేశంతోటే ఈసాధనా శిబిరాన్ని ప్రారంభించడం జరిగింది. ఇంతకీ దేనికైనా దైవాజ్ఞ లేనిదే గడ్డిపోచైనా కదలదని మనపెద్దల వాక్కు . మీరు ఎంతో భక్తి శ్రద్ధలతోటి ఈ కార్యక్రమంలో పాల్గొని మీకు తోచినట్టి అనుభవాలను ఇంతవరకూ అందరూ కలిసి ఆనందంతో చెప్పారు. మీరు ఆ ఆనందాన్ని పొందినందుకు ఈ శిబిరం ఇక్కడ పెట్టినందుకు మన జీవితకాలం వృథా కాలేదని ఒక సంతృప్తి కూడా కలిగింది. నిన్న శర్మగారు చెప్పారు. "ఏదో మాతాజీగారు క్లాసు తీసుకుంటారని" నాకు ఆ క్లాసు తీసుకునే అర్హతలేదు. (నవ్వుతూ)కానీ మీరందరూ రోజూ స్వామీజీని గూర్చి ఏదో వినాలి అనే ఉద్దేశాన్ని వ్యక్తపరచుటచేత ఇచ్చట కూర్చో గలిగాను.

ఒక మహాత్ముని గురించి మనం చెప్పాలంటే అటువంటి భక్తి శ్రద్ధలు మనలో ఉన్ననాడే మనం చెప్పగలం. కాని స్వామీజీ గురించి చెప్పాలంటే, అది మాటలకు అందరానిది. వారు ఆశ్రమాలను స్థాపించి, వారు పడిన కష్టనష్టాలను వారుచేసిన సేవ,ఎన్నో ఆయన జీవిత చరిత్రవలన తెలుస్తాయి. ఇప్పుడు మనకి ఈ సాధనాశిబిరం నేర్పిందిఏమిటి? రోజూ మనం ఉదయం భగవద్గీత యొక్క సారాంశం వింటున్నాము. మన నిత్య జీవితంలో ఏ విధంగా నడుచుకోవాలి? ఎలా చక్కనైన సుగుణాలతోటి, ఉదార బుద్ధితోటి ఉండాలి? ముఖ్యంగా మన భోజనం ఎలా ఉండాలి? అనే మాటలను ఈ పదిహేను రోజుల నుండీ మనము వింటూనే ఉన్నాము. ఆ విధంగానే మన వినమ్రానంద, సాధన ఏవిధంగా చేస్తే మనం గమ్యాన్ని చేరగలమో, ఆ దయామయుని అనుభూతిని మనం ఏవిధంగా పొందగలమో, ఈ పదిహేను రోజులనుండి మనకు వినిపించారు. కాని నిజంగా మన జీవితంలో మనం ఎన్నివిన్న ప్పటికీ అవి అన్ని మన మెదడులో ఉంచుకోవడం చాలా కష్టమే. మన నిత్య జీవితంలో మనం ఏవిధంగా గడపాలో, మన శర్మగారు చెప్పిన దాంట్లో ఏదో ఒకటి, రెండు అంశాలు మన హృదయానికి ఎక్కించుకొని, ఖచ్చితంగా ఆచరణలో పెట్టిననాడే మనం నిజమైన జీవిత గమ్యాన్ని చేరడానికి, ఆ దైవానుభవమును పొందడానికి చక్కటి మార్గం దొరుకుతుంది.

జీవితం ఏరకంగా గడపవచ్చునో మనకు బోధించినందుకు, మన జీవితాలను మనం ధన్యం చేసుకోవడానికి ఈ సాధనా శిబిరం ఎంతో ఉపయోగపడినట్లు భావించాలి. మేమెంతో సాధన చేస్తున్నా, ఎన్నో అభ్యాస ప్రక్రియలు చేస్తున్నా, మాకింకా ఆ దైవానుగ్రహము రాలేదంటారు. కాని, ఇంతకీ మనకు కావలసింది ఏమిటి? ఎంత ప్రయత్నం చేసియైనా ఆదైవానుగ్రహాన్నిపొందాలి. దైవానుగ్రహం కావాలంటే మనమేమి చేయాలి? మనలో ఉన్న కామ,క్రోధ,లోభ,మోహ, మద,మాత్స ర్యాలు అనే దుర్గుణాలను మనం ఒకేసారి త్యజించలేము. ఒకటి ఒకటిగా వాటిని దూరం చేసుకోవాలి. ఒకటి మనం దూరం చేయగలిగితే సహజంగా వాటంతట అవే ఒక్కొక్కటిగా తొలగిపోతాయి. కాని అవి తొలగాలంటే ఏమి చేయాలి. మనలో

ఎటువంటి కల్మషంలేకుండా, నిర్మలమైన హృదయం, పవిత్రమైన హృదయం ఉండే టట్లు సాధన చెయ్యాలి. మన జీవితాలు ఆ దైవ సన్నిధికి చేరడానికి ఆ భగవంతుడి అనుగ్రహం పొందడానికి సాధన చెయ్యాలి. భగవంతుడు మనలో ఉండాలంటే ఏమి చేయాలి. నిర్మలమైన, శాంతమైన పవిత్రమైన హృదయం ఉంచుకుంటే, భగవంతుడు మన హృదయములోనే ఉంటాడు. అదే మన శర్మగారు భగవద్గీత పదిహేడవ అధ్యాయం ద్వారా అందించిన ఆధ్యాత్మిక సందేశం. ఈ శిబిరంలో తెలుసుకున్న విషయాలను, మీ మీ ఇళ్ళకు వెళ్ళిన తరువాత కూడా మననం చేసుకుంటూ, వీలైనంత వరకూ ఆచరణలో పెట్టే ప్రయత్నం చేసిననాడు, ఈ సాధనా శిబిరము సాధకులకు, నిర్వాహకులకు కూడా సార్ధక్యాన్ని తెచ్చిపెడుతుంది.

పూజ్యశ్రీ ఓంకారస్వామి వారిలో అహంకారం, దర్పం, లవలేశం కూడా వుండేవికావు. ఆశ్రమానికి వచ్చిన వారందరినీ ఆప్యాయంగా పలక రించి, ఇక్కడ ఉండండి, ధ్యానం చెయ్యండి, కీర్తన చెయ్యండి, శాంతిని పొందండి అంటూ ఉండేవారే తప్ప "ఆశ్రమాభివృద్ధికి ఆ చందాలివ్వండి, ఆ పనులకు సహకరించండి అని ఎప్పుడూ అడిగేవారుకారు" అని శ్రీమాన్ శ్రీ భాష్యం అప్పలాచార్యులుగారు అంటూ ఉండేవారు. పూజ్యశ్రీ ఓంకార స్వామీజీలోని విశ్వప్రేమ భావాన్ని మనం గమనించి, అలవాటు చేసుకోవాలి. సాధకులంతా వారి వారి మనస్సును మచ్చలేని తెల్లకాగితంలాగా ఉంచు కోవాలి అంటుండేవారు స్వామీజీ.

నేనెరిగిన ఓంకార్ స్వామీజీ అనే వ్యాసంలో శ్రీతారకంగారు (కంభంపాటి రామశాస్త్రి, బ్రహ్మసమాజ సభ్యుడు.) స్వామివారిని గూర్చి ఇలా వ్రాశారు."డ్రైవర్లు, కంకరరాళ్ళు, చెట్లు, పక్షులు, వగైరాలు కూడా స్వామీజీకి కార్యవస్తువులే. స్వామీజీ వద్దకు వెళ్ళితే ఒక తండ్రి వద్దకు వెళ్ళిన భావన కలుగుతుంది. ఇతర మఠాధిపతుల వద్ద దూరంగా ఉండవలసినట్లు, స్వామీజీ దగ్గర దూరంగా ఉండవలసిన పనిలేదు. ఈ కోటగిరి ఆశ్రమం నుండి తోటపల్లి ఆశ్రమానికి బయలు దేరుతూ, మార్గ మధ్యలో సిద్ధిపొందే చివరి క్షణాలలో కూడా "సేవ చేయండి" అనే సందేశాన్ని స్వామివారు అందజేసారు.

భగవదాశీస్సులు, పూజ్య గురుదేవుల ఆశీస్సులు సదా మనందరిని కాపాడుగాక ! సాధకులందరికీ శాశ్వత సుఖ-శాంతులు, ఆత్మాభివృద్ధి సిద్ధించునుగాక !

ఓం శాంతిః శాంతిః శాంతిః

**(శాంతి - జూలై 2006)**

యుధిష్ఠరుడు రాజసూయ యాగముచేసినప్పుడు ఎవరు జేయవలసిన కర్తవ్యములను వారి వారికి యేర్పరచబడెను. చివరకు కృష్ణుడువచ్చి నా పని ఏమిటని ప్రశ్నించగ, ఎవరి పనులు వారికి ఏర్పర్చబడెను. యిక మిగిలినవి ఏమియు లేవనెను. అయితే ఎవరును తీసుకొనని పనిని, నాకు యిష్టమైనది. తీసుకొనవచ్చునాయని, అందరు భోజనములు జేసిన విస్తర్లు తీయుటకు తాను పూనుకొనెను.

## 26. పూజ్యశ్రీ ఓంకార్ స్వామీజీ వారి 114వ జన్మదిన సందర్భంగా పూజ్యశ్రీ జ్ఞానేశ్వరి మాతాజీ వారి సందేశం

భగవంతుని అపార అనుగ్రహముచే మరో సంవత్సరము పూజ్యశ్రీ స్వామీజీ 114వ జన్మదినము జరుపుకొను అదృష్టము, అవకాశము గల్గించిన పరమాత్మకు మన కృతజ్ఞతను తెలుపుకొనవలసి యున్నది.

మీరందరూ ఎంతో వ్యయప్రయాసలకోర్చి, భక్తి, శ్రద్ధలతో ఈ జన్మదిన కార్యక్రమములో పాల్గొనుట ఆనందము. పూజ్యశ్రీ స్వామీజీ సదా జెప్పు చుండెడివారు. "నా జన్మదినమే మీ అందరి జన్మదినముగాన మీకందరకూ జన్మదిన శుభాకాంక్షలు."

పరమపూజ్యులు శ్రీస్వామి చిదానందులవారు ఎన్నో సంవత్సరాలుగా ఈ జనవరి 21వ తేదిన మన మధ్యనుండి వారి దివ్య ఆశీస్సులు మనకు అనుగ్రహించే వారని మీలో చాలామందికి తెలిసిన విషయమే! వారు లేని లోటు వారి శిష్యులు పూజ్యశ్రీ పద్మనాభానంద స్వామీజీ, ఋషీకేష్ శివానంద ఆశ్రమము వారు మన మధ్యవుండి ఈ జన్మదిన కార్యక్రమములో పాల్గొని, మనలను ఆశీర్వదించుట ఆనందకరము. పూజ్యులు శ్రీ ఓంకారానంద స్వామీజీ, పెద్దాపురం వార్కి ఎన్నితొందర పనులున్ననూ, ప్రతీ సంవత్సరము జనవరి 21వ తేదీన జన్మదిన కార్యక్రమములలో పాల్గొని వారిసందేశమును, ఆశీస్సులను అంద జేయు చున్నారు. వార్కి మా కృతజ్ఞతను తెలుపుకొనవలసియున్నది.

ప్రతి సంవత్సరము జన్మదినములు జరుపుకొనుట సంతోషమే! ఈ జన్మ దినములు జరుపుకొనుటలో మనమెంత అభివృద్ధి అవుచుంటిమని ఎవరి జీవితములను వారు పరీక్షించుకొనవలసినదే! ముఖ్యముగా మన జన్మకు ఆధారమైన గమ్యమును జేరుటకు మనము ప్రయత్నించవలసి యున్నది. ఆ తపనలేని నాడు మన జీవితములు వ్యర్థమే గదా ! అసలు ఈ ప్రపంచములోకి ఎందుకు వచ్చితిమి? ఏమి జేయుచుంటిమి? చివరకు ఎచ్చటకు వెళ్ళుచుంటి మని నిత్యము మనము స్మరించుచున్న మన గమ్యము జేరుటకు కొంత తోడ్పడును.

పూజ్యశ్రీ స్వామీజీ తరచు అనుచుండెడివారు "ఈ శరీరముతో వుండి జేసిన సేవ కన్న శరీరము వదలిన తరువాత హెచ్చు సేవ జేయవచ్చు. ఆ విధముగానే ఆశ్రమ భక్తులు, శ్రేయోభిలాషులు పాతవారు, క్రొత్తవారు అను కొనని రీతిగ ఆశ్రమాభివృద్ధికి, ఎన్నో విధములుగ తోడ్పడు చుండుట జూచిన శ్రీ స్వామీజీ తరచు అనుచుండెడి మాటలు జ్ఞప్తికి వచ్చు చుండును. వారి పవిత్రమైన దివ్యశక్తియే ఆశ్రమాన్ని నడుపుచున్నదనుటలో సందేహమేమి లేదు.

ఓం శాంతిః శాంతిః శాంతిః

**(శాంతి - ఫిబ్రవరి 2008)**

## 27. మనోవిజయ సాధనే దుఃఖాలను దూరం చేస్తుంది-14.5.2008

(కోటగిరి - సాధనా శిబిరం)

శిబిరంలో పాల్గొన్న సాధకులకు, ఉపన్యాసకులు, జీవితంలో ఏది అవసరమో, సాధన విధానమేదో చక్కగా అందించారు. సాధకులంతా ఆ సందేశాలను తమ తమ నిత్య జీవితంలో అనుసంధానించుకోవాలి. శ్రీ శర్మగారు ప్రతిరోజు మీకు సుమారు అరగంటపాటు శ్రీస్వామీజీ యొక్క సందేశాలను విపులంగా వివరించారు. జీవితాన్ని ఎలా సార్థకం చేసు కోవాలో, ఎలా సద్వినియోగపరచుకోవాలో శ్రీస్వామీజీ యొక్క సందేశాలు మనకు మార్గదర్శకాలవుతాయి. గడచినకాలం మనకు తిరిగిరాదు. కనుక దుర్లభ మైన మానవ జన్మను సార్ధక పరచుకోవలసిన బాధ్యత మనవంటి సాధకుల మీదే వుంది. జీవితములో మనం ఇంతవరకు ఏమి సాధించాము అనే తపన సాధకునికి ముఖ్యంగా ఉండాలి. మీరంతా యెంతో శ్రమపడి, వ్యయప్రయాసలను లెక్కపెట్టక ఇక్కడకు వచ్చి విన్న సందేశాలను మననం చేసుకొని, వాటిని ఆచరించి, జన్మను ధన్యం చేసు కోవాలి. ఉపదేశాలను చేయటం కంటె, వాటిని విని ఆచరణలో పెట్టి తరించటమే సాధకుల యొక్క ముఖ్య ధర్మం. నిదిధ్యాసను అటుంచి, మనం ఎంత శ్రవణం చేశాం, ఎంత మననం చేశాం అని ఎవరికి వారే ఆలోచించు కోవాలి.

శాంతి ప్రార్ధన యొక్క ప్రాముఖ్యాన్ని అనుభవ పూర్వకంగా స్మరించాలి. దానిని అందరు నిత్యం పఠించాలి. 1977వ సం॥లో "సందేశ తరంగిణి" అనే గ్రంథాన్ని, శాంతి పత్రికను ప్రారంభించి అరవై సంవత్సరాలు అయిన సందర్భముగా శ్రీ స్వామీజీ ఇచ్చిన సందేశాలని మరికొన్ని సేకరించి 1985వ సం॥లో "ఓంకారసద్బోధామృతం" అనే గ్రంథాన్ని, శ్రీశాంతి ఆశ్రమం ప్రచురించింది. 13-8-51న శ్రీస్వామీజీ ప్రసంగించిన, "రైళ్లను ఆపుచేయుట" అనువ్యాసంలో మనో విజయసాధనను గూర్చి ఎంతో చక్కటి సందేశము ఉంది.

శ్రీమతి సరోజిని గారు (శ్రీవిశ్వనాధంగారి భార్య) మన ఆశ్రమానికి మంచి భక్తురాలు. ఆమె తన భర్త యొక్క అనారోగ్య పరిస్థితిలో చాలా బాధపడుచు ఆశ్రమానికి వచ్చి, నన్ను కలసి, తన బాధను చెప్పుకొని తన భర్త జీవితం ప్రశాంతంగా గడవాలనీ, ఆయనకు ఆయుర్దాయమే లేకపోతే ప్రశాంతమైన మరణమైనా కలిగించే ఉపాయాన్ని చెప్పమని నన్ను కోరారు. అప్పుడు నేను మన లోకశాంతి ప్రార్థనను గూర్చి చెప్పి, భక్తి శ్రద్ధలతో స్మరిస్తూ ఉండమని సలహా చెప్పాను. ఆమె అలాగే అని ఆ ప్రార్థనను స్మరిస్తూ వచ్చింది. ఆమె భర్తతో కలసి ఒకరోజు ఉదయమే శివాలయానికి వెళ్ళి శివునిదర్శించి, తనగదికి తిరిగి వచ్చింది. భార్యా భర్తలిద్దరూ ప్రశాంతంగా ఉన్న ఆ క్షణంలోనే ఆమె భర్తయైన శ్రీ విశ్వనాధంగారు పరమపదించారు. 3సం॥ తర్వాత ఆమె నా దగ్గరకు వచ్చి "అమ్మా మీరిచ్చిన శాంతి ప్రార్థన నాకు రక్షరేకువలె పనిచేసింది. రక్షిస్తోంది." అని చెప్పింది. శాంతి ప్రార్థన యొక్క మహిమను గూర్చి

ఆమె చెప్పిన అనుభవం ఇది. అంతటితో ఆగకుండ ఆమె తన చేతికి ఉన్న బంగారు గాజులను తీసి స్వామి ముందుంచింది. నేను వద్దన్నా ఆమె అంగీకరించలేదు. ఆ గాజులను అమ్మించి వచ్చిన సొమ్ముతో తోటపల్లిలోని శ్రీ శాంతి ఆశ్రమ ఆవరణలో లోకశాంతి ప్రార్థనను వ్రాసిన పుస్తకాల నన్నింటిని పునాది భాగంలో భద్రపరిచేటందుకు (శాంతి పీఠస్థాపనకు) నాంది పలికాము. మరికొందరు ఉదారులైన దాతలు అందించిన విరాళాలతో శాంతిపీఠం సర్వాంగ సుంద రంగా తయారయింది. నేటికి కూడ అత్యంత భక్తి శ్రద్ధలతో భక్తులు లిఖించిన లోకశాంతిప్రార్థన పుస్తకాలను అందులో భద్రపరుస్తూనే ఉన్నాము. జీవులకు, భక్తులకు లోకశాంతి ప్రార్థన రక్షరేకులా రక్షిస్తుంది అన్న అనుభవానికి నిదర్శనంగా ఈ శాంతి పీఠం, స్థాపించబడి, అందరికి శాంతి ప్రసాదాన్ని అందిస్తోంది.

"మహత్తులకు మహత్తు అయినది మనో విజయమే. మనో నిగ్రహము లేకుండుటే దుఃఖములకు కారణము. అదే అహంకారమునకు మూలము, కష్టములకు కాణాచి. కనుక మనందరము శ్రీ ఓంకార గురుదేవులు అందించిన ఈ ఉపదేశాన్ని అందుకొని, ఆచరణలోపెట్టి ఆనందిద్దాము. ఆ మనో విజయశక్తిని సాధించుటే మన సాధనకు, మీరు ఈ సాధనా శిబిరానికి వచ్చినందుకు సార్థకత యేర్పడుతుంది."

ఓం శాంతిః శాంతిః శాంతిః

**(శాంతి - జూలై 2008)**

## 28. సాధనా శిబిరంలో ఇచ్చిన సందేశం-30.5.2008(కోటగిరి)

భగవంతుని మరియు పూజ్యశ్రీ ఓంకార స్వామీజీ వారి ఆశీస్సులు పరిపూర్ణంగా ఉండటం చేతనే ఈ సాధనా శిబిరం విజయవంతంగా ముగి సింది. ఈ శిబిరములో పాల్గొన్న వారందరు మనకు, ఆశ్రమమునకు కూడా సుపరిచితులే. అందరూ ఈ శిబిరంలో భక్తి శ్రద్ధలతో పాల్గొనినందుకు చాలా ఆనందముగా వుంది. శ్రీ సుబ్రహ్మణ్యశర్మగారును, వినమ్రానంద వారును ఎన్నో ఆధ్యాత్మిక సాధనా రహస్యాలను హృదయాలకు హత్తుకునేలా అందించారు. ఈ విన్న సందేశాలను ఎంతవరకు మనం ఆచరింపగలుగు తామో ఎవరికి వారే బాగా ఆలోచించాలి.

ఈ శిబిరంలో పాల్గొన్న వారిలో గుంటూరు భక్తులు ఎక్కువ మంది ఉన్నారు. వారిని చూస్తే గుంటూరులో నివసించే ఒక భక్తురాలి కథ నాకు జ్ఞాపకం వస్తోంది. మంగాదేవి అనే భక్తురాలు గుంటూరులో నివసిస్తుంది. ఆమె శ్రద్ధ, పట్టుదలతో ఎన్నో మంచి కార్యక్రమాలను నిర్వహిస్తుంటారు. ఆమె ప్రకృతి ఆరాధకురాలు, భగవంతుణ్ణి ప్రకృతి రూపంలో ఆరాధించే వారు. అయిదారు రోజుల క్రితం ఆమె ఫోనుచేసి "అమ్మా! వెంకటేశ్వర బాల కురీటరము ప్రారంభించాను. అది బాగా పనిచేస్తోంది" అని చెప్పారు. ఆమె ఇంకా మరికొన్ని సేవా కార్యక్రమములు కూడా నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం విద్యా సంస్థలకు సెలవులు ఉండటంచేత, తీరిక సమయం దొరికి నందువలన ఆమె ఈ మధ్య పూజ్యశ్రీ ఓంకార స్వామీజీ వారి రచనలను

చదవుతున్నారట. పూజ్య స్వామీజీవారి రచనలలో "తానొకటి తలచిన దైవమొకటి తలచును" అనే వ్యాసాన్ని చదివిన తరువాత నాతో మాట్లాడా లనిపించిందట. అందుకే ఫోను చేసాను అని ఆమె చెప్పినారు. ఆమె చది విన వ్యాస సారంశమిది–

గుంటూరుకు దగ్గరలో చందవరం అనే గ్రామంలో డా॥ నారాయణ స్వామి అనే వైద్యులు ఉండేవారు. ఆయన ఆయుర్వేదం, హోమియో వైద్యాన్ని కూడా చేస్తూ వుండేవారు. ఆ వైద్యుడు పూజ్యశ్రీ ఓంకార స్వామీజీవారికి ఉత్తరాలు వ్రాస్తూ ఉండేవారు. మందులు కూడా అప్పుడప్పుడు పంపించే వారు. ఒకసారి ఆ డాక్టరుగారు, పూజ్యశ్రీ స్వామీజీవారికి ఒక ఉత్తరం ఇలా వ్రాసారు. "స్వామీ మిమ్ము దర్శించాలనివుంది. ఇదే నా చివరి కోరిక కూడా అనుగ్రహించడి" ఆ ఉత్తరాన్ని చూచి కూడా స్వామీజీ సమాధానాన్ని వ్రాయకుండా ఉపేక్షించారు. ఆ డాక్టరుగారు మళ్ళీ టెలిగ్రామ్ ఇచ్చారు. దానితో స్వామీజీ, డాక్టరు నారాయణస్వామి గారిని చూద్దామని బయలు దేరి గుంటూరు చేరారు. అప్పటికే ఆ డాక్టరుగారు స్వర్గస్తులైనారు. కాని, ఆ డాక్టరుగారు మరణించే చివరి క్షణం వరకు "స్వామీజీ వచ్చారా?" అని అడుగుతూనే ఉన్నారు. ఆ డాక్టరుగారు జీవించి ఉన్నంతకాలం తమ గ్రామంలో ఒకచిన్న పర్ణశాలలో స్వామీజీవారు ధ్యానముద్రలో ఉన్న ఫోటోను ఉంచుకొని, అక్కడే వైద్యముచేస్తూ వుండేవారు. తన చివరి క్షణంలో కూడా స్వామీజీ రానందువలన దగ్గర ఉన్న ఆప్తులను పిలిచి, "స్వామీజీ వస్తే వారికి నేను పాదపూజచేసి, సమర్పించిన ఈ కవరును సమర్పించండి" అని ఒక కవరును అందించారు. స్వామీజీ ఆ కవరును అచటనున్న తమ ఫోటోను, డాక్టరు శ్రీనారాయణస్వామిగారి భక్తిని, చూచి ఆశ్చర్యపోయారు. అనంతరం అచ్చట జరిగిన డాక్టరు గారి సంతాప సభలో పూజ్యశ్రీ స్వామీజీ వారు ప్రసంగిస్తూ, "తానొకటి తలచిన దైవమొకటి తలచును" అనే విష యాన్ని ఉపదేశించారు. భగవంతుని లీలలు విచిత్రంగా ఉంటాయి. "ఎవ రైనా సరే, తాము తలచిన దానిని వెంటనే చేయాలి గాని, వాయిదాలు వేయరాదని పూజ్యశ్రీ స్వామీజీవారి ఉద్దేశ్యము" అని మాతాజీ వారు వివరించారు.

ఓం శాంతిః శాంతిః శాంతిః

**(శాంతి – సెప్టెంబర్ 2008)**

గీతను యుద్ధ సమయంలో బోధించుటేమి ? నిర్మలంగా వుండు కాలములో ప్రశాంతముగా బోధించవలసిన ఉత్తమ తత్వము గదా యని కొందరి అభిప్రాయం. శ్రీకృష్ణార్జునులు సుఖముగ యమునానది తీరమున గడిపిన కాలమున్నది గాని యీ పవిత్ర బోధలకు తగిన అవకాశము రాలేదు. అర్జునుడు వీరాధి వీరుడు,సాక్షాత్ పరమశివునితో పోరాడి ఆయనను మెప్పించి పాశు పతాస్త్రమును సంపాదించిన గొప్ప లోకైక వీరుడు. అంత గొప్ప వీరుడు శ్రీకృష్ణుని పాదముల వద్ద పడి, నాకేమీ తోచుట లేదు. నీ శిష్యుడను, నా కర్తవ్యం బోధింపుడని ప్రాధేయ పడినప్పుడు విధిగా చేయవలసి వచ్చి చేసిన గొప్ప బోధ భగవద్గీత.

# 29. పూజ్యశ్రీ స్వామీజీ వారి 120వ జన్మదిన సందర్భంగా పూజ్యశ్రీ జ్ఞానేశ్వరి మాతాజీ వారి సందేశం

హరిఃఓమ్. భగవంతుడు మరో సంవత్సరము పూజ్యస్వామి ఓంకార్ జన్మదినం, మనం జరుపుకొనే అవకాశం, అదృష్టం కలిగించి నందులకు మొదట ఆ భగవంతుడికి కృతజ్ఞతలు తెలుపుకోవాలి. ప్రతి సంవత్సరం వచ్చే నా జన్మదినమే, మీ అందరి జన్మదినం అని స్వామీజీ అనేవారు. ఇపుడు ఇక్కడ ఆసీనులైన పరమ పూజ్యులు పద్మనాభానంద స్వామీజీ, మరియు ఇతర స్వామీజీలు, స్వామినులు మరియు భక్తులు అందరికీ జన్మదిన శుభాకాంక్షలు. ఇపుడు మనం భగవంతుడికి కృతజ్ఞతలు తెలుపు కున్నాం. కాని, ముఖ్యంగా పద్మనాభానంద స్వామీజీకి కృతజ్ఞతలు చెప్పు కోవాల్సి వుంది. ఎందుకంటే, వారు ఈ సం॥ ఇక్కడికి రాలేనని బాధపడుతూ వుత్తరం వ్రాశారు. వారి వుత్తరం కాస్త నిరాశను కలిగించినప్పటికి, వారు భౌతికంగా రాలేకపోయినా వారి, సన్నిధిలో జరుపుకుంటాము అని భావిం చాము. అయినా దైవానుగ్రహం వలన వారు ఈ రోజు మనతో ఇక్కడ వున్నారు. వారికి శ్రీశాంతి ఆశ్రమం పట్లవున్న భక్తి ప్రేమ, అభిమానం వలన, వారిచే నిర్ణయించబడిన కార్యక్రమములు అన్ని రద్దు చేసుకొని, ఎంతో శ్రమ కోర్చి వచ్చి ఉన్నారు. భగవంతుని పూర్ణ అనుగ్రహం వలన మనందరిని పునీతులను చేసి ఆశీర్వదించుటకు విచ్చేసినందులకు మనందరి తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

మనం ప్రతిసంవత్సరం ఓంకార్‌స్వామి పుట్టినరోజు జరుపుకుంటు న్నాము. ఈ సంవత్సరం కూడా భగవంతుడు మనకు ఆ అదృష్టం కలిగిస్తు న్నాడు. మనం ఈ జన్మదినాల గురించి ఎన్నో వింటున్నాము, చూస్తున్నాము. కాని ఈ దినం అనేది మనం మన జీవితంలో ఎంత వరకు ఆ దైవానికి సన్నిహితులం అవుతున్నాం, ఎంతవరకు మన ఆధ్యాత్మిక వృద్ధి కోసం ఎంతగా దాన్ని అనుసరించి ఆచరణలో పెడుతున్నాం, ఎంత వరకు ఇతరులకు తోడ్పడుతున్నాం, అని ఎవరంతట వారు ఆలోచించుకోవాల్సిన విషయం. ప్రతి సంవత్సరం భగవంతుడు అనుగ్రహిస్తున్నాడు. మన జీవితం యొక్క ఆధారం ఏంటి? మన జన్మయొక్క ప్రయోజనం ఏంటి? మనం ఎందుకు ఈ ప్రపంచానికి వచ్చాము? ఏం చేస్తున్నాము? చివరికి ఎక్కడికి వెళుతున్నాం ? ఈ ప్రశ్నలు మనం ఎవరంతట వారు వేసుకొని ఆలోచించు కోవాలి. రోజు రోజుకి మనం భగవంతుడి సన్నిధికి దగ్గర అవ్వడం మన ముఖ్యమైన ఆశయం, గమ్యంఅవ్వాలి. నిన్నటి సత్‌సంగంలో పద్మనాభానంద స్వామి చెప్పారు. స్వామి ఓంకార్ యొక్క జన్మదిన సందేశం లోకాసమస్తా సుఖినోభవంతు. మనం ప్రతి రోజు ఈ వాక్యాన్ని పారాయణం చేస్తున్నాం. కాని, కేవలం నోటితోనే స్మరిస్తున్నామా లేదా హృదయంతో స్మరిస్తున్నామా అని ఎవరికి వారే ఆత్మావలోకనం చేసుకోవాల్సిన తరుణం ఇది. ఈ వాక్యం అంటున్నపుడు తెన్నేటి విశ్వనాథంగారు గుర్తుకు వస్తారు. ఆయన ఎప్పుడూ చెపుతూ వుండేవారు. మనం బయటకు వెళ్ళి అందరికి ఎక్కువగా

సేవ చేయలేక పోయినప్పటికీ మనం ఎచ్చట వున్నవాళ్ళ మచట మన స్ఫూర్తిగా హృదయ పూర్వకంగా భక్తి, శ్రద్ధలతో “లోకాసమస్తా సుఖినో భవంతు” స్మరిస్తూ వుంటే మనం అందరికీ సేవ చేసినట్లే అనేవారు. అందు చేత దాని యొక్క భావాన్ని మనం ధ్యానంచేసుకొని, ఆ వాక్యమే పద్మనాభా నంద స్వామి వారి యొక్క సందేశము కూడా అని భావిద్దాము.

హరిఃఓమ్

**(శాంతి - మే 2014)**

## ౩౦. పూజ్యశ్రీ స్వామీజీ వారి 121వ జన్మదిన సందర్భముగా పూజ్యశ్రీ జ్ఞానేశ్వరి మాతాజీ వారి సందేశం

హరిఃఓమ్. మీరందరు ఎంతో భక్తి, ప్రేమలతో వ్యయప్రయాసలతో వచ్చినందుకు మీఅందరికీ స్వాగతం. స్వామి ఓంకార్ ఎప్పుడూ చెపుతూ వుండే వారు. “ఆశ్రమంలోనికి స్వాగతం కాదు. దైవ సన్నిధిలోనికి స్వాగతం” అందుచేత ఇపుడు మనం అందరం ఆ దైవసన్నిధిలో ఆశీనులమై వున్నాము కనుక, ఆ సన్నిధిని మనం నిరంతరం అనుభవించేలా ప్రయత్నించాలి. ప్రతిసంవత్సరం భగవంతుడు ఈ అదృష్టాన్ని భాగ్యాన్ని కలిగిస్తున్నాడు. అందులో ముఖ్యంగా మన పూజ్యశ్రీ పద్మనాభానంద స్వామి ఎంతో శ్రమ పడి ఇక్కడికి వచ్చి, వారి సన్నిధిలో మనం గడపడానికి అవకాశం ఇచ్చారు. భగవంతుడు మన యందుప్రేమ కలిగి వున్నాడు అన్న దానికి ఇది నిదర్శనం. వారికి ఎన్నో కార్యక్రమాలు వున్నా, మన మధ్యకు వచ్చి వారి సందేశాన్ని ఇచ్చారు. ఆ సందేశాన్ని ఆచరణలో పెట్టిన నాడే మనం ఎంతో శ్రమపడి ఇక్కడకు వచ్చినందులకు మనజీవితాలు ధన్యమౌతాయి. ప్రతిఒక్క సంవత్సరం ఆశ్రమానికి వస్తున్నాము, వింటున్నాము కాని ఎంత వరకు మనం ఆచరణలో పెడుతున్నాము అనేది ఎవరికి వారే ఆలోచించాల్సిన విషయం. ఆచరణలో పెట్టలేకపోతే ఎంత గొప్ప విషయాలు విన్నా అది అప్రయోజనమే ! ఏదో ఆశ్రమానికి వస్తున్నాం, ఆశ్రమంలో వుంటున్నాం, వెళుతున్నాం అనుకుంటే దాని వలన ఫలితం ఏమిటి? కొందరంటూ వుంటారు. ఎంతో సాధన చేస్తున్నాము. కాని దైవానుగ్రహం ఇంకా కలుగట్లేదు అని. మన మనస్సు ఎపుడు పరిపక్వం అవుతుందో అపుడు దైవానుగ్రహం మనకు లభిస్తుంది. ఆ పరిపక్వం లేనినాడు మనం ఎన్ని విన్నా ఎంతచదివినా, ఎంతమంది మహాత్ములను దర్శించినా, దాని వలన మనకు ఏమి వుపయోగం లేదు. మనస్సు పరిపక్వం అవ్వాలి. అపుడే మనం ఆ దైవానుగ్రహాన్ని అనుభవించగలము. కనుక ఎన్నిసార్లు చెప్పినా, చెప్పిందే చెప్పడం, వినిందే వినడం మనకు అలవాటు అయిపోయినది. ఈ చెవితో నుండి విని ఆ చెవితో వదిలేస్తాం. ఎంతో శ్రమపడి భక్తి శ్రద్ధలతో వచ్చి నందులకు కొంచమైన విన్నది మీరు ఆచరణలో పెట్టిననాడే మన జీవితాలు ధన్యమవుతాయి. మనం ఏదైనా విజయం సాధించాలన్నా

ఎలా సాధిస్తాం? మనలో పట్టుదల విశ్వాసం, నమ్మకం లేనినాడు మనం ఎంత చేసినా, అది ఏమి ప్రయోజనంలేదు. కాబట్టి మనం ప్రతి సంవత్సరం, ఆశ్రమానికి వస్తున్నాం,పోతున్నాం, దానివలన మనజీవితాలు ఎంతవరకు సార్థకత అవుతున్నాయి. మన గమ్యాన్ని చేరడానికి మనం ఎంతవరకు ప్రయత్నంచేస్తున్నాము అనేది ఎవరికి వారే ఆలోచించుకోవాల్సిన విషయం. భగవంతుడు ఆ శక్తిని, ఓర్పును, సహనాన్ని, పట్టుదలను మన అందరికి అనుగ్రహించుగాక! మనందరికి భగవంతుడు సుఖశాంతులను ప్రసాదించు గాక అన్న ప్రార్థనతో హరిఃఓమ్.

**(శాంతి - ఫిబ్రవరి 2015)**

## 31. భారతదేశము యొక్క విలువ

అమూల్యమగు మానవజన్మను యీ పవిత్రమైన భారతదేశంలో సంపా దించ గలుగుట ఎంతో అదృష్టము. ఒకానొకప్పుడు ఈ పవిత్ర భారతదేశం, లోకమునకంతయు జ్ఞాన జ్యోతి వెలిగించినది. ఈ పవిత్రదేశము చూచుటకు వచ్చిన వారందరూ ఎంతో భక్తి శ్రద్ధలతో వచ్చేవారు. ఇది సత్యదేశము. ఎవరూ అబద్ధ మాడరు. ప్రతివారిలోనూ దైవమునే చూచి ప్రేమించగల వారు. అట్టి స్థితిలో ఈదేశము స్వర్గలోకముగా యుండేది. ఈ ప్రపంచమున కంతయు ఈ పుణ్యభూమి తీర్థయాత్రా స్థలముగా ఉండేదనుటలో ఆశ్చర్య మేమున్నది! దేవాలయము లోనికి చెప్పులు లేకుండా ఎట్లు వెళ్లెదమో, అట్లే కొందరు విదేశీయ భక్తులు చెప్పులు లేకుండా మన పుణ్యదేశములో నడిచేవారు. దానికి కారణము ఈ పవిత్ర దేశమును దేవాలయముగా చూచుకొనేవారు. అట్టి ఉన్నత స్థితి తిరిగి సంపాదించుటకు భారతీయు లందరూ, నిత్య నిర్విరామ కృషి చేయాలి.ప్రతి వ్యక్తి దేశమును ప్రేమించాలి. దేశాభ్యుదయం కోరాలి. స్వార్థం పూర్తిగా విడవాలి. వివేకానందస్వామి బోధనలను మరువక సదా ఆచరణలో పెట్టుటకు ప్రయత్నించాలి. తిరిగి మన పవిత్ర దేశమును ప్రపంచము నంతటికి ఆదర్శ దేశముగ జేయుట ప్రతివారి కర్తవ్యమని మరువరాదు.

సర్వేజనాః సుఖినోభవంతు !

**(శాంతి - జూలై & ఆగస్టు 1983)**

హిందూమతము మతముగాదు- ఇది సనాతన ధర్మము. ఎంతో పుణ్యం చేసికొని, ఈ సనాతన ధర్మములో జన్మించియు, ఈ ధర్మమును విస్మరించి కర్మ సిద్ధాంతము, పునర్జన్మయందు నమ్మకములేని ఇతర మతములలో కలియు చుండుట దురదృష్టకరము. ఈ సృష్టిలో బీద, గొప్ప రోగి వగైరాతేడాలకు కారణము. "అంతయు భగవంతుని మహిమ" యని క్రిస్టియన్, మహమ్మదీయ మతములు చెప్పుచున్నవి. గాని హిందూమత సిద్ధాంతము అట్లుగాదు. ఈ జన్మలో చేసిన సుకృత దుష్కృత కార్యముల ఫలితముగానే మరుజన్మలో వాటి ఫలితమును అనుభవించుటకు దరిద్రు

డుగా, ఐశ్వర్య వంతుడుగా, రోగిగా మొదలగు వివిధ తేడాలతో జన్మించుట జరుగుచున్నదను ధర్మ సూక్ష్మమే హిందూధర్మము. ఇట్టి సనాతన ధర్మ మతముయొక్క గొప్పతనమును స్వామి వివేకానంద చిన్నవయస్సులో విదేశములకు వెళ్ళి ధైర్యముగా బోధించినప్పుడు అమెరికావాసులు– "భారత దేశములో ఇట్టి మహాపురుషులుండగా అచ్చటి నుండి ప్రవక్తలను తెప్పించు కొని మనము నేర్చుకొనుటకు బదులు మన మత ప్రచారకులను అచ్చటకు పంపి క్రిస్టియన్ మత వ్యాప్తిచేయ బూనుట సిగ్గుచేటుయని తలంచుటేగాక, వారి అభిప్రాయములను పైకి వెల్లడించగల్గిరి. గనుక శ్రీరామకృష్ణ, వివేకా నందులవంటి మహనీయులు అవతరించిన భారతదేశములో జన్మించిన ప్రతివారు, వారి జీవిత విలువను గ్రహించి, ధర్మమార్గమున జీవితములను చక్కదిద్దుకొని అన్యమతముల జోలికిపోక, మతవ్యాప్తికై, లంచముగా యిచ్చు చున్న పరధనమును ఆశించక, అన్నిమతములకు ఒక్కడే భగవంతుడు అను సత్యమును గ్రహించి భారతదేశపు ఖ్యాతిని నిలిపెదరుగాక! ఏ మతములో నున్నను అన్ని మతములసారము ప్రేమయే యనియు, ప్రస్తుత ప్రపంచములో శాంతి కరువైయున్నదను విషయమును గ్రహించియే పూజ్యశ్రీ స్వామీజీ శాంతి ఆశ్రమము ద్వారా, విశ్వశాంతిని కోరుచు, ఆశ్రమ మునకు వచ్చిన ప్రతివారిని వారు ఏ మతమునకు చెందినవారైనను "భగవం తుడు ప్రేమమయుడు గావున తమను తాము మరచి (అనగా స్వార్థమును విడిచి) అందరిలో భగవంతుని గాంచుచు, ప్రేమతో సేవచేయుటే నిజమైన మత మనియు అదియే భగవంతుని పూజించుట, స్తుతించుట" యనియు శలవిచ్చు చుందురు. ఏ మతములవారైనను తోటి మానవులనుగాని, పశు పక్ష్యాది జంతుజాలమును ప్రేమించజాలక, వృథా ఉపన్యాసముల నిచ్చు వారు భగవంతునెట్లు ప్రేమించిన వారగుదురు. "మానవసేవయే మాధవ సేవ మధురిపుగనుత్రోవ" అనగా భగవంతుని తెలుసుకొను మార్గము అని భక్త పోతనవంటి మహనీయులు కీర్తించిరి. ఓంకార్ స్వామికూడ పరోపకారార్థమిదం శరీరమ్ అను సూక్తికి ఆదర్శముగా వారి జీవిత మం తయు బ్రహ్మ ముహూర్తమున లేచినది మొదలు రాత్రి పరుండబోవు వరకు ఒక్కక్షణమైనను వృథాచేయక భక్తుల సందర్శకుల ఆత్మాభివృద్ధికి, విశ్వశాంతి వ్యాప్తికి 86 సంవత్సరముల వృద్ధాప్యములో గూడ నూతనోత్సాహముతో నిరంతర కృషి చేయుచుండిరి.

ఓం శాంతిః శాంతిః శాంతిః

**(శాంతి – జనవరి 1981)**

# 32. భారతీయుల కర్తవ్యం

ఒకప్పుడు ప్రపంచమంతటికి జ్ఞానజ్యోతిగా ఈ పవిత్ర భారతదేశం ఉండెడిది. 2000 సం॥ క్రితం చరిత్రకారుడు మెగస్తనీస్ హిందూదేశములో ఒక్కరు కూడా ప్రాణం పోయినా అబద్ధమాడేవారు లేరని స్పష్టంగా రచి యించెను. మహాపతివ్రత లకు, ఏకపత్నీ వ్రతులకు ఈ దేశము ప్రసిద్ధిగాంచినది. సావిత్రి, అనసూయలాంటి వారు పుట్టిన పుణ్యదేశము. సత్యహరిశ్చంద్రుడు భారతదేశమునకు ఎంతో ఖ్యాతి గడించెను. మహాత్మాగాంధీ సత్యహరిశ్చంద్ర నాటకము చూచి ఎంతో ప్రభావితు డైనాడు. అప్పటినుండి మహాత్ముడు సత్యా గ్రహము నవలంభించెను. గాంధీజీ జీవితము ఆంగ్లభాషలో సినిమా తీసిరట. దానిని చూచినవారు ఎంతో ఉత్తేజితులై, ఒక మానవుడు అస్త్రశస్త్రములు లేక ఇట్టి విజయము సాధించగలడా యని ఆశ్చర్యపడే వారు. పాశ్చాత్యులకు ఆత్మబలం తెలియదు. వారికి ఆయుధబలం బాగా అనుభవం. అందువల్లనే యిప్పుడు ప్రపంచములో ఆయుధ పోటీ బాగా జరుగుచున్నది. అమెరికా వారు ఆయుధము లను తయారుచేసి వాటినమ్ముట వారి వృత్తి. అమెరికావారి జీవనమే ఆయుధ ములు తయారుచేయుట, వాటిని విక్రయించుట.

దుర్యోధనుడు, అర్జునుడు, సహాయం నిమిత్తం శ్రీకృష్ణుని సమీపించి నపుడు ఆయన యిద్దరికీ ఈవిధముగా స్పష్టపరిచెను. నారాయణ సైన్య మంతా ఒకవైపు, తానొక్కడు అస్త్రశస్త్రములు లేక ఒకవైపు, యెవరికి కావలసిన వానిని వారు కోరుకొమ్మని చెప్పగా, అర్జునుడు శ్రీకృష్ణునే కోరు కొనెను. దుర్యోధనుడు ఎంతో సంతోషించి ఆయన పెద్ద సైన్యమునంతను తీసుకొనెను. "ధర్మోరక్షతి రక్షితః" మహాభారత సారము. ధర్మరాజు ప్రాణము పోగొట్టుకొనుటకైనను అంగీకరించెను గాని ధర్మము ఏనాడూ విడనాడలేదు. ధర్మము యొక్క బలము వారికి బాగుగా తెలుసు. ఈ సత్యమును భారతీయులెవరూ, ఎన్నడూ మరువరాదు. పాకిస్తాన్ వార్కి, అమెరికావారు, చైనావారు యెంత ఆయుధబలము సహాయము చేసినను వారు అధర్మముగా భాతర దేశముపైన దండయాత్ర చేసిన యెడల వెనుకటివలెనే అపజయము పొందుదురు. విజయం ధర్మ దేశమైన భారతదేశమునకే దక్కును. భారతీయులందరు అవినీతిని పూర్తిగా విడచి వెనుకటివలెనే, సత్యసంధులై వుండాలి. అంతట భగవంతుని సహాయము మనకుండును. ధర్మమునకు విరోధముగా ఎన్ని ఆయుధములతో నైనను ఎందరు వచ్చినను, భగవంతునిచేత సదా కాపాడబడుచున్న ధర్మపరులను ఎవరు జయించగలరు? భక్తులగు వారిని కాపాడు బాధ్యత భగవంతునిదే. ఎటు సహాయము వచ్చునని ఎవరును అనుమానపడనక్కరలేదు.

దుర్మార్గులగునట్టి వారిని ప్రోత్సాహపరచువారు, దుర్మార్గముచూచి ఆపు టకు ప్రయత్నించనివారు, వీరందరూ పాపులేగదా? భూకంపములెందుకు వచ్చుచున్నవి? అట్టి వారిని నాశనముచేసి భూభారం తగ్గించుటకే కదా? కౌరవ సంతతి నూర్గురు, వారి బలము అపారము. కౌరవ పాండవయుద్ధములో ఎవరు జయించిరి?

ధర్మబలము చాలాగొప్పదని ఈకాలము మానవుడూహింప లేకున్నాడు. "యదార్ధవాది లోకవిరోధి" కాని "దైవ విరోధికాదు" అని జ్ఞాపకము చేసికొనుచు భయపడనక్కర లేదు. లోక విరోధి అన్నారు కాని దైవవిరోధి అనలేదని వారు నిత్యము జ్ఞాపకము చేసికొన వలయును. భగవంతుడు సత్యస్వరూపుడు, జ్ఞానస్వరూపుడు, కరుణా మయుడు, శాంతస్వరూపుడు, కావున భారతీయులు నిత్యం ఈ సుగుణములను అలవాటు చేసుకొనుటకు ప్రయత్నం చేసుకొనవల యును.అట్లు చేయగలిగినచో ఆసురీ సంపత్తులను విడిచి, దైవీసంపత్తిని అలవాటు చేసుకొని దైవ సహాయమునకు అర్హులై వారందరూ ధైర్యముగా జీవించగలరు.

"సత్యమేవ జయతే" అన్న సూక్తిని ప్రతిభారతీయుడు ఎన్నడూ మరువ రాదు. త్యాగరాజులవారికి సన్మానం చేయుటకు తంజావూరు మహారాజు గారు ఆహ్వానించగా "నిధి చాల సుఖమా, రాముని సన్నిధి సేవ సుఖమా, నిజముగ బల్కుమనసా", అని ఈకృతిని పాడి, ఆహ్వానమునకు ఈకృతియే జవాబుగా పంపిరట. ధనము అశాశ్వతమని ఆయనకు తెలుసు. భగవత్సేవ కొరకే మనము మానవులుగా ఈ పుణ్యదేశంలో జన్మించినామనే సత్యమును ప్రతిభారతీయుడు ఎన్నడూ విస్మరించ రాదు. ప్రతికాలములోను, సమస్త జీవరాసులలోను భగవంతుని జూచి ప్రేమించు పుణ్యదేశము. "ఆత్మవత్సర్వభూతాని" అన్నదే మనధ్యేయము. ఈ ఆయుధ పోటీరోజులలో మన ధర్మాచరణ ప్రపంచానికి చూపవలసిన కాలమాసన్నమైనదని ప్రతిభారతీయుడు బాగా గుర్తించాలి. అవినీతి పెరుగుచున్న యీ కాలంలో, ముఖ్యంగా ప్రతివారూ సదా ధర్మోద్ధరణకే కృషి చేయవలసిన అవసరం యెంతైనా వున్నది. ఇదియే భారతీయుల ముఖ్యకర్తవ్యం.

ఓం శాంతిః శాంతిః శాంతిః

**(శాంతి - జనవరి 1984)**

## 33. జీవిత ధ్యేయం

చాలామంది చదువుకొన్నవారు, పెద్దపదవులలో నున్నవారు కూడా మానవ జన్మ పరమావధి ఏమో తెలుసుకొనరు. యీపవిత్రమైన మానవజన్మ ముఖ్యముగ యీ పుణ్యభూమిలో, కర్మభూమిలో ఎందుకు వచ్చినది తెలుసుకొన గలిగిన యెడల, ఏ కొద్దిమందైనను, గమ్యస్థానము చేరుటకు ప్రయత్నించెదరు. గమ్యస్థానం అనగా భగవంతుని తెలుసుకొనుటయే! ఆయనలో ఐక్యమగుటయే అని తెలుసుకొనినవారు, అధర్మమైన పనులు జేయుటకు సాహసించరు. మనోవాక్కాయ కర్మలలో ఏ లోపము ఎప్పుడు తటస్థించినను పతనం తప్పదని తేలికగ గమనించగలరు.

పూజ్యశ్రీ స్వామీజీ తరచు ధర్మచట్టమును జ్ఞాపకము చేయుచుందురు. వెనుకటి జన్మలో మనము ఏ కర్మ చేసినది ఎవరికీ సాధారణముగ తెలియదు. ప్రస్తుతం అనుభవించుచున్న దానినిబట్టి మంచి కర్మచేసినది, చెడుకర్మ చేసినది

గ్రహించగలము. కర్మఫలం అనుభవించక తప్పదు ఎవరికైనా. గనుక ప్రస్తుతం మనచేతిలోనున్న అమూల్య అవకాశమును ఎవరుకూడ, ముఖ్యముగా బుద్ధి మంతులైన వారు క్షణములను ఎన్నడు వ్యర్థము చేయక, అహర్నిశములు మానవ జన్మ ధ్యేయమును తెలుసుకొని, ఆ గమ్యస్థానమును చేరుటకు సాధన చేయవలసిన అవసరము యెంతైన వున్నది. ఈ సాధనకు పవిత్రమైన శాంతి ఆశ్రమము దాని శాఖలు, పూజ్యశ్రీ స్వామీజీ బోధలు ఎంతైనను సహాయపడును. ఆధ్యాత్మిక మార్గము తేలికైనది గాదు. ముళ్లు, రాళ్లు వగైరాలతో చాలకఠినముగ నుండును. వాడియైన క్షౌర కత్తిపై నడకయని ఉపనిషత్ చెప్పుచున్నది. ఎంతకష్టమైనను ఏటికి ఎదురీదుట, పర్వతం ఎక్కుటవంటిదైనను, బుద్ధి మంతులు తప్పకసాధన చేయవలసి వుండునని పూజ్యశ్రీ స్వామీజీ నిత్యం బోధించుచుందురు.

ప్రవృత్తి పరులు పూజ్యశ్రీ స్వామీజీ వేసవిలో విశ్రాంతి తీసుకొనుటకు కోటగిరికి వెళ్లుచున్నారని తలంచెదరుగాని, నివృత్తిపరులు, మానవ జన్మ గమ్య స్థానము తెలిపి దానిని చేరుమార్గము నీలగిరి భక్తులకు తెలుపుటకే శ్రమపడి అంతదూరము వెళ్లుచుందురని తలచెదరు. “యద్భావం తద్భవతి” అనునట్లు ఎవరి హృదయములలో ఏమియుండునో అదియే బాహ్యమున చూడగలరుగదా! గావున ప్రతివారు ముఖ్యముగ భక్తులు మానవజన్మ గమ్యస్థానము తెలుసుకొని, వారి బంధుమిత్రులకు తెలియ చెప్పుట ముఖ్యముగ అవినీతి హెచ్చు పెరిగి పోవుచున్న ఈ కాలములో ఎంతైనను అవసరము కలదు. అట్లు చేయగలవారు, పూజ్యశ్రీ స్వామీజీ అందులకై అహర్నిశ ములు చేయుచున్న కృషికి-ప్రపంచములో శాంతిస్థాపనకు ఎంతైనను తోడ్పడిన వారగుదురు. శ్రీ పరమేశ్వరుడు అట్టి వారి కృషికి సదాతోడ్పడును. వారి జీవితములు అట్టి దేశసేవవల్ల, మానవజన్మ ధన్యము జేసుకొన కలిగిన వారయ్యెదరు. అనేక మందికి మార్గదర్శకులుగా గూడ వుండగల్గుదురు.

ఓం శాంతిః శాంతిః శాంతిః

**(శాంతి - ఆగస్టు 1979)**

వ్యాధికి మందు వేసుకొనుట కంటె వ్యాధి రాకుండా చూచుకొనుట మంచిది గదా? సర్వులలో భగవంతుని చూచుచు ఎవరిలోను చెడుచూడకుండా, మంచిని చూచుట అలవాటు చేసుకున్నవారి ఆరోగ్యం బాగుండును. మనసా, వాచా, కర్మణా పవిత్రముగా సర్వకాలములయందు వుండగలిగినవారు సదా ఆరోగ్యంగా వుండ గలరు. అట్టివారికే నిరంతరము శాంతి ప్రాప్తించును. లోకమంతయు శాంతి మయం చేయుట ప్రతివారి ధ్యేయమై వుండాలి.

# 34. శాంతి ఆశ్రమము

1917 నుంచి ఈ పవిత్ర ఆశ్రమము పనిచేయుచున్నను, భారతదేశము లోనే గాక ఆంధ్రదేశములో గూడ చాలమందికి ఈ ఆశ్రమము ఎచ్చట నున్నదో తెలియదు. ఏమి చేయుచున్నది కూడా ఆశ్రమము చూచిన వారిలో చాలమందికి తెలియదు. తెల్సుకోలేక పోవుచున్నారు. యిచ్చట ప్రార్థన ద్వారా రోగనివారణ కేంద్రమును శ్రీపూజ్య స్వామీజీ చాలా శ్రద్ధతో నడుపు చుండేవారు. వైద్యుడు మందు యిచ్చినను, రోగమును కుదిర్చేవాడు భగవంతుడేనని శ్రీరామకృష్ణ పరమహంస కూడా చెప్పుచుండేవారు. మామూలుగా వైద్యుడు మందు యిచ్చునంతవరకు వైద్యుని మీదనే ఆశపెట్టు కొనుచుందురు. వైద్యుడు తాను చేయవలసినదంతయు చేసి, ఇక లాభము లేదని చెప్పినపుడు "ఏడుకొండలవాడా! ఎచ్చటనున్నావు" అని వేంకటేశ్వర స్వామికి ముడుపుగట్టు కొనుట సహజము. యెప్పటికైనను దిక్కు ఆ పరమాత్మయేగాన, ప్రారంభము ననే డాక్టర్లకు డాక్టరైన భగవంతునే స్మరించ రాదా? అని శ్రీపూజ్య స్వామీజీ అందరికీ సలహా చెప్పుచుండేవారు. ఈ ఉత్తమసలహా ఆచరణలో పెట్టుటకే ఈ రోగనివారణ కేంద్రము పనిచేయు చున్నది.

ఈ పవిత్ర ఆశ్రమములో యిచ్చట ప్రార్ధన మందిరములో నిరంతరము భగవన్నామ సంకీర్తన పగలంతయు జరుగుచుండును. ఆశ్రమవాసులందరూ అచ్చట వంతుల ప్రకారం కూర్చుని భగవన్నామ సంకీర్తన చేయుచుందురు. దీని ఫలితంగా సకాలంలో వర్షములు కురియుటయు, భూములు పండు టయు, అనుభవముగా చూచుచున్నాము. భగవంతుని శ్రద్ధాభక్తులతో పూజించువారికి ఎన్నడూ ఆశాభంగము కలుగదని ఋజుగవగుచున్నది. నదులు పొంగి చాలా నష్టము జరుగబోవు చున్నదని గమనించి నప్పుడు కూడా, భక్తిశ్రద్ధలతో మనస్ఫూర్తిగా ప్రార్ధన చేయగా నదులు పొంగుట, తగ్గుచున్నది. ఇదే ప్రార్ధన మహిమ!

కావుననే శ్రీపూజ్య స్వామీజీకి "లోకశాంతి ప్రార్ధన" మహిమ బహు బాగా స్వానుభవము. యితర దేశములో నున్న ఆశ్రమభక్తులు కూడ "లోకశాంతి ప్రార్ధన" మహిమ వలన నదులు పొంగుట వగైరాలు ఆగిపోయి అచ్చటి ప్రజలను కాపాడుట స్వయంగా అనుభవించి, వారు సంతోషం పట్టలేక శ్రీపూజ్య స్వామీజీకి ఉత్తరములు వ్రాయుచుండేవారు. ప్రార్ధన చేయలేనిది ఏమున్నది? "పత్రం పుష్పం ఫలం తోయం" ఏదైన ఇచ్చిన చాలు భగవంతునికి. భగవంతుడు ఎంత సులభసాధ్యుడు. విశ్వమత చిహ్నము పెద్ద పరిమాణంలో ఆశ్రమము నందున్నది. ఆశ్రమము నుండి వెలువడు ప్రతిలేఖలోను విశ్వమత చిహ్నము అచ్చుపడియే యుండును. ప్రపంచమునకు ఒకే సూర్యుడు, భగవంతుడు కూడా ఒక్కడే. భగవంతుని ఎవరు ఏ నామముతో పిలిచినను ఆయన తప్పక పలుకును.

ఎవరికైనను ఏమైన దానము చేసిన, పవిత్ర హృదయముతో, ప్రేమతో, వినయంతో, భక్తి శ్రద్ధలతో యివ్వబడుచున్నదా అనునది ముఖ్యము. మానవులు

చూచునది దానముయొక్క విలువ. భగవంతుడు గమనించునది పవిత్రమైన హృదయము. మనము దానము చేయునది భగవంతుని సొమ్ము, పుచ్చు కొనువాడు కూడా భగవంతుడే. ఈ సత్యమును సదా జ్ఞప్తియందుంచు కొని, దానము చాలా వినయము, ప్రేమ,భక్తితో చేయవలెను. "పెట్టిపుట్టాలి" అను సామెత అందరికీ తెలుసు. కాని మామూలుగా ఆచరణలో పెట్టలేము. చాలా బీదలు దరిద్రులై పుట్టుటకు ముఖ్యకారణం వారు ఏ జన్మలోనూ, దాన, ధర్మములు చేయకుండుటయే. కావున యిప్పుడైనను ప్రతివారూ జాగ్రత్తపడి అర్హులకు దానమిచ్చుట మానరాదు.

ఈ ఆశ్రమంలో పెద్దల జయంతులు, వర్ధంతులు శ్రీపూజ్య స్వామీజీ శ్రద్ధతో జరిపించేవారు. ప్రతివారి జయంతి మనకు ఎంతో బోధించును. పశుత్వమునుంచి మానవత్వము అచటనుండి దైవత్వములోనికి తీసుకొని వెళ్ళుమార్గము, ఈ పవిత్ర శాంతి ఆశ్రమము నిత్యము బోధించు చున్నది. శ్రీ స్వామి రామతీర్థ శిక్షణాలయములో బోధింపబడుచున్న అనుష్ఠాన వేదాంతం ద్వారా జీవన్ముక్తి స్థితిని అనుభవించుటకు వీలగుచున్నది. జ్ఞానజ్యోతి నిత్యం వెలుగుచున్నది.

ఓం శాంతిః శాంతిః శాంతిః

**(శాంతి - నవంబరు 1983)**

## (అ) విశ్వమత చిహ్నము

చాలమంది భక్తులు, శాంతిఆశ్రమ - విశ్వమత చిహ్నము యొక్క వివరములు తెలియపరచ గోరుచున్నారు. మొదట, అర్ధ చంద్రగుర్తు వున్నది. అది మహమ్మదీయ మత చిహ్నము, దరిమిలా వున్నది శిలువ ఇది క్రిష్టియన్ మతమును తెలుపుచున్నది. దరిమిలా వున్నది సంస్కృత భాషలోని ఓం. ఇది హిందూమతమును గుర్తు చేయుచున్నది. దాని దిగువన పద్మమున్నది ఇది బౌద్ధమత చిహ్నము. ప్రక్కన సూర్యుడున్నాడు పారశీకులు అగ్నిని పూజింతురు. ఇప్పుడు ప్రపంచములో అందరికి తెలిసిన ముఖ్యమతములు యివియే. హిందూమతం అనాదిగనున్నది. దానికి మరియొక పేరు సనాతన ధర్మము. దీనికి పుట్టుక లేదు. పుట్టుక లేనిదానికి మృత్యువుకూడ నుండదు. ఈ ప్రపంచములో వున్న మతములన్నీ ఏదో ఒక ప్రవక్తపైన ఆధారపడి యున్నవి. హిందూమతం, అట్లుకాదు గాన అది ధర్మమని పిలువబడు చున్నది. జొరాష్ట్రియన్ అనువారు, పారశీకుల మత స్థాపకుడు, బౌద్ధమత మునకు బుద్ధుడు కారణం. క్రిష్టియన్ మతమునకు, ఏసుక్రీస్తు, ఇస్లాం మతమునకు మహమ్మదే స్థాపకుడు.

భగవంతుడు సత్య, ధర్మ,ప్రేమ, శాంతి, జ్ఞాన, ఆనంద స్వరూపుడు. దైవమును తెలుసుకొన దలచిన భక్తులు, పై సద్గుణముల నలవరచుకొన వలసి యున్నది. ఈ ప్రపంచమునకంతకు దైవము ఒక్కడే. కొందరు తెలివి తక్కువచేత, మా దేవుడు మీదేవుని కంటెచాల గొప్పవారని తలచుచుందురు. నిజముగ దేవునికి రూపనామము లేవు. అవి మనము కల్పించుకొన్నవే. అఖిలరూపములు తన రూపమైనవాడని

గజేంద్రుడు ప్రార్థించెను. నిర్గుణంగా ధ్యానించి ప్రార్ధనచేయలేని వారు, సగుణముగా వారికి యిష్ట మైన రూపము లతో ప్రార్ధన చేయుచున్నారు. అన్నినదులు కలసి ఒకే సముద్రములోనిక వెళ్లుచున్నట్లు, ఎవరు ఎట్లు ప్రార్థించినను భక్తి,శ్రద్ధ, విశ్వాసములతో ప్రార్ధించ వలెననియు, అందరి ప్రార్ధనలు తనకే చేరుననియు, శ్రీకృష్ణ పరమాత్మ భగవద్గీతలో స్పష్టముగా చెప్పియున్న సంగతి ఎవరూ మరువరాదు.

మతములన్నియు మంచివే. అన్నియు సన్మార్గములనే, సత్ప్రవర్తననే, తెలుపుచున్నవి. నైతికప్రబోధములలో ఏమీతేడాలులేవు. వాటిని అర్థం చేసుకొనడం లోను ఆచరించటంలోను కొన్ని వ్యత్యాసాలు కనిపించుచున్నవి. ఆ తేడాల వలన ఎవరు బాధపడనక్కరలేదు. ముఖ్యంగా ఈ పవిత్ర భారత దేశములో మత కలహము లుండవలసిన పనిలేదు. దైవమును బౌద్ధవిహార ములో గాని చర్చిలోగాని, మసీదులోగాని, గురుద్వారాలోగాని, శివాలయ ములో గాని, విష్ణాలయములోగాని మరియెచ్చటైన భక్తితో ప్రార్థించిన ఒకటియే. ఆయన సర్వాంతర్యామి. ఆయనలేని చోటు, సమయము ఎన్నడు వుండదు, ఈముఖ్య విషయం అందరు జ్ఞాపక ముంచుకొనవలెనని శ్రీస్వామీజీ తరచు చెప్పుచున్నారు.

శాంతి ఆశ్రమము, విశ్వమత సౌభ్రాతృత్వమునే తెలుపుచున్నది. అందు వల్లనే, ఐరోపా ఖండం,అమెరికా మొదలైన దేశములనుండి, శాంతిని ఆపే క్షించు భక్తులందరు యీ ఆశ్రమమునకు వచ్చి, శాంతిగా వారి కాలమును గడిపి, యీ ఆశ్రమమును వారి జ్ఞాన గృహముగా భావించి, సంతోషము తోను తృప్తితోను, తిరిగివెళ్లి శాంతి ఆశ్రమమును ఎన్నడు మరువక ప్రేమగా తమ స్వంతముగ భావించ గలుగు చున్నారు. 56 సంవత్సరముల నుంచి, నడుప బడుచున్న శాంతి ఆశ్రమము ఆదర్శ మేమనగా, ప్రతివారు దైవంలోనే జీవించవలెననియు, వారి బంధు మిత్రులను అట్లు జీవించుటకు తోడ్పడ వలసినదనియు శ్రీపూజ్య ఓంకార స్వాములవారు సదా భక్తులందరికి, ఆశ్రమ సందర్శకులందరికి జ్ఞాపకం చేయుచున్నారు.

ఓం శాంతిః శాంతిః శాంతిః

**(శాంతి - సెప్టెంబర్ 1972)**

## (ఆ) ప్రపంచమునకు శాంతి ఆశ్రమ ఆవశ్యకత

ఈ 20వ శతాబ్దంలోకూడ, మానవులు సర్వమత సామరస్యమును తెలుసుకొనలేక పోవుచున్నారు. ఏపేరున పిలచినను తలంచినను, ప్రపంచ మునకంతకు ఒక్క దైవమే గదా! మనమందరము ఆయన బిడ్డలమేగదా! ఆ దివ్య శక్తివలననే ఈ ప్రపంచమునకు రాగలిగితిమి. తిరిగి అందరము ఆయనలో లీనము కావలసినదేగదా !

దివ్య జ్ఞాన సమాజము, దివ్య జీవన సంఘము, శాంతి ఆశ్రమము, అవతార్ మెహర్‌బాబా, సాయిబాబా, హరనాథ బాబా వగైరా ఆధ్యాత్మిక సంస్థలు, సంఘము

లన్నియు విశ్వమానవ సౌభ్రాతృత్వమునే బోధించు చున్నవిగదా! శాంతి ఆశ్రమ ఆవశ్యకత, లక్ష్యము; వ్యక్తి శాంతి ద్వారా, సంఘములు, రాష్ట్రములు, భారతదేశమేగాక ప్రపంచమంతయు శాంతిని వెదజల్లుటయే! ఈ సంస్థలన్నియు సహకారముతో కలసికట్టుగా పనిచేయ గల్గిన ఎడల, మనదేశములో ధర్మాభివృద్ధికి, లోకశాంతికి ఎంతగానో తోడ్పడగలవు. దైవమే ప్రేమ - ప్రేమయే దైవమనియు సత్యమే-దైవముగా దైవమే సత్యమను దివ్యసూక్తులు అందరూ అంగీకరించినపుడు, అన్ని ఆధ్యాత్మిక సంస్థలు, ఐకమత్యముతో, పట్టుదలతో కృషిచేసిన యెడల, దేశక్షేమము, లోకశాంతి త్వరలో తప్పక నెలకొల్పబడుననుటకు సందేహమేముండును?

అహింసా పరమోధర్మః అని బోధించిన మహనీయుడు గౌతమబుద్ధుడు. ప్రపంచమంతయు దుఃఖమయమని తేలికగా గమనించి, చిన్న వయస్సులో సర్వ భోగములు, రాజ్యము విడనాడి తీవ్రతపస్సు చేసి సిద్ధిపొంది, వాడ వాడలా ప్రచారముచేసి అహింసా సిద్ధాంతమును నెలకొల్పి లోకశాంతికి కృషి చేసిన మహనీయుడాయన. అట్టివారు జన్మించిన యీ పవిత్రదేశములో మనమందరము జన్మించు భాగ్యమును పొందితిమిగాన, మన మందరము ధర్మాభివృద్ధి ద్వారా లోకశాంతికి తప్పక కృషి చేయవలసిన అవసరమెంతే నియు కలదు.

ఓం శాంతిః శాంతిః శాంతిః

**(శాంతి - జూన్ 1976)**

## (ఇ) శాంతి ఆశ్రమ సేవ

తోటపల్లి కొండల మధ్య స్థాపించబడిన శాంతి ఆశ్రమము 60 సంవత్సరము లకు పైబడి నిర్విరామంగా లోకశాంతికి కృషిచేయు చున్నను, ఈ జిల్లావారిలోనే చాలామందికి తెలియదు. ఆశ్రమం కాకినాడకు ఉత్తరముగ సుమారు 32 మైళ్ళ దూరములోనున్నను, చాలమంది కాకినాడ వాస్తవ్యులేగాక, పిఠాపురం కాపురస్తులు కూడ ఎక్కువమంది రాలేకపోవు చున్నారు. ఆశ్రమం చూచిన యెడల వచ్చు లాభమేమి? యని అనేకులు ప్రశ్నించుచున్నారు.

చాలామంది భక్తులు కూడ, దేవాలయములకు ఆశ్రమానికిగల తేడాను గమనించజాలకున్నారు. భక్తులు తిరుపతి వెంకటేశ్వరస్వామికి మ్రొక్కుకుని అచ్చటికివెళ్లి శ్రీస్వామి దర్శనంచేసి మ్రొక్కులు యదావిధిగా చెల్లించి రావడం అందరికి తెలిసన విషయమే. ఏ దేవాలయంలోను కూడ దేవుడు మాట్లా డడు. మ్రొక్కిన పైకం నగలు వగైరాలు హుండీలోవేసి నమస్కరించి తిరిగి రావడం జరుగుచున్నది. శాంతి ఆశ్రమం చూచుటకు అట్లు మ్రొక్కవలసిన అవసరం లేదు. ఆశ్రమంలో వున్న దైవస్వరూపులు పూజ్యులు శ్రీఓంకార స్వాముల వారు చక్కగా మాట్లాడుతారు. వచ్చిన భక్తులందరికి మానవజన్మ గమ్యస్థానం ఏదో,దాని నెట్లు చేరవలెనో, చేరుమార్గమునెట్లు శుభ్రము చేసికొనవలెనో సులభంగా వివరిస్తారు. అంతేగాదు,

భక్తుల హృదయములను మేల్కొల్పుటకు అనేక నీతి–జ్ఞానప్రబోధకములగు సూక్తులను బోర్డులపై వ్రాయించి ఆశ్రమం అంతటా అడుగడుగునా పెట్టించారు. కొన్ని ముఖ్య సూక్తులు క్రిందనుదహ రింపబడినవి.

"ప్రతివారు దైవములో జీవించుచు, ఇతరులుకూడ దైవములో జీవించు టకు తోడ్పడుటే" శాంత్యాశ్రమ స్థాపనాలక్ష్యమని శ్రీవారు ప్రబోధిస్తుంటారు. 1. క్షణములు వ్యర్థము చేయువారు జీవితమంతయు తమకు తెలియకుం డానే వ్యర్థము చేయుదురు. 2. ప్రేమలేని హృదయము శ్మశానవాటిక వంటిది. 3. కాలమనెడి సర్పము, మృత్యువనెడి నోటిని తెరచి ప్రతివారిని వారికి తెలియ కుండగనే మ్రింగుచున్నది. 4. ధనంపోతే ఏమీపోలేదు, ఆరోగ్యంపోతే కొంతనష్టం, గుణంపోతే సర్వనాశనము, కాలంపోతే ఎన్నడు తిరిగిరాదు. మాతృఆశ్రమాన్కి వచ్చినవారికి యిట్టి సూక్తులు అనేకం తెలుసుకొను అవకాశముండును. దూరముగా నున్నవారు మాతృ ఆశ్రమంనకు రాజాలనిచో, వారికి దగ్గరలోనుండు ఆశ్రమశాఖలనైనను దర్శించి అచ్చుట వ్రాయ బడిన కొన్ని ముఖ్య సూక్తులనైనను చదివి అభివృద్ధి చెందవచ్చును. 'నేడేమనది – రేపుమనదికాదు' అనునది ఎంత సత్యము. బాగా చదువు కొన్నవారును, గొప్ప పదవులలో నున్నవారు కూడ చాలమంది మానవ జన్మ గమ్యస్థానమును గురించి విచారించరు. తెలిసికొని గమ్య స్థానము చేరుటకు ప్రయత్నించువారు లక్షకు ఒక్కరుంటే యుండవచ్చును. దీనికి ముఖ్యకారణము ప్రపంచ సుఖవ్యా మోహమే. ఈ మాయ ఎంతఆశ్చర్యముగ నుండుననగా, ఎంతమంది ఎన్ని జబ్బులతో బాధపడుట చూచుచున్నను, మనకు అట్టి జబ్బులు రావనియు, ఎంతమంది హఠాత్తుగ అకాలమృత్యు వాతబడుట చూచుచున్నను, ఎవరిమట్టుకువారు, తాము శాశ్వతముగ జీవించియుందుమను భ్రమలోనే యుందురు.

రాష్ట్రపతులు చనిపోవు చున్నారు. జగద్గురువులు చనిపోవుచున్నారు. యీ మధ్య రోమన్ కేథలిక్కుల ప్రపంచ గురువు రోమ్ నగరములో 'పోపు' పదవినలంకరిం చిన ఒకమాసము నిండకపూర్వమే నిద్రలోమరణించెనట. ఇట్ట వెన్నియో వినుచున్నను, చాలమంది మరణ విషయం ఆలోచించనే ఆలోచించరు. అన్నిటికంటె ముఖ్యము సద్గుణము. చాలమంది విద్యలేనివారు పశుతుల్యు లని తలంచుచుందురు గాని, గుణములేనివాడే, నిజమైన పశువని గమనించ లేకున్నారు. ఎంతచదువు చదివినను, ఎంత ఉన్నత పదవి నలంకరించినను, సద్గుణములేని ఎడల పశుప్రాయు డేగదా. మానవజన్మను వృథా చేసికొన్నట్టే గదా. గుణవంతులు మార్గదర్శులు. వారి పవిత్రజీవితములు ఈనాటికీ మనకు ఆదర్శ ప్రాయములుగా నున్నవి. ఈ విషయము నిరంతరము స్మరించే విధంగా శాంతి ఆశ్రమం అందరి మహాత్ముల జయంతులు, వర్ధంతులు జరిపి మానవాళికి సేవచేస్తున్నది.

ఓం శాంతిః శాంతిః శాంతిః

**(శాంతి – డిసెంబరు 1978)**

## (ఈ) శాంతి ఆశ్రమ భక్తులకు విజ్ఞప్తి

పూజ్య శ్రీ స్వామీజీ శాంతిఆశ్రమం ద్వారా 60 సంవత్సరములనుండి, విశ్వమానవ సౌభ్రాతృత్వమును కోరుచు, ప్రేమ శాంతి సందేశములను లోకశాంతికై బోధించుచుండిరి. ఈ ఆశ్రమము – దేవాలయములకెల్ల పెద్ద దేవాలయము వంటిది. ఇచ్చట నిత్యము విశ్వప్రేమను గురించి, ధర్మమును గురించియు, స్వార్థులు అధోగతికి పోవుదురనియు, స్వార్థ రహితులు ఇతరులకు ఆదర్శముగా నుండుటేగాక, స్వార్థరహిత సేవ ద్వారా తాము శాంతి సుఖముల ననుభవించుటేగాక, లోకశాంతికి తోడ్పడిన వారగుదురనియు నిత్యము ప్రబోధించు చుందురు.

అదృష్టవశాత్తు మన దేశమునకు పరాయి ప్రభుత్వము పోయి, స్వపరి పాలన మత ప్రమేయము లేని ప్రజా శ్రేయోరాజ్యము (Secular Govt) దైవానుగ్రహమున లభించినది. వెనుకటి సూత్రం 'యథారాజా తథా ప్రజా!' నేటి సూత్రం యథాప్రజా తథారాజా!' ప్రజలను ధార్మిక జీవులుగ చేయుటకు – ప్రభుత్వం చట్టములుచేసి, పరిపాలకులు, ప్రజలు కూడ భగవద్గీతా సారమును బాగుగా గ్రహించి ఆచరణలో పెట్టుకొనగలిగిన యెడల, ఏదేశము ప్రపంచమున కంతకు జ్ఞానజ్యోతిని అందించి నదో అట్టి మన పవిత్ర పుణ్య భారతదేశము తిరిగి లోకమునకు అచిర కాలము లోనే మార్గదర్శకముగా నుండి లోకశాంతికి తోడ్పడగలదు. కనుక మన పరిపాలకు లందరు, శాంతి ఆశ్రమమును దర్శించి, అది 60 సంవత్సరముల నుండి నిశ్శబ్ధముగ చేయుచున్న స్వార్థ రహిత సేవను గుర్తించి ఆశ్రమాభి వృద్ధికి తగిన రీతిగా సహాయము చేసినయెడల మన ప్రభుత్వమునకు కుడి భుజముగా నుండి, ప్రజాక్షేమమునకు, లోకశాంతికి, దైవానుగ్రహమున ఇంకను ఎంతగానోతోడ్పడగలదు.

**(శాంతి డిసెంబర్ 1976)**

శ్రీపూజ్య స్వామీజీ ఆశ్రమ సందర్శకుల అందరికి యిట్లు చెప్పుచుండే వారు. ఇంతవరకూ భగవంతుని అనుగ్రహంచేత శాంతి ఆశ్రమము ప్రస్తుత స్థితికి తీసుకురాబడినది. ఇకముందు ఆశ్రమ అభివృద్ధి ఆశ్రమ భక్తులందరి పైన ఆధారపడివున్నట్లు గమనించవలసి యున్నది.

ప్రస్తుతం మనదేశంలో అవినీతి అన్ని రంగములలో కూడా హెచ్చుగా నున్నది. దాని నిర్మూలమునకు, ధర్మోద్ధరణకు, భక్తులందరు కూడా హృదయ పూర్వకంగా సహకరించి తోడ్పడినగాని ధర్మోద్ధరణ జరుగుట చాలకష్టం.

దేవాలయములు ఎన్ని పర్యాయములు సందర్శించినను మానవ జీవిత పరమావధి తెలుసుకొనుటకు అవకాశం వుండదు. శాంతి ఆశ్రమంలో పూజ్య స్వామీజీ సందర్శకుల కందరకు ఇలా బోధించేవారు. మానవజీవిత గమ్యస్థానమును ఈ జన్మలో చేరలేకపోయినను, సక్రమమైన కర్మమార్గంలో పయనించిన యెడల తప్పక మానవ జీవితము ధన్యమగును.

ఒకప్పుడు మన దేశము ప్రపంచమంతటిలో ధర్మదేశమని పేరుగాం చిన పవిత్ర పుణ్యభూమిగా విలసిల్లినది. గాని అనేక కారణములచేత యీ మంచిపేరు యిప్పుడు పోగొట్టుకొను చుంటిమి. శాంతి ఆశ్రమస్థాపనకు ముఖ్యకారణము, ధర్మోద్ధరణయే. అది జరిగినప్పుడే నిజమైన శాంతి చేకూర గలదు. గావున శాంతి ఆశ్రమ శాఖలను విరివిగా మనదేశములో స్థాపించి భక్తులందరూ హృదయపూర్వకంగా సహకరించి ఈ స్థాపనకు తోడ్పడవలసి యుండును. శ్రీపూజ్య స్వామీజీకి మన మందరము చాలా ఋణపడి యున్నాము. ఆశ్రమ శాఖలను స్థాపించి వాటి ద్వారా ధర్మోద్ధరణ చేయుటకు నిరంతరము కృషిచేయుటయే మన అందరి కర్తవ్యం.

సర్వేజనా సుఖినోభవంతు !

**(శాంతి - మే 1983)**

## (ఉ) మన కర్తవ్యము

పూజ్య స్వామీజీ నిర్యాణానంతరం మన కర్తవ్యమేమి? అని ప్రతి ఆశ్రమ భక్తులు ఆలోచించవలసిన అవసరమెంతైన నున్నది. శ్రీస్వామీజీ జీవితాశయం, ఈ విశ్వమంతయు ఒకే కుటుంబమనియు, జనులందరు సహోదరులుగా ప్రేమైక్యతలతో స్వార్ధరహితముగా జీవించుటయే- లోకశాంతికి ముఖ్య సూత్రమనియు సదాజ్ఞాపకం చేసెడివారు.

దైవమే ప్రేమ - ప్రేమయే దైవము అను పవిత్ర భావనను ఆచరణలో నుంచుట నేర్చినచో ఈ ప్రపంచములో అశాంతికి, అవినీతికి తావెక్కడ? దేశములో అశాంతికి కారణము-ప్రజలలో అవినీతి పెరిగి, ధర్మబుద్ధి నశించుటయే. శాంతి ఆశ్రమ స్థాపనాలక్ష్యం-ప్రతివారు తాము నిరంతరము దైవజ్ఞప్తితో జీవించుచు ఇతరులు కూడా దైవశక్తిని గుర్తించి జీవించునట్లు తోడ్పడుటయే నిజమైన సేవయని శ్రీస్వామీజీ సదా బోధించుచుండెడివారు. అయినచో యిపుడు మనకర్తవ్యమేమిటని ఎవరికివారు ప్రశ్నించుకొని, ప్రస్తుతం అశాంతిగా నున్న మన భారతదేశము, మహాత్ముని జీవితాశయము ప్రకారం తిరిగి శాంతియుతముగా మారి రామరాజ్యము వర్ధిల్లాలని మనము కోరుచున్నచో దానికి ఒకేమార్గము,స్వార్ధమును విడిచి విశ్వప్రేమతో జీవించు టయే. అందువలననే శ్రీస్వామీజీ "ప్రేమలేని హృదయము శ్మశానవాటిక" యను సూక్తిని ప్రతివారికి జ్ఞాపకము చేయుచుండెడివారు. శ్రీస్వామీజీ వంటి మహనీయుల బోధలు విని, ఆచరణలో పెట్టుకొన గలిగిన యెడల, శాంతి ఆశ్రమం దాని శాఖల అభివృద్ధికి ఎంతయో తోడ్పడిన వారయ్యెదరు.

తోటపల్లి పర్వతముల చెంతనున్న శాంతి ఆశ్రమం 65 సంవత్సరముల నుండి ప్రజల హృదయములలో ఆధ్యాత్మిక బీజములు నాటి, దేశశాంతికి లోక క్షేమమునకు ఎంత కృషి చేయుచున్నను, దాని ఆశయములు దేశ మంతటా వ్యాప్తిచెందుట

లేదని గ్రహించియే, శ్రీవారు దేశమందలి అన్ని జిల్లా కేంద్రములలో ఆశ్రమ శాఖలు స్థాపించవలెనని సదా కోరుచుండెడి వారు. ఆయా శాఖలను నడుపుచున్న భక్తుల వలన ఆయా ప్రాంత ప్రజలు ఆధ్యాత్మికాభివృద్ధి చెంది, దానివలన ధర్మము అభివృద్ధిచెంది, అవినీతి అక్ర మములు రూపుమాసిపోయి, శాంతి ఏర్పడునని శ్రీవారి విశ్వాసము. గనుక ఆశ్రమ భక్తులు, శ్రేయోభిలాషులమైన మనమందరము శ్రీవారి పవిత్ర ఆశయ ములు నెరవేర్చుటలో మన కర్తవ్యమును నిర్వహించగల్గినచో వారి పవిత్రాత్మ పరిపూర్ణ శాంతి నొందగలదు. అంతేగాక భక్తుల కొరకై ఆశ్రమం ద్వారా నొనర్చిన కృషి, శాంతి వృక్షమునకు శాకోపశాఖలను పుట్టించి, బాగుగా ఫలించి దేశమందంతటా శాంతి తరంగములు వ్యాపించి పూజ్యశ్రీ స్వామీజీ పేరు చిరస్థాయిగా నుండునట్లు మాకు సహకరించెదరుగాక! ఇదియే శ్రీవారికి మన హృదయపూర్వక శ్రద్ధాంజలి యగును. శ్రీవారి పవిత్రాత్మ మనలను సర్వదా ఆశీర్వదించుగాక !

ఓం శాంతిః శాంతిః శాంతిః

**(శాంతి - సెప్టెంబర్ 1982)**

## (ఊ) శ్రీ పూజ్య స్వామీజీ భక్తుల యొక్క ముఖ్య బాధ్యత

ఒకప్పుడు యీ పవిత్ర భారతదేశము ప్రపంచమున కంతయు జ్ఞాన భూమిగా ప్రసిద్ధి చెందినది. కావుననే శ్రీ పూజ్యస్వామీజీ దీనిని అంతర్జాతీయ జ్ఞానజ్యోతి అనేవారు. ఈ పవిత్రదేశము యొక్క ఆదర్శము ప్రతివారూ ధర్మమును అనుష్టించి ధర్మాభివృద్ధికి తోడ్పడుటయే. అమూల్యమగు మానవ జీవిత గమ్యస్థానమును మరువక ప్రతివారు దైవమును తెలుసుకొని, వారిలో ఐక్యమగుటయే అని గమనించవలసియున్నది.

ఈ గొప్ప సేవ శాంతి ఆశ్రమము, దాని శాఖల ద్వారా జరుగువలసి యున్నది. ఇందులకు శ్రీవారి భక్తులందరూ మరువక కృషి చేయవలసి యున్నది. ఈ పవిత్రపని మేము చేయగలమా ? అని ఎవరూ ఎంత మాత్రమును నిరుత్సాహ పడరాదు. అందరు భక్తులు పట్టుదల వహించిన యెడల సాధించలేని పని ఏమీ వుండదు. శాంతి ఆశ్రమములో అందరిపెద్దల జయంతులు, వర్ధంతులు, ప్రతి సంవత్సరం జరుపబడు చున్నవి. కాని చాలమంది వీటిలో పాల్గొనలేకున్నారు. దేశమంతట ఆశ్రమశాఖలను స్థాపించి వాటిలో కూడా యీ జయంతులు, వర్ధంతులు జరిపించిన యెడల వీటి ద్వారా తెలుసుకొనవలసిన మంచి విషయములు యెక్కువ మంది తెలుసుకొనుటకు అవకాశం కలుగును. ప్రతిసంవత్సరం శ్రీకృష్ణజయంతి, వాల్మీకిజయంతి, బుద్ధ జయంతి, నృశింహజయంతి, హనుమత్ జయంతి, గాంధీజయంతి, శ్రీరామకృష్ణ పరమహంస, శారదా దేవి, వివేకానందస్వామి వారి జయంతులు, శ్రీరామనవమి వగైరా జరుపబడుచున్నవి. మానవ జన్మను సార్థకం చేసుకొనదలంచిన భక్తులకు ఈ కార్యక్రమములెంతో ఉపయోగకరములుగ నుండును. క్రిమి, కీటకాది, పశు

జన్మలనుండి మానవ జన్మను సంపాదించుకోగలిగినందుకు, ముక్తి సంపాదించి దైవములో చేరు టకు యివి ఎంతగానో తోడ్పడును. గాన శాంతి ఆశ్రమ శాఖలను స్థాపించినవారు, ఆయా శాఖలకు దగ్గరలోనున్న ఆశ్రమ భక్తులందరు యిట్టి జయంతులను భక్తి ఉత్సాహములతో జరుపుకొని, అట్టి మహనీయుల అడుగుజాడలలో నడుచుటకు గట్టి సాధనచేసి తరించవలెను.

రోగులకు ఆసుపత్రులు, విద్యార్థులకు పాఠశాలలు ఎంత అవసరమో దైవపరితాపనాపరులకు, మానవజన్మ గమ్యస్థానమును చేరదలచిన వారికి కూడ ఆశ్రమములు, వాటి శాఖలు ధర్మోద్ధరణకు అమోఘముగతోడ్పడును. గావున భక్తులందరు శాంతి ఆశ్రమ శాఖలను విరివిగా కేంద్రములలో స్థాపించి, వాటి వలన ఆధ్యాత్మిక లాభం పొందుతూ ధర్మోద్ధరణకు, ప్రపంచ శాంతికి దోహదమొనర్చ ప్రార్ధన.

ఓం శాంతిః శాంతిః శాంతిః

**(శాంతి - సెప్టెంబర్ 1983)**

## (ఋ) గ్రంథాలయములు

వీటిని ఆలయములని ఎందుకన్నారు? దేవాలయములకంటే అతి పవిత్రమైనవి, సరస్వతీదేవి ఆలయములు. దేవాలయములలో దేవుడు మాట్లాడడు. కానీ గ్రంథాలయ ములలో ఎందరో మహనీయుల చరిత్రలు, బోధలు మనకు లభించును. ప్రాణ మిత్రులు–ధర్మాత్ముల చిత్తవృత్తులు ఒక్కొక్క ప్పుడు మారవచ్చును. కాని సద్గ్రంథము ఎన్నడూ మారదు. దానికి మృత్యువు లేదు. పవిత్రమైన గ్రంథాలయముల విలువ చాలామంది తెలుసుకొన లేకున్నారు.

శాంతిఆశ్రమ గ్రంథాలయంలో సైన్సుకు, చరిత్రకు సంబంధించినవి, మహనీయుల స్వీయచరిత్రలు, వారి యొక్క రచనలు లభించును. అశాం తిగా నుండు మనస్సుకు, శాంతినివ్వగల గ్రంథము లెన్నియో యిచ్చట లభించును. ఆరోగ్యము గురించి తెలుసుకొనే వైద్య గ్రంథములు, ఇంగ్లీషు వైద్యం, హోమియోపతి, ఆయుర్వేదము, యునాని, ప్రకృతి చికిత్స వగైరా అన్ని వైద్యములకు సంబంధించిన గ్రంథములు లభించును. వీటివల్ల అనా రోగ్యం పోగొట్టుకొని చక్కటి ఆరోగ్యం సంపాదించుకొనవచ్చును. లోకమం తటా పర్యటన చేసిననూ సంపాదించలేని జ్ఞానం ఒక్కమంచి గ్రంథంతో మనము సంపాదించవచ్చును. అనేకమంది ప్రపంచమంతా పర్యటనచేసి, వారి స్వానుభవముతో చక్కగా రచించిన గ్రంథము లెన్నియో యిచ్చట లభించగలవు.

ఆట–పాటలకు, యోగ, వ్యాయామమునకు సంబంధించిన గ్రంథ ములు లభించును. సంగీత, సాహిత్య వివరాల గ్రంథాలు, హిందూమతము లోని భాగములు ద్వైతం, అద్వైతం, విశిష్టాద్వైతం వైగరాలు తెలుపు గ్రంథములే గాక, క్రిస్టియన్

మతము, మహమ్మదీయమతం, బౌద్ధమతం తెలుపు ధర్మపద, జైనమత గ్రంథములు, జొరాష్ట్రియన్ మత గ్రంథములు కూడ వుండును. రామకృష్ణమఠం, వంటి ఇతర మత సంస్థలు, ప్రచురించు మాసపత్రికలు తెలుగులోనేగాకుండా ఆంగ్లము మొదలైన వివిధ భాషల్లో కూడా లభించును. ఏ ఒక్కరూ తెప్పించజాలని మాసపత్రికలు గ్రంథా లయములలో నుంచి అందరికి ఉపయోగపడునట్లు చేసి వున్నారు.

ఇవి అననేల, ఎవరికి ఏ గ్రంథము కావలసిననూ స్వయంగా తెప్పించు కొనుట కంటే గ్రంథాలయములలో అన్ని రకముల గ్రంథములు ఏర్పాటు చేసిన యెడల అందరికీ అనుకూలముగా చదువుకొనుటకు వీలగును.

ఏ భక్తుడు కూడ సత్సంగమునకు తగిన సజ్జనులు దొరుకుటలేదని ఆశాభంగం చెందనవసరంలేదు. మతగ్రంథములు శాశ్వతంగా వుండును. వానిని మించిన సత్సంగమునకు ఉపయోగపడునవి వేరొకటి ఉండవు. రామాయణం, మహాభారతం, భాగవతం వంటి పవిత్ర గ్రంథములు మానవ జన్మను సార్థకత చేసికొనుటకు ఎంతగానో తోడ్పడును. కావున శాంతి ఆశ్రమ శాఖలలో సత్ గ్రంథములను ఏర్పాటు చేసినచో, శాంతి ఆశ్రమ శాఖల అభివృద్ధికి ఎంతగానో తోడ్పడును.

ఓం శాంతిః శాంతిః శాంతిః

**(శాంతి – ఏప్రిల్ 1983)**



**కోటగిరి భక్తులతో మాతాజీ**

# భాగము - 2

## 1. శ్రీరామనవమి సందేశముల సారాంశము

రామాయణమును రచించినపుడే ఇది ప్రపంచములో సూర్య చంద్రు లున్నంతవరకు చిరస్థాయిగా వుండి పోవునని ఆదికవి వాల్మీకి వచించి యుండెను. రామాయణము, అనాది అపౌరుషేయములని చెప్పబడుచున్న వేదముల తరువాత, ఇదియే ప్రపంచము నంతకు శాశ్వతమైన ధర్మమును బోధించిన ఆది మహాకావ్యము. శ్రీరాముడు సత్యవాక్య పరిపాలకుడు. ఏక పత్నీవ్రతుడు, పితృవాక్య పరిపాలకుడు. మానవ జీవితములో అన్ని ఘట్టములలో తండ్రిగా, సోదరునిగా, భర్తగా, రాజుగా ఆదర్శయుతముగా జీవించి ప్రపంచమునకే మార్గదర్శకుడయ్యెను. శ్రీరాముడు శరణాగత రక్షకుడు, ఆపద్బాంధవుడు, సత్యభాషి, మిత భాషి, హితభాషి, ధర్మప్రియుడు త్యాగధనుడు సదా సంతోషముగ నుండువాడు. శతృపక్షము నుండి వచ్చి శరణుజొచ్చిన విభీషణునికి అభయమిచ్చి లంకకు రాజ్యాభిషేకము చేయగా, సుగ్రీవాది హితులు, రాముడి నీ విధముగా ప్రశ్నించిరి. "ఒకవేళ రావణుడే వచ్చి మిమ్ము శరణుజొచ్చిన అతనికేమి యిచ్చెదరని" ప్రశ్నించగా "రావణుడె వచ్చి నన్ను శరణుజొచ్చినచో అయోధ్యా రాజ్యమునకె అతనిని పట్టాభిషక్తు నిగా చేసి నేను అరణ్యములలో నివసించి కందమూలములను తిందునని" ప్రేమతో చెప్పిన త్యాగకరుణామూర్తి శ్రీరామచంద్రుడు. శ్రీరాముని పవిత్ర పాదము సోకినంతనే అహల్య శాపవిముక్తి పొందెను. శబరి ముక్తి పొందెను. పక్షిరాజైన జటాయువునకు స్వయముగా దహన సంస్కారమొనర్చి ముక్తి నొసంగెను.

రామరాజ్యములో అకాల వర్షములు, కరువు కాటకములు లేవు. పంటలు చక్కగా పండెడివి. అకాలమృత్యువు లుండేవిగావు. ప్రజలు దీర్ఘా యురారోగ్యవంతులై ధర్మప్రియులై యుండెడివారు. అందుచేతనే గాంధీ మహాత్ముడు రామరాజ్యము భారతావనిలో నెలకొల్పవలెనని ఘోషించెను.

శ్రీరామనామ ప్రభావమువల్లనే హనుమంతుడు నూరుయోజనముల సముద్రమును అవలీలగా దాటి సీతాదేవిని దర్శించి శ్రీరామదూతగా తన శక్తిని రావణునికి చూపి మరల సముద్రమును దాటి శ్రీరామునికి సీత క్షేమ వార్త చెప్పగలిగెను. శ్రీరామనామ ప్రభావమున సాధించలేని దేమియు నుండదు. నిరంతర శ్రీరామనామస్మరణ ఈ కలియుగములో, ఈ రోజు వరకు ఎందరినో భక్తులను తరింపచేయుచున్నది. రామనామం క్షమించ లేని పాపము,కుదర్చలేని వ్యాధి యుండదు. పతితుడైన రత్నాకరుడు దుస్సాం గత్యముచే అనేక పాపములను చేసిన కిరాతకుడైనను, పవిత్ర రామనామ మును అనన్య చింతనతో చేసినందుననే వాల్మీకి మహర్షిగామారెను. దీనిని బట్టి రామనామం మహాపాపిని గూడ అతి పవిత్రునిగా నొనర్చగల దని రూఢి యగుచున్నది.

పూజ్యశ్రీ స్వామీజీ శాంతి ఆశ్రమంలో నిత్యము జరుగు సత్సంగములలో శ్రీరామనామ సంకీర్తనమును చేయించుచు, నోటితో రామ నామమును పాడుటకంటె నూటికి నూరుపాళ్ళు హృదయముతో శ్రీరాముని సన్నిధిని అనుభవించుచు, భగవంతుడు మన పవిత్ర హృదయ నివాసిగా నుండెనని గుర్తించి స్మరించవలసినదిగా భక్తులకు బోధించుచుందురు. శాంతిఆశ్రమ మును సందర్శించినవారు, వచ్చిన విధముగా ఖాళీ హృదయములతో వెళ్ళక, ఇచ్చటకు వచ్చిన జ్ఞాపకార్ధముగా అందరి హృదయములను, శాంతితో దైవశక్తితో పూర్ణముగా నింపుకొనివెళ్లి, వారి వారి తావులందున, పరిసర ప్రాంతములందు గ్రామములు, పట్టణములు, దేశమంతయు, ప్రపంచములో దైవసంతతి యగు సర్వమానవాళి యందును,శాంతి, భక్తిబీజములు నాటుటయే అమూల్యమైన మానవజీవిత కర్తవ్యమని నిరంతరము బోధించు చుందురు.

శ్రీరామ రామ యనుచును ఏ మానవుడైన గాని ఏర్పడు మదిలో
ఆరామ విభుని దలచిన కారాకులు డ్రుల్లినట్లు కర్మము డ్రుల్లున్ ॥

ఓం శాంతిః శాంతిః శాంతిః

**(శాంతి - ఏప్రిల్ 1977)**

భగవంతుని దశ అవతారములలో శ్రీరామావతారము చాల ముఖ్య మైనది. శ్రీదశరథ మహారాజు సంతతి లేకపోతే, పుత్రకామేష్టి యను యాగముచేసి నలుగురు పుత్రులను పొందెను. అందు జ్యేష్టుడు శ్రీరామ చంద్రమూర్తి భగవదవతారముగా జన్మించిన శ్రీరాముడు చిరుత ప్రాయము నుండియు గుణవిశిష్టుడై, వశిష్ట మహాముని యొద్ద యోగ వాశిష్టము నభ్యసించెను. విశ్వామిత్ర మహర్షికి శిష్యుడై ఆయనవద్ద అనేక అస్త్రశస్త్రముల ప్రయోగము నేర్చుకొని వారి యాగసంరక్షణ చేయగల్గెను. తదుపరి విశ్వా మిత్రుడు రామలక్ష్మణులను, మిథిలానగరమునకు తీసుకువెళ్లెను. అచ్చట శివధనస్సు అవలీలగా విరచి జనక మహారాజ కుమార్తె యగు సీతాదేవిని వివాహమాడెను. అంతేగాక శ్రీరామ సహోదరులగు లక్ష్మణ, భరత, శతృఘ్నుల వివాహములు కూడ ఒక ముహూర్తముననే గొప్ప వేడుకలతో జరిగెను. వారందరును తిరిగి అయోధ్యకు వచ్చుచుండగా దారిలో పరశు రాముడు ఎదురై రాముడు శివధనస్సు విరచినందుకు చాలా ఆగ్రహించి ఆయనను సంహరించ యుద్ధమునకు తలపడెను. గాని, శ్రీరాముడు, ఆయన ఆయుధముల శక్తిని క్షణములో సునాయాస ముగ తీసుకొనగల్గెను. అంతట పరశురాముడు, మహావిష్ణువే సాక్షాత్తు శ్రీరామునిగ గ్రహించినవాడై వారి యొద్ద శలవుతీసుకొని తపస్సునకు వెళ్ళిపోయెను.

శ్రీరామచంద్రుని యువరాజుగా పట్టాభిషేకము చేయ దశరథ మహా రాజు ముహూర్తమునేర్పాటు చేయగా, కైకేయి కారణముగా సింహాసనాసీను డగుటకు బదులు పదునాల్గు సంవత్సరములు అరణ్యవాసము చేయుటకు స్థిత ప్రజ్ఞుడుగా సీతాలక్ష్మణ సహితుడై, సంతోషముగ వెళ్లెను. ఆయన పితృవాక్య పరిపాలనను

అమోఘముగ పాటించుటేగాక అన్నిరంగములలోను ఆదర్శముగా జీవించి లోకము నకు ఈనాటికి మార్గదర్శకుడయ్యెను. తులసీదాసు, కబీరువంటి భక్తులు శ్రీరాముని అవతార విశేషములను, రామనామ మహిమను చక్కగా రచించిరి. రామనామం సహస్రనామతత్తుల్యం అని శివుడు పార్వతికి తారకనామ మహిమ గురించి చాలా గొప్పగా వివరించెను. ఆ పవిత్ర నామమును భక్తి విశ్వాసములతో ఒక్కసారి స్మరిం చిన చాలునట. "రామా! నీ నామమెంతరుచిరా" యని భక్తరామదాసు కీర్తించెను. ఈ రుచిలో సంతృప్తులైనవారు. ప్రపంచరుచులను అవలీలగా విడనాడగలరు. ఆ రుచి సంపాదించుకొనుటకే మనకు మానవజన్మ ప్రసాదింపబడెను.

శ్రీరామకథా ప్రభావము మనదేశము నందేగాక, విదేశములలో గూడ బహుళ ప్రచారములోయున్నది. రష్యాదేశములో పిల్లల నాటకశాల యున్నదట. అచ్చట రామాయణము వరుసగా చాలారోజులు ప్రదర్శింపబడునట. టికెట్లుదొరకక నాటకశాల ఎల్లప్పుడు క్రిక్కిరిసి యుండునట. రామకథ యందు వారికిగల ఉత్సాహ మునకు ఈ దిగువ విషయము గమనార్హము. శ్రీరాముడు, లేడి రూపముననున్న మారీచ సంహారార్థము వెళ్ళినప్పుడు- లక్ష్మణుడు సీతాదేవి సంరక్షణకై పర్ణశాల యొద్ద నుండెను. రాక్షస మాయచే రాముని గొంతుకతో కేకలు వినిపించగా, సీత లక్ష్మణుని వెళ్ళమని తొందర చేయగా ఆయన పర్ణశాల ముందు హద్దుగా ఒకగీత గీసి, సీతను ఆగీత దాటవద్దని చెప్పి వెళ్ళెను. సీతఒంటరిగా ఉండుటచూచి రావణుడు సన్యాసి వేషముతో "భవతి భిక్షాందేహి" యని కేకవేసి, ఆమె భిక్షనిడుటకు రాగా- రావణుడు గీతదాటిరమ్మనగా, సీత గీతదాటబోవుచుండగా-నాటక శాల లోని పిల్లలందరు ఘొల్లునలేచి గీతదాటవద్దు-గీతదాటవద్దు అని పెద్ద పెద్దకేకలు వేశారట. ఈ గీత రహస్యం మనదేశములో ఎందరికి తెలుసును? మన హిందూ సంస్కృతి రష్యాలోనేగాక, అనేక విదేశములలో చక్కగా వ్యాపించగా మనదేశములో రామభక్తి చాలవరకు క్షీణించుట దురదృష్టము. కనుక మన మందరము నిత్యజీవితములలో నిరంతర దైవజ్ఞప్తితో జీవించుచు, రామనామ స్మరణలో ధన్యులమై గమ్యమును చేరుదుముగాక!

శ్రీరామ శరణం మమ

**(శాంతి - ఏప్రిల్ 1978)**

వనవాసమునకు వెళ్లుటకు ముందు తల్లి కౌసల్యాదేవి ఆశీర్వాదము పొందుటకు వెళ్లగా ఆమె యిట్లుచెప్పెను. 'నాయనా! నీవెచ్చట నున్నను నీ ధర్మమే నిన్ను రక్షించును సుఖముగా వెళ్లిరమ్ము' అనెను. శ్రీరాముడు దండ కారణ్యములో మునులతో కాలము గడుపుచు సుఖముగ 14 సంవత్సర ములు గడుపవచ్చునని తలంచిరి. ఆయన ఎంతో మోహన రూపుడగుటచేత, దండ కారణ్యములోని మహర్షులందరు ఆయనను ఉత్కంఠతతో కౌగలించు కొన వలయునని కోరిరి, గాని శ్రీరాముడు వారిని వారించి- యిప్పుడు కాదు. మరుజన్మలో మీకు అట్టి సదవకాశము లభించునని చెప్పిరి. ఆ

కారణము వల్లనే ద్వాపరయుగములో మహర్షులందరు గోపికలుగా జన్మించి, శ్రీరాముడు శ్రీకృష్ణుడుగా అవతరించి, వారికి ఆలింగన సుఖమును కలి గించుటయే గాక, వారితో ఎంతో ఆనందముగ రాసక్రీడలు జరిపి, గోపికలు భక్తి పరవశతలో సమస్త ప్రపంచమును మరువగల్గునట్లు చేసిరి. శ్రీమహా విష్ణువే శ్రీరాముడుగాను శ్రీకృష్ణుడుగాను అవతరించినను, శ్రీరాముడు ఆచరించినట్లు ఆయన అడుగుజాడ లలో నడవండి శ్రీకృష్ణుడు చెప్పినట్లు చేయండి. అను సలహా ఈ రోజువరకు అమలులో పెట్టుకొనబడుచున్నది.

భరతుని తల్లియైనకైక - దశరథ మహారాజు ఎంతో ప్రేమతో తనకు యిచ్చెదనన్న రెండువరములు ఒకటి భరతునికి పట్టాభిషేకము చేయుట, రెండు శ్రీరాముని వనవాసమునకు పంపుట కోరినది. దశరథుడు విధిలేక ఎంతయో దుః ఖించుచు ఈ వరములకు అంగీకరించిరి,గాని శ్రీరామచంద్రు నితో స్వయముగా చెప్పలేకపోయిరి. ఆయన కైక ద్వారా ఈ వరముల విషయమువిని, అది రాజాజ్ఞగానే భావించి ఎంతో ఆనందముగ వనవాసము నకు బయలుదేరెను.

భరతుడు అయోధ్యకు వచ్చి శ్రీరాముని వనవాసమును గురించి విని, ఎంతయో హృదయావేదనతో తన తల్లిని దూషించి, శ్రీరాముడు సీతాలక్ష్మ ణులతో చిత్రకూట పర్వతమునందున్నట్లు తెలుసుకొని ఆయనను తిరిగి అయోధ్యకు వచ్చి రాజ్యమేల వలసినదిగా కోరుటకు వెళ్లెను. అప్పుడు భరతు నకు రాముడిట్లుచెప్పెను.తల్లి కైక నీకంటెనన్ను చాల హెచ్చుగా ప్రేమించెను. తల్లి నెన్నడును నిందించవలదు.ఆమె, నీవు, నేను విధికి బాధ్యులము విధి ప్రకారము జరుగుచున్న దానికి ఆమెను దూషించ రాదు. అని చెప్పిన అన్న గారి హితవు ప్రకారము భరతుడు శాంతచిత్తుడై, శ్రీరాముడు రాజ్య పరిపాలనా విషయములన్నియు చెప్పగా జాగ్రత్తగా విని, శ్రీరాముని పాదుక లను తీసుకొని వాటిని భక్తితో శిరమునదాల్చి, అయోధ్యకు సమీపముననున్న నంది గ్రామముచేరి శ్రీరాముని స్థానమున పాదుకలుంచి పట్టాభిషేకముచేసి భరతుడు పదునాల్గు సంవత్సరము లచ్చటనేయుండి ధర్మయుతముగా రాముని ప్రతినిధిగా రాజ్యపాలన చేసెను. రాజ్యమిచ్చినను అవసరంలేదని తల్లిమాట జవదాటి శ్రీరాముని సేవలో జీవితమర్పించిన భరతునివంటి సోదరుడు సృష్టిలో మరియొకరు యింత వరకు కానరాడు. అట్టి వారికి ధర్మము ప్రధానముగాని రాజ్యముగాదు.

మహాభారత యుద్ధసమయమున 18 రోజులు గాంధారి పెద్ద కుమారుడు దుర్యోధనుడు తల్లివద్దకు వెళ్లి సాష్టాంగవందన మాచరించి ఆమె ఆశీర్వాదములను కోరగా 18 రోజులు ఒకేమాట చెప్పెను. నాయనా వెళ్లిరమ్ము ధర్మమెచ్చటనున్నదో అచ్చటనే జయముండునని చెప్పెనుగాని, ఒక్కనాడు కూడా నీకు జయమగునని చెప్పలేదు. మహాపతివ్రతలకు ధర్మ వ్యామోహమే హెచ్చుగానుండును. శ్రీరామ నవమిరోజున శ్రీరాముని పూజించుటయనగ ధర్మమూర్తి యగు శ్రీరాముని హృదయములందు నిల్పుకొని ఆయన అడుగుజాడలలో నడువ ప్రయత్నించుటే-

శ్రీరామ రామ రామేతి రమే రామే మనోరమే
సహస్ర నామ తత్తుల్యం రామ నామ వరాననే

ఓం శాంతిః శాంతిః శాంతిః

**(శాంతి – ఏప్రిల్ 1981)**

## ౨. వాల్మీకి జయంతి

ఆది కవి యని ప్రసిద్ధికెక్కిన వాల్మీకి జయంతి కార్తీక పౌర్ణమి రోజు జరుపుతాము. త్రేతాయుగములో రత్నాకరుడను బ్రాహ్మణుడు చెడుసాంగత్య ముతో బోయ స్త్రీని పెండ్లాడి సంతతినిపొంది, దారి దోపిడి వృత్తితో ఎందరినో దోచి బాధించి, ఆ సంపాదనతో కుటుంబ పోషణను సుఖముగ చేయుచుండెను.

ఒకనాడు నారద మహాముని ఆ దారిన వెళ్లుచుండగా ఆయనను కూడ, కొట్టి దోచుకొన ప్రయత్నించగా ఆ ముని ఆ దొంగతో యిట్లు చెప్పెను. నీవు ప్రతిరోజు ఏందరినోహింసించి, దొంగిలించి పాపము సంపా దించి, నీ కుటుంబ మును పోషించుచున్నావు గదా ! నీవు ప్రతిరోజు చేయు పాపములో నీ కుటుంబ సభ్యులు ఏమయినా పాపమును పంచుకొందు రేమో నీ యింటికి వెళ్లి అడిగిరమ్ము, అంతవరకు నేను పారిపోను యిచ్చటనే యుందును అని చెప్పగా, రత్నాకరుడు యింటికి వెళ్లి విచారించగా, భార్య పిల్లలందరు 'నీవెట్లు సంపాదించి కుటుంబపోషణ చేయుచున్నను మేము సుఖంగాతిని బ్రతుకుచున్నాముగాని, నీ పాపములో భాగము పంచుకొన వలసిన అవసరము మాకెంత మాత్రము లేదని నిష్కర్షగా చెప్పుట విని చాల ఆశ్చర్యపడి, దుఃఖించి పశ్చాత్తాపముతో తిరిగివచ్చి నారదమహా ముని పాదములపైబడి మహానుభావా ! ఈనాటికి నాకండ్లు తెరపించితిరి. వారెవరూ నాపాపములో భాగముపంచుకోరట, నా ప్రస్తుత పాప జీవిత మును మానెదను. నాకు తరుణోపాయము ఏమైనను, బోధించుడు అని కోరగా, నారదుడు కరుణించి రామనామస్మరణచేయమని సలహా చెప్పగా, రామ యనుటకు కూడ ఆయనకు నోరు తిరగనందున మరా మరా యని జపించు చుండవలసినని బోధించివెళ్లిరి.

ఆతడు యితర చింతనలేక ఒకచోటున గూర్చుండి రామనామును దీక్షతో విడువక జపించుచుండెను. అట్లు సంవత్సరములుగడువగా ఆయన చుట్టును పుట్టపెరిగెను. చివరకు ఆ పుట్టలోనుండి వాల్మీకి మహర్షిగా వెలుపలికి వచ్చెను. అప్పుడు తిరిగి నారదమహాముని ఆయనకు దర్శన మిచ్చి రామాయణమును రచియించమని సలహాచెప్పిరి. వాల్మీకి మహర్షి తమ తపశ్శక్తిచేత శ్రీమద్రామాయణ మును రచియించి ఆదికవియను పేరు గాంచిరి. ఈ పవిత్రగ్రంథము వేదసారముగా ప్రపంచములో ఖ్యాతి చెందెను. దానిలో లేని ధర్మములు మరియెచ్చటను లేవు. శ్రీరామచంద్రమూర్తి ఆదర్శ పుత్రునిగా రాజుగ, ఆదర్శ సోదరునిగా, భర్తగా, ఏకపత్నీ వ్రతుడుగా,అన్ని రంగములలో కూడ ఆదర్శ పురుషునిగా, ధర్మప్రభువుగా వాల్మీకి చిత్రించిరి. ఆయన ఎన్ని క్లిష్ట పరిస్థితులలోనైనను ధర్మమును, సత్యమును విడువ

లేదు. సింహాసనాశీనుడు గావలసినరోజున అరణ్యవాసమునకు ఆనంద ముగా వెళ్ళగలిగెను. సీతాదేవి ఒక సంవత్సరము లంకలో యున్నందున, రావణ సంహారా నంతరము ఆమెను అగ్ని ప్రవేశము చేసిన తరువాతనే స్వీకరించెను.

శ్రీరామచంద్రమూర్తి ఆదర్శ ప్రభువుగా అయోధ్యలో ప్రజాపరిపాలన చేయుచుండగా, లంకలో చాల కాలముండిన సీతాదేవిని, రాముడు స్వీక రించెను గాని నేను అట్టిపని చేయుదునాయని ఒక చాకలివాడు అనినట్లు ఒకనాడు వేగుల వాని వలన వినిరి. లోకములో తన ఆదర్శమును చూపుటకై వెంటనే నిండు చూలాలైన సీతాదేవిని లక్ష్మణుని ద్వారా అరణ్యమునకు పంపివేసెను. లక్ష్మణుడు ఎంతయో విచారించి ఆమెను తీసికొనివెళ్ళి వాల్మీకి మహర్షి ఆశ్రమం దగ్గర విడిచివచ్చెను. వాల్మీకి ఆమెను ఎంతయో ఆదరించి తన ఆశ్రమంలో సంరక్షించుచుండ కొంతకాలమునకు ఆమెకు లవకుశులు జన్మించిరి. ఆ బిడ్డలకు వాల్మీకి విద్యాబుద్ధు లలో మంచి శిక్షణనిచ్చి మహా యోధులుగా తయారుచేసి రామకథ గానము చేయుట కూడా బోధించిరి.

శ్రీరాముడు అశ్వమేధ యాగము చేయ సంకల్పించి గుర్రమును విడు వగా, లవకుశులు దానిని బంధించిరి. గుర్రమును విడిపించుటకు ఎవరు వచ్చి ఎంత ప్రయత్నము చేసినను లాభము లేకపోయినది. భరత శత్రు ఘ్నులు, లక్ష్మణుడు వచ్చి వారితో యుద్ధము చేసి ఓడిపోయిరి. చివరకు శ్రీరాముడు వచ్చి కూడా వారిని జయింపలేకపోయిరి. వాల్మీకి మహర్షి ప్రసాదించిన శక్తి దివ్యమైనది, అనుహ్యా మైనది, శ్రీరాముని బాణములు ఆ బాలుర మెడలలో పుష్ప హారములుగా మారి పోవుచు వాల్మీకి తపో మహిమను బాగా ఋజువుచేసెను. శ్రీరాముడు ఆశ్చర్యపడి, చివరకు ఆ బిడ్డలు తన కుమారులేయని తెలిసికొని శ్రీవాల్మీకి మహర్షి కరుణ చేత సీతాదేవిని పిల్లలను ఆయోధ్యకు తీసికొనివెళ్ళ గలిగిరి.

ఈ రోజులలో కూడా వాల్మీకి రామాయణమును భక్తిశ్రద్ధలతో వినుచు, చదువు చుందురుగాని, వారులంచములతో, అవినీతితో, జీవితయాత్ర గడుపు చున్నారు. మేము చేయు పాపములో, మా కుటుంబ సభ్యులు భాగము పంచుకోరు గదా యను జ్ఞానమును మాత్రము సంపాదించ లేకున్నారు. రామరాజ్యం నిజమైన ధర్మరాజ్యము, ప్రజలు సుఖశాంతులతో న్యాయ మార్గములో నడచిన రాజ్యం. అట్టి శ్రీరాముడు పరిపాలించిన మన పవిత్ర భారతదేశంలో మహాత్మాగాంధీవంటి రామభక్తులు జన్మించిరి. వారి అనుయాయులుగానున్న వారు సత్యధర్మములతో జీవించుచున్నచో ఈనాటి దేశం అశాంతి అవినీతి కష్టనష్టములతో ప్రజలు బాధపడవలసిన అవసరముండదు. ప్రభుత్వము వారు ఆదేశములు చేయనవసర ముండదు. అతివృష్టి వలన నదులు పొంగుచు విపరీతమైన జననష్టం, పశునష్టం, ఆస్తుల నష్టము లుండవు. అనావృష్టిచే కొన్ని తావులలో ప్రజలు బాధపడ వలసిన అవసరముండదు.

పూజ్యశ్రీ స్వామీజీ తరచు చెప్పుచున్నట్లు పూర్వజన్మ సుకృతముచే లభించిన మానవజన్మ గమ్యస్థానమును తెలుసుకొని, ధర్మాభివృద్ధికి తిరిగి అందరు కృషి చేసినచో తిరిగి భారతావని సుభిక్షముగా సుఖ శాంతులతో వర్ధిల్లి, గాంధీ జీవితాశయమైన రామరాజ్యం తిరిగి పొందగలదు.

ఓం శాంతిః శాంతిః శాంతిః

**(శాంతి - నవంబరు 1981)**

## 3. శ్రీకృష్ణ జన్మాష్టమి సందేశముల సారాంశము

హరియను రెండక్షరములు

హరియించును పాతకముల నంబుజనాభా !

హరి నీ నామ మహత్వము

హరి యని బాగడంగ తరమే హరి శ్రీ కృష్ణా !

శ్రీకృష్ణ పరమాత్మ మానవోద్ధరణకు యీ పవిత్రమైన భారతావనిలో జన్మించుట చేతనే మనదేశము, ఈ భూమండలములో జ్ఞాన తపోభూమిగ అఖండ ఖ్యాతి నొందినది. శ్రీకృష్ణావతారము అవతారములలోకెల్ల గొప్ప అవతారమని చెప్పబడుచున్నది. వీరు కురుక్షేత్రములో లోకోద్ధరణకు చేసిన ప్రబోధమే భగవద్గీత. అట్టిపవిత్ర భగవద్గీత సనాతన ధర్మమై శాశ్వత కీర్తిని గాంచినది.

ఇప్పుడు అవతార్ మెహర్‌బాబా కూడా యీ పవిత్ర భారతదేశంలో 25-2-1894వ తేదీన జన్మించి, తానే శ్రీరామచంద్రమూర్తిగ, శ్రీకృష్ణ భగవానునిగ అవతరించితినని చెప్పుచుండెను. వీరు భగవద్వచనం (God Speaks) అను గ్రంథమును ఆంగ్లములో ముఖ్యముగ పాశ్చాత్య దేశీయుల కొరకు, గీతాసారమునే వారి మనస్తత్వమునకు సరిపడునట్లు రచియించిరి. ఇది చాల గొప్ప గ్రంథమని కొనియాడబడుచున్నది. వారి బోధనాసారము శ్రీకృష్ణ ప్రేమతత్వమే, మురళీగానమే, త్యాగమే. ఈ సుదినమున గీతనేగాక, శ్రీకృష్ణ జీవితమును అనగా గీతానుష్టానమునే ఒకసారి తప్పక ప్రతివారు జ్ఞాపకముచేసుకొని ఆనందించవలసి యున్నది. భాగవతము దశమస్కం దము యీ నాడైనను ముఖ్యముగ చదువ దగినది.

మధురా నగరములో ఆయన ప్రవేశించుచున్నపుడు ఆ పట్టణ స్త్రీలు ఆయననుచూచి ఎట్లుతలచిరో భాగవతములో యీ దిగువ పద్యము చక్కగ తెలుపుచున్నది. అది వారికే కాదు, లోకములోని భక్తులందరికి వర్తించును.

సీ. వీడటే రక్కసి విగతజీవగ జన్ను బాలు ద్రావిన మేటిబాలకుండు,
వీడటే నందుని వెలదికి జగమెల్ల ముఖమందు జూపినముద్దులాడు,
వీడటే మందలో వెన్నలు దొంగిలి దర్పించి మెక్కిన దాపరీడు
వీడటే యెలయించి వ్రేతలమానంబు సూఱలాడిన లోకసుందరుండు

తే. వీడు లే కున్న పుర మటవీస్థలంబు, వీని బొందని జన్మంబు విగత ఫలము
వీని బలుకనివచనంబు విహగరుతము,వీనిజూడనిచూడ్కులు వృథలు వృథలు
భాగవతం 10సంక(పూర్వ)ప. 1248

రుక్మిణిదేవి ఆయన గురించి ఎట్లు తలంచినది, ఇతర భక్తులు ఎట్లు గ్రహించినదియు యీ దిగువ పద్యములు స్పష్టముచేయుచున్నవి. ఇట్టి అమూల్య పద్యరత్నము లెన్నియో యీ స్కంధమునందున్నవి. రుక్మిణీదేవి, శ్రీకృష్ణునిపై గల భక్తి భావమును గాంచుడు.

సీ. ఏ నీ గుణములు కర్ణేంద్రియంబులు సోక,దేహతాపంబులు దీరిపోవు
నే నీశుభాకార మీక్షింపగన్నుల కఖిలార్థ లాభంబు గలుగుచుండు
నే నీచరణసేవ లే ప్రొద్దు చేసిన, భువనోన్నతత్వంబు బొంద గలుగు
నే నీలసన్నామ మే ప్రొద్దుభక్తితోదడవిన, బంధసంతతులువాయు,

తే॥ నట్టి నీ యందు నా చిత్త నవరతము
నచ్చియున్నది నీ యాన నానలేదు
కరుణజూడుము కంసారి ! ఖలవిదారి!
శ్రీయుతాకార ! మానినీ చిత్తచోర !

భాగవతం 10స్కం. (పూర్వ) ప 1706

పరమ పావనుడైన శుకయోగి గోపాలకులతో అరణ్యమున గ్రుమ్మరెడి బాలగోపాలుని చర్యలెంత మనోహరముగా చిత్రించెను. భక్తాగ్రేసరుడైన పోతనా మాత్యుని కవితలో ఆ మోహన రూపము మన కన్నుల కట్టినట్లుం డును.

సీ. వేదాంత వీథుల విహరించు విన్నాణి,విహరించు గాంతార వీథులందు
ఫణిరాజశయ్యపై బవళించు సుఖభోగి, పల్లవశయ్యల బవ్వళించు
గురుయోగి మానసగుహల గ్రుమ్మరుమేటి, గ్రుమ్మరు నందేంద్రదృగుహలలోన
గమలతోడ బెనంగి కడు డయ్యు చతురుడా,భీర జనులతోడ బెనగిడయ్యు

ఆ. నఖిలలోకములకు నాశ్రయుండగు ధీరు
డలసి తరులనీడ నాశ్రయించు
యాగభాగ చయము లాహరించు మహాత్ము
డడవిలోని ఫలము లాహరించు

–భాగవతం 10 స్కం. (పూర్వ) 610

భాగవతోత్తముడైన భీష్ముడు, యుద్ధరంగమున చక్రముపట్టను అని చెప్పిన శ్రీకృష్ణునంత వానిచే చక్రము చేతపట్టించెను. స్వచ్ఛంద మరణశీలి యగు నాతడు అంపశయ్యపై నుండి నాడు తనను చంపవచ్చెడి శ్రీకృష్ణ రూపమును స్మరించుచు

వారిని స్తుతించిన రీతి కడు మనోహరముగా యుండును.

సీ. కుప్పించి యెగసిన గుండలంబులకాంతి గగనభాగంబెల్ల గప్పికొనగ
నురికిన నోర్వక యుదరంబులో నున్న, జగములవ్రేగున జగతిగదల
జక్రంబు జేపట్టి చనుదెంచు రయమున,బైనున్న పచ్చనిపటము జాఱ
నమ్మితి నాలావు నగుబాటు సేయక మన్నింపుమని క్రీడి మరల దిగువ
తే. గరికి లఘించు సింహంబుకరణి మెరసి,నేడు భీష్ముని జంపుదు నిన్ను గాతు
విడువు మర్జున యనుచు మద్విశిఖవృష్టి, దెరలిచనుదెంచు దేవుండు దిక్కునాకు

భాగవతం 1స్కం ప. 222

చతుర్ముఖ బ్రహ్మయే శ్రీకృష్ణ పరమాత్మను తన యహంకారముచేత మొదట గుర్తించలేక గోవత్సములను గోపాలురను అంతర్ధానంబుచేసి, తిరిగి ఆ కృష్ణపరమాత్మ చేత సంకల్ప మాత్రమున వాటిని సృష్టింపబడుట చూచి, చాల ఆశ్చర్యపడి, కొంతసేపటికి నిజము తెలుసుకొని, ఆ పరమా త్మను యీ విధముగా స్తుతించెను.

సీ. అదిగాక నిజరూప మనరాదు కలవంటి దై బహువిధ దుఃఖ మై విహీన
సంజ్ఞానమై యున్న జగము సత్సుఖబోధతనుడవై తుది లేక తనరుదీవు
మాయచే బుట్టుచు మనుచు లే కుండుచు నున్న చందంబున నుండుచుండు
వొకడ వాత్ముడ వితరోపాధిశూన్యుండ వాద్యుండ వమృతుండ వక్షరుండ
ఆ. పద్వయుండవును స్వయంజ్యోతి వావూర్ణు
డవు పురాణపురుషుడవు నితాంత
సౌఖ్యనిధివి నిత్యసత్యమూర్తివి నిరం
జనుడ వీవు దలపజనునె నిన్ను

భాగవతం. 10స్కం(పూర్వ) ప. 566

వ. దేవా! యిట్టి నీవు జీవాత్మ స్వరూపుండవును, సకలాత్మలకు, నాత్మయైన పరమాత్మ స్వరూపకుడవు, నని యెవ్వరెరుంగుదురు, వారు, గదా గురువని యెడుదినకరుని వలన బ్రాప్తుంబైన యుపనిషదర్థ జ్ఞానంబను సునేత్రంబునంజేసి, సంసారమిథ్యాసాగరంబుదరించిన చందంబున నుండుదురు; రజ్జువందు రజ్జువని యెరింగెడి యెరుక లేకుండ, నయ్యెరుం గమి, నది సర్పరూపంబయి తోచిన పిదప నెరింగిన వారివలన రజ్జువు (త్రాడు)రజ్జువని యెరుంగుచుండ, సర్పరూపంబు లేకుండు కైవడి, నాత్మయ ప్పరమాత్మయని యెవ్వరెరుంగరు, వారికయ్యెరుంగమి వలన సకల ప్రపంచంబు గలిగితోచు, నాత్మ యప్పరమాత్మయని యెవ్వరెరుంగుదురు; వారికయ్యెరుక వలన ప్రపంచంబులేకుండు; నజ్ఞానసంభావితనామకంబు లైన సంసార బంధ మోక్షంబులు జ్ఞాన విజ్ఞానంబుల లోనివిగావు; కావున కమల మిత్రున (సూర్యుడు) కహోరాత్రంబులు లేని తెరంగున బరిపూర్ణజ్ఞాన మూర్తి యగు

నాత్మయందు నజ్ఞానంబులేమిని బంధంబును, సుజ్ఞానంబు లేమిని మోక్షంబునులే; వాత్మవైన నిన్ను దేహాదికంబని తలంచియు, దేహాది కంబు నిన్నుగా దలంచియు నాత్మ వెలినుండునంచు, మూఢులు మూఢత్వం బున వెదకుచుందురు; వారి మూఢత్వంబు జెప్పనేల బుద్ధిమంతులై పరతత్వంబు గాని జడంబును నిషేధించుచున్న సత్పురుషులు తమ శరీరం బుల యంద నిన్నరయుచుందు; రదిగావున.

శా. దేవా నీ చరణప్రసాదకణలబ్ధింగాక లేకున్న నొం
డే వెంటం జను నీ మహామహిమ నూహింపంగ నెవ్వారికిన్
నీవారై చనువారిలో నొకడనై, నిన్ గొల్వు భాగ్యంబు నా కీవే;
యిప్పటి జన్మమం దయిన నొం డెం దైన నో యీశ్వరా !

భాగవతం 10 స్కం (పూర్వ) ప. 568.

బ్రహ్మయే శ్రీకృష్ణుని గుర్తించ లేక చాల బాధపడినపుడు మామూలు వారు గుర్తించలేకపోగా, శ్రీభగవానుని లీలలు విని కూడ ఆనందించలేక పోవుచున్నారు. ఈ మానవజన్మ మనకు శ్రీపరమేశ్వరు డొసంగినది. ఆయ నను తెలుసుకొనుటకే యను సత్యమును కూడ కలికాలమగుటచేత గుర్తించ లేక పోవుచున్నారు.

ఏనాడు శ్రీకృష్ణపరమాత్మ నిజతత్వమును తెలుసుకొన గలుగుచుం టిమో, ఆనాడే శ్రీపరమేశ్వరుని అనుగ్రహముచేత మనము తరించి జీవన్ముక్తి శుభమనుభ వించగలుగు చున్నాము. ఇది భారతీయుల జన్మహక్కని మరువ రానిది.

ఓం శాంతిః శాంతిః శాంతిః

**(శాంతి - ఆగస్టు 1968)**

5000 సం॥క్రితం శ్రీ మహావిష్ణువే కృష్ణుడుగా అవతరించి, అర్జునిని నిమిత్త మాత్రముగా జేసి తనవాణి ద్వారా, ప్రపంచమునకంతకు సనాతన ధర్మమనగానేమో జ్ఞాపకంచేసిరి. అదియే భగవద్గీతగా రూపొందినది. సృష్టి ఆరంభముననే ఈ పవిత్ర సనాతన ధర్మమును, మొదట సూర్యభగవానునికి, ఆయన మనువునకు, మనువు ఇక్ష్వాకునకు బోధించుట జరిగినదని, దానిని మరచుట వలన ఇపుడు తిరిగి జ్ఞాపకము చేయుచున్నానని కృష్ణుడు పలికెను.

శ్రీపరమేశ్వరుని పవిత్ర ముఖారవిందము నుంచి వెలువడిన అతి పవిత్ర బోధయిదియేగాన, పాశ్చాత్య తత్వవేత్తలు గూడ గీత ప్రాముఖ్యతను గ్రహించి దీనిని మానవులందరికి మతగ్రంథం(The Bible of Humanity) అనిరి. ఎందరో మహాను భావులు దీనిని వేనోళ్ళ కొనియాడిరి. శ్రీకృష్ణుని జీవితమును చూచిన ఈ పవిత్ర భగవద్గీతను వారు అనుభవములోపెట్టి యీ ప్రపంచమునకంతకు ఆదర్శముగా చూపినట్లు స్పష్టముగ కనిపించును. ఈ ప్రపంచమంతటిలో యీ పవిత్ర భారత భూమి అనాది నుండి ఈ రోజు వరకు గౌరవ ప్రతిష్ఠలతో నిలచియున్నదంటే, శ్రీకృష్ణుని జన్మము మరియు ఆయన గీతోపదేశము వలనే ! భారత యుద్ధమంతయు,

శ్రీకృష్ణుడు అస్త్ర,శస్త్రములుచేపట్టకయు జయప్రదముగ నడిపించెను. దీనివలన ప్రస్తుత కాలములో మనమందరము సదా జ్ఞాపకముంచుకొనవలసిన దేమనగా ధర్మము లేనియెడల మారణాయుధములున్నను, అటం, హైడ్రోజన్ బాంబులున్నను, టాంకర్లు ఉన్నను, మహావీరుడైన కర్ణుని రథము, ఆయుధ ములవలె సమయమునకు అక్కరకు రావు. శ్రీమన్నారాయణమూర్తి కరుణలేనిదే, కర్ణుని వద్ద నున్న శక్తి నిరుపయోగ మయ్యెను.

ధర్మము తప్పి ఎన్నడు ప్రవర్తించరాదు. దుర్యోధనుని రావణుని నాయకత్వమును మరువరాదు. అధర్మమునకు ఎప్పడో ఒకప్పుడు పతనము తప్పదు. కాన ధర్మమూర్తి యగు శ్రీకృష్ణ భగవానుని నాయకత్వము, పవిత్ర ధర్మబోధలు చిరస్మరణీ యము.

దేశాభ్యుదయమునకు, వ్యక్తి శాంతికి, లోక శాంతికిగూడ ధర్మ జీవితమే తప్పక తోడ్పడును. పుట్టినది మొదలు గిట్టునంతవరకు ధర్మ విజయమే మనకు శ్రీకృష్ణుడు అనుష్టించి చూపెను. ప్రస్తుత మన భారత ప్రభుత్వము గూడ, రామరాజ్యమును, ధర్మ రాజ్యమును అనుష్టించుచు, పవిత్ర భారతా వని క్షేమమునకు, ప్రపంచ శాంతికి తోడ్పడుగాక !

**(శాంతి సెప్టెంబర్ 1969)**

ఆదౌ దేవకీ గర్భ జననం, గోపీ గృహే వర్ధనం
మాయాపూతన జీవితాపహరణం, గోవర్ధనోద్ధారణం
కంసచ్ఛేదన కౌరవాదిహననం, కుంతీసుతా పాలనం
యేతద్భాగవతం పురాణకథితం, శ్రీకృష్ణ లీలామృతం
ఏకశ్లోకీ భాగవతం

శ్రీపరమాత్మ ఈ భారత భూమియందు, లోక సంగ్రహార్థం గీతలో ఈ దిగువ చెప్పిన ప్రకారం మానవ స్వరూపముతో అవతరించిరి.

యదా యదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత
అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్
పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్
ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే

ద్వాపరయుగములో శ్రీ పరమేశ్వరుడు యిట్లు అవతరించినపుడు, రాక్షస దుష్టశక్తులు విజృంభించి యున్నవి. అప్పుడాయన పూతన, కంసుడు, నరకాసురుడు, జరాసంధుడు మొదలగు ఎందరో దుష్టులను రూపుమాపి ప్రజలకు క్షేమము, శాంతిని చేకూర్చెను.

నైనం ఛిందంతి శస్త్రాణి నైనం దహతి పావకః
నచైనం క్లేదయంత్యాపో న శోషయతి మారుతః
భగవద్గీత 2-23

మనము శరీరము మాత్రము కాదనియు, ఎన్నడు నశించని దహింప బడని, తడుపబడని, సంహరింప వీలుపడని, ఆత్మలమే ననియు గ్రహించి, శారీరక, తాదాత్మ్య మును విడిచి పవిత్ర ఆత్మతో సదా తాదాత్మ్యనొందుటను అభ్యసింపవలెను.

యుక్తా హార విహారస్య యుక్తచేష్టస్య కర్మసు
యుక్త స్వప్నావ బోధస్య యోగోభవతి దుఃఖహా భగీ. 6-17

జీవితములో యుక్తాహార విహారముల విలువను గుర్తించి ఆరోగ్యముగ నుండి శ్రీ పరమేశ్వరుని తెలుసుకొనుటకు, మనకీ జన్మయనియు, శరీరము నిల్పుకొనుటకే భుజించడముగాని, భోజనాది భోగముల ననుభవించుటకే యీ పవిత్ర మానవజన్మ మనకు దైవముచేత ప్రసాదింప బడలేదని సర్వులము గ్రహించెదము గాక !

ఈశ్వరః స్వర్వభూతానాం హృద్దేశేర్జున తిష్ఠతి
భ్రామయన్ సర్వభూతాని యన్త్రారూఢాని మాయయా ॥

భగవద్గీత 18-61

మన పవిత్ర హృదయమే పరమేశ్వరునికి నివాస స్ధానమనియు, సత్యము ధర్మము ప్రేమయు, నిజమైన దైవ స్వరూపముగ గ్రహించి, నిత్య జీవితములో వాటిని అనుసరించుము. అసురీ సంపత్తులను నెమ్మది నెమ్మ దిగా విడిచి, దైవీ సంపత్తులను సదా అలవాటు చేసుకొనుటయే నిజమైన గీతాపారాయణ. కాలము యొక్క విలువను గ్రహించి, సర్వదా నిష్కామ సేవచేస్తూ సాధన చేయవలెను.

సత్కర్మ, సదా భక్తి జ్ఞానయోగములలోనికి తీసుకువెళ్ళి మనలను స్థిత ప్రజ్ఞులనుగా జీవన్ముక్తులనుగా చేయునను పూర్ణ విశ్వాసముతో అహర్నిశ ములు, మానవజన్మ పరమావధిని చేరి తరించుటకు, నిరంతర సాధన చేయవలసి యుండునననునది జ్ఞప్తియందుంచుకొనవలెను.

బహూనాం జన్మనామన్తే జ్ఞానవాన్మాం ప్రపద్యతే
వాసుదేవః సర్వమితి సమహాత్మా సుదుర్లభః॥ భగీ. 7-19

శ్రీకృష్ణ లీలలు స్మరించుచు ఆయన సంకల్ప మాత్రముచేత ప్రతి సృష్టి చేసిన విషయము గుర్తుంచుకొని, సర్వము వాసుదేవ మయం జగత్తను నది మరువరాదు.

ఈకాలములో నిజమైన దుష్టశక్తులేవి ? అన్యాయార్జితము చేత ధనికులై మధాంధ కారముచేత ధర్మానుష్ఠానమును మరచినవారు, సప్త వ్యసనములకు అతి దూరముగ నుండవలసినదానికి బదులు, అదివరలో లేని దురలవాట్లు లకులోనై, పాశ్చాత్య వ్యామోహితులై సాంగత్య దోషముచేత, ఇతరులనుగూడ దుష్ట ప్రవర్తనులనుచేసి భ్రష్టులను చేయువారు, మూగజంతువులేగాక, సాటి మానవులు ఆకలి దప్పికలతో మలమలమాడుచు, కట్టుకొనుటకు బట్ట వసించుటకు ఇల్లులేక కృశించి పోవువారిని చూచి, కొంచెమైనను జాలి చెందక, యావత్తుకాలము ఇతరుల

ఆస్తులను అనేక మాయోపకారణము లచే, తమదిగ చేసుకొనుచు పాప భీతిలేక, ధనమును సద్వినియోగము చేయక ఇంకను అమితముగ కూడబెట్టుచు, నక్సలైటులు వగైరా పేర్లతో, సంఘములో శత్రువులను తమకు తెలియక తామే సృష్టి చేయుచు ఆదర్శ ప్రాయముగ పెద్ద జీతములు పుచ్చుకొనుచు,ఉద్యోగములు చేయుచు, విద్యా వంతులు లోకక్షేమమునకు తోడ్పడుటకు బదులు లోకకంటకులగు చున్నారు. ఇట్టి దుష్టశక్తుల నిర్మూలమునకు ప్రతివారు నిత్యం ప్రయత్నించాలి.

ఈ పవిత్రమైన భారతభూమిని తిరిగి పునరుద్ధరింపవలెనంటె, ప్రతి భారతీయుడు శ్రీకృష్ణభగవానుడు సర్వకాలములందు గీతలో చెప్పినట్లు, ఎట్లు తాను జీవితమంతయు అనుష్టించి ఆదర్శమైన జీవితమును చూపెనో ఈ పవిత్ర జయంత్యోత్సవ జ్ఞాపకముగ మనము గూడ అట్లు నిత్యము 'సత్యమేవ జయతే' అని ప్రతిజ్ఞ పూని జీవితమును గడుపవలెను.

పరమాత్మ ధర్మమూర్తిగా రధసారధియై విజయునికి ధైర్య సాహసముల నిచ్చి, నిర్భయముగ ఆతతాయిలను (పాపులను) నిర్మూలనము చేయించెను. అట్లే మనలోని అంతర్య దుష్టతలంపులను శత్రువులను, ఆత్మ ధర్మబలముచే సత్సాంగత్యముచే నిరంతర సాధనచే నిర్మూలింప చేసుకొనుటకే మనకీ మానవ జన్మ యీ పుణ్య(కర్మ) భూమియందు, ప్రసాదింపబడెను గాన యీ పవిత్ర మానవ జీవిత విలువను ప్రతివారు గ్రహించి, ధన్యము చేసుకొనుటకు సదా ప్రయత్నించవలెను.

ఉద్ధరేదాత్మనా త్మానం నాత్మాన మవసాదయేత్
ఆత్మైవ హ్యాత్మనో బన్ధురాత్మైవ రిపురాత్మనః॥ భగీ 6-5

మనకు నిజమైన శత్రువు, మనకు స్వాధీనముగాని మన యింద్రియ ములే. మన మనస్సే.

కృష్ణ వాసుదేవ కేశవ పరమాత్మ
యప్రమేయ హరి వరద ముకుంద
నిన్ను జూడ గంటి నీ కృప గనుగంటి
నఖిల సౌఖ్య పదవులందగంటి

శ్రీకృష్ణా! యదుభూషణా! నరసఖా! శృంగార రత్నాకరా!
లోకద్రోహినరేంద్రవంశ దహనా లోకేశ్వరా ! దేవతా
నీక బ్రాహ్మణ గోగణార్తి హరణా! నిర్వాణ సంధాయకా!
నీకున్ మ్రొక్కెద ద్రుంపవే భవలతల్ నిత్యానుకంపానిధీ !

ఈ శుభదినమున, పవిత్రగీత అంతరార్థమును, జ్ఞాపకము చేసికొని, బ్రహ్మ జ్ఞానముతో ప్రతి భారతీయుడు ఆదర్శ భారతీయుడుగ జీవించుటకు, ఆ భగవానుని అనుగ్రహము వలన, ప్రయత్నించవలసి యుండును.

ఓం శాంతిః శాంతిః శాంతిః

**(శాంతి - ఆగస్టు 1970)**

శ్రావణమాసంలో బహుళపక్ష అష్టమిరోజున రోహిణి నక్షత్రమున భగవంతుడు మధురలో కారాగృహమున, మానవ రూపమున దేవకీ వసు దేవులకు అష్టమ బిడ్డగా జన్మించిరి. జన్మించిన వెంటనే వారి తల్లిదండ్రు లకు తమ నిజ స్వరూపమును జూపగా వెంటనే వారి సంకెళ్ళు విడిపోయెను. చెరసాల ద్వారములు వాటంతటవియే తెరవబడెను. దైవాజ్ఞ ప్రకారమే వసుదేవుడు ఆ బిడ్డను తీసుకొని రేపల్లెకు బయలుదేరగా యమునా నది రెండుగా చీలి మార్గమిచ్చెను. నదిని దాటి నందుని భార్య యశోద వద్దకు వెళ్లి ఆమె నిద్రించుచుండగా శ్రీకృష్ణుని ఆమె చెంత పరుండబెట్టి ఆ రాత్రియే ఆమెకు ఆడశిశువుగా జన్మించిన, ఆమె ప్రక్కలోయున్న యోగమాయను తీసుకువచ్చి దేవకీదేవి యొద్ద పరుండబెట్టెను.

మాయచే వెంటనే మరల వారు సంకెళ్లచే బంధింపబడిరి. కారాగృహ ద్వారములు తిరిగి వాటంతటవియే మూయబడెను. అంతట పసిబిడ్డ ఏడ్వగా పహరా వారులేచి, వెంటనే కంసుని యొద్దకు పరుగెత్తి దేవకీదేవి ప్రసవించె నని చెప్పిరి. కంసుడు వెంటనే వచ్చి ఆ బిడ్డను చంపబోగా, దేవకీదేవి అడ్డుపడి, మగపిల్లవాడు కాదు, ఆడ బిడ్డ గాన చంపవలదని ఎంత వేడినను వినక కత్తితో నరక ప్రయత్నించగా ఆ బిడ్డ ఆకాశములోనికి ఎగిరి పోయి నిన్ను చంపువాడు వేరుగా పెరుగుచున్నాడని చెప్పి అంతర్ధాన మయ్యెను.

శ్రీకృష్ణుడు రేపల్లె, బృందావనములలో, దుష్టశిక్షణ, శిష్టరక్షణకై యెన్నియో లీలలు చూపెను. గాని ఆయన నిజస్వరూపమును ఎవరూ తెలుసుకోలేకపోయిరి.

అవజానన్తి మాం మూఢాః మానుషీం తమమాశ్రితమ్

పరం భావమజానన్తో మమభూత మహేశ్వరమ్ ॥ భగీ. 9-11

అవివేకులు సర్వాంతర్యామియైన భగవంతుని లీలలను తెలుసుకొనలేక, ఆయన మానవుడేయని భ్రమించినారు. ఆయన ఏడవ ఏటనే గోవర్ధనగిరిని చిటికెనవ్రేలితో ఎత్తి గోవులను గోపకులను వారం రోజులు గొప్ప వర్ష బాధ నుంచి సంరక్షించెను. గోపాలుని మహిమను తెలుసుకొనలేక 'బ్రహ్మ' పెద్ద గుహలో గోవులను, గోపాలురను దాచినపుడు, తన సంకల్పమాత్రము ననే ఈ సృష్టి, అంతయు ఏర్పడెనని ఋజువు చేయుటకు, వేరుగా గోవులను, గోపాలురను సృష్టించెను. దరిమిలా బ్రహ్మ శ్రీమన్నారాయణుడే శ్రీకృష్ణ రూపము దాల్చెనని తెలుసుకొనెను. ఆయన 11వఏటనే భక్తులైన గోపికలతో రాసక్రీడలు జరిపెనను సత్యమును తెలుసుకొనలేక, కొందరు మూఢులు శ్రీకృష్ణుడు జారుడు చోరుడు అని చాల తెలివితక్కువగ విమర్శించెదరు. శ్రీకృష్ణుని మురళిగానం ఎందరో గోపికలను అద్భుతంగా ఆకర్షించెను. ఇట్లు ఆకర్షించుటకు మురళిజేసిన పుణ్యమేమనివారు ప్రశ్నించగా, అది తనలో అంతయు

కాళీయే యనియు గర్వాహంకార రహితమైన కాళీగొట్ట మును భగవానుకి సర్వార్పణము చేసుకొంటిననియు వినయముతో వారికి మనవి చేసెను. గాన, శ్రీ పూజ్య స్వామీజీ తరచు చెప్పుచున్నట్లు, మనము గూడ మనలోని అసురీ సంపత్తును పాపపు చింతనలను పూర్తిగా విడనాడి, దైవీ సంపత్తును అభివృద్ధి చేసుకొని, మన హృదయములను పవిత్రవంత ముగా చేసుకొన గల్గినప్పుడే, ధర్మ స్వరూపియగు పరమాత్మ దానిలో నివసించి పార్ధుని రధములో కూర్చుని సారధ్యం చేసినట్లు మనలను కూడ సక్రమ మార్గములో నడుపుదురని మురళీ చెప్పిన సందేశమును, పూజ్యశ్రీ స్వామీజీ సదా మనకు జ్ఞాపకము చేయుచుందురు.

జగద్గురు శ్రీ ఆదిశంకరాచార్యులు వారి భజగోవింద శ్లోకములలో ఇట్లు శలవిచ్చిరి.

గేయం గీతానామ సహస్రమ్
ధ్యేయం శ్రీపతిరూప మజస్రమ్
నేయం సజ్జన సంగేచిత్తం
దేయం దీన జనాయ చ విత్తమ్ ॥ భజ॥ 27 శ్లో.

భగవద్గీతా కించి దధీతా
గంగాజల లవకణికా పీతా
సకృదపి యే న మురారి సమర్చా
క్రియతే తస్య యమేన న చర్చా॥ భజ॥ 20 శ్లో.

నమే పార్థాస్థి కర్తవ్యం త్రిషు లోకేషు కించన
నానవాప్త మవాప్తవ్యం వర్త ఏవ చ కర్మణి. భగీ 3-22

అర్జునా ! నాకీ మూడు లోకములలో చేయదగిన కార్యమేదియు లేదు. పొంద దగినదియు, పొందనట్టిదియు వస్తు వేమియు లేకపోయినను నిత్యము నేను కర్మ చేయుచునే యున్నాను. అని చెప్పి చేసి చూపించెను శ్రీకృష్ణ భగవానుడు. అందుకు కొన్ని ఉదాహరణలు –

**పని :** సోమరిపోతులకు తినుటకు హక్కులేదు. భగవానుడు త్రిలోకాధి పతియైనను ఒక్క క్షణమైనను వృధా చేయలేదు. 'యధారాజా తధా ప్రజా' అనినట్లు తాను పనిచేయకుండా ఒక్క క్షణమైనను వృధా చేసిన యెడల ప్రజలు తనను అనుకరించి సోమరులు అగుదురని చెప్పిరి.

అన్ని పనులు గౌరవమైనవని, గుఱ్ఱములు కడుగుట, దానా పెట్టుట, రధమును తోలుట, అతిధుల కాళ్ళు కడుగుట, భోజనము చేసిన తరువాత విస్తళ్ళు ఎత్తుట, వగైరా ఎన్నో పనులను స్వయంగా చేసి ఆదర్శమూర్తి యయ్యెను.

**భక్తి :** పత్రం,పుష్పం,ఫలం,తోయం అని ఏది లభ్యమైన దానిని భక్తితో సమర్పించమనిరి. విలువ గల వాటిని ఆయన కోరలేదు. కుచేలుడు చాల భక్తితో సమర్పించిన అటుకులు ఆయన ఎంతో ప్రీతితో స్వీకరించిరి. దానికి ప్రతి ఫలముగ కుచేలునకు ఐశ్వర్యములను ప్రసాదించిరి.

**నిరంతర స్మరణ :** తన నామమును నిరంతరము స్మరణ చేయువారి యోగక్షేమ భారము వారు వహించిరి. ద్రౌపది జీవితంలో అనేక పర్యాయ ములు ఆమె మాన సంరక్షణ (వస్త్రాపహరణలో) చేయుటయేగాక అనేక ఆపత్తులలో స్మరించినంత మాత్రముననే ప్రత్యక్షమై అత్యద్భుతంగా తోడ్పడిరి.

**అద్భుత సహనం :** శమంతకమణిని తనకివ్వలసినదని కోరినపుడు సత్రాజిత్తు నిరాకరించెను. ఆ మణిని తాను పోగొట్టుకొనినపుడు శ్రీకృష్ణుడే అపహరించెనని అపవాదు వేసెను. ఇందులకు శ్రీకృష్ణుడెంత మాత్రము ఆగ్రహపడక ఆ మణి ఉన్నచోటును గ్రహించిదానిని తీసికొనివెళ్లి సత్రాజిత్తు నకు అప్పగించి అద్భుత సహనం చూపెను.

శిశుపాలుని తల్లి వరము కోరగా, ఆమెపుత్రుడు చేయు అపరాధములు ప్రతిరోజు నూరువరకు క్షమించెదననిరి. రాజసూయయాగ సందర్భములో ఆయన తిట్లు నూటికి మించిన తరువాతనే తన పళ్ళెము చక్రముగ ఉప యోగించి, శిశుపాలుని వధించి ఆయన ఆత్మను తనలో లీనము చేసికొనిరి. ఎంతమందికో గర్వభంగం చేసి, వారి లోపములను వారికి తెల్పి, వారు ఆధ్యాత్మికముగా అభివృద్ధి పొందుటకు తోడ్పడెను.

మానవునిలోనే మాధవుడుండెనను సత్యమును గ్రహించి మనమెవరికి సేవచేసినను దైవసేవగా భావించిచేయుట అలవాటు చేసుకోవలెను. శ్రీకృష్ణ పరమాత్మను, అందరు బాగుగా అర్ధము చేసుకొనవలసిన అవసరం ఎంతై ననూ వున్నది. శ్రీకృష్ణుడు యుద్ధములో అస్త్ర శస్త్రములను పట్టననిచెప్పినను, అర్జునుడు ఆయన సహాయమునే ఎందుకు కోరెనో మనము గ్రహించవలెను. ఎన్ని మారణాయుధములున్నను, భగవంతుని సహాయమునకు మించినవి కావని నిరూపించబడినది.

యజ్ఞ శిష్టా శినఃస్సన్తో ముచ్యన్తే సర్వకిల్బిషైః
భుఞ్జతే తే త్వఘం పాపాః యే పచంత్యాత్మ కారణాత్॥భగీ 3-13

యజ్ఞమునందు భగవదర్పణముచేసి మిగిలిన పదార్థమునే తినవలెను. అట్లు కాక, ఎవరు తమనిమిత్తమే వండుకొని భుజించుచున్నారో అట్టివారు పాపమునే పచనముచేసి తినువారగుచున్నారని గీతలో భగవానుడు శలవిచ్చెను. మన పవిత్రమైన భారతదేశము, ఇట్టి పవిత్ర ధర్మయుతమైన, ఆదర్శములతో నడుపబడినంత కాలము, ప్రతి ఇంట పాడి పంటలు, సమృద్ధిగా నుండెడివి. ఆనాడు ఇతర దేశముల నుండి

ఆహారపదార్ధముల నెన్నడు అర్థించలేదు. గాన, ఈ పుణ్యదినము జ్ఞాపకార్ధముగ, మన పవిత్ర జీవితాదర్శములను మరువక మానవ గమ్యస్థానము చేరుటకు ప్రయత్నించ వలెను.

ఓం శాంతిః శాంతిః శాంతిః

**(శాంతి – ఆగస్టు & సెప్టెంబరు 1973)**

'ఆత్మవత్ సర్వ భూతాని' అను మన ఆర్య ధర్మమును మనము ఆచరణలో పెట్టుకొనగలిగిన మనకెవరూ ఈ ప్రపంచములో శత్రువులు వుండరు. అంతయు భగవంతుడు మనలోయుండి చేయించు చుండెను. మనము ఆయన చేతిలో వట్టి పనిముట్లము మాత్రమే అను సత్యమును గ్రహించి అహంకారమును పూర్తిగా నశింపుచేసుకొని, సర్వదా జ్ఞాపకం చేసుకొని జీవించగలిగిన మన జీవితములు తప్పక ధన్యవంతములగును. మన జీవిత పరమార్ధమును చూపిన కృష్ణపరమాత్మకు ప్రణతు లర్పింతము కాక !

సీ. శంపాలతిక తోడి జలదంబు కైవడి
మెరుగుటొల్లియ తోడి మేనివాని
గమనీయ మృదులాన్న కబళ వేత్ర విషాణ
వేణు చిహ్నంబుల వెలయువాని
గుంజావినిర్మిత కుండలంబులవాని
శిఖిపింఛవేష్టిత శిరమువాని
వనపుష్ప మాలికా వ్రాతకంఠమువాని
నలిన కోమల చరణములవాని

ఆ. గరుణ గడలు కొనిన కడగంటవాని గో
పాలు బాలు భంగి బరగువాని
నగు మొగంబువాని ననుగన్న తండ్రిని
నిను భజింతు మ్రొక్కి నీరజాక్ష ॥

భాగవతం 10స్కం(పూర్వ)ప. 548

ఓం శాంతిః శాంతిః శాంతిః

**(శాంతి – ఆగస్టు & సెప్టెంబరు 1974)**

వైకుంఠములో ద్వారపాలకులుగ నున్న జయవిజయులు శాపగ్రస్తులై మూడు జన్మలలో దైవ విరోధులుగ నుండి శాప విమోచనము పొందిరి.

మొదటిజన్మ : హిరణ్యాక్షుడు, హిరణ్యకశిపుడు

రెండవజన్మ : రావణ, కుంభకర్ణులు

మూడవజన్మ : శిశుపాల దంతవక్త్రులు

శ్రీకృష్ణభగవానుడు శిశుపాలుని ఎట్లు సంహరించినది ఆయన ఆత్మ శ్రీకృష్ణ పరమాత్మలో ఎట్లు లీనమైనది రాజసూయ యాగమున కేతెంచిన మహనీయులందరు ధర్మరాజు భీష్ముని సమక్షములో తిలకించ గలిగినారు.

చిన్నతనంలోనే కంసుని వధించి, ఆయన తండ్రి ఉగ్రసేనుని చెరసాల నుండి విడిపించి మధురకు రాజుగ చేయగలిగిరి. తాను రాజుగ నుండుట కెన్నడు అంగీకరించలేదు. సత్యభామ సహాయముతో నరకాసురుని వధించి ఆయన కుమారుని పట్టాభిషక్తుని చేసెను. భూదేవి కోరికపై ప్రతి సంవత్సరం నరకచతుర్దశినాడు నరకాసుర వధ జ్ఞాపకార్ధముగ దీపావళి పండుగ జరుపు కొనుచున్నాము. జరాసంధుని భీమునిచేత చంపించి ఆయన కుమారుని రాజుగాచేసి, అనేకమంది రాజులను చెరసాల నుండి విడుదల చేయించిరి. భక్తుల నెందరినో కాపాడిన విషయము లోకవిదితమే. మణి కుబేరుల నృగమహారాజులను శాపవిముక్తులుగ చేయలేదా ? దుర్యోధనునిచే పంప బడిన దూర్వాస మహర్షి కోపజ్వాలల నుంచి పాండవులను వనవాసములో అత్యద్భుతంగా కాపాడలేదా ? ముచకుందుని కోప వీక్షణచేత కాలయవనుని భస్మము చేయించ లేదా ?

ఆధ్యాత్మికాభివృద్ధికి అసూయ,గర్వము, అహంకారము కానరాని ఆటం కములు. వాటిని నిర్మూలము చేసి వారందరు తరించుటకు తోడ్పడెను. ఎందరి గర్వమునో అణచివైచెను. సత్యభామ,నారదుడు, అర్జునుడు మొదలైన వారి నెందరినో సక్రమమైన మార్గములో బెట్టి అనుగ్రహించ గలిగిరి.

ద్రోణాచార్యుని పుత్రుడు అశ్వద్ధామ ఉపపాండవుల నందరిని సంహ రించి చివరకు ఉత్తర గర్భంలోనున్న శిశువుని కూడా తన బ్రహ్మ శిరోస్త్ర ముతో చంపడానికి ప్రయత్నించగా శ్రీకృష్ణ భగవానుడు అనుగ్రహించి పరిక్షిత్‌ను కాపాడి పాండవ వంశమును నిలబెట్టెను. ఆ పరిక్షిత్ మహారాజు ద్వారానేగదా లోకమున కంతయు భాగవతమును వినిపించెను. ఆ పరిక్షిత్ మహారాజు ఏడు రోజులు నిద్రాహారములు లేక, భాగవతములో హరి లీలలు విని తరించగల్గెను.

ఎంతటి పాపియైనను తాను చేసిన పాపములకు పశ్చాత్తాపపడి, ముందెన్నడు పాపములు చేయనని బద్ధకంకణుడైన యెడల, తప్పక రక్షింప బడునని శ్రీకృష్ణుడు ప్రతిజ్ఞ చేసెను. ఈ ప్రపంచములో ఏ మూర్తిని పూజించి నను భక్తి, శ్రద్ధ, విశ్వాసములతో భజించిన యెడల తనకే జెందునని కూడ అభయహస్తమిచ్చిరి. నదులన్నియు ఎటు ప్రవహించినను సముద్రము లోనే చేరునట్లు– పరమాత్మ యొక్కడే గాన తనకే చెందునని కూడ స్పష్టముగ చెప్పిరి. భగవానుని లీలలు అర్ధం చేసుకొనుట అంత సులభము కాదు. గాన, తొందరపడి అపార్ధము జెందక యదార్ధ జ్ఞానము పెద్దల ద్వారా తెలుసుకొని, సర్వ సందేహములు నివృత్తి చేసుకొని మానవులు దానవులుగా దిగజారిపోక దైవత్వము సంపాదించుటకు నిరంతరం సాధన చేయవలసి

వుండును. పరమాత్మ అనుగ్రహం చేత ఈ జన్మలోనే భక్తులు తరించుటకు తీవ్ర ప్రయత్నం చేసి ఆయన అనుగ్రహామునకు పాత్రులయ్యే దరు గాక !

లోకాసమస్తా సుఖినోభవంతు !

**(శాంతి - సెప్టెంబర్ & అక్టోబర్ 1975)**

సాధుసంరక్షణకొరకు- దుష్ట సంహారము కొరకు, ధర్మసంస్థాపన కొరకు యుగయుగమున నేను పుట్టుదును. అని భగవానుడు గీతలో స్పష్ట ముగ చెప్పెను. మహా భారతయుద్ధములో ధర్మవర్తనులగు పాండవులకు అనేక విధముల అద్భుతముగ సహాయం చేసెను. కర్ణుడు దేవేంద్రుని వద్ద తన కవచకుండలములకు బదులుగా సంపాదించిన శక్తి బాణమును అర్జునినిపై ప్రయోగించకుండా ఘటోత్కజుని సంహరించుటకు విధి లేక ప్రయోగించినందున అర్జునుని ప్రాణము కాపాడబడుట కృష్ణ కృపయే.

తన ప్రియ కుమారుడు అభిమన్యుని అక్రమముగా వధించిన సైంధ వుని సూర్యాస్తమయంలోపున సంహరింపజాలని యెడల తనే ఆత్మహత్య చేసికొందునని అర్జునుడు ప్రతిజ్ఞ చేసినందున, శ్రీకృష్ణుడు తన దివ్యశక్తిచే సూర్యుడస్తమించినట్లు చూపగా, అంతవరకు దాగియున్న సైంధవుడు సంతోషముతో తల పైకెత్తి చూడగా, అర్జునుడు అది చూచి తన పాశుపతాస్త్ర ముతో సైంధవుని తలను ఖండించి, శ్రీకృష్ణుని ఆదేశానుసారము ఆ తలను క్రిందపడనీయక సైంధవుని తండ్రి ఒక అరణ్యములో తపస్సు చేసుకొను చుండగా, వాని దోసిలిలో ఈ శిరస్సు పడునట్లు అర్జునుడు తన అస్త్ర నైపుణ్యముతో బంతివలె ఎగురవేయుచు అచ్చటకు పంపెను. అప్పుడాతడు తన చేతులలో పడిన పుర్రెను క్రిందపడవేయగా ఆతని తల వెయ్యి వ్రక్కలై తన శాపము తనకే తగిలి వెంటనే మృతి చెందిన గొప్ప గాధ భారతములో గలదు. శ్రీకృష్ణభగవానుని సహయమెంత అమోఘమైనచో ప్రతివారు గ్రహింప గలరు.

ఎచ్చుట దుష్టుల వలన సత్పురుషులకు హాని గల్గుచున్నను ఎచ్చుట ధర్మ విరుద్ధమైన పనులు జరుగుచున్నను, అచ్చుటచ్చుట తాను స్వయంగా సంహరించియు, భీమార్జునులు మొదలగు వీరులచే సంహరింపజేసియు, భగవానుడు ధర్మ రక్షణ గావించెను.

శ్రీకృష్ణుడే ఈ ప్రపంచమంతయు వివిధ నామ రూపములతో నిండి యుండెనని తెలుసుకొని విశ్వప్రేమ అలవర్చుకొనవలసి యున్నది. అప్పుడు లోకమంతయు శాంతిమయ మగును.

ఓం శాంతిః శాంతిః శాంతిః

**(శాంతి - సెప్టెంబరు 1979)**

శ్రీకృష్ణుడు పూర్ణావతారమనియు అవతారములకు అవతారమని చెప్పబడు చున్నారు.

శ్లో॥ అథవా బహునైతేన కిం జ్ఞాతేన తవార్జున ।
విష్టభ్యాహ మిదం కృత్స్న మేకాంశేన స్థితో జగత్ ॥
భగీ. 10-42

పవిత్రమైన భగవద్గీత పదియవ అధ్యాయంలో ఆయన విభూతు లన్నియు స్పష్టముగా జెప్పి, చివరకు ఈ ప్రపంచమంతయు ఆయన ఒక అంశ మాత్రమేననిరి. ఈ విశాల ప్రపంచమంతయు ఆయన యొక్క అంశ మాత్రమే యైన యెడల వారి పూర్ణస్థితిని ఎవరికి వూహించుటకు తరమగును?

11వ అధ్యాయంలో అర్జునిని యందు భగవానునికి గల అమితప్రేమ చేత, శ్రీవారి విశ్వరూపం జూపిరి. ఈ దివ్య దర్శనం అదివరకు ఎవరికి, ఎన్నడు జూపబడలేదని కూడ స్పష్టముగ జెప్పిరి. మహావీరుడైన అర్జునుడు ఈ విశ్వరూపం జూచి, చాల భయపడిపోయి, అనేక విధములుగ పరమా త్మను, స్తవంజేసి, వేడుకొని సహజ రూపమును జూపమని ప్రాధేయపడగా ఆయన ఎంతో ప్రేమతో జూపించెను. చాలాకాలంగా అర్జునుడు శ్రీకృష్ణ నితో, కలసిమెలసి ఉన్నవాడై నను, విశ్వరూప సందర్శనము జరిగినప్పటి నుంచియే, ఆయన సామాన్యుడు కాదని భగవంతుడని స్పష్టముగ తెలుసుకొనగలిగెను.

శ్రీకృష్ణ భగవానుడు పుట్టినది మొదలు చివరి వరకు ధర్మస్థాపనయే చేసిరి. ఆంగ్ల భాషలో ధర్మం అను పదమునకు సరియైన పదము లేనందున ధర్మమనే వాడవలసి వచ్చును. అచ్చట ధర్మం లేదుగాన, దానికి సరియైన పదం కూడ లేదు. ఈ ప్రపంచములో ధర్మమునకు పుట్టినిల్లు, పవిత్రమైన భారతదేశము. ధర్మము విలువ ఎరిగినవారు, ఇచ్చట జన్మించెదరు. ప్రపంచ మంతయు ఏకీభవించి వచ్చినను, ధర్మమునకే జయము. గాన ధర్మమును, సత్యమును ప్రతి భారతీయుడు విస్మరింపరాదు.

ఓం శాంతిః శాంతిః శాంతిః

**(శాంతి - ఆగస్టు 1981)**

శాంతి ఆశ్రమము దాని శాఖలు దేశాభ్యుదయమునకు,క్షేమమునకు, చేయ వలసిన బాధ్యతలు చాలావున్నవి. నిరాడంబర జీవితము గడుపుటకు ధనం అవుసరం లేదు. పదవులు అవసరంలేదు. సద్గుణము ముఖ్యము. శీలం చాలా అవసరం. ఇవియే నిజముగా శాంతినిచ్చునవి. వరకట్నములు మన పవిత్ర దేశమునకు అనర్థమును అపకీర్తిని ప్రస్తుతం తెచ్చిపెట్టుచున్నవి. “అప్పుచేసి పప్పుకూడు తిను” అను సామెత వున్నది. జీవించుటకు మాత్రమే తినుట అభ్యసించాలి. తినుటకొరకే జీవించుట యను అభిప్రాయం మంచిదికాదు. మంచి అభిప్రాయములు మంచి ఆశయములు వ్యాప్తిలోనికి రావలసి యున్నవి.

# 4. గీతా జయంతి సందేశముల సారాంశము

మహాభారతములో 18 పర్వములున్నవి. భారతయుద్ధము 18 దినములు జరిగినది. అందులో18 అక్షౌహిణుల సైన్యము (11అక్షౌహిణులు కౌరవుల తరుపున 7 అక్షౌహిణులు పాండవుల తరుపున) పాల్గొన్నది. పవిత్రమైన భగవద్గీత భగవానుని ముఖతః 18 అధ్యాయములుగా వెలవడినది. అందులో 6 అధ్యాయములు కర్మషట్క మనియు, 6 అధ్యాయ ములు భక్తిషట్కమనియు, ఆఖరి 6 అధ్యాయములు జ్ఞానషట్క మనియు పిలువబడు చున్నవి.

సృష్టి ప్రారంభముననే భగవంతుడు సూర్యునికి ఈ పవిత్ర ధర్మమును బోధించెనట. ఈ సనాతన ధర్మము ప్రపంచమున కంతకు వర్తించును. దీని నుండియే మతములన్నియు శాఖలుగా బయలుదేరినవి.జొరాష్టరు ద్వారా పారశీకుల జొరాష్టమతము, బుద్ధుని ద్వారా బౌద్ధ మతము, ఏసుక్రీస్తు ద్వారా క్రైస్తవ మతము, మహమ్మదు ద్వారా మహమ్మదీయ మతము. ఇట్లే ప్రపంచ ములో ఆయా ప్రవక్తల ద్వారా ఆయా మత సిద్ధాంతములు బోధింపబడినవి.

ఈ శతాబ్దములో శ్రీశాంతి ఆశ్రమం ద్వారా పూజ్యశ్రీ ఓంకార స్వాముల వారు, విశ్వమతచిహ్నము ద్వారా, మత సమన్వయము నిరూపింప బడుటకు మతములన్నియు వేరుగా యున్నను, ఒక్కడే దైవమనియు, మన మందరము ఆ దైవ బిడ్డలమే యనియు, భగవంతుడు, సత్య, ధర్మ, ప్రేమ స్వరూపిగాన లోకములోయున్న జనులందరూ ఏ జాతికి చెందినను, ఏ భాష మాట్లాడుచున్నను, సర్వమానవ సౌభ్రాతృత్వముల ననుసరించవలసిన దనియు, సుమారు 60 సంవత్సరముల నుండి, శాంతి(తెలుగు), పీస్ (ఆంగ్లము) పత్రికల ద్వారా ప్రపంచమునకంతకు తెలియజేయు చున్నారు. ఈ ఆశ్రమము అంతర్జాతీయ శాంతి కేంద్రము.

భగవద్గీత భగవంతుడు స్వయముగా చెప్పినదిగాన దీనిని మించిన పవిత్ర గ్రంథము ఈ లోకములో లేదు. 2వ అధ్యాయములో 22-27 శ్లోకములు, 9వ అ. 27-28-30-31 శ్లోకములు, 16వ అధ్యా. 21శ్లో. ముఖ్యముగా సదా స్మరించవలెను.

వాసాంసి జీర్ణాని యథావిహాయ నవాని గృహ్ణాతి నరోపరాణి ।
తథా శరీరాణి విహాయ జీర్ణాన్యన్యాని సంయాతి నవాని దేహీ॥ 22

తా. మానవుడు జీర్ణవస్త్రములను త్యజించి, నూతన వస్త్రములను ధరించినట్లు జీవాత్మ పాత శరీరములను వీడి నూతన శరీరములను పొందును.

నైనం ఛిందంతి శస్త్రాణి నైనం దహతి పావకః।
న చైనం క్లేదయంత్యాపో న శోషయతి మారుతః॥ 23

తా. ఈ ఆత్మను శస్త్రములు ఛేదింపజాలవు. అగ్ని దహింపజాలదు. నీరు తడుపజాలదు. వాయువు ఆరిపోవునట్లు చేయజాలదు.

అచ్ఛేద్యో యమదాహ్యో యమక్లేద్యో శోష్య ఏవ చ ।

నిత్యః సర్వగతః స్థాణురచలోయం సనాతనః॥ 24

తా. ఈ ఆత్మ ఛేదించుటకును, దహించుటకును, తడుపుటకును, శోషింపజేయుటకును సాధ్యము కానిది. ఇది నిత్యము. సర్వవ్యాపి, చలింప నిది (అచలము) స్థాణువు (స్థిరమైనది) సనాతనము. (శాశ్వతము)

అవ్యక్తో యమచింత్యో య మవికార్యో యముచ్యతే ।

తస్మాదేవం విదిత్వైనం నానుశోచితు మర్హసి ॥ 25

తా. ఈ ఆత్మ అవ్యక్తమైనది (ఇంద్రియ గోచరముగానిది) అచింత్యము (మనస్సునకును అందనిది) వికారములు లేనిది. దీనిని గూర్చి ఇట్లు తెలుసుకొనుము. కనుక ఓ అర్జున ! నీవు దీనికై శోకింపదగదు.

అథ చైనం నిత్యజాతం నిత్యం వా మన్యసే మృతమ్ ।

తథాపి త్వం మహాబాహో నైవం శోచితుమర్హసి ॥ 26

తా. ఓ అర్జున ! ఈ ఆత్మకు జననమరణములు కలవని ఒకవేళ నీవు భావించినప్పటికిని దీనికై నీవు శోకింపదగదు.

జాతస్య హి ధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృతస్య చ ।

తస్మాదపరిహార్యేర్థే న త్వం శోచితుమర్హసి ॥ 27

తా. ఏలనన పుట్టిన వానికి మరణము తప్పదు. మరణించిన వానికి పునర్జన్మ తప్పదు. కనుక అపరిహార్యములైన ఈ విషయముల యందు నీవు శోకింపదగదు.

**భగీ. 2-22-27**

యత్కరోషి యదశ్నాసి యజ్జుహోషి దదాసి యత్ ।

యత్తపస్యసి కౌంతేయ తత్కురుష్వ మదర్పణమ్ ॥ 27

తా. ఓ కౌంతేయ ! నీవు ఆచరించు కర్మను, భుజించెడి ఆహారమును, హోమము చేయు హవ్యమును, అర్పించు దానమును, ఆచరించు తపస్సును నాకే సమర్పింపుము.

శుభాశుభ ఫలైరేవం మోక్ష్యసే కర్మబంధనైః ।

సన్న్యాస యోగ యుక్తాత్మా విముక్తో మాముపైష్యసి ॥ 28

తా. ఈ విధముగా సన్న్యాసయోగమునందు స్థిరచిత్తుడవై, అనగా సమస్త కర్మలను భగవంతుడనైన నాకే సమర్పించి శుభాశుభ ఫలరూప కర్మ బంధముల నుండి ముక్తుడవయ్యెదవు. పిదప నన్నే చేరగలవు.

సమోహం సర్వభూతేషు న మే ద్వేష్యోస్తి న ప్రియః।
యే భజంతి తు మాం భక్త్యా మయి తే తేషు చాప్యహమ్॥ 29

తా. నేను సకల భూతముల (ప్రాణుల) యందును సమభావముతో వ్యాపించి యుందును. నాకు అప్రియుడు గాని ప్రియుడు గాని ఎవ్వడును లేడు.కాని నన్ను భక్తితో భజించువారు నా యందే యుందురు. నేనును వారి యందు ప్రత్యక్షముగా ఉందును.

అపి చేత్సుదురాచారో భజతే మామనన్యభాక్ ।
సాధురేవ స మంతవ్యః సమ్యగ్వ్యవసితో హి సః॥ 30

తా. మిక్కిలి దురాచారుడైనను అనన్యభక్తితో నన్ను భజించినచో అతనిని సత్పురుషునిగానే భావింపదగును. ఏలనన యథార్థముగా అతడు నిశ్చయ బుద్ధి గలవాడు. అనగా పరమాత్మని సేవించుటతో సమానమైనది మరి యొకటి ఏదియును లేదని గట్టిగా నిశ్చయించుకొనినవాడు.

క్షిప్రం భవతి ధర్మాత్మా శశ్వచ్ఛాంతిం నిగచ్ఛతి ।
కౌంతేయ ప్రతిజానీహి న మే భక్తః ప్రణశ్యతి॥ 31

తా. కౌంతేయ ! అతడు శీఘ్రముగా ధర్మాత్ముడగును. శాశ్వతమైన పరమశాంతిని పొందును. "నా భక్తుడెన్నడును నష్టమునకు గురికాడు" అను విషయమును నిశ్చయముగా ఎఱుంగుము. **భగీ. 9-27-31**

త్రివిధం నరకస్యేదం ద్వారం నాశనమాత్మనః
కామః క్రోధస్తథా లోభః తస్మాదేతత్త్రయం త్యజేత్. **భ.గీ. 16-21**

తా. కామక్రోధలోభములు అను ఈ మూడును నరక ద్వారములు. ఇవి ఆత్మనాశనమునకు కారణములు. అనగా మనుజుని అధోగతి పాలు చేయునవి. కనుక ఈ మూడంటిని త్యజింప వలెను.

భగవద్గీతను నిత్యము పారాయణ చేయవలసినట్లు మన పెద్దలు చెప్పు చున్నారు. గీతాజయంతినాడు భగవద్గీతను పువ్వులతో పూజించు వాడుక మనదేశంలో కలదు. నిజమైన పూజ గీతాసారమును గ్రహించి ఆచరణలో పెట్టుటయే. అసురీ సంపత్తులను విడనాడి దైవీసంపత్తులను నిత్యము అలవాటు చేసుకొనవలసి యుండును. అప్పుడే స్థితప్రజ్ఞ లక్షణములు అలవాటు కాగలవు. మనకు స్వాధీనముగాని ఇంద్రియములే మనకు శత్రు వులు,ఈ విషయమే ప్రహ్లాదుడుకూడ,తన తండ్రి హిరణ్యకశిపునితో చెప్పెను.

ఉ. లోకము లన్నియున్ గడియలోన జయించినవాడ వింద్రియా
నీకము జిత్తమున్ గెలువ నేరవు నిన్ను నిబద్ధు జేయు నీ

భీకరశత్రు లార్వుర బ్రభిన్నుల జేసిన బ్రాణికోటిలో
నీకు విరోధి లే డొకడు నేర్పున జూడుము దానవేశ్వరా.

భాగవతం 7స్కం. ప. 267

నేడు ప్రపంచ అశాంతికి ముఖ్యకారణము ధర్మ పతనమే. దానిని ప్రతివారు గ్రహించి పునరుద్ధరించ గలిగినచో నిజమైన శాంతి తిరిగి అంతటా చేకూరగలదు. గాన మానవులందరు భగవద్గీతా సారాంశ మును బాగుగ గ్రహించి, తూచా తప్పకుండా ఆచరణలో పెట్టుకొనుటయే ప్రస్తుత మానవ కర్తవ్యం. పవిత్రమైన గీతా జయంతోత్సవములు, పరమేశ్వ రానుగ్రహమున, ధర్మోద్ధరణకై సర్వులకు తోడ్పడుగాక.

ఓం శాంతిః శాంతిః శాంతిః

**(శాంతి - జనవరి 1974)**

ఈ పవిత్ర భారతదేశములో మనము ముఖ్యముగా జ్ఞాపకముంచుకొని జరుపుకొనవలసిన జయంతులలో శ్రీకృష్ణజయంతి, గీతాజయంతి. శ్రీ శంకర జయంతి మొదలగునవి.

భగవంతుడు మన భారతదేశములో, దుష్టజన శిక్షణ, శిష్టజన రక్షణార్థం దశావతారములెత్తెను. అందులో ముఖ్యమైన అవతారము శ్రీకృష్ణావతారములో చేయబడిన కార్యము చాలగొప్పది. ప్రపంచమున కంతకు శాశ్వతముగ ఉపయోగపడుచున్నది.

తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా
ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానిన స్తత్త్వదర్శినః - భగీ 4-34

పై శ్లోకములో చెప్పబడినట్లు తత్వదర్శునుని సమీపించి, భక్తి వినయ ములతో ప్రశ్నించి తెలిసికొనవలసి యుండును. ఒక పర్యాయము సరిగా బోధింపబడిన మానవులు తిరిగి యెన్నటికిని మోహములో పడరు. తిరిగి జన్మించ నవసరముండదు. ఈ ప్రపంచములో మానవులందరికి, వారి వారి క్లిష్ట సమస్యల నన్నిటిని గీత తప్పక పరిష్కరించగలదు. అది తీర్చలేని సమస్యే యుండదని రూఢిగా చెప్పవచ్చును.

గీత కర్మ సిద్ధాంతమును చాల స్పష్టముగ చెప్పగల్గినది. ఎవరు ఏ విత్తనమువేస్తే దాని ఫలితమునే తప్పక అనుభవించెదరు. గాన శ్రీ స్వామీజీ తరుచు జ్ఞాపకము చేయుచున్న ధర్మ చట్టమేమనగా, వెనుకటి జన్మలలో చేసిన కర్మముల ఫలితము యిప్పుడు అనుభవించక తప్పుటలేదు. ఎంతో గొప్ప సత్కర్మ చేసినగాని, దుష్కర్మ ఫలితము తగ్గించుకొనుటకైనను అవకాశ ముండదు. గాన ఇప్పుడు మనము చేయు కర్మను జాగ్రత్తగ, ధర్మయుతముగ చేసికొన గలిగిన, ముందు జన్మలలోనైనను, సుఖమనుభవించుటకు అవకాశ ముండును. గాన మనము ఈ జన్మలో సదా దైవజ్ఞప్తితో సత్కర్మనే ఆచరిం చుట చాల ముఖ్యము.

భగవద్గీతలో చనిపోయిన ప్రతివారు, వారు చేసిన కర్మల ప్రకారం జంతు జన్మలేగాక క్రిమి కీటకాది జన్మలు గూడ, చేసినపాపములకు ఫలిత ముగ ఎత్తక తప్పదని చెప్పబడెను. గాన ప్రతి భారతీయుడును తప్పక గీతా సారమును గ్రహించి తీరాలి. అమెరికా, జర్మని, రష్యా, వగైరా దేశము లలో కూడ గీతను ఎంతో భక్తితో పఠించి దాని సారమును గ్రహించుచుండ మన దేశములో గీత చదువని వారు ముఖ్యముగ హిందువులు ఉండరాదు. అంతా రామమయం ఈ జగమంతా కృష్ణమయం అని ఆశ్రమములో సదా పాడించుచుందురు. దాని భావం అందరిలో శ్రీరామచంద్రుని, శ్రీకృష్ణునిచూచి ప్రేమించవలసినదనియే గదా. ప్రతి మానవుడు సదా ఆనందముగ నుండుటనే స్వామీజీ కోరుచుందురు. దానికి పూజ్యశ్రీస్వామీజీ చూపించుచున్న సులభ మార్గమును ఆచరణలో పెట్టుకొన లేకున్నారు. వారు చెప్పినట్లు అందరిలో శ్రీరాముని, శ్రీకృష్ణుని రూపమును చూచుచు ప్రేమించుటను సాధనచేయుట ముఖ్య కర్తవ్యము. పరమాత్మ తనకు నిజమైన భక్తులెవరో గీత అ. 12 శ్లో 13-20 వరకు స్పష్టముగ వివరించిరి. (భక్తుని లక్షణాలు)

మనము ప్రపంచములో జీవరాసులన్నిటిని ప్రేమించ గల్గుచుంటిమా? మనకెవరూ శత్రువులు లేకుండా వుంటిమా? మనకు నిజమైన శత్రువులు బైటలేరు. మనలోపలనే కామ,క్రోధ,లోభ,మోహ,మద,మాత్సర్యములను ఆరుగురు శత్రువులున్నారు. వాటిని జయించుటకే గదా మనకు అపురూప మైన మానవజన్మ ప్రసాదింపబడినది. నిత్యము ఈ శత్రువులను తరిమి వేయ ప్రయత్నించక, మన అమూల్య ఆయుర్దాయమును వృధా చేసుకొనిన యెడల, మన పవిత్ర మానవజన్మ వృధాయేగదా ? ఎన్నాళ్లు జీవించి ఏమి ప్రయోజనము? ఎన్ని జన్మలెత్తి మాత్రము ఏమి ప్రయోజనము ? అందు వల్లనే క్షణములను వ్యర్ధము చేయువారు జీవితము నంతయు వ్యర్ధము చేయదురను సూక్తి నిరంతరం శాంతి ఆశ్రమములో మారు మ్రోగుచున్నది.

విదేశీయులు మనదేశంవచ్చి శ్రీకృష్ణనామం అతిభక్తితో గానము చేయు చుండగా, మనమెంతగా శ్రీకృష్ణ చైతన్యము అనుభవించుచు, మన పవిత్ర మానవ జీవితములను ధన్యము చేసుకొనవలసి యుండునో ప్రతివారు తీవ్రముగ ఆలోచించవలసియున్నది. మానవజన్మ గమ్యస్థానము దైవమే అని ప్రతివారు సదాజ్ఞప్తియందుంచు కొనగల్గితే, మన మనస్సు అనిత్యమైన ప్రాపంచిక విషయములవైపు పోక నిత్యమగు పరమాత్మను తెలుసుకొనుట యందే లగ్నమగును. భగవద్గీత సారాంశము, పరమాత్ముని తెలుసుకొని, ఆయనలో ఐక్యమై ముక్తిని సంపాదించుటయేగదా! కావున ప్రతి మానవుడు కనీసము గీతాజయంతి పుణ్యదినమునాడైనను పవిత్ర గీతాసారమును గ్రహించి యీ పవిత్ర భారతదేశములో జన్మించినందుకు మానవ జీవితము ధన్యము చేసుకొనెదరు గాక!

లోకాసమస్తా సుఖినో భవంతు !

**(శాంతి - జనవరి 1975)**

ఎక్కడ దైవభక్తి గాఢముగ నుండునో అక్కడ ధర్మము ప్రతిష్టితమగును. వానలు సకాలములో కురియుచు పంటలు సవ్యముగా పండి ప్రజలు సుఖించెదరు. ఈనాడు దేశములో అనేక ప్రాంతములలో అతివృష్టి వలన వరదలు విపరీతముగా వచ్చి ప్రజా, పశు, పంట నష్టములతో అనేక బాధలకు గురియగుచుండిరి. మరికొన్ని ప్రాంతము లలో అనావృష్టిదోషముచే, ఎండవేడిచే పంటలు ఎండిపోవుట, మంచినీటికి కరువౌట, పశుగ్రాస ములు లేక బాధపడుచుండిరి. దీనికి కారణము ప్రజలలో నైతిక బుద్ధి పూర్తిగా అంతరించి భగవంతుని యందు భక్తి విశ్వాసములు నశించుటయే. ఇప్పటికైనను విజ్ఞత కలవారు భగవంతుని ప్రార్థించుటే గాక, వారి పరిసర ప్రాంత ప్రజానీకానికి గూడ భక్తి ప్రబోధనచేయుచు, ఐకమత్యముతో హరినామ సంకీర్తన, భజనలు చేయుచున్నచో అట్టి తావులలో అతివృష్టి అనావృష్టి బాధలు లేకుండా ప్రజలు హాయిగా జీవించ గలరు. పరమేశ్వరుడు వారిని సదా రక్షించి కాపాడుచుండును.

## అంతా కృష్ణమయం

అంతా కృష్ణమయం ఈ జగమంతా కృష్ణమయం
భవనం కృష్ణమయం యీ భవనం కృష్ణమయం
ఈ సృష్టియే కృష్ణమయం ॥అంతా॥

ఎదుటా కృష్ణమయం మాకనులెదుటా కృష్ణమయం
నలుమూలల కృష్ణమయం ॥అంతా॥

లోపల కృష్ణమయం మా లోపల కృష్ణమయం
వెలుపల కృష్ణమయం ॥అంతా॥

కన్నుమూసినా కృష్ణమయం నా కన్నుమూసినా
కృష్ణమయం కన్ను తెరచినా కృష్ణమయం ॥అంతా॥

గీతలు కృష్ణమయం భగవద్గీతలు కృష్ణమయం
మా ఊహలు కృష్ణమయం ॥అంతా॥

సర్వం కృష్ణమయం మాకు సర్వం కృష్ణమయం
సకలం కృష్ణమయం ॥అంతా॥

సద్గురుదేవల ప్రేమ ప్రభావం మాసద్గురుదేవుల
ప్రేమ ప్రభావం మా కందరికీ దివ్యానుభవం ॥అంతా॥

కృష్ణజయంతియే మా కానందం శ్రీకృష్ణ జయంతియే
మా కానందం ఆ ప్రభు నామం బ్రహ్మానందం ॥అంతా॥

# 5. హిమాలయ-ఆనందకుటీర-దివ్యజ్యోతి

పూజ్యులగు శ్రీ శివానందస్వాములవారు (శ్రీ కుప్పుస్వామి అయ్యర్) తేది 8-9-1887 తిరునల్వేలి జిల్లాలోని పట్టమడయ్ గ్రామంలో జన్మిం చిరి. తండ్రి వెంగు అయ్యర్, తల్లి పార్వతి అమ్మాల్. చిన్ననాటి నుండి వీరికి సంఘసేవ యందు అభిలాష గాన వైద్య వృత్తిని స్వీకరించిరి.మానవ సేవకు మంచి అనుకూలమైన ప్రదేశమని తలంచి మలయాకు వెళ్లిరి. అచట డాక్టరుగా వుంటూ అమృత అను పత్రికను, ఆరోగ్య విషయములు ముఖ్యముగా వ్రాయుచు నడిపిరి. బీదల డాక్టరని పేరు సంపాదించిరి.

1923 వ సంవత్సరములో బహువ్యాప్తిలో నున్న తమ వైద్య వృత్తిని విడచి, తమ ఆస్తిని బీదలకు పంచి హిందూదేశము చేరిరి. హిందూదేశ పర్యటనలో వీరు కొంతకాలం శ్రీ ఓంకార స్వాములవారు 47 సం॥ పూర్వం స్థాపించిన శ్రీ శాంతి ఆశ్రమంలో (తోటపల్లి పర్వతముల వద్ద) సుమారు 2 మాసములుండి, చుట్టుప్రక్కల గ్రామములు తిరుగుచు, హరేరామ మహా మంత్రము వగైరాలను చాలభక్తి ప్రేమలతో ప్రచారము చేయగలిగిరి. దరిమిలా కాశీక్షేత్రం చేరిరి. కొంతకాలము మహారాష్ట్ర దేశములో పర్యటన చేసి ఒక పోస్టు మాష్టరువద్ద ఉద్యోగమునకు చేరిరి. వారు వీరిని ఋషీకేశ్ పంపిరి. శ్రీ స్వామి విశ్వానందకు శిష్యులైరి. వారు వీరికి సన్యాసమిచ్చి శివానందయను పేరు ప్రసాదించిరి. దరిమిలా 7 సంవత్సరములు భిక్షాట నము చేయుచు తపస్సు చేసిరి. రోగులకు సేవచేయుచునే యుండిరి. ఒక చిన్న ఆసుపత్రిని నెలకొల్పిరి. సర్వమత సామరస్యమును వారి పర్యటన లలో ప్రభోదం చేసిరి. వందలాది విద్యార్థులను యోగాసనములను నేర్పిరి.

1932లో ఋషీకేశ్‌లో ఒక ఆశ్రమం స్థాపించిరి. అనేకులు వీరి శిష్యులైరి. బదరినాథ్, కేదార్‌నాథ్ వెళ్ళు యాత్రికులు వీరివద్ద చాల సహాయం పొందెడివారు. వీరు 1932లో దివ్య జీవన సంఘమును స్థాపిం చిరి. దీని ద్వారా సేవ, ప్రేమ, ధ్యానము, ఆత్మానుభూతిని చాల బాగుగ ప్రచారము చేయగలిగిరి. దీనికి శాఖలు 300లు ప్రపంచమంతయు ఏర్పడి నవి. 1948లో యోగ వేదాంత అకాడమీ అనే కళాశాలను, ఆధ్యాత్మిక విద్యా, యోగసాధన ప్రచారము నిమిత్తం నిర్మాణం చేసిరి.

1950లో వారు ఆధ్యాత్మిక సేవా ప్రచారం నిమిత్తం అఖిల భారత పర్యటన ఏర్పాటుచేసిరి. వారు సుమారు 300పైగా ఆధ్యాత్మిక గ్రంధములను రచియించిరి. వివిధ మతములకు, జాతులకు సంబంధించిన వారనే కులు వీరి శిష్యులుగా నున్నారు. బ్రహ్మచర్యము, ఆసనములు, భగవన్నామ సంకీర్తన గురించి హెచ్చుగా ప్రచారము చేయగలిగిరి. వీరి ప్రబోధ సారాంశ మేమనగా అందరు దేవతలు సమానమే. ఎన్నివిధముల ఎవరు ఎచ్చట ప్రార్థించినను దైవము ఒక్కడే. బ్రహ్మజ్ఞానమే అన్నింటికి ప్రధానము. అది తెలుసుకొనిన యింక తెలుసుకొనవలసిన దేమియు

వుండదు. అదియే పరశాంతిని, సుఖమును, ఆనందమును ప్రసాదించును.

శ్రీవారికి ది 25-6-63న సెరిబ్రల్ త్రాంబోసిసు అను జబ్బువచ్చి, కొంచెము నెమ్మదించినట్లే కనిపించెను గాని, చివరికి ది 14-7-63 ఆది వారం రాత్రి 11 గంటలకు మహాసమాధినొందిరి. అఖిల భారతదేశమునకే గాక, ప్రపంచమున కంతయు గొప్ప తీరని నష్టము ఏర్పడినది. ఎంతో పటుత్వముతో ఆధ్యాత్మిక విద్యను శ్రీవారి చివరి ఘడియల వరకు బ్రహ్మాండ ముగ ప్రచారము చేయగలిగిరి.

శ్రీ ఓంకార స్వాములవారు, సోదరి సుశీలాదేవిగారు ఒకప్పుడు ఋషీకేశ్ వెళ్ళినపుడు, శ్రీశివానంద స్వాములవారు స్వర్గాశ్రమములో ఒక బ్రహ్మాండమైన సభ ఏర్పాటు చేసిరి. అప్పటి యతులు, ఋషులు, జడధారులు అనేక భక్తులు ఋషీకేశ్‌లో తపస్సు చేయుచున్న వారందరు, సభకు హాజరై దానిని చాల జయప్రదం చేసిరి. శ్రీ ఓంకార స్వాముల వారితో, చాలభక్తి ప్రేమలతో, ఆమెరికానుండి యిచ్చటికి వచ్చిన శాంతి ఆశ్రమ సోదరి సుశీల (ఎలెన్ సెయింట్ క్లేయర్ నోవాల్టు, అమెరికా) హిందూదేశమును, సనాతన ధర్మమును ఎంతగనో ప్రేమించుటచూచి, శ్రీ శివానంద స్వాములవారు, ఆమె నిరాడంబర జీవితమును, భక్తి శ్రద్ధలను జంతువుల యందుండెడి ప్రేమను, చూచి ముగ్ధులై ఆమెను ఎంతగానో, ప్రేమించి, తమ ఆనంద కుటీరములో ఆమెతో ఆధ్యాత్మిక ప్రసంగముల నెన్నియో జరిపిరి.

1959వసంవత్సరములో శ్రీ ఓంకార స్వాములవారు, గురుకుల పిల్లలు వగైరాలతో ఉత్తరదేశము వెళ్ళి ఋషీకేశ్‌లో శ్రీవారి ఆశ్రమంలో పది రోజు లున్నపుడు, శ్రీ స్వామీజీని, అందరిని ఎంతయో ప్రేమతో ఆదరించి, డెహ్రాడూన్ మొదలగు తావులనుండి వివిధ రకముల పండ్లను తెప్పిం చియు, మధురమగు ఫలహారములతోను, అత్యంత ప్రీతితో ఆతిధ్యమిచ్చిరి. శాంతి ఆశ్రమం ఖర్చులకు రూ. 116లు లిచ్చి గౌరవంగా సత్కరించి, ఆశ్రమ వాసులెల్లరు శ్రీవారిని ఆజన్మాంతరము మరువకుండునట్లు వారి ప్రేమ వాహినిలో ముంచెత్తిరి. శ్రీవారు రచించిన గ్రంథము లన్నియు ఒక్కొక్క కాపీ చొప్పునను, ఇతర కరపత్రములన్నియు శాంతి ఆశ్రమమునకు పంపుచుండెడివారు. మరియు వారు తయారు చేయించెడి ఔషధములు చ్యవనప్రాశ్ మొదలగు మందు లేహ్యములు ప్రతి సంవత్సరము ప్రేమా నందములతో పంపుచుండెడివారు.

శ్రీవారి నిర్యాణం ప్రపంచమునకే గాక, ముఖ్యముగ శాంతి ఆశ్రమ వాసులకు అపార నష్టము. శ్రీవారి పవిత్ర ఆత్మకు శాశ్వత శాంతి కొరకు ఆశ్రమ వాసులందరు చాలభక్తితో హృదయ పూర్వక ప్రార్థనలు తోటపల్లి ఆశ్రమములోను, శ్రీ ఓంకార స్వాములవారి సమక్షమున కోటగిరి శాంతి కేంద్రములోను జరిపిరి. గాని శ్రీవారి అమూల్య సందేశములు ప్రపంచ మంతయు అనేక విధముల యిదివరకే వ్యాప్తిచెందియున్నందున ఇక ముందు వారి ఆత్మ బలముచేత యింకను విపరీత శక్తితో దేశ వ్యాప్తి చెంది, భక్తి యోగ జ్ఞానాభివృద్ధికి తోడ్పడి లోకశాంతికి,

ఐకమత్యమునకు, కళ్యాణముకు పరమేశ్వరాను గ్రహముచేత అనేక విధముల త్వరలో తోడ్పడు గాక ! దివ్య జీవన సంఘములు అతి శీఘ్రముగ చాలవృద్ధి పొంది, సజీవ ముతో ఈ ప్రపంచములో నిజమైన దివ్య జీవితములకు చక్కగ తోడ్పడు గాక.

లోకాసమస్తా సుఖినో భవంతు !

**(శాంతి - అక్టోబర్ 1963)**

## 6. పూజ్యశ్రీ వినోబాజీ సందర్శన భాగ్యము

మహాత్ములు, సాధుపుంగవుల దర్శనార్థము ఎవ్వరైనను వెళ్ళినపుడు, వారి దర్శనముచే వారి సన్నిధిలో పొందిన ఆనందము, అనుభవము, అనుభూతులేమిటని సాధారణముగ ప్రశ్నించుట కద్దు. ఎవరు ఏ ఏ ఆశయ ములతో వెళ్ళిన, వారివారి మనస్తత్వమునుబట్టి వారు ఆ ఆనందానుభవము లను పొందుచుందురు. ఒక మహాత్ముని సన్నిధికి వెళ్ళిన యిద్దరు, ముగ్గురు ఒకేవిధమైన ఆనందమును పొందజాలరు గదా! ఒకరు ఎన్నో విధములైన దివ్యానుభవములు పొందవచ్చును. మరియొకరు ఎన్నో సంశయములతో అశాంతిగా యుండవచ్చును. అయితే వీటికి కారణము వారి వారి భక్తి శ్రద్ధలు, నమ్మకమును బట్టియె యుండునని మనము నిత్యము జూచుచున్న సంఘటనలవల్ల తెలియచునే యున్నది. ఎవరిభక్తి, విశ్వాసములను బట్టి వారంతటవారే శాంతి, అశాంతులను, సంతోష, విచారములను గలుగజేసు కొనుచుండిరి. గాని కేవలం ఒక వ్యక్తి గల్గజేయుటలేదు. వారివల్లనే మనకు గల్గే యెడల అందరకూ ఒకేవిధమైన ఆనందము గలుగవలయును గదా!

సర్వసంగ పరిత్యాగులై, పవిత్ర స్వరూపులై ఆత్మశక్తిపై ఆధారపడి జీవించుచున్న మహాత్ముల సన్నిధికి వెళ్ళి వారి ఆశీస్సులను పొందగల్గుట మహాభాగ్యము. అటువంటి వారి సన్నిధినుండి పవిత్రత, ఆత్మశక్తియే గోచర మగుచుండును. వారి నుండి వచ్చే వాక్కులు గూడ జీవితమునకు వుపయోగ పడును. ఆ పవిత్ర వాక్కులను మనము వుపయోగించుకొనుటలో యున్నది గాని వాటిని ఆచరణలో పెట్టక వారి నుండి మనమే విధమైన ఆనందము, శక్తి పొందలేదనుట అసంభవము.

పూజ్యశ్రీ వినోబాజీ గురించి విననివారు లేరు. వారు కేవలము ఆధ్యాత్మిక కృషితోనేగాక, ఆధునిక ప్రపంచములో ప్రజలు పడుచున్న బాధలను ఏవిధముగ శాంతిపర్చుటయని తలచి భూదాన యుద్యమము స్థాపించి చాలాకాలము పాదయాత్రచే ఎంతోకృషి సాగించిరని అందరికి తెలిసిన విషయమే ! తెలిసిన విషయములనే వ్రాసి కాలయాపన జేయనేల? శ్రీ వినోబాజీ సందర్శన భాగ్యమువల్ల నీవు పొందిన అనుభవమేమిటని పలువురు అడుగుట సహజమే! (ఏలనన ఒక ఆదర్శమూర్తి పవిత్ర సన్నిధికి వెళ్ళుటచేతను)

పూజ్యశ్రీ స్వామి రామానంద తీర్థులకు పూజ్యశ్రీ వినోబాజీకి చాలా సన్నిహిత సంబంధము గలదు. వారికి శ్రీ వినోబాయన్న అపారమైన గౌరవము, అపూర్వమైన

భక్తి, విశ్వాసములు గలవు. వారికి ఏవిషయములో నైన ఏమైన సలహా కావలసివచ్చిన వెంటనే పూజ్యశ్రీ వినోబానుండి అమూల్య సలహాలను పొందుచుందురు. చాలకాలము నుండి నన్ను పూజ్యశ్రీ వినోబాజీ దర్శనమునకు తీసుకొని వెళ్లెదనని శ్రీరామానంతీర్థులు అనెడివారు. గాని ఏరోజుకు ఎటుల ఏ విధముగ జరుగవలయునో అంతయు దైవానుగ్రహమే. 15–3–63వ తేదీన బీహారులో ఒక మారుమూలనున్న రాణిపత్ర అనే గ్రామములో శ్రీవినోబాజీ సందర్శన భాగ్యము గలిగినది. అది ఒక పరమ పవిత్రమైన, చిరస్మరణీయమైన దినముగ భావించుకొంటిని. ఏలనన, ఎచ్చట తోటపల్లి ? ఎచ్చట బీహారు? ఒక పవిత్రమూర్తి దర్శనము యిచ్చట పొంది వారి ఆశీస్సులను పొందగల్గుట యేమి? దీనికికారణమేమి? యని నాలో నేనే ప్రశ్నించుకొనుచు ఏదో తెలియని ఆనందానుభూతిని పొందితిని. మూడు రోజులు వారి దివ్య సన్నిధిలో ఆనందముగ,శాంతిగ గడిపితిమి. వారి ప్రతివాక్కు, ప్రతిచూపు ఆశీస్సులే! వారి నుండి పవిత్రత అనెడి జలమే నిరంతర ప్రవాహమువలె ప్రవహించెడిది. ఎంతోమంది ఎన్నో సమస్యల పరిష్కార నిమిత్తము సలహాలను పొందుటకు వచ్చుట, వారి సమస్యలన్నిం టికి ఏవిధముగ సరిపడునో ఆ విధముగ సలహాలిచ్చుచు వారిని తృప్తిగ పంపుచుండెడివారు.

ప్రార్థనకు ఎంత ప్రాముఖ్యతను యిచ్చెదరో స్వయముగ జూడవలసి నదే! ఎంత ముఖ్యమైన సమస్యగురించి సంభాషించుచున్ననూ, ప్రార్థన సమయము అయినచో సంభాషణ ముగించి ఎచ్చటనున్నవారు, ఏ మూల కూర్చున్న వారు అచ్చటనే కూర్చుని ప్రార్థన జేసెడి దృశ్యము స్వయముగ చూచి ఆనందించవలసినదే గాని వర్ణించుట కష్టము. బాహ్యకలాపముల నుండి, ఆంతర్య కలాపమునకు వెళ్ళెడి స్థితి అతిసహజమైన దృశ్యముగ వుండెడిది. వారికి ఆత్మశక్తి యందు అంత నిగూఢమైన విశ్వాసముగలదు. ఎవరి ఆత్మశక్తి పై వారు ఆధారపడి దాని యందు పూర్తి నమ్మకము గల్గి ఆశక్తిని సంపాదించిననాడే దేశసేవ జేయగలరన్న విశ్వాసము గలవారు. భాషరాని కారణముచే వారు నొసంగెడి అమూల్య బోధలన్నియు బోధ పడక పోవచ్చును, గాని ముఖ్యముగ ఆకర్షించినవి. “వినోబా చాల పెద్దవారు, గొప్పవారని తలంచవచ్చును.” గాని నేను మీవలె ఒక సామాన్య వ్యక్తినే అయితే ఎవరి ఎవరి సాధనలనుబట్టి వారు వారు ఆ వున్నత స్థానమునకు వెళ్ళి, ఆ ఆనందమును అనుభవించెదరు. గాని ఎవరికి ఏవిధమైన అభీష్ట మున్న ఆ కర్తవ్యమును నెరవేర్చవలయును.

శ్రీరామానంద తీర్థులు, శ్రీ వినోబా నుండి రామతీర్థ శాంతి సంస్థకు అనేక అమూల్య సలహాలు పొందిరి. అందులో ఒకటి పనియే ఆరాధన. అనగ మీ అభిప్రాయమేమని ప్రశ్నించిరి. శ్రీ వినోబాజీ జెప్పిన సమాధానము, ఎన్ని కార్యములు చేసినను, ఎంత స్వార్థ రహితమైన సేవ చేసినను అది ఆరాధన అవ్వదు. అర్పణ

బుద్ధితో చేసినపుడే ఆ పని నిజమైన ఆరాధన అవుతుంది. ప్రప్రధముననే మనవి జేసినట్లు ఎవరు ఏ ఏ ఆశయములతో వెళ్ళిన, వారు ఆ విధమైన ఆనందమును అనుభవించెదరు. పూజ్యశ్రీ వినోబాజీ పవిత్ర సన్నిధికి వెళ్ళేటప్పుడు నాలో ఏవిధమైన ఆశయము లేకుండ మనస్సు సంకల్ప రహితముగ యున్నదా అన్నట్లు కేవలము వారి పవిత్ర ఆశీస్సులనే కోరుచు, ఏదో నాకు తెలియని ఒక దివ్యానందమును అనుభ వించితిని. సంకల్ప రహితముగ ఆ ఆనందమును ఎవరంతటవారు అనుభ వించ వలసినదేగాని వర్ణించుట కష్టముగదా ! శ్రీ వినోభాజీ పవిత్రమైన, శాంతి యుతమైన నిరాడంబర జీవితమే వారి సన్నిధికి వచ్చిన వార్కి గోచరమగును. అటువంటి బ్రహ్మానందమును మూడురోజులు ఏ సంక ల్పము లేకుండా సంతోషించ గల్గిన జీవితము ధన్యవంతమైనదని ఆశిం చుచూ, వారి పవిత్ర ఆశీస్సులను పొందగల్గితిని. శ్రీస్వామి రామానంద తీర్థుల ద్వారా ఈ మహదవకాశము అనుగ్రహించిన దైవమునకు ధన్యవాద ములు అర్పించుచూ, ఎచ్చటయున్ననూ సంకల్ప రహితమైన ఆనందమును అనుభవించెదము గాక !

ఓం శాంతిః శాంతిః శాంతిః

**(శాంతి - మే 1968)**

## 7. శ్రీ అవతార్ మెహర్‌బాబా జయంతి సందేశములు

వీరు పారశీక వంశములో 25-2-1894న పూనా నగరములో జన్మిం చిరి. 31-1-69న అహమ్మదాబాద్ నగరంవద్ద నున్న మెహర్‌బాద్‌లో సిద్ధి పొందినారు. అచ్చట వీరు జీవించి యుండగనే సిద్ధముచేసి యుంచిన కొండమీద ప్రదేశములో వీరి భౌతిక కాయమును సమాధిచేసిరి. 10-7-1925వ సంవత్సరము నుండి జీవితం ఆఖరు వరకు మౌనముగానే యుండిరి. అట్లుండియే, విదేశములలో చాల పర్యాయములు, పర్యటనచేసి,వారి దివ్యప్రేమ సందేశములను, ప్రపంచమంతటను వ్యాప్తిచేయగలిగిరి. వీరికి అయిదుగురు సద్గురువులు లభించిరి. పూనాలో ఇంటర్‌మీడి యట్ చదువుచుండగా, హజరత్ బాబాజాన్ అను ఆమె మొదటి సద్గురువుగా లభించెను. తదుపరి షిర్డీసాయి బాబాను కలసిరి. తరువాత శకోరిలోని ఉపాసినీ మహరాజువద్ద 7 సంవత్సర ములు శుశ్రూషచేసిరి. వారే అవతార్ మెహర్‌బాబా యను నామకరణమిచ్చిరి. దరిమిలా కోపర్గాములోనున్న శ్రీ నారాయణ మహారాజ్, నాగపూర్‌లో నున్న తాజుద్దీన్ బాబాగార్లు కూడ వీరిని అవతార్‌గా గుర్తించిరి. వారు స్వయముగా నేనే అవతార పురుషుడనని చెప్పుచుండుటచే, అమెరికాలోని భక్తులు మీరు ఎందుకు అట్లు చెప్పుచుండిరి? అది అహంకార మనిపించుకొనదా అని ప్రశ్నిం చగా, బాబా చెప్పిన సమాధానము ఏమనగా “మీ రందరూ అవతారులే, గాని మీరు గుర్తించుటలేదు గాన, మిమ్ములను మేల్కొల్పి మీరందరూ అవతారములే యని స్పష్టముగా తెలియచెప్పుటకు నేను అవతరించితిననిరి.

వెనుక స్వామిరామతీర్థ కూడ యించుమించు యిట్లే చెప్పితిరి. "ఏ రాముడు, వెనుక కురుక్షేత్రములో (శ్రీకృష్ణుడుగ) బోధించెనో, జెరూసలేములో (క్రీస్తుగాను) మక్కాలో (మహమ్మదుగాను) బోధించెనో, ఆ రాముడే యిప్పుడును మీకు బోధించ గలుగుచున్నాడనిరి."

బాబా యిచ్చిన విశ్వసందేశము,రెండుప్రార్ధనలు, ప్రభుస్తుతి,పశ్చాత్తాప ప్రార్ధన. ప్రతిభక్తులు నిత్యము తప్పక స్మరించి మననము చేయతగినవి. బాబా తామే మతమునకు సంబంధించినవారు కాదయని, అన్ని మతములు తమవే యనియు, మతములన్నియు పటుత్వము కోల్పోయిన వనియు, తిరిగి వాటికి నూతనపటు త్వము నిచ్చుటకు తానవతరించితిననియు చెప్పిరి. ఎవరు ఒక మతము నుండి మరియొక మతమునకు మారనక్కరలేదనియు, ఎవరు ఏ మత ములో జన్మించిన, వారా మతసారమును బాగాగ్రహించి, ఆచరణలో పెట్టుటయే ప్రతివారి కర్తవ్య మనియు నొక్కి చెప్పిరి. బాబా దివ్యప్రేమ సందేశమును లోకములో వ్యాప్తి చేయదల చినవారు "దేవుని ప్రేమించుటఎట్లో" అను విషయ మును బాగుగా వివరించి చెప్పగలిగిరి. ఆ సూక్తులు ప్రతివారు శ్రద్ధగా చదవతగి నవి. "ఒకరికి లేకలేక ఒక పుత్రుడు జన్మించినపుడు, ఆపుత్రుని ఎంత ప్రేమతో ఆ తల్లిదండ్రులు చూచుకొనెదరో, అట్టి ప్రేమతోనే లోకములో ఎల్లరిని చూడగలుగుట సరియైన ప్రేమయనిరి.

శ్రీస్వామి వివేకానంద ఏ దరిద్ర నారాయణ సేవను గూర్చి గట్టిగ చెప్పి పరితపించిరో, ఆ దరిద్ర నారాయణ సేవయే బాబా స్పష్టముగ చేసి చూపిరి. వారు స్వయముగ కుష్టురోగులకు స్నానం చేయించి, నూతన వస్త్రములను ధరింపచేయించి, వారిని నారాయణ స్వరూపులుగ ఎంచి, వారి పాదములకు ఎంతో భక్తి, వినయములతో నమస్కరించిరి. వందలాది మామూలు బీద ప్రజల పాద ప్రక్షాళనము చేసి, నారాయణ స్వరూపులుగా భావించి పాదాభివందనము భక్తి శ్రద్ధలతోచేసి దక్షణలనిచ్చి ఎంతో ప్రేమతో సత్కరించి పంపిరి.

బాబా చెప్పిన గొప్ప సలహా ఏమనగా, ప్రతి మానవుడు తన విద్యుక్త ధర్మమును, బద్ధకించక నిర్లక్ష్యము చేయక తుచా తప్పకుండా సకాలములో నెరవేర్చవలెననియు, దైవముపేరిట వసూలుచేసిన, పైకములో ఒక నయా పైసనైనను దుర్వినియోగము చేసినను హరించినను, పురుగులై పుట్టెదరని, జ్ఞాపకముంచుకోమనిరి. ఈ అవతారములో మరియొక విలక్షణమేమన, గొప్ప సేవ, అనగా దైవోన్మత్తుల సేవ చాలా గొప్పగా చేయగలిగిరి. ప్రతివారు శ్రీ బాబా ప్రేమికులై వారి ప్రేమను ఆచరణలో పెట్టగలిగిన పూజ్యశ్రీ స్వామీజీ సుమారు 60 సంవత్సరముల నుండి ప్రయత్నించు చున్న విశ్వమానవ సౌభ్రాతృ త్వము, సర్వలోకశాంతి, తప్పక నెలకొల్పబడును. అంతర్జాతీయ శాంతికేంద్ర ముగ విజ్ఞానజ్యోతి స్వరూపముగ వెలుగుచున్న, ఈ పవిత్రమైన శాంతి ఆశ్రమము శ్రీ అవతార్ మెహెర్‌బాబా సూచించిన విశ్వ ప్రేమనే ప్రచారము చేయుచున్నది. భక్తులందరు, అదివరలో చూడని వారు ఒకమారు శ్రీపూజ్య

స్వామీజీని ఆశ్రమములో దర్శించి శ్రీవారి ఆశీర్వాదములు పొంది వెళ్ళగోరు చున్నాము.

జీవితార్థము

ప్రేమగోరకయే తాను ప్రేమజూపి
సేవగోరకయే తాను సేవజేసి
పుచ్చుకొను నిచ్చలేకయే యిచ్చుచుండి
యార్తులకు నార్తిలో పరమాప్తుడగుచు
దీనులకు ధైర్యమొసగెడు మానవుండె
జీవితార్థము నెరిగిన పావనుండు

లోకాసమస్తా సుఖినో భవంతు !

**(శాంతి – ఫిబ్రవరి & మార్చి 1974)**

వీరి మొదటిపేరు మెహెర్‌వాన్. పూనాలోనే చదువుకొనుచుండెడివారు. ఒకనాడు వీరు సైకిలు మీద కాలేజీ నుండి ఇంటికివెళ్ళుచుండగా త్రోవలో "హజరత్ బాబాజాన్" (సుమారు 120సం॥ వయస్సుగల) అను ఒక వృద్ధ భక్తురాలు ఒక వేపచెట్టు క్రిందకూర్చొని యుండెను. మెహెర్‌వాన్ ఆ ప్రక్క నుండి వెళ్లుచుండగా హజరత్ బాబాజాన్ వీరిని సంజ్ఞచేసి పిలిచెను. అప్పుడు ఆయన సైకిలు దిగి దగ్గరకు రాగానే, ఆమె వీరినుదుటను (భ్రూ మధ్యమున) ముద్దుపెట్టుకొనెను. ఆమె అట్లు ముద్దు పెట్టుకొనగానే మెహెర్ వాన్‌కు ఈలోక స్మృతితప్పి అంతా దైవమయం ఈ జగమంతా దైవమయం అను దివ్యానుభూతి కలిగింది. ఆ రోజునుండి ఆయన చదువు మానివేసినారు.

ఆయన తల్లి కుమారుని మార్పునకు చాల విచారపడి బాబా జాన్ వద్దకు వచ్చి "నా అబ్బాయి చదువంతయు పాడుచేసినావు. ఇది నీకు న్యాయమా?" యని తగాదాచేసెను. దానికి బాబాజాన్ "ఈయన నీకు కుమారుడు కాదు, ఈలోకము నంతను ఉద్ధరించుటకు జన్మించిన మహాను భావు"డని చెప్పెను. మెహెర్‌వాన్ కొన్నాళ్ళు ఆ స్థితిలోనే యుండి షిర్డీ వెళ్ళిరి. సాయిబాబా ఈయనను చూచిన వెంటనే ఓ పరివర్ధిగార్ ! అని సంబోధించిరి. ఈ మాటకు అర్థం ఓ లోకరక్షకా యని, అచ్చటి నుండి శకోరి వెళ్లి అచ్చట శ్రోత్రీయ బ్రాహ్మణుడు ఉపాసనీ మహరాజ్ అనువారిని దర్శించి, వారివద్ద ఏడు సం॥లుండి శుశ్రూషచేయగల్గిరి. చివరకు ఉపాసనీ మహరాజ్ తన శిష్యులకు మెహెర్‌వానుని చూపి, వీరిని ఈ దినం నుండి అవతార్‌మెహర్‌బాబా అని పిలువబడవలసియున్నదని చెప్పి, వారి శిష్యు లతో కలసి హారతినిచ్చిరి. అచ్చటినుండి బాబా కోపరిగాం అను చోటికివెళ్లి శ్రీనారాయణ మహరాజ్ అనువారిని దర్శించగా వారు కూడా బాబానుచూచి వీరు లోకోద్ధరణ చేయుటకు అవతరించిరనిరి. తరువాత వారు నాగపూర్ లోని తాజుద్దీన్ బాబా

అనువారివద్దకు వెళ్లగా వారు గూడ బాబాను అవతార పురుషునిగా గుర్తించి సంబోధించిరి. అందుచేతనే బాబా ఎప్పుడును వారికి ఐదుగురు సద్గురువులని చెప్పుచుండెడివారు. ఈ పై నుదహరించిన ఐదుగురు గురువులు 1 హజరత్‌బాబా జాన్ 2 షిర్డీసాయిబాబా 3 ఉపాసనీ మహరాజ్ 4 శ్రీనారాయణ మహరాజ్ 5 తాజుద్దీన్‌బాబా వీరు ఐదుగురు బాబాను అవతారపురుషునిగా పేర్కొనిరి.

బాబా 10-7-25 నుండి మౌనదీక్షబూనిరి. ఈ మౌనంలోనే వీరు విదేశ పర్యటనలు చేసిరి. ఇంగ్లాండు దేశమునకు మొదటి పర్యాయం వెళ్ళినప్పుడు, వార్తాపత్రికల విలేకరులు వారివద్దకు వచ్చి "మీరు ఏమి సందేశమిచ్చుటకు మా దేశం వచ్చితిరని" ప్రశ్నించగా బాబా ప్రపంచము లోని మతములన్నియు మాలలోని తులసిపూసలవలె నున్నవి.వాటికి పటుత్వం తగ్గినందున తిరిగి మంచి పటుత్వం నిచ్చుటకే నేనవతరించితి ననియు అన్ని మతములు తమవేననియు, తమకు ప్రత్యేకంగా ఏమతము లేదనియుచెప్పిరి. వీరు హాంకాంగ్, అమెరికా మొదలగు దేశములకు కూడ వెళ్ళిరి. వీరు చాల సంవత్సరములు అక్షరపలక సహాయంతో ఎ లగాయతు జడ్ వరకు అక్షరములున్న పలకమీద తాము చెప్పదలచిన మాటలు గుర్తు చేసి చూపగా వారి కార్యదర్శి 'ఈరుచి' అనువారు వీరు చూపిన అక్షరముల గుర్తును గ్రహించి మాటలలో చెప్పుచుండువారు. ఈ విధముగానే విదేశ పర్యటనలు చేయగల్గిరి. తరువాత అక్షరపలక గూడ విడిచిపెట్టి ప్రత్యే కంగా చేతి సంజ్ఞలు ద్వారానే వారి భావములు తెలుపుచుండువారు. ఆ సంజ్ఞలకర్థం వారిశిష్యులు ఈరుచియే ధారాళముగ చెప్పగలుగుచుండేవారు.

గీతలో చెప్పినట్లు మణులలో సూత్రము ఎట్లు కానరాకుండ యున్నదో అట్లే భగవంతుడు యీ సృష్టిలో అందరి హృదయములలో నున్నందున, అందరిని దైవతుల్యులుగ చూచి ప్రేమించ గలిగినప్పుడే తమను నిజముగ ప్రేమించగల్గుటయని బాబా స్పష్టముగ చెప్పిరి. త్రేతాయుగములో శ్రీరామ చంద్రునిగాను, ద్వాపరంలో శ్రీకృష్ణునిగాను, తర్వాత బుద్ధునిగాను, ఏసుక్రీస్తు గాను, మహమ్మదుగాను, నేడు అవతార్ మెహెర్‌బాబాగాను అవతరించి నది ఒకే పరమాత్మయనియు, గీత బోధించినది తామేననియు, వెనుక జన్మలలో తాము చేసిన బోధలన్నియు ఆచరణలో పెట్టక, హాస్యాస్పదం చేసినందున ఈ అవతారంలో తిరిగి బోధచేయుటకుగాక మేల్కొల్పుటకే వచ్చితినని వారి తుది సందేశములో నొక్కి చెప్పిరి.

ఈ ప్రపంచములో ఎన్నిమతములు,ఎన్ని జాతులు, ఎన్నికులము లున్నను ఏమియు ఇబ్బంది లేదనియు, దివ్యప్రేమ ఆచరణలో పెట్టుకొన్న యెడల ప్రపంచమంతయు ప్రేమమయమగుననియు ఎంతటి ఘోరపాపము చేసినను పశ్చాత్తాపపడి ఇకముందు అట్లు చేయనని ప్రతిజ్ఞ చేసిన వారిని క్షమించి అభయహస్త మిచ్చెదని శ్రీకృష్ణుడు గీతలో చెప్పినట్లు బాబా కూడ పాత చిత్తవృత్తులు మార్చుకొని సత్యముగ, ధర్మముగ, ప్రేమతో జీవించినచో ప్రపంచములో విశ్వమానవ సౌభ్రాతృ

త్వము తిరిగి నెలకొల్పబడునను నదే బాబా ప్రేమ సందేశము. ప్రతి ఆదివారం పూజ్యశ్రీ స్వామీజీ సమక్ష మున జరుగు ప్రార్ధన సభలలో, శ్రీ బాబా రెండు ప్రార్ధనలు, ప్రభుస్తుతి, పశ్చాత్తాప ప్రార్ధనలు చదువబడుచున్నవి.

– సర్వేజనా స్సుఖినోభవంతు –

(శ్రీ సనకా రామారావుగారి బోధల ననుసరించి ఇది వ్రాయబడినది)

**(శాంతి – మార్చి 1979)**

## 8. గాంధీ మహాత్ముని జయంతి సందేశములు

శ్రీ గాంధీ మహాత్ముని పవిత్ర జీవితమునుండి, మనమందరము నేర్చు కొనవలసిన వెన్నియోనున్నవి. వారి బోధలను ఆచరణలో పెట్టక పోవుట వలన వచ్చిన నష్టములను మన ప్రస్తుత ప్రభుత్వమువారు బాగుగా గ్రహించి ఈ సంవత్సరం మన నాయకులందరు వారి సమాధివద్దకు వెళ్ళ ప్రార్ధనలు చేసి, వారి పవిత్ర అడుగుజాడలలో నడచెదమని ప్రతిజ్ఞ బూని, దేశపరిపాల నను చేపట్టిరి. ముప్పది సంవత్సరములుగ విస్మరించిన వారి సూత్రములను ఒక్క పర్యాయమే అమలులోపెట్టుట చాలా కష్టమైన పనియైనను, తప్పక దేశక్షేమము, లోకశాంతి కోరి, అమలులో పెట్టుటకు దీక్షవహించుట చాల సంతోషమైనవార్త. ప్రజలందరు హృదయ పూర్వకముగా యిందులకు సహకరించిన యెడల యిదినెరవేరుట అసాధ్యము గాదు. ఇప్పుడు గాంధీ మహాత్ముని బోధలకు ప్రాముఖ్యత హెచ్చుచున్నది. చాలా మంది విదేశీ యులు కూడ వారి అమూల్యసలహాలను ఆచరణలో పెట్టుటకు ప్రయత్నించు చున్నారు. వారి నిరాడంబర జీవితము ఉన్నత ఆశయం, (Simple living and high thinking).అందరూ శ్రద్ధగా పాటించవలసినదే. మద్యనిషేధమును పూర్తిగా అమలులో పెట్టలేకపోయినందు వలన వచ్చిన నష్టములను, అందరు బాగుగా గ్రహించగలిగి, యీ సంవత్సరము దీనిని భారతదేశమంత టకు తప్పక అమలులో పెట్టుటకు తీవ్ర ప్రయత్నములు దైవానుగ్రహమున జరుగుచున్నవి.

మహాత్మాజీ తన తల్లి పోయిన వెనుక గీతామాతనే తన తల్లిగా భావించి, అనేక సందేహములను నివృత్తి చేసుకొని శాంతిగా నుండగలిగిరి. రామనామ మహిమను, మహాత్ముడు జీవితమంతయు ఆచరణలో పెట్టి చూపి చివరకు హఠాత్తుగ ప్రాణంపోవునపుడు సహితం, హే రాం ! అను మాటలతో ఆయన ప్రాణం విడుచుట లోకములో అందరకు తెలిసినదేగదా! జీవితమంతయు వారు రామరాజ్య స్థాపన కొరకు కృషిచేసి, ఆ తలంపులోనే వారు ప్రాణం విడిచినందున మన నాయకులందరు, రామరాజ్య స్థాపనకు కృషి చేయుచున్నారు. ఇట్టి పవిత్ర కార్యమునకు అందరు హృదయ పూర్వక ముగా సహకరించవలసినదే.

ఖాదీతయారుచేయుట, ఖాదీనే ప్రతివారును ధరించుట వారు సూచించిన ముఖ్యసూత్రము. మన స్వపరిపాలనలో దీనిని ప్రోత్సాహపరచుటకు అనేక సదవకాశ

ములున్నవి. వారి అమూల్య స్వీయచరిత్ర ప్రతివారు ఒక పర్యాయము తప్పక చదువ తగిన ఉత్తమ గ్రంథము. దానిలో మన మందరం తెలుసుకొని ఆచరించి వృద్ధి పొందు అవకాశము లెన్నియో ఉన్నవి. బ్రహ్మచర్యము యొక్క ప్రాముఖ్యతను వారు అనుభవపూర్వకముగ చెప్పిరి. వివాహితులు కూడ యింద్రియ నిగ్రహము ఎట్లుచేసి, ఆరోగ్యమును వృద్ధి చేసుకొనుటకు ఉపయోగించు సలహాలెన్నియో నున్నవి. ప్రార్థన యొక్క ప్రాముఖ్యతను గురించి వారుచెప్పిన మాటలు, ఆశ్రమంలో శ్రీస్వామీజీ నిత్యం ప్రార్ధన సమావేశములలో జ్ఞాపకం చేయుచునే యున్నారు. "నేను ఏమి లేకపోయినను జీవించగలనుగాని, ప్రార్థన లేక జీవించలేనని"వారి జీవితములో ప్రార్థన యొక్క ప్రాముఖ్యతను ఋజువుచేసిరి.

వశిష్టుడు, విశ్వామిత్రుల సంఘర్షణలో శారీరక బలముకంటె, ఆత్మ బలము ఎంతగొప్పదియో ఋజువైనది. మహాత్ముడు కూడ ఆత్మబలము చేయలేనిది, సాధింపలేనిది ఏమియు లేదని ప్రపంచమునకే ఋజువుచేసిరి గదా! రవి అస్తమించని, బ్రిటీషు పరిపాలనను మన భారతదేశములో, సత్యము అహింసలను ఆయుధములతో అంతరింపచేయుట జగద్విఖ్యాతమే గదా! వారి పవిత్ర మార్గముల ననుసరించి, అణు ఆయుధములను విసర్జించి, మైత్రీపూర్వకముగా యుద్ధములను పూర్తిగా విసర్జించి, రాజకీయ భేదాభిప్రాయములను సరిదిద్దుకొనుటకు తీవ్రప్రయత్నములు జరుగు చున్నవి.

హరిజనోద్ధరణను మన ప్రస్తుత ప్రభుత్వము తీవ్రముగా చేబట్టిరి. వారికి ఇండ్ల స్థలములు పొలములు యిచ్చుటేగాక, వాటిని ఇతరులు అన్యాక్రాంతము చేయకుండగ మంచికట్టుదిట్టములు చేయుచుండిరి. అస్పృశ్యత అచిరకాలములోనే మన దేశములో రూపుమాపు దివ్య సూచ నలు కన్పించు చున్నవి. మహాత్మాజీ ప్రకృతి చికిత్సకు చాలా ప్రోత్సాహ మిచ్చిరి. మట్టి పట్టీలతో ఎందరికో వ్యాధులు నిర్మూలం చేయగలిగిరి. వారు "ఆరోగ్య మార్గం" అను చిన్న గ్రంథమును రచించిరి. అందు ఇంగ్లీషు మందుల యొక్క నిరుపయోగమును గురించి తమ అనుభవములను చక్కగ విపులీకరించిరి. ఇది ప్రతివారు చదవదగిన గ్రంథము.

గృహ పరిశ్రమలను గురించి వారి ఉన్నతాశయములను మన ప్రభు త్వము ప్రస్తుతం చాల ప్రాముఖ్యతనిచ్చి అభివృద్ధిచేయ సంకల్పించిరి. గాంధీ శిలావిగ్రహ ములు శాంతి ఆశ్రమంలోను, దీని శాఖ వాల్తేరు ఆశ్రమం లోను ఉంచబడినవి. నూలువడకుట ఆశ్రమంలో ప్రోత్సాహింపబడుచునే యున్నది. ఇంకను విరివిగా రాట్నములు తెప్పించి అభివృద్ధి చేయుటకు చర్యలు తీసుకొనబడుచున్నవి. జీవించు టకు మాత్రమే తినవలసియుండును అను సూక్తి నిత్యము జ్ఞాపకము చేయబడి, అమలులో పెట్టబడుచున్నది.

భగవదనుగ్రహమున భారతదేశమునకు మంచికాలము వచ్చినదను టకు సందేహములేదు. మన ప్రస్తుత ప్రధాని, గాంధీగారి అడుగుజాడలలో నడచుచు

మన దేశోద్ధరణకు నిరంతరం కృషిచేయుచున్న సంగతి లోక విదితమే. ప్రభుత్వముతో ప్రజలందరు హృదయపూర్వకముగ, ఐకమత్యముతో సహకరించుటెంతయో అవసరము. అట్లుచేసినచో భారతదేశము, ప్రపంచమునకంతకు ఆదర్శయుత ప్రజాప్రభుత్వముగా దైవానుగ్రహమున అచిరకాలముననే విరాజిల్లగలదు.

లోకాసమస్తా సుఖినో భవంతు !

**(శాంతి - అక్టోబరు 1977)**

బుద్ధ భగవానుని, ఏసుక్రీస్తు జీవితముల తరువాత ప్రపంచముకంతకు ఆరద్శజీవితం మహాత్మునిదే. పవిత్ర భారతావనిలోని స్త్రీ పురుషులందరికి, దేశభక్తి, నిస్వార్థసేవ నేర్పిన జాతిపిత. వారి పవిత్రమైన సహాయ నిరాకారణోద్యమము ద్వారానే మనము పరహస్తముల నుండి స్వరాజ్యము అవలీలగ సంపాదించు కొనగలిగితిమి.

శరీరమునకు ఎంత అవసరమో అంత భోజనం చేయమనెడి వారు. జీవితము భుజించుటకు కాదని స్పష్టంగా చెప్పేవారు. మితాహారం, శాఖా హారం తీసుకొనువారి దరికి రోగములు సాధారణముగారావు. వచ్చినను వాటిని, ఉపవాసములతో, ప్రకృతి చికిత్సలతోనే నివారణ చేసుకోవాలని వారు ఆచరణ ద్వారా అందరకు చెప్పెడివారు. ప్రతివారు స్వయముగా ప్రత్తి నుండి ఏకులు తయారుచేసి రాట్నము మీద నూలువడికి, ఖద్దరు బట్టలనే ధరించుట చాల ఉత్తమ పద్ధతనేవారు, రెండవ పక్షము ఖాదీబట్టలనే వాడుట మన కర్తవ్యము. భగవంతుడు మనకు మానవజన్మను ప్రసాదించి నప్పుడు– మానవునిగనే సుఖంగా జీవించక, మద్యపానంచేసి పశువులవలె జీవించుట తగదనియు మద్యపాన నిషేదము దేశక్షేమమున కెంతయో అవసరమని చెప్పుచుండెడి వారు. వస్త్రములనుగాని, ఆహార పదార్ధములను గాని తమకు అవసర మున్నంతవరకే సంపాదించుకోవాలి గాని హెచ్చుగా కూడబెట్టి దాచుట పాపమనియు చెప్పిరి. నేటి పాపి రేపు సాధువు కావచ్చును గాన,పాపిని ఎన్నడు ద్వేషించవలదు. పాపమును ద్వేషించమని చెప్పేవారు. గాంధీగారు అట్లు ఆచరించి చెప్పుట వల్లనే మహాత్ము డయ్యెను.

పూజ్యశ్రీ స్వామీజీ సదా చెప్పుచున్నట్లు మానవులందరు దైవబిడ్డలేగాన ఒకరినొకరు ద్వేషించుకొనక, తమను తాము, తమవారిని ఎట్లు ప్రేమించు చుంటిరో, సర్వులను అట్లే ప్రేమించుచు, ప్రతిఫలాపేక్ష లేకుండా సహాయం చేయుటే, మన శాంతి సుఖములకు దగ్గర మార్గమనియు, ఎవరు ఏ పేరుతో పిలచినను అన్ని మతములకు దైవమొక్కడే, ప్రపంచమంతా ఒకే కుటుంబ మనియు, మతములు, కులములు పోనక్కరలేదనియు, ముఖ్యముగా పోవలసినది మన హృదయములలోని కలుషత్వము, ద్వేషభావమేననియు, అది తొలగించుకొనిన ప్రపంచమంతయు ప్రేమమయ మగుననియు, నిరంతరం శలవిచ్చుచుందురు.

గాంధీమహాత్ముడు హిందూమహ్మదీయ సమైక్యతకు ఎంతయో కృషి చేసిరి గాని ఫలించలేదు. లార్డు మౌంట్‌బాటన్ మనకు స్వరాజ్యమిచ్చు చున్నట్లు తృప్తిపరచి, భారతదేశమును రెండుగాచీల్చి మహమ్మదీయులకు పాకిస్తానును ప్రసాదించెను. గాని ఎవరి స్వభావములను ఎవరు తేలికగ మార్చగలరు ? మొగల్ రాజ్యము అంతరించినప్పటి నుండియు తిరిగి హిందూ దేశమంతయు మహమ్మదీయ రాజ్యం స్థాపించవలెనని మహమ్మ దీయులు ప్రయత్నం చేయుచునే యున్నారు. మహాత్ముడు చూపిన సత్య అహింస మార్గములలో నడచుచు, శాంతిగా నుండుటకు బదులు వారు ఆనాడు ఆత్మ నిగ్రహముతో జరిపిన సహాయ నిరాకరణోద్యమ పవిత్రతను తెలిసికొనలేక, ఈనాడు ప్రతి చిన్న విషయమునకు సమ్మెలు చేయుచు దేశములో అశాంతి అల్లకల్లోలములు రేపుచు అనవసర ఆవేశములతో, బస్సులు వగైరాలు తగులబెట్టుచు ప్రభుత్వ నష్టము, ప్రజానష్టమేనని గుర్తించకపోవుట విచారకరము. ఇట్టి అశాంతి పరిస్థితులలో గాంధీజయంతి ఉత్సవములు గాంధీ తత్త్వమును సరిగా గుర్తించలేక జరుపుకొనిన ఏమి లాభము? మనము వారి అడుగుజాడలలో నడచుచు, సత్యము అహింస లను పాటించుచు సన్మార్గవర్తనులమై, దేశాభ్యుదయమునకు, సర్వుల క్షేమమును కోరుచు ప్రేమతో జీవించినప్పుడే గాంధీ జయంతిని జరుపుకొనిన ప్రయోజనముండును.

వందే మాతరం

లోకాసమస్తా సుఖినో భవంతు !

**(శాంతి - అక్టోబర్ 1979)**

బుద్ధుడు బోధించినట్లే మహాత్ముడు కూడ “అహింసా పరమోధర్మః” అని బోధించిరి. ‘సత్యమేవ జయతే’ అనునది మన జాతీయ జండా సూచించుచున్నది. మన జండాను చూచినప్పుడల్ల విదేశీయులు మన ఉత్తమ ఆదర్శములను గుర్తుచేసుకొనెదరు. పరుల వస్తువులను మనము ఆశించము. ఇతర దేశములలో ప్రవేశించినంత మాత్రమున ఆ దేశ సంపద నాశించము. సత్యధర్మములను ఎన్నడు విడువము. మన జాతిపిత గాంధీజీ నాయకత్వ మున రక్తపాతము ఏమీ లేకుండా సహాయనిరాకరణోద్యమం ద్వారా మనం స్వరాజ్యము సంపాదించ గల్గినాము. అట్లు సంపాదించిన దేశము మరి యొకటి లేదు. ఈ ప్రపంచములో ఏ విధమైన అన్యాయం అక్రమం గాంధీజీ సహించలేదు. బ్రిటీషు పరిపాలనా విధానమును ఆయన విమర్శించెను. గాని బ్రిటిషువారిని ఆయన ఎన్నడు ద్వేషించలేదు.

భారతదేశ పాలకులు ప్రజలు గాంధీజీ బోధలను ఆచరణలో పెట్టుకొన గలిగిన మన పవిత్ర భారతావని ఎంతో ఆదర్శనీయ రాజ్యముగ శాంతిగ క్షేమంగా నుండగలదు. గాంధీ జీవితాశయముల నెట్టి పరిస్థితులలోను విడిచిపెట్టలేదు. ఇంగ్లండు రౌండు టేబులు సమావేశమునకు కూడ ఆయన అంగవస్త్రముతోనే వెళ్లగలిగిన ధీరుడు. ఇంకను వారి నుండి నేర్చుకొనవలసినవి ఇంద్రియ నిగ్రహం,

బ్రహ్మచర్యము యొక్క విలువను వారు ఆచరణ ద్వారా చూపిన మహనీయుడు. గాంధీ జయంతి సందర్భముగా గాంధీ విగ్రహములు నిల్పుట, వీధులకు వారి పేరు పెట్టుటతో తృప్తి చెందక వారి జీవితాశయములను ఉద్యోగస్తులు, వర్తకులు ప్రతివారు జీర్ణింపచేసికొని, ఆచరణలో చూపగల్గి నప్పుడే తిరిగి దేశము సుభిక్షముగా నుండగలదు. మనము భగవంతుని ప్రతినిధులవలె ఈ ప్రపంచములో వ్యవహరిం చుచు ఇతరుల కష్టములు మనవిగా భావించుచు, ప్రేమతోను, నిస్వార్ధముగాను సేవచేయగలగాలి. అప్పుడే మానవ జీవితం సార్ధకమగునని పూజ్యశ్రీ స్వామీజీ సదా శలవిచ్చు చుందురు. హరి జనోద్ధరణకు గాంధీజీ చేసిన సేవ అపారము. 'ఆత్మవత్ సర్వభూతాని' అను సిద్ధాంతము ననుసరించి వారిని మన స్వంతముగా భావించి ప్రేమతో మంచి సలహాల నివ్వగలిగినచో వారు హిందూమత సిద్ధాంతమును బాగుగా జీర్ణింపచేసికొని యితర మతములను ఎన్నడూ ఎవరూ స్వీకరించరు.

'ధర్మోరక్షతి రక్షితః' ధర్మమును మనము రక్షించుచున్నచో ధర్మమే మనలను రక్షించును. ధర్మరాజు జీవితములో తాను ప్రాణము విడుచుటకై నను సిద్ధముగా నుండెదనుగాని ధర్మమును ఎన్నడు విడనాడలే ననిరి. అందు చేతనే ధర్మముగా పరిపాలన మొనర్చిన శ్రీరామచంద్రుని, ధర్మరక్షణ కోసం అవతరించిన శ్రీకృష్ణుని, ధర్మ స్వరూపిగా జీవించిన ధర్మరాజాదులను యుగములు గడచినను ఈనాటికిని మనము మరువలేకున్నాము. పరమే శ్వరుడు భారతీయ పరిపాలకులను, ప్రజలను ధర్మ పరులుగా నొనరించి భారతదేశమును శాంతి సౌభాగ్యములతో బ్రోచుగాక.

లోకాసమస్తా సుఖినో భవంతు !

**(శాంతి - అక్టోబర్ 1981)**

## 9. మాతృశ్రీ శారదా దేవి - పవిత్ర జనని

మాతృశ్రీ శారదాదేవి జయరాంబాటి యను గ్రామమున కడుబీద శ్రోత్రియ బ్రాహ్మణ కుటుంబములో 1853 డిశంబరు 22వ తేదీన జన్మించెను. శ్రీరామకృష్ణుని కొరకు కన్యను వెదకుచుండగా, వారు స్వయ ముగా "జయరాంబాటిలో యున్న అమ్మాయిని వివాహము చేయుడని చెప్పగా వారి అన్నగారు వెళ్ళి ఆ గ్రామమున విచారించగా, చాల చిన్న బాలికయైనను, ఆమె తల్లిదండ్రులు ఆమెను శ్రీరామకృష్ణుల కిచ్చి వివాహము చేయుటకు వెంటనే తేలికగా అంగీకరించిరి. ఈ సంఘటనవల్ల కూడ వివాహములు కేవలం దైవ నిర్ణయములు. మన చేతిలో ఏమియులేదని తెలియుచున్నది. ఆమె హెచ్చుగా చదువుకొనలేదు. వివాహమైనను ఆమె చాల సంవత్సరములు పుట్టినింటిలోనే యుండిపోయెను. శ్రీరామకృష్ణునకు పిచ్చిపట్టినదని గ్రామములో పుకారు పుట్టినది. గాని ఆమె చలించలేదు. యుక్తవయస్సు వచ్చిన తరువాత కొన్ని సంవత్సరములకు భర్తను కలుసుకొనుటకు తండ్రి అనుమతి తీసుకొని కలకత్తాకు బయలుదేరి అడవి దారిన ప్రయాణము చేయుచుండగా దొంగల గుంపు

ఎదురుపడగ, పల్లకి మోయు వారు భయపడి పారిపోవ ప్రయత్నించిరి. అప్పుడు శారదా దేవి ఆ దొంగల నాయకునితో "నాయనా నీవొక్కడవే వచ్చితివి అమ్మ ఏది?" అని ప్రశ్నిం చగా, ఆతడు ఆశ్చర్యంతో అమ్మా ! అమ్మ ఇంటివద్ద నున్నది. రమ్ము! మాయింట ఈ రాత్రి విశ్రాంతి తీసుకొందువుగాని" యని ప్రేమతో చెప్పెను. అప్పుడు శారదా దేవి నేను నీ అల్లునియొద్దకు కలకత్తాకు వెళ్ళుచుంటిని నీవును అచ్చటకు నాతో వచ్చెదవాయని అడుగగా లేదు నేనిప్పుడు రాలేను. మరియొక మారు వచ్చెదనని సమాధానపరచి పంపెను. ఆమె మర్నాడు కలకత్తా చేరగానే భర్త ఈమెను చూచి "నీవు నన్ను సంసార కూపములోనికి దించుటకు వచ్చితివా?" అని ప్రశ్నించెను. "నేను మీ మార్గమునకు అడ్డు రానని" చెప్పెను. వీరిద్దరు ఒకరికొకరికి శారీరక సంబంధము లేకనే అన్యోన్య దాంపత్యముచేసిరి. క్రమేణ శ్రీరామకృష్ణు లామెను, జగజ్జననిగా భావించి పీఠము మీద గూర్చుండచేసి షోడశోపచార పూజకూడ అతి భక్తి శ్రద్ధలతో చేసిరి. ఒకసారి ఆమెతో "నీకు పిల్లల లేరని బాధపడనవసరం లేదు." ఇంతమంది పిల్లలు ఎందుకని బాధపడు రోజులు వచ్చును" అనిరి. అట్లే వారు శరీరము విడచిన తరువాత, ఆయన శిష్యులందరు అమ్మవద్దనే సేవచేయుచు, ఉపదేశములు పొందుచు కాలంగడిపేవారు. ఈమె జగజ్జనని అంశముగావుననే కులమత విచక్షణ లేక అందరిని తన స్వంత బిడ్డలవలె ప్రేమించుచుండేది. ఒకప్పుడు శ్రీరామకృష్ణులు శిష్యులతో దేవాలయంలో నున్న కాళికాదేవికిని, శారదాదేవికిని ఏమియు తేడాలేదు. ఆమెకెన్నడు కోపం రానీయకుండ జాగ్రత్తగా మెలగవలసి యుండునని చెప్పిరి.

సోదరి నివేదిత (శ్రీవివేకానంద శిష్యురాలు) భారతదేశం వచ్చినపుడు శారదాదేవి శ్రోత్రియ బ్రాహ్మణ స్త్రీయని, తనను దూరముగా నుంచునేమో అని తలచి చాల సందేహించుచు ఆమెవద్దకు వెళ్ళినది. గాని మాతృశ్రీ ఆమెను అత్యంత ప్రేమతో దగ్గరకు చేర్చుకొని తన సొంతబిడ్డవలె ఆదరిం చగా నివేదిత ఆమె నిష్కల్మష పవిత్ర ప్రేమకు చాల ఆశ్చర్యపడి ముగ్ధురాలై నది. శారదాదేవి ఎప్పుడు, ఎవరిలోను చెడుచూచి యెరుగదు. ఇతరులలో చెడుచూడకపోవుటయే గాక, తనలో ఏమైన దోషములు, లోపములున్నచో వాటిని తెలుసుకొని సవరించుకొనుటకు నిరంతరము ప్రయత్నించు చుండె డిది. ఒకసారి ఒక మహమ్మదీయునకు భోజనము పెట్టుటకు తనవద్దనున్న భక్తురాలు సంకోచించి, దూరము నుండి ఎత్తిపెట్టుచుండగా చూచి ఆమె అట్లుకాదు నేను స్వయముగా వడ్డించెదనని చెప్పి ఆతని వద్ద కూర్చుని మాతృ హృదయంతో నాయనా ! ఏమి కావలయునో నెమ్మదిగా అడిగి వడ్డించుకొని, సావధానముగా భుజించమని చెప్పి అతడు తృప్తిగా, సంతోష ముగా భుజించునట్లు చేసెను.

ఒకనాడొక భక్తుడు అమ్మా ! రోజంతయు నేను సంకీర్తన చేసినను ఒక ముల్లు నా కాలుకు గుచ్చుకొన్నది. ఇది సంకీర్తన ఫలమా? యని అడుగగా బాబూ,

భక్తితో నీవు సంకీర్తన చేయబట్టియే, ముల్లు గ్రుచ్చుకొను టతో సరి పోయెను. లేనిచో కాలే విరిగి వుండవలసినది, ఇంత స్వల్పముతో పోయినందుకు భగవంతునికి మనము కృతజ్ఞులమై యుండవలసి యుండు నని చెప్పి తృప్తి పరచి పంపెను. భక్తులు అనేక సంసార కష్టసుఖములు అమ్మతో చెప్పుకొనుటకు రాగా, ఆమె వాటిని బహు నిదానముగా ఓపికతో విని, వారి వారి మనస్సులకు తృప్తి కలుగునట్లు తగు సమాధానములను సలహాలను చెప్పి, ధైర్యము ఉత్సాహము కలుగునట్లు చేసి పంపుచుండేది. ఆమె వద్దకు వచ్చిన వారెవరునూ ఆశాభంగముతో వృధాగా వెళ్లువారు కారు. ఆమె జీవితములో ప్రతి అనుభవంలోను కూడ విశ్వప్రేమను చూపించి ప్రేమమూర్తిగా ఆరాధించబడినది.

ఆమె జీవితములో పనికిరానివస్తువంటూ ఏదిలేదు, జడపదార్ధముల ఎడ గూడ ఎంతో శ్రద్ధ చూపించెడిది. ఒకనాడొక పరిచారిక చీపురుకట్టను విసిరివేయగా చూచి 'అట్లుకాదు అది మనకు ఎంతోసేవచేయుచున్నదిగాన, దానిని నిర్లక్ష్యముగా పారవేయరాదు. నిదానముగా ఓపికతో ఒక మూల పెట్టవలెననిచెప్పి' అట్లుచేసి చూపినది. పండ్లను తీసుకొని బుట్టలను పార వేయుట మంచిదిగాదని వాటిని భద్రముగా నుంచెడిది. మనుష్యులకు పనికి రానివాటిని పశువులకు, పశువులకు పనికిరాని వాటిని కుక్కలకు, వాటికి పనికిరానివాటిని పక్షులకు ఉపయోగించునట్లు చేయుచుండెడిది. భక్తురాండ్రు ఎవరు ఏ సమయంలో వచ్చి ఉపదేశమిమ్మనినను, ఆమె తనకు సమ్మతం కాకపోయినను, ఎవరి మనస్సు, ఎంతమాత్రం కష్టపెట్టు టకు ఇష్టము లేక ఉపదేశమిచ్చి సంతోషపెట్టి పంపుచుండెడిది. ఆమె పవిత్ర జీవితం భారతీయ స్త్రీలకు ఈనాటికీ ఆదర్శనీయము. అందుచేతనే ఆమె విశ్వజననిగా అన్ని దేశముల వారిచేతను ఆరాధింపబడుచున్నది. ఆమె కలకత్తాలో 1920వ సంవత్సరం జూలై 20వ తేదీన మహాసమాధి నొందెను.

అందుచేతనే పూజ్యశ్రీ స్వామీజీ తరచు గురుకుల బాలబాలికలకు శారదాదేవివలెను, కస్తూరిబాయి వలెను వుండుటకు ప్రయత్నించమని చెప్పు చుందురు. ఆశ్రమంలో అందరి జయంతులు జరిపించుటలో వారి అభిప్రాయమేమనగా ఆయా మహనీయుల గొప్పతనమును, వారిలోనున్న మంచిని గ్రహించి వాటిని ఆచరణలో నుంచుటకొరకేయని శలవిచ్చు చుందురు.

లోకాసమస్తా సుఖినో భవంతు !

(మాతృశ్రీ వర్ధంతి జ్ఞాపకంగా ఈ వ్యాసము ప్రచురించబడెను.)

**(శాంతి – జూన్ & జూలై 1979)**

# 10. బుద్ధుడు

సిద్ధార్థుడు–శుద్ధోధన మహారాజు, మాయాదేవియను రాజదంపతులకు కుమారుడు. ఆయన జన్మించినప్పుడు మహారాజు జ్యోతిష్య శాస్త్రజ్ఞులకు చూపగా వీరు భవిష్యత్తులో మహాత్యాగి అయ్యెదరని చెప్పిరి. రాజు తన కుమారునికి మంచి సౌధము, ఉద్యానవనముల నేర్పాటుచేసి సకల సుఖములు అనుభవించునట్లు చేయగల్గిరి. చాలా కాలము అట్లుగడచెను. యుక్తవయస్సు రాగానే సిద్ధార్థునకు వివాహమొనరించెను. భార్య యశోధర మహాసౌందర్యవతి. మహారాజు తన కుమారుని రాజభవనమువిడిచి నగరములోనికి ఎన్నడూ ప్రవేశించనీయలేదు. సదా సర్వభోగములతో జీవితము స్వర్గతుల్యముగా గడుపుచుండెను. కాని విధి బలీయమైనది.

రాజకుమారునికి ఒకనాడు హఠాత్తుగా నగరములోనికి వెళ్ళి చూడవల యునని సంకల్పము కలుగగా యీ విషయం రాజుగారు తెలుసుకొని వెంటనే నగర మంతయు చక్కగా అలంకరింపచేయించి ఎటు చూచినను స్వర్గతుల్యముగా కనిపించునట్లు ఏర్పాటు చేయగలిగిరి. గాని దైవ విధిని ఎవరు తప్పించ గలరు? సిద్ధార్థుని రథము రాజసౌధము విడచి నగరములో ప్రవేశించినది. దారిలో మొదట ఒక వృద్ధుడు కనుపించెను ఆతడు కర్ర సహాయముతో వంగి నడచుచుండుట చూచి తన సారథిని ప్రశ్నించి శరీరమునకు యౌవనము గడచి ముసలితనము రాకతప్పదని తెలిసికొనెను. మరికొంత దూరము వెళ్ళగా ఒక వ్యాధిగ్రస్తుడు కనిపించెను. వానిని గురించి ప్రశ్నించి శరీరమునకు రోగము రాక తప్పదని తెలుసుకొనెను. తదుపరి ఒక శవమును వాహనముపై తీసికొని వెళ్ళుటచూచి సారథిని ప్రశ్నించి పుట్టిన ప్రతి వారికి మృత్యువు తప్పదని తెలుసుకొనిరి. రథము మరికొంత దూరము వెళ్ళగా ఒక సన్యాసిని చూచి ఈ ప్రపంచమంతయు దుఃఖ భూయిష్టమని తెలుసుకొని అతడు సన్యసించెనని తెలుసుకొనెను. తన సారథితో ఇక ముందుకు వెళ్ళనవసరంలేదు. రథమును వెనుకకు త్రిప్పమని చెప్పి రాజ సౌధము చేరెను.

ఆశ్చర్యమేమనగా రాజకుమారుడు జీవితములో ఒక్క కష్టమైనను అనుభవించలేదు. గాని రాజధాని నగరములో ప్రవేశించి ఒక్కసారి కష్టము లన్నియు చూచినంత మాత్రముననే యీ ప్రపంచమంతయు దుఃఖ భూయిష్ట మని తెలుసుకొని గొప్పవైరాగ్యముచెంది ఈ దుఃఖనివృత్తికి మార్గము తెలుసుకొనవలెనని సంకల్పించెను. రాజ్యమును, అందమైన భార్యను పసిబాలుని విడిచిపెట్టి అరణ్యములోనికి తపస్సునకు బయలుదేరెను. అచ్చట కొన్ని సంవత్సరములు మహాతపస్సుచేసి శరీరమును శుష్కింప జేసుకొనెను. ఆయనతోపాటు తపస్సు చేసుకొనుచున్న నలుగురు యువకులు ఆయన స్థితిచూచి వారిని విడిచి వెళ్ళిపోయిరి. తరువాత శరీరమును శుష్కింప చేసుకొని తపస్సు చేయుట మంచిదిగాదని తెలుసుకొని మితాహారము తీసుకొనుచు, తిరిగి

తపస్సు ప్రారంభించి, ఈ మారు జ్ఞానోదయమగు వరకు బోధి వృక్షము నుండి లేవరాదని నిశ్చయించుకొని చివరకు జయ మును పొంది బుద్ధుడు కాగలిగెను.

వారు తమకు కలిగిన జ్ఞానానుభవమును బోధించుటకై ప్రధమముగా సారనాథ్ వెళ్ళిరి. అచ్చట బుద్ధుని ముఖారవిందముచూచి ఆయనను విడిచి వెళ్ళిన నలుగురు తిరిగి వారి వద్దకుచేరి శిష్యులై "అహింసా పరమో ధర్మః" అను సూత్రముపైననే వారి ప్రచారము ప్రారంభమయ్యెను. ఆ కాలములో జంతుబలులు హెచ్చుగా జరుగుచుండేవి. బింబిసారుడను చక్రవర్తి జంతు బలులను ప్రోత్సహించుట తెలుసుకొని బుద్ధుడు ఆయనను సమీపించి తనను ముందుగా బలి యిమ్మనికోరగా, ఆ చక్రవర్తి చాలా ఆశ్చర్యపడి బుద్ధుని బోధలు గుర్తించి తన రాజ్యములో వెంటనే జంతుబలు లను నిషేదించెదనని చెప్పి అట్లు చేసెను. ఇటులనే బుద్ధుడు అనేక తావులలో ప్రబోధము చేసి జంతుబలులను అరికట్టగలిగెను.

బుద్ధుడు భగవంతుని గురించి, ఆయన యున్నాడనిగాని, లేడని గాని ఏవిధమైన ప్రచారము చేయలేదు. దేశమునకు కావలసినది సర్వ మానవ సౌభ్రాతృత్వము, సర్వభూతహితము అను సిద్ధాంతమునే దేశ వ్యాప్తముగా బోధించెను. స్వదేశములోను, విదేశములోను వీరికి అనేకమంది అనుచరు లైరి. చైనా, సింహళము, బర్మా, జపాను, ఇండోనేషియా, మొదలగు దేశ ములలో బుద్ధతత్వము బాగుగా వ్యాపించినది. అట్టి మహనీయుడు జన్మిం చిన పవిత్ర పుణ్యభూమిలో పుట్టియు యిప్పుడూ జంతు బలులిచ్చుట చాల శోచనీయము. పాశ్చాత్య నాగరికత ప్రభావం వలన మాంసాహారులుగ మారుట చాల విచారకరముగా ఉన్నది.

భగవద్గీతలో చెప్పినట్లు రాజసిక తామసికాహారములను నెమ్మదిగా విడిచి సాత్వికాహారముతో జీవితములను గడుపుచు దైవత్వమును సంపా దించుటకు బదులు, పశువులుగా దిగజారిపోవుచుండుట కడు శోచ నీయము. శాఖాహారము సాత్వికాహారమేగాక శరీరములో అనేక జబ్బులను రానీయదని విజ్ఞాన వేత్తలు పరిశోధనల వలన బాగుగా తెలుసుకొని హిందూ దేశములో అనేక వేల సంవత్సరముల క్రితము ఋషులు చెప్పిన వన్నియు యదార్ధములని నెమ్మది నెమ్మదిగా అంగీకరించగలుగు చున్నారు. గాని శాఖాహారులు రుచిని విడువలేక జిహ్వాచాపల్యము చేత మాంసాహారు లుగా మారిపోవుచుండుట శోచనీయము.

ఇటీవల "జీవబంధు" అను పత్రిక ద్వారా కొందరు ఎంతప్రయత్నము, ప్రచారము చేయుచున్నను మన దేశము ప్రస్తుతం దురదృష్టవశమున ఇంకను జంతుబలులు ఆపలేకపోవుటయు, జీవహింసయు జరుగుచునే యున్నది. జీవహింస చేయరాదను బుద్ధుని సిద్ధాంతము ప్రతివారి హృదయములో నాటినప్పుడే అది తప్పక అరికట్టబడును. అప్పుడే మనము బుద్ధ జయంతులు జరుపుకొనుట సార్ధకమగును. అహింసా పరమోధర్మః అను పవిత్రసూక్తిని ఆచరణలో పెట్టినపుడే మానవజన్మ సార్ధక మగును. ఓం శాంతిః శాంతిః శాంతిః

**(శాంతి – మే & జూన్ 1981)**

# 11. శ్రీ శంకరాచార్యుల జయంతి

పరమశివుడే భారతదేశములో ధర్మోద్ధరణకు మానవ శరీరము దాల్చి కేరళ రాష్ట్రములో కాలడి అను గ్రామమున ఆర్యాంబ శివగురువులను పుణ్య దంపతులకు పుత్రునిగా జన్మించిరి. వీరు కారణ జన్ములగుటచే బాల్యముననే సన్యాసము తీసుకొనుటకు అనుజ్ఞ నిమ్మని తల్లినికోరగా ఆమె ఒక్క కుమారుడు సన్యాసియైన ఎడల తనకు దిక్కెవరని అనుమతి యివ్వ లేకపోయినది. గాని ఒకనాడు శంకరులు నదిలో స్నానము చేయుటకు వెళ్ళగా ఒక మొసలి కాలుపట్టుకొనినది. అప్పుడు నదీతీరమున నున్న తల్లిని పిలచి, "అమ్మా మొసలి నా ప్రాణము తీసుకొనునుగాన, నేను సన్యాసము పుచ్చుకొన్నచో విడుచునని" చెప్పగ ఆమె కుమారుని ప్రాణ రక్షణకు సన్యాసమునకు అనుమతిచ్చినది."

వారు చిన్న వయస్సునందే దేశమంతటను పర్యటించి ప్రస్తానత్రయము నకు భాష్యము వ్రాయుటేగాక, వివేకచూడామణి, అపరోక్షానుభూతి, భజగోవింద శ్లోకములు మొదలగు అనేక వేదాంత గ్రంథములు రచించిన మహా జ్ఞానులు. ఆనాటి కాలములో ఎన్నియెా కులమతముల దురాచార ములు మాన్పి, షణ్మతస్థాపకులు అని పేరు సంపాదించిన మహనీయులు. కర్మసిద్ధాంతమే చాలాగొప్పదని ప్రచారము చేయుచున్న మండనమిశ్రుడను గృహస్తునితో వాగ్వాదము చేసి, వారిని జయించగా ఆయనపత్ని ఉభయ భారతి తనను కూడా జయించిన గాని పూర్ణజయము కాదని చెప్పగా శంకరులు ఆమెతో కూడా వాదన చేయుటకు అంగీకరించిరి. అంతట ఆమె కామశాస్త్రము మీద ప్రశ్నలు వేయగా వీరు బాల సన్యాసులగుటచే కొంత వ్యవధికోరి ఆ శాస్త్రము కూడ చదివి వాదనకు సిద్ధపడెదనని చెప్పి పర్యటనకు బయలుదేరి ఒక నగరమున ఎక్కువ భార్యలు గల మహారాజు గారు మరణించుట తెలుసుకొని వారు పరకాయ ప్రవేశవిద్య గల వారు గావున తమ శరీరము నొక రహస్య ప్రదేశమున గుహలో నుంచి శిష్యులను జాగ్రత్తగ చూచుచుండమని కోరి, రాజు శరీరములో ప్రవేశించిరి. అంతట ఆ రాజు తిరిగి బ్రతికెనని రాణులు, మంత్రులు అందరు చాలా ఆనందిం చిరి. కాని కొలది రోజులలోనే వారు పాతరాజుకాదని ఒక గొప్ప యోగి రాజు శరీరములో నున్నారని గ్రహించి వారి పాత శరీరము కాల్చివేసినచో రాజు రూపములో నున్నవారు తమకు శాశ్వతముగా దక్కునని ఆలోచన చేసి రాజ్యములో దహనముగాని మృత శరీరములున్నచో వెంటనే దహించ వలసినదిగా ఆజ్ఞచేసిరి. రాజభటులు శంకరుల శరీరం తెలుసుకొని దహించుటకు ప్రయత్నించు చుండుగా, కాపలావున్న శిష్యులు వెంటనే రాజుగారి యొద్దకు వెళ్లి వారికే అర్ధమగు భాషలో శరీరము దహింపబడు చున్నదని తెలుపగా వారు వెంటనే రాజు శరీరము విడిచి తమ శరీరంలో ప్రవేశించిరి. గాని అప్పటికే అగ్నిచేత కొన్ని అవయవములు కాల్చబడగా వారు లక్ష్మీ నృసింహస్తవము చేసి మరల పూర్తి స్వస్థత నొందగలిగిరి.

తిరిగి మండనమిశ్రుని భార్యతో వాదన చేసి ఆమెను కూడ జయించగా వారిరువురు శంకరులకు శిష్యులైరి. మండన మిశ్రునికి సురేశ్వరాచార్యు లను పేరునిచ్చి శృంగేరిలో మొదట స్థాపించిన శారదా మఠమునకు ప్రథమ పీఠాధిపతిగా చేసిరి. అట్లే పవిత్ర భారత దేశోద్ధరణకు నాల్గువైపుల నాల్గు మఠములను స్థాపించిరి. (శృంగేరి, ద్వారక, పూరిగోవర్ధన, ఉత్తరమున జ్యోతిర్మఠము) వారి పవిత్ర జీవితమునుండి అందరూ నిత్యము జ్ఞాపక ముంచు కొనదగిన ఘట్టములలో ముఖ్యమైనది. వారు ఒక యింటికి భిక్షకు వెళ్ళి 'భవతి భిక్షాందేహి' అని కోరగా ఆ యింటి యిల్లాలు చాల పేదరాలు అగుటచే వీరికి నొసంగుటకు ఏమియు లేక బాధపడుచుండుట గ్రహించి, అమ్మా నీకు ఏది లభించినను దానిని భిక్షపాత్రలో వేయమని కోరగా, ఆమె చేయునది లేక తన యింటి గూటిలోనున్న ఎండిపోయిన ఒక ఉసిరికాయ దొరకగా దానిని ఎంతో భక్తి శ్రద్ధలతో వారి భిక్షపాత్రలో వేసినది. శంకరులు ఆమె దుస్థితిని గ్రహించి, లక్ష్మి దేవిని స్తవనము (కనకధారస్తవము) చేయగా లక్ష్మి ప్రసన్నురాలై తనను పిలిచిన కారణ మడుగగా, వారు ఆ బీదరాలి స్థితిని చెప్పి ఆమెకు ధనము నిమ్మని కోరగా లక్ష్మీదేవి ఈమె ఏ జన్మలోను ఏ విధమైన దాన ధర్మములు చేయలేదు గనుక తానామెకు సహాయము చేయజాలనని చెప్పెను. అంతట స్వామి నా కిప్పుడు ఉసిరికాయ దానము చేసినది కనుక ఆమెకు ఏదైనను ఇమ్మని కోరగా లక్ష్మీదేవి కరుణించి వెంటనే బంగారపు ఉసిరికాయలను వర్షముగా కురిపించినది. దీనినే కోలారు బంగారుగనులుగా యిప్పటికీ పిల్చుచున్నారు.

కనుక మనము దానము చేయనిదే తిరిగి మనము దేనిని పొంద జాలమను సత్యమును ప్రతివారు గ్రహించి, ఈ జన్మలో భగవంతుడు మనకు ప్రసాదించిన అవకాశమును సద్వినియోగము చేసుకొని లేని వారికి మన శక్తికొలది అది భగవంతుని సొమ్ముగా భావించి ప్రేమతో దానము చేసి మానవ జన్మను సార్థకత చేసుకొనమని పూజ్యశ్రీ స్వామీజీ ప్రతి వారిని కోరుచుందురు. అట్లు అందరూ ఉదార హృదయములతో ఇతరుల కష్టములు తమవిగా భావించి ప్రేమతో సహాయం చేయగల్గినపుడే భారత దేశములో మహాత్మాగాంధి కోరిన రామరాజ్యం తిరిగి స్థాపించబడి ప్రపంచ మున కంతకు ఇది ఆదర్శ దేశంగా పరిగణించబడగలదు.

లోకాసమస్తా సుఖినోభవంతు ! **(శాంతి – మే 1982)**

# 12. శ్రీ వినోబాజీ భూదాన యజ్ఞం

మహాత్మాగాంధీజీ, వ్యక్తిగత సత్యాగ్రహమునకు అఖిల భారత దేశములో వినోబాభావే అర్హుడని నిశ్చయించిరి. వీరు పాదయాత్ర భారతదేశ మంతటను చేసిరి.

కమ్యూనిష్టులవలన జరుగు అరాచకమును నిర్మూలించుటకు ప్రయత్నముచేసిరి.తెలంగాణాలో వీరు పర్యటనచేయుచు పూచంపల్లి గ్రామం వెళ్లుట తటస్థించెను. అచ్చట ఒక పేదరైతు బావేను సమీపించి సాగుచేసు కొనుటకు భూమి యిప్పించమని కోరెను. బావే అచ్చట భూకామందులను ఎవరైనను సహాయము చేయరా? అని కోరగా శ్రీరామరెడ్డియను ఒక దాత వెంటనే తాను ఒక వందయెకరముల భూమిని భూమిలేనివారికి దానం చేస్తానని ముందుకు వచ్చెను. శ్రీ వినోబాభావే చాలా సంతోషించిరి. అడిగినంత మాత్రముననే ఇంత భూమిని దానం చేసెనని ఆశ్చర్యపడి అప్పటి నుండి భూదాన యజ్ఞమును ప్రారంభించిరి.

భారత దేశమందలి గ్రామములన్నియు మొత్తం 40వేలమైళ్లు కాలినడకసాగించి మొత్తం 45 లక్షల యెకరముల భూమిని దానముగా బడసి పేదలకు పంచి పెట్టిరి. అన్నదానము కంటే జ్ఞాన దానము చాల గొప్పది. జైలులో వుండగా భావే భగవద్గీతను సాటి కారాగార వాసులకు ప్రభోదిం చిరి. దీనిని డా. వెంపటి సూర్యనారాయణగారు తెలుగులో తర్జుమా చేసి 'గీతా ప్రవచనములు' అనుపేరున బాగా వ్యాప్తి చేయించిరి.

శ్రీపూజ్య ఓంకార స్వామీజీ సగం భూమిని అనగా 5 1/2 యెకరము లను విశాఖ ఆశ్రమంలో ఒక ప్రకృతి చికిత్స చేయుచున్న వారికి దానము చేసిరి. ఆ చికిత్సాలయము నడుపు వ్యక్తి తన ప్రకృతి చికిత్సాలయము గుంటూరు జిల్లాలో కృష్ణానదిలో కొట్టుకొని పోయినదని విలపించిరి. అందు వల్ల స్వామీజీ వారు అడుగకయే దానముచేసిరి.

ప్రస్తుతం ప్రభుత్వం బీదలకు భూమి పంచుచుండగా మన ధనికులు వారికి భూములు దక్కకుండా చేయుచున్నారు. శ్రీ వినోబాజీ తమ జీవిత మంతయు విశ్వమానవ సౌభ్రాతృత్వము ప్రబోధించుచు, దానములుచేసి తరించుడని విరివిగా బోధించిరి. భూదానము చేయలేనివారు సంపద దానము, అదియును లేనివారు శ్రమదానము, ఎవరు ఏ దానము చేయు టకు భగవంతుడు సదవకాశమిచ్చెనో దానిని సద్వినియోగము చేసి అర్హులగు సోదర మానవులకు తగు సహాయముచేసి తరించుటకు నిత్యం ప్రయత్నము చేసి దేశ క్షేమమునకు శాంతికి తోడ్పడగోరు చున్నాము.

మహాభారతములో సువర్ణదానము, భూదానమును గురించి ఎంతగానో బోధించబడి యున్నది. కావున ఈ పుణ్య దేశములో పూర్వజన్మ సుకృతము చేత జన్మించినందుకు అమూల్యమగు మానవజన్మను భూదానము చేసి ధన్యము చేసుకొన

వలయును. ఒట్టిచేతులతో మనము పుట్టితిమి. ఒట్టి చేతులతో ఈ ప్రపంచమును ఎప్పుడో ఒకప్పుడు అందరూ విడువ వలసినదే. చివరకు మన వెంట వచ్చునది మన దాన ఫలములేగదా?

త్యాగభూమి యని పేరొందిన ఈ కర్మభూమిలో జన్మించినందుకు పూజ్యశ్రీ స్వామీజీ నయాగరా నదీ జలపాతమిచ్చిన సందేశమును గొప్పగా రచించిరి. ఆ సందేశమును అనుసరించి ప్రతివారూ తమకు చేతనైన ధర్మమును చేసి ఈ పవిత్రభూమిలో భగవంతుడు జన్మను ప్రసాదించి నందుకు తగిన దానముచేసి జీవితమును ధన్యము చేసుకొనుట చాల యుక్తము. శ్రీపూజ్య స్వామీజీ వారి ఆఖరి క్షణము వరకూ శాంతి ఆశ్రమము దాని శాఖల ద్వారా జ్ఞాన దానము లోకశాంతి కొరకు చేయగలిగిరి. లోక శాంతి ప్రార్థనను ప్రతివారూ భక్తి శ్రద్ధలతో చేయవలసినదిగా ప్రబోధించిరి.

ఓం శాంతిః శాంతిః శాంతిః

(15.11.1982 శ్రీ వినోబాజీ నిర్యాణం పొందిన సందర్భంగా)

**(శాంతి – డిసెంబర్ 1982)**

## 13. మహర్షి శ్రీ సద్గురు మలయాళ స్వాములవారు

శ్రీ మలయాళ స్వాములవారి శతజయంతి మహోత్సవము త్వరలో అనగా మార్చి 28 నుండి ఏప్రియల్ 1వ తేది వరకు జరుగనున్నదన్న ఆనంద వార్త విన్నప్పటి నుండియు ఎంతో పరమానందముగా నున్నది. ఇక వారి భక్తులకు, శిష్యులకు, సన్నిహితులకు ఎంత ఉత్సాహముగా సంతోష దాయకముగా వుండునో వేరుగా వ్రాయనవసరములేదు. ఈ శత జయంతి జ్ఞాపకార్ధముగా వారి పాదపద్మములకు ఏమి అర్పించు కొన వలయును? వారి సన్నిధికి ఏమి అర్పించుకొన్న వారికి ఆనందముగా, తృప్తిగా ఉండునన్న భావన తప్ప ఈ మనోభావ ప్రపంచములో ఏమియు తోచుట లేదు. వారు సిద్ధ పురుషులు వారికి కావలసినది ఏమియు ఉండదు. వారి యందు మనకు నిజమైన భక్తి ప్రేమలు యున్న యెడల, మనలోయున్న స్వార్ధమును, అహంకార మమకారములను వదలి వారి దివ్యబోధలను ఆచరణలో పెట్టి, వారి అడుగు జాడలలో నడచుకొనుచు మన జీవితములను సార్ధకము చేసుకొనుటకు ప్రయత్నించవలెను. ఇదే మనము వారికి అర్పించు కొను కానుక.

శ్రీ స్వాములవారు యావద్భారతావనికి అపూర్వమైన ఆధ్యాత్మిక సేవచేసినట్లు అందరకు తెలిసిన విషయమే. ముఖ్యముగా ఆంధ్రదేశములో ఎనలేని తత్త్వబోధ ప్రచారము గావించి అఖండ సేవను చేసిరి. వారి పవిత్రమైన దివ్య జీవితమును గూర్చి తెలియని వారుండరు. పూజ్యశ్రీ స్వామీజీ (ఓంకారస్వాములు) తరచు చెప్పెడివారు "శ్రీకృష్ణభగవానుని బోధపరచుకొనుటకు మరియొక శ్రీకృష్ణుడే

కావలెనని, ఆవిధముగానే రాముడు, బుద్ధుడు, క్రీస్తు, మహాత్మాగాంధీలను బోధపరచుకొనుటకు అటువంటి అవతారమూర్తులే కావలయుననియు, ఒక మహాత్ముని బోధపరచుకొనుటకు మహాత్ముడే కావలెనని" బోధించెడివారు. అదేవిధముగా మన సద్గురు శ్రీ మలయాళ స్వాముల వారిని బోధపరచుకొనుటకు మరియొక మలయాళ స్వామియే ఉండవలెను కదా! అట్టి ఉన్నత స్థితికి వెళ్ళగల్గినవారే నిజముగా వారిని బోధపరచుకొని తెలుసుకొనగలరు. అటువంటివారే వారి దివ్య స్వరూప మును గ్రహింపగలరు.

శ్రీ వ్యాసాశ్రమమునకు, శ్రీ శాంత్యాశ్రమమునకు చాల సన్నిహిత సంబంధం కలదని వినుటకు శాంతి పాఠకులకు, భక్తులకు ఆనందముగా ఉండును. శ్రీ మలయాళస్వాముల వారు పూజ్యశ్రీ ఓంకార స్వాములవారు ఎంతో ప్రేమానురాగములతో ఉండెడివారు. శ్రీ మలయాళ స్వాములవారు 50 సం॥కు పూర్వము శ్రీ శాంత్యాశ్రమమును సందర్శించినప్పుడు వారు శ్రీ పూజ్య స్వామీజీ కలిసియున్న చిత్రపటము శాంతి ఆశ్రమములో యుం డుట చాలా ఆనందకరము. పలుమార్లు శ్రీ మలయాళ స్వాములవారి దివ్య దర్శన భాగ్యము పొంది,ఆనందముతో వారి దివ్య ఆశీస్సులను పొందుటయేగాక 30 సం॥లకు క్రిందట శ్రీ వ్యాసాశ్రమములో వారి పవిత్ర సన్నిధిలో ఒకటి, రెండు రోజులుండి వారి ప్రేమాశీస్సులు పొందు మహా భాగ్యము కూడా కల్గినదని తెలుపుటకు చాలా ఆనందముగా ఉన్నది. అటువంటి మహర్షుల దివ్య సన్నిధిలో ఒక్క క్షణము గడిపిన చాలునన్న ఆనందము తృప్తి కలిగినది. ఆ పరమ పావనమైన రోజు జీవితములో ఎన్నడూమరుపురాదు. మరల వారిని భౌతికముగా దర్శింపలేక పోయినను వారిని సదా దర్శించుచున్నట్లు గానే హృదయానందముగా నుండును. అటువంటి దివ్యానందమును అనుగ్రహించిన శ్రీ స్వాముల వారి దివ్య పాదపద్మములకు భక్తిపూర్వకమైన హృదయపూర్వక నమస్సుమాంజలులు అర్పించుకొను చుంటిమి. శ్రీ స్వాముల వారు మాలోయున్న దోషములను రూపుమాపి వారి దివ్యాను గ్రహము సదా మాయందుండునట్లు ఆశీర్వదించ గలరని ప్రార్థిస్తూ ఈ శత జయంతి జ్ఞాపకార్థముగా శ్రీ సద్గురు మలయాళ స్వాముల వారి పాద పద్మములకు మా "హృదయ శాంతి పుష్పములను" భక్తితో అర్పించు కొనుచున్నాము.

సర్వులయందు సద్గురుదేవుల ఆశీస్సులుండుగాక !

(పూజ్యశ్రీ మలయాళస్వాములవారి శతజయంతి సందర్భమున శ్రీశాంతి ఆశ్రమం అందించు "హృదయ శాంతి పుష్పములు"

**(శాంతి - మార్చి 1985)**

# 14. పూజ్యశ్రీ చిదానంద స్వామివారికి హృదయ పుష్పాంజలి

పరమపూజ్య శ్రీశ్రీశ్రీ చిదానంద స్వామీజీ మహరాజ్ వారి 75వ జన్మోత్సవము–అమృతోత్సవము సెప్టెంబరు 24,1991నాడు పరమపూజ్య శ్రీశ్రీశ్రీ స్వామి శివానంద గురుదేవుల దివ్యశక్తితో నిండి నిబిడీకృతమైన ఋషీకేష్ శివానందనగర్, దివ్యజీవన సంఘమునందు జరుపబడుట నాకెంతో ఆనందమును కల్గించుచున్నది.

ఈ శుభసమయమున ఈ పవిత్ర క్షణములలో, పవిత్రస్వరూపులు, భగవత్స్వరూపులు పూజ్యశ్రీ చిదానందులకు నేనేమి (మేమేమి) అర్పించ గలను (ము)? పూజ్యశ్రీ స్వామీజీ మానుండి స్వీకరించుటకు ఏమ్మున్నది? అనంత శక్తిమంతుడైన పరమాత్మ, పూజ్యశ్రీ శివానంద గురుదేవులు వారికి ప్రపంచమందలి సర్వస్వము ప్రసాదించిరి. ఇంక వారికి ఇతరుల నుండి (మానుండి) పొందుటకు ఈ ప్రపంచములో ఏమియులేదు. అయినప్పటికి మా హృదయములన్నీ పూజ్య స్వామీజీ వారి దివ్యరూపముతో నింపబడి యుండుటచే వారికి ఏదో ఒకటి అర్పించవలెనన్న తపనతో నిండియున్నవి. ఏమి అర్పించవలెను? మా హృదయములు మనస్సులు ఆయన దివ్య మంగళ రూపముతో నింపబడియున్నవి. కావున ఈ పవిత్ర సమయమున మా హృదయ పుష్పములను ఆయన దివ్య పాదారవిందముల యందు అర్పించి, శరణాగతులమై పూజ్యశ్రీ చిదానందులు మరిన్ని (శత) సంవత్సర ములు జీవించి, మా అందరి దివ్య జీవనములను ఆశీర్వదించుచుండవలె నని ప్రార్థిస్తూ, వారి దివ్య సన్నిధిని, ఎల్లప్పుడూ శాశ్వతముగా అనుభవించు నట్లు అనుగ్రహించ ప్రార్థిస్తున్నాము. పూజ్యశ్రీ గురుదేవులు మరియు అనంత శక్తి స్వరూపుడైన పరమాత్మ పూజ్య స్వామీజీ వార్కి సర్వస్వము ప్రసాదించిరి. పూజ్య స్వామీజీవారు పొందిన సర్వస్వము, దయార్ద్ర హృదయముతో, సర్వసుఖమును విస్మరించి, భగవంతుని బిడ్డలందరికి, అనారోగ్యులకు, అనాథలకు, నోరులేని మూగ జీవ రాసులకు పంచిపెడుతూ, ప్రపంచమంతా నిర్విరామముగా ప్రయాణిస్తూ వారి దివ్య బోధనలను మానవాళి మనుగడకై అందిస్తూ వారి ఆధ్యాత్మిక పురోగతికి మార్గమును వేయు చున్నారు. ఈ కార్యము సామాన్యులకు సాధ్యమా ? ఎప్పుడును కాదు! పూజ్య స్వామీజీ యందు గల అద్వితీయమైన భగవత్‌శక్తియే దీనికంతటికి కారణము. పూజ్య స్వామీజీ సాక్షాత్తు భగవత్స్వరూపులేనని (నా) మా నమ్మిక. ఇది భగవంతునిలీల. అద్భుతమైన విధి. ఆయన దివ్యమహిమకు ప్రణామములు. ఈ నా మనోభావములు ఎల్లప్పుడు నా హృదయమందు నిక్షిప్తము కాబడి నాకు ఎంతో శక్తిని ప్రసాదించు చున్నవి. ఈ అనంత శక్తివంతమైన భావనలు నాకు మాత్రమే పరిమితముకాక, పూజ్యశ్రీ స్వామీజీవారి జన్మోత్సవ సందర్భమున, అందరికి పంచి, వారందరూ అంతర్య శక్తిని పెంపొందించు కొనునట్లు చేయ సంకల్పించి, ఈ నిస్సారమైన మాటలలో వ్రాయుచున్నాను.

నా స్వీయానుభవములో ఎన్నడును మరువలేని సంఘటన, పూజ్యశ్రీ చిదానంద స్వామీజీవారు, శ్రీ శాంతి ఆశ్రమం 'ది మిషన్ ఆఫ్ పీస్' అధ్యక్షు లుగా ఉండుటకు అంగీకారము తెలుపుట పరమపూజ్య శ్రీశ్రీశ్రీ ఓంకార గురుదేవులు మూడు సంవత్సరముల నుండి నిర్విరామముగా, పూజ్య చిదా నందులు ఆశ్రమాధ్యక్షులుగా ఉండవలెనని తెలిపినప్పుడు, ఏ మాత్రము అంగీకరించక, ఆశ్చర్యమును కల్గిస్తూ, అద్భుతమయిన రీతిలో 1982వ సంవత్సరము జనవరి 21 నాడు పరమపూజ్య గురుదేవుల చిరకాల నిర్ణయమునకు అనుగుణముగా "శ్రీశాంతిఆశ్రమం గౌరవాధ్య క్షులు"గా ఉండగలనని అంగీకారము తెలుపుట నిజముగ పూజ్య చిదానందుల వారి అద్భుత శక్తికి ఒక నిదర్శనము. పరమపూజ్య శ్రీశ్రీశ్రీ ఓంకార గురు దేవులు త్వరలో మహాసమాధి అవుతారని ఊహించియే, వారిని ఆనంద పరచుట శ్రీ స్వామీజీవారి ధర్మ కర్తవ్యముగా గ్రహించి ఈ అంగీకారం తెలిపిరనుటలో మాకెట్టి సందేహము లేదు. శ్రీ ఓంకార గురుదేవులు 1982 జూన్ 10వ తేదీన మహా సమాధి పొందిరి. ఈ సంఘటన శ్రీ స్వామివారి దివ్య అంతర్గత జ్ఞానమును, శక్తిని గ్రహింపచేయుచున్నది. పూజ్యశ్రీ ఓంకార గురుదేవులు సదా శలవిచ్చుచుండెడివారు "రామకృష్ణులను అర్థము చేసు కొనుటకు రామకృష్ణులే కావలె"నని. మహాత్ములను మహాత్ములే గ్రహించ గలరు. సామాన్యులు గ్రహింపజాలరు. కావుననే పూజ్యశ్రీ గురుదేవుల భావనలను పూజ్యశ్రీ స్వామీజీ వారు గ్రహించగల్గిరి. శ్రీస్వామివారి మహో న్నత శక్తి అద్భుతము, అఖండము అద్వితీయము. దానియందు మనమంతా సదా లీనమై జీవించునట్లు అనుగ్రహించెదరు గాక యని నా ప్రార్థన.

పూజ్యశ్రీ చిదానందులు స్థిత ప్రజ్ఞులు. వారికి అంతా ఆనందమే. నేను హృదయములోని భావనలను దాచుకొనలేక, ఆనంద పారవశ్యములో ఈ వ్రాతపూర్వకముగా వ్యక్తీకరించి శ్రీవారి నిశ్చలతను భంగపరచినందు లకు క్షమించ ప్రార్థిస్తున్నాను. కాని పూజ్య స్వామీజీవారు 'స్థితప్రజ్ఞులు'. భగవద్గీతలో స్థిత ప్రజ్ఞునికి చెప్పబడిన లక్షణములన్నీ వారిలో మూర్తీ భవించి యున్నవి. కావున ఏ విధమయిన ఆలోచనా తరంగములు, భావనా తరంగ ములు వారి నిశ్చలతను భంగము చేయజాల వని నమ్ముతూ అది అందరి అదృష్టముగా భావిస్తూ ఆనంద మహాసముద్రములో మునిగిపోవుచున్నాను.

మరొక్క పర్యాయము, నా యొక్క, ఆశ్రమవాసులయొక్క, ఆశ్రమ గురుకుల బాలబాలికలు, భక్తులయొక్క, భక్తిపూర్వకమయిన సాష్టాంగ దండ ప్రణామములు అర్పించుకొంటూ, సదా శ్రీ స్వామీజీవారి ఆశీస్సులు కోరుతూ శలవు తీసుకొంటున్న పూజ్యశ్రీ స్వామివారి ఆధ్యాత్మికపు బిడ్డ.

**(శాంతి – అక్టోబరు 1991)**

(పరమపూజ్య శ్రీశ్రీశ్రీ చిదానంద స్వామివారి దివ్య సన్నిధికివే మా (నా) వినయపూర్వక హృదయ పుష్పాంజలులు.) **– జ్ఞానేశ్వరి**

# భాగము - 3

## 1. నా బొబ్బిలి యాత్ర

కాశీయాత్ర, రామేశ్వరయాత్ర, బృందావనయాత్ర, బదరియాత్రయన్న సమంజసముగా యుండి అందరకు తెలియును. అవి యదార్థమగు యాత్రలు గూడ, ఏలయన ఈ పై యాత్రలు సేవించుట వలన పుణ్యము లభించుననియు, ఆ యాత్రలలో యున్న పవిత్ర నదులలో స్నానముల వలనను, దైవదర్శనములచేతను పాపములన్నియు పోవునని గూడ తలచుచూ, యాత్రలు చేయుచుందురు. ఈ పుణ్యస్థలములలో సాక్షాత్ పరమేశ్వరుడు సంచరించినాడు. ఇంకను ఎందరో తపోధనులు, త్యాగ మూర్తులు తపస్సు చేసిన పవిత్ర స్థలములను సందర్శించుట మహాభాగ్యమే కాక, దర్శించిన వారి జీవితములు ధన్యవంతమైన వనియే చెప్పనగును. అయినా వ్యక్తుల పాపములు యాత్రలు చేసినంతమాత్రమున పూర్తిగ పోవునా? ఎన్నటికిని పోవు. వ్యక్తుల జీవితములలో మార్పు వచ్చుటకు అవి కొంత తోడ్పడును. భక్తి శ్రద్ధలతో సాధనచేసి దైవానుగ్రహము పొంద వలయును.

నే జేసిన ఈ బొబ్బిలియాత్ర యేమిటి? దీని వలన ఫలితమేమియని తలచుట సహజమే. దైవము సర్వాంతర్యామి, సర్వజ్ఞుడు, సర్వశక్తివంతుడు. అణువు మొదలు బ్రహ్మాండము వరకు వ్యాపించియుండెనని మన గ్రంథ ములు, మహాత్ములు చెప్పుచుందురు. మనము ఏవైపున కదుగిడినను దైవ ములోనికే ఏగుచుంటిమి. ఎచ్చుట ఏ మొనర్చుచున్నను ఆ దైవతేజస్సుచే ఆవరింపబడి యుంటిమి. ఇక సదా ఆ దైవానుభూతిలో జీవించువారెచ్చట నున్నను, ఎచ్చటకేగినను, అది యాత్రాస్థలముగనే పరిగణింపబడునని శ్రీ స్వామీజీ తరచు సెలవిచ్చుచుందురు. దివ్యక్షేత్రములు సేవించుచు, పుణ్యనదులలో స్నానముచేసిన పాప పరిహారమయి పుణ్యము సంపాదించి, మోక్షమును బడయగలమని తలచెదరు. అది కేవలము మానసిక భ్రాంతియే గాని వేరుకాదు. దివ్య క్షేత్రములు దర్శించుట వలనను, గంగా స్నానముల వలనను కొంత ఫలితముండిన వుండవచ్చును. ఆ దివ్యక్షేత్రములు సేవించిన పుణ్యముండునన్న విశ్వాసములో, భక్తిలో కొంత ఫలితము పొందవచ్చును. అయితే తన నిజస్థితిని తెలుసుకొని, దేనిని పాటించిన జీవితము మోక్షధామ మునకు జేరునో వాటిని తెలుసుకొనిన వారికి ఎచ్చటనున్నను, ఏ తావునకు వెళ్ళినను స్వర్గధామమే గదా! పరమాత్మ సత్య, ధర్మ, ప్రేమ స్వరూపియని మన శాస్త్రములు చెప్పు చున్నవి. అవి ఆచరణలో యుంచినచో సర్వము ప్రత్యక్షదైవ స్వరూపమే, యాత్రా స్థలమే.

అసలు ఈ నా బొబ్బిలి యాత్ర ఏమిటని కొందరు తలచవచ్చును. చరిత్రాత్మక మైన బొబ్బిలి కథ గురించి వినని వారుండదరు. కావున మా బొబ్బిలిని కూడ ఒక యాత్రాస్థలముగ చరిత్రలో జెప్పుకొన వలసినదే. వీరమాత రాణి మల్లమ్మదేవి

జన్మస్థానము. శ్రీరాజారంగారావు వగైరా వారి మాతృస్థానము, శ్రీకృష్ణ భగవానుని ఇలవేల్పుగా కొలుచు పవిత్ర గడ్డ, సదా ఆయన నామస్మరణ పూజలు సలుపబడు పుణ్యభూమి యాత్రాస్థలమే గదా!

ఆ. కృష్ణ! వాసుదేవ! కేశవ! పరమాత్మ,యప్రేమయవరదహరిముకుంద
నిన్ను జాడగంటి,నీకృపగనుగొంటి, నఖిలసౌఖ్యపదవులందగంటి

మ. నినుజింతించుచు,బాడుచుం,బొగుడుచున్ నీ దివ్యచారిత్రముల్
వినుచుం జూతురు గాక! లోకు లితరాన్వేషంబులం జూతురే
ఘనదుర్జన్మ పరంపరాదళన దక్షంబై మహాయోగి వా
గ్వినుతంబైన భవత్పదాబ్జయుగమున్ విశ్వేశ విశ్వంభరా!

శా. నీ పాదాబ్జము బ్రహ్మపూజ్యము గదా,నీ సేవ సంసారసం
తాపధ్వంసినియౌగదా, సకలభద్రశ్రేణులం బ్రీతితో
నాపాదింతుగదా ప్రపన్నులకు, గాలాధీశ కాలంబుని
ర్వ్యాపారంబుగదయ్య చాలరు నినున్ వర్ణింపబ్రహ్మాదులున్!

ప్రస్తుతము దేశములో దేశభక్తి, దైవభక్తి కూడ చాల క్షీణించు చున్నవి. ఈ కాలములో ఆ రెండింటి ఉనికిపట్టైన యీ స్థలము తీర్థయాత్ర కాదగి యున్నది. కాని ఇపుడు ముఖ్యముగ నా చిన్నఅనుభవమునకు నేను బొబ్బిలి వచ్చుట నాకు యాత్రగనే యున్నది. బొబ్బలికి 4,5 మైళ్ళ దూర మున వేగవతియని చిన్న జీవనది ప్రవహించు చున్నది. ఆ నదీ ప్రాంతము లకు వెళ్ళిన అచ్చటి ప్రకృతి, సూర్యభగవానుడు తన బంగారు కిరణములను ప్రసరించుచుండ వింతకాంతుల నీనుచుండును. సూర్యాస్తమయ సమయ ములో అచ్చటి సుందర దృశ్యము గాంచిన, పూర్వము అరణ్యములలో తపస్సు గావించుచు, నదీతీరముల సంధ్యావందనములు, జపములు జేసుకొనుచు ప్రకృతిలో లీనమయ్యెడి ఋషిపుంగవుల గురించి పురాణగాథలలో వర్ణింప బడిన దృశ్యములు జ్ఞప్తికి రాకమానవు.

కారణము లేనిదే కార్యముండదని పెద్దలునుడివెదరు. అటులనే ఈ బొబ్బిలి యాత్ర యని వ్రాయుటకు కూడ కారణముండియే తీరును. చారిత్రాత్మకమైన బొబ్బిలి రాజవంశములో యున్న శ్రీమతి లక్ష్మీ సుభద్రా దేవిగారు, ఆమె సోదరి శ్రీమతి సరస్వతీదేవిగారు, ఆ సోదరీమణు లిరువురికి దైవభక్తి, గురుభక్తి, ప్రేమ ధర్మమునందలి విశ్వాసము అపారమైనవి. వారిని గూర్చి ఎంతయో వ్రాయవలెనని యున్నను, నా చిన్నబుద్ధికి అందుటలేదు. సోదరి సరస్వతీదేవిగారి ఆహ్వానముపై ఈ పవిత్ర రాజమహల్‌కు వచ్చు భాగ్యము నాకు కల్గినది. భాగ్యము కల్గుటయనగా రాజులు నివసించెడి బాహ్యమైన రాజభవనమున వశించు భాగ్యము కాదు. మానవ జీవితమునకు ఏది అవసరమో, ఆ భక్తి ప్రేమలు ఈ మహల్‌లో పూర్తిగ వ్యాపించి వున్న వనుటలో ఎట్టి అతిశయోక్తియు లేదు.

రాజమహల్ వూరి చివరనేగాక,చుట్టును పర్వత పంక్తులలో శోభాయ మానముగ విరాజిల్లు చుండెను. పక్షుల కిలకిలారావములు మనోరంజక ములై అరణ్య ప్రాంతమునందు ఆనందము కలిగించును. ముఖ్యముగా-

గురుర్బ్రహ్మ గురుర్విష్ణు ర్గురుర్దేవో మహేశ్వరః

గురుస్సాక్షాత్ పరంబ్రహ్మ తస్మై శ్రీగురువే నమః॥

అనెడి శ్లోకమునందున్న అంతరార్ధమును సోదరి సరస్వతీ దేవిగారు, ఈ రాజమహాల్ అంతటను సద్గురు దేవుల భక్తితో నింపిరి. గురుభక్తి యననేమియో,గురువు నెట్లారాధించవలయునో ఆమెలో చూడవలయును. సర్వము మరచి,ఆత్మార్పణతో, రోమ రోమములోను, సద్గురుదేవుల స్పర్శనే వ్యక్తము చేయుచున్న ఆమె వీణాగాన మాధుర్యమును ప్రత్యక్షముగ విని అనుభవించవలయునేగాని వర్ణింప తరము గాదు.

ఎచ్చట నిత్యము పూజలు, దివ్యగానము, భజనలు, హోమములు జరుగుచుండునో, ఎచ్చట నామసంకీర్తన భక్తితో జరుగునో అచ్చటనే నేనుంటినని భగవానుడు పల్కిన దివ్యవాక్కులు యిచ్చటనే వ్యక్తమగుచుండె నా యనిపించుచున్నది. ఈ నిర్మల పవిత్ర ప్రదేశము యాత్రగ, పరిగణింప బడకుండునా? ఈ పవిత్ర స్థలములోనేను గడిపిన 15 దినములు చిరస్మర ణీయములు. ప్రతి నిత్యము ప్రార్థన,భజనలలో శ్రీమతి సరస్వతీదేవిగారితో పాల్గొనిన భక్త సోదరీమణులకు నాకృతజ్ఞతాభి వందనములు.

అయినను ఎవరి మనస్తత్వములను బట్టి వారికుండవచ్చును. ఇది కేవలము నా ఆనందము కొరకు, నా అల్పబుద్ధికి ఇది ఒక యాత్రగా చూపట్టుటచే నా సంతోషమును సోదరి సరస్వతీదేవిగారికి ఎట్లు అభివ్యక్తము జేయగలను ? వారి ప్రేమకు అర్హురాలుగ యుండుటెట్లు? ఈ విధమగు రూపకల్పన కావించి,నాచిన్న కానుకగ,హృదయ పూర్వక భక్తి ప్రేమలతో వారి సద్గురు భక్తియుతమైన ప్రేమకు అర్పణ చేసుకొంటిని.

శా. శ్రీకృష్ణాయదుభూషణా నరసఖా! శృంగార రత్నాకరా !
లోకద్రోహినరేంద్రవంశదహనా ! లోకేశ్వరా! దేవతా
నీక బ్రాహ్మణ గోగణార్తి హరణా! నిర్వాణసంధాయకా !
నీకున్ మ్రొక్కెద ద్రుంపవే భవలతల్ నిత్యానుకంపానిధీ!

ఓం ! ఓం ! ఓం !

**(శాంతి - మార్చి 1970)**

# ౨. శ్రీ జ్ఞానేశ్వరి మాతగారి దక్షిణాఫ్రికా యాత్ర

(7.12.89 - 8.1.89)

-శ్రీమతి ఎ.వివేకానందదేవి

రెండు,మూడు వందల సంవత్సరాల క్రింద, చాలామంది భారతీ యులు దక్షిణ ఆఫ్రికా వలస వెళ్లారు. బ్రిటిషు వారి ఆధీనంలో, ఆఫ్రికాతో పాటు మనదేశం కూడా వున్నది. ఆఫ్రికాలో పనిచేసే కూలీలుగా, ఉపాధ్యా యులుగా, వ్యాపారులుగా, గుమాస్తాలుగా మనుష్యులు అవసరమయ్యారు బ్రిటిషువారికి. ఇందుచేత వారు భారతీయుల్ని ముఖ్యంగా ధనార్జనా కాంక్ష గల వార్ని వలసకు ప్రోత్సాహించారు. లక్షలాది భారతీయులు దేశంవదలి వెళ్లి పోయారు. "యధారాజాతధా ప్రజ" అన్నట్లు ప్రభువుల్ని మెప్పించడానికే ఒప్పించడానికే వారి భాష నేర్చుకున్నారు. వారి అడుగుజాడల్లో నడవాలని, కట్టూబొట్టూ వేషం మార్చుకున్నారు. వేలాది మంది మతం కూడా మార్చుకున్నారు. మొదటితరం భారతీయులకు, మాతృదేశం రావడానికి అనుకూల పరిస్థితులులేవు. రెండు మూడుతరాల వారికి మాతృదేశ ప్రేమ బంధు ప్రీతి తగ్గాయి. సాంస్కృతిక సంప్రదాయాలు అడుగంటాయ, ఆధ్యాత్మికత కూడా సన్నగిల్లి పోయింది. వారి మూలాన్ని మరచే స్థితికి దిగజారి పోవడం పెద్దలూ, వృద్ధులూ గమనించారు. తరతరాల బేధం, పాశ్చాత్య నాగరికత యొక్క వెర్రి తలలూ వార్ని వేధిస్తున్నాయి. ఏం చేయాలో తెలియక మూఢులై, మహాత్ములు, మహనీయులకై నిరీక్షిస్తున్నారు. సంపన్నత, విద్యాధికతవున్న, అర్జునునివలె ధర్మాధర్మ విచక్షణకై విషాదయోగంలో పడ్డారు. శాంతి ప్రశాం తికై పరితపిస్తున్నారు. రామకృష్ణమిషన్, దివ్యజీవన సంఘం, ఆర్యసమాజం, సత్యసాయి మండలి వంటి ఆధ్యాత్మిక సమాజాలెన్నో వారి వుద్ధరణకై కృషిచేస్తున్నాయి.

దక్షిణాఫ్రికా గురించి భారతీయులకు జ్ఞాపకముండియే యుండును. అచ్చట క్రిందటి శతాబ్దములో సుమారు ఇదే సమయమునకు మహాత్మగాంధీ గారు కూడ మనదేశ ప్రతినిధిగా సేవ జేయుటకువెళ్ళి యెంతో పెద్దపేరు సంపాదించుకొని భారతదేశము తిరిగివచ్చి యుండిరి. పరమ పూజ్య స్వామి ఓంకార్ గురుదేవులు యెంతో కాలము క్రిందట తన ఆత్మకథలో, తనకు సరియైన గురువు, శిష్యుడుకూడ కుమారి జ్ఞానేశ్వరే కాబట్టి తన అనంతరము వారే ఈ విశాల శ్రీ శాంత్యాశ్రమమునకు ఆధ్యాత్మిక అధిపతి యగు యోగ్యత కలిగి యున్నారనియు, కొంత కాలమునకు జ్ఞానేశ్వరి గారు తన దివ్యత్వ మును వెలిబుచ్చి, క్రమేపీ దేశ విదేశముల యందు పర్యటించి విశ్వశాంతి స్థాపనకు నాంది పలుకుదురనియు వ్రాసియుండిరి. ఇప్పుడు ఈ విషయము మన అనుభవములోనికి వచ్చుచున్నది. పూజ్య మాతాజీగార్కి చాలా దేశాల నుండి అనగా ఫ్రాన్సు, జర్మనీ, అమెరికావంటి దేశాలనుంచి భక్తులు ఆహ్వాన ములు పంపుచున్నప్పటికీ, స్వభావరీత్యా వారికి ఎటువంటి పర్యటనలపై ఆశ, ఆసక్తి కూడ లేనందునను వారందుకు చాలా కాలము నుంచి అంగీ కరించుటలేదు.

కాని దక్షిణాఫ్రికా దివ్యజీవన సంఘాధ్యక్షులు పరమ పూజ్యులు అయిన స్వామి సహజానందవారి ప్రేరేపణ వలనను అచ్చట యున్న భక్తుల ఒత్తిడి వల్లను అక్కడకు వెళ్ళుటకు తప్ప లేదు. అచ్చటి భక్తులు పూజ్య మాతాజీవార్ని క్రిందటి సంవత్సరము నుంచి ఈ ప్రయాణ మునకు అంగీకరించమని ఒత్తిడి చేయగా రాజమండ్రిలో ఉన్న నన్ను (శ్రీమతి అద్దేపల్లి వివేకానందదేవి) తీసుకొని బొంబాయి చేరినారు. బొంబాయి విమానాశ్రయంలో భక్తులు సోదరి సుశీల, వారి భర్త శ్రీరామా నంద గారు, డిన్సోగారు, మరియు ఎంతోమంది యితర భక్తులు పూజ్య మాతాజీని కలుసుకొని అభినందనలు తెలియజేసిరి. మాతాజీవారు సోదరి సుశీల గారింట్లో ఆతిధ్యము స్వీకరించిరి. తే. 7-12-89న బయలు దేరి మారిషస్ మీదుగా దర్బన్ అనే దక్షిణాఫ్రికా ముఖ్యపట్టణము తే.8-12-89న దైవకృప వలన సురక్షితంగా చేరాము.

ప్రేమ్‌సింగ్ వారి కుటుంబము మరియు మిగిలిన ఆశ్రమ భక్తులు విమానాశ్రయానికి వచ్చి అందమైన పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. వీరి ఆశ్రమమైన దివ్యజీవన సంఘం, దర్బన్ నగరంలోని మౌంట్ బేటన్ డ్రైవ్‌లోని రిజర్వాయర్ హిల్స్‌లో వుంది.సువిశాలమైన కొండపైన వున్న ఆ ఆశ్రమం ప్రక్కగా 'అంగానీ' నది ప్రవహిస్తోంది. మమ్మల్ని అచ్చటకు తీసుకొని వెళ్ళినారు. ఆశ్రమంలో చాలా మంది భక్తులు, స్వామి సహజా నందగారు మాతాజీకి స్వాగతం పలికారు. భోజనం, కాస్త విశ్రాంతి అయిన తర్వాత, స్వామి సహజానందవారు ఆశ్రమమంతా త్రిప్పిచూపారు. ప్రార్థనా మందిరంలో శివానందస్వామి వారిది నిలువెత్తు చిత్రపటము పెట్టారు. ప్రక్కగా ఇంద్రధనస్సు రంగుల దీపాలు అమర్చారు. అచ్చట కొంచెం క్రిందుగా ఓంకారుల ఫోటో, శ్రీరామ, శ్రీకృష్ణుల ఫోటోలు అమర్చారు. ఎంతో సుందర మైన పూగుచ్ఛాలు వాటి ముందుంచారు. దృష్టి అటు పోగానే ఆకర్షించేలా వుందా పూజామందిరం.

అచ్చట మాతాజీ వారికి ఆహ్వాన సభ ఏర్పాటు చేసిరి. సభలో పూజ్య స్వామీజీ మాతాజీకి ఎంతో పూజ్య భావంతో స్వాగతము పలికి, వారి స్వాగతోపన్యాసము ఈ విధంగా ఇచ్చిరి. మాతాజీ వారు ఎంతోప్రతిభ కలవారనియు, చిన్నతనముననే శ్రీవారి దగ్గరకు చేరి వారి వద్ద తర్ఫీదు పొంది, మన్ననల నందుకొని మహనీయులైన ఓంకార స్వాముల వారి అడుగుజాడల్లో ప్రయాణిస్తూ శ్రీశాంతి ఆశ్రమము వంటి సువిశాల ఆశ్ర మము, మరియు ప్రపంచ ప్రసిద్ధిగాంచిన యెందరెందరో మహానుభావులు నిరంతరము వచ్చి పోవుచున్న ఆశ్రమము, యెటు వంటి వారికైనా సమర్థ వంతముగా నిర్వహించుట కష్టతరం, పూజ్య మాతాజీ వారు, తమ దివ్య సేవాభావముతో ఆశ్రమమును నిర్వహించుటేగాక, చాల అభివృద్ధిలోకి తీసుకొని వచ్చి, పూజ్య ఓంకార గురుదేవుల ఆశలను సార్ధకం చేసిరి అని అనిరి. తరువాత స్వామీ ఓంకారుల ఆత్మకథయందు స్వామీజీ మాతా జ్ఞానేశ్వరి గార్ని గురించి ఒక

అధ్యాయం వ్రాశారు. అందులో మాతాజీ "స్వామీజీ నుండి నేను ఏమినేర్చుకున్నాను" 21 మణిపూసల వంటి వాక్యాలు వ్రాశారు. వాటిని స్వామీజీ అందరికీ వినిపింప చేశారు. వీటివల్ల మనము గ్రహించవలసినదేమంటే మాతాజీ, దృష్టిలో జీవితం వేరు మతం వేరు కాదు. రెండూ పడుగుపేకల్లా జీవిత వస్త్రంలో పెనవేసుకు పోవాలి. ఇట్టిదే అర్థవంతమైన జీవితం అనిరి. శ్రీ గురుదేవులు శివానందులు, శ్రీ ఓంకార స్వామిని ఎంతగానో ప్రేమించి గౌరవిస్తూ వుండేవారు. వారి అనురాగం ఎంతటి దంటే వారిరువురు ఒకే పడకలో నిద్రించేవారు. వీరి అనుబంధం తుదివరకు కొనసాగింది. లామాసీలో నిర్మిస్తున్న శివానంద అంతర్జాతీయ బాలల కేంద్రాన్ని ప్రారంభించడానికి మాతాజీని పిలవాలని నిర్ణయించాము. కాని అది పూర్తికావడనికి యింకా కొంతకాలం పడుతుందని నిశ్చయించి యిప్పుడే రమ్మని ఆహ్వానం పంపాము. వారు ఎంతో దయతో అంగీకరించి మనవద్దకు వచ్చారు. ఎంతో ఆనందంగా వుంది, వారికి మా ఆశ్రమం తరపున, భక్తులతరపున స్వాగతం సుస్వాగతం అన్నారు.

జ్ఞానేశ్వరి మాతాజీ, వారి హార్ధికస్వాగతాన్ని అందుకుని మృదు మధు రంగా వుపన్యసించారు. భక్తులెంతో ఆనందించి, అభినందించారు. ఓంకార గురువరేణ్యులున్నప్పుడే మాకీ ఆహ్వానం అందింది. వారు కూడా దక్షిణ ఆఫ్రికా వెళ్ళడం మంచిదని శెలవిచ్చేవారు. కాని పై దేశాలకు ప్రయాణం చేయాలనే అభిలాష ఎన్నడూ లేనందువల్ల సంవత్సరాలు దొర్లి పోయాయి. శాంత్యాశ్రమం, శివానందాశ్రమం రెండూ వేరుకావు. బాహ్యంగా వేర్వేరు భౌగోళిక ప్రదేశాల్లో వున్నా ఆశయాల్లో అభిమానంలో రెండూ ఒక్కటిగానే వ్యవహరిస్తున్నాయి. వ్యక్తిశాంతియే, దేశశాంతి, ప్రపంచ శాంతులకు మూలం ఆధారం. మూర్తీభవించిన ప్రేమ దయాకరుణతో, కుల,మత జాతి వివక్షత లేకుండా సర్వుల్నీ ప్రేమించగల్గి, సర్వుల్లో సర్వాంతర్యామి సర్వేశ్వరుణ్ణి చూడగలగడమే నిజమైన మతం. "ఈ దేశానికి రావడం ఆలస్యమైనా ఆనందంగా వుంది, వేరే దేశానికి వచ్చిన అనుభూతి లేదు. మా వారివద్దకే వచ్చామనే అభిమానం కల్గుతుంది. పూజ్య సహజానందులవారికి మేము సదా కృతజ్ఞులం. మేము రాకపోయినా వారెంతో అనుగ్రహంతో మా శాంత్యాశ్రమాభి వృద్ధికి ఎంతో సహాయ సహకారాలు అందిస్తూ వున్నారు. మీ సుస్వాగతానికి మా హార్ధికాభివందనాలు.

ఆ తరువాత పూజ్య సహజానంద స్వామివారు ఒక భక్తునితో సోల్ ఆఫ్ ఓంకార్ అనే పుస్తకములోనుంచి ఒక అధ్యాయం చదివించిరి. ఇక్కడ ఇలా చదవడం ఆనవాయితి. నాడు జరిగిన సత్సంగ సభకు ఎన్నో వందల మంది భారతీయులు హాజరైనారు.

ఆదివారం తిరిగి సత్సంగ సభ జరిగింది. వందలాది భారతీయులు విచ్చేసిరి. పూజ్య మాతాజీవారు శ్రీరామతీర్థస్వామి వారి సూక్తులెన్నో శ్రోతలకు వివరించి

చెప్పి వారి చిన్న పిల్లల ఆదివారపు కార్యక్రమములో ప్రసంగించిరి. “మీరంతా ఎంతో అదృష్టవంతులు, అందుచేతనే స్వామి సహజానందులు మీకు గురువుగా లభించారు. వారి ప్రేమ, ఆదరాభిమానాలు మీకు లభిస్తున్నందువల్ల మీరు ధన్యులు”. మాతాజీ వారికొక కథ చెప్పారు. ఇద్దరు బాలురు గురువు వద్ద విద్యాభ్యాసం చేస్తున్నారు. ఒకనాడు వారిద్దర్ని గురువు గారు పిలిచి యిద్దరికి చెరొక పావురాన్ని ఇచ్చారు. “ఎవరూ లేనిచోటులో వీటిని చంపి తీసుకురండి అని చెప్పి పంపారు. ఒక బాలుడు పక్షిని చంపి వెంటనే వచ్చాడు. రెండవ బాలుడు పక్షిని చంపడానికి ప్రయత్నించగా, ప్రేమ అమాయకత్వం ముప్పిరిగొన్న దాని కళ్ళుచూచి దైవమే జ్ఞాపకం వచ్చి చంపలేక పక్షితో సహా గురువు వద్దకు తిరిగివచ్చి వేశాడు. అన్నిటా అంతటా ప్రేమ చూడగల్గడం మహాసౌభాగ్యం. మీరు వృక్షాల్లో, జంతువుల్లో, అంతటా యీ విశ్వ ప్రేమను చూడండి అని వ్యక్తం చేశారు. చిన్నపిల్లల హృదయాల్ని కథలు ఆకర్షించినంతగా వుపన్యాలు ఆకట్టుకోవు. మాతాజీ పిట్టకథ వార్ని ముగ్ధుల్ని చేసింది.

మధ్యాహ్న భోజనానంతరం శ్రీ సహజానందులవారు కొందరు భక్తు లతో కార్లలో వారు నిర్మించిన పాఠశాల భవనాలు చూడ్డానికి బయలు దేరాము. నల్లజాతి వారికి స్వామీజీ డెబ్బై పై చిలుకు స్కూలు భవనాలు భక్తుల విరాళాలతో నిర్మించారు.

సాయంకాలం సత్సంగానికి కూడా చాలామంది భక్తులు వచ్చారు. శివానంద స్వామి “గాస్‌పెల్” నుండి సగుణ నిర్గుణ బ్రహ్మల గూర్చిన వ్యాఖ్య చదివి వినిపించారు. ప్రతిదినం ప్రార్థనలో ముందుగా గురుస్తుతి, గణపతి స్తవం, యితర దేవి దేవతాస్తవాలు అవగానే, ఓంకారుల శాంతిప్రార్థన, శివానందుల నిత్య ప్రార్థన చదువుతారు. తరువాత భజనావళిగాని, ఏదైనా దైవకీర్తన, స్తుతి గాని గానం చేసిన పిదప కొంతసేపు మౌనంగా ధ్యానం చేస్తారు. హనుమాన్ చాలీసా తప్పనిసరిగా పఠిస్తారు, తరువాత మంగళం ఇవన్నీ భక్తులందరూ చేస్తారు.

పూజ్య మాతాజీ వారు ఇతర దివ్య జీవనసంఘ శాఖలను కూడ పర్యటించి చూచుటకు ఏర్పాట్లు కావించబడినవి. మూగ చెవిటి వారికి కూడా పాఠశాల భవనం నిర్మించారు. మిషనరీ వారిచే నడపబడుతున్న వృద్ధుల శరణాలయం నిర్మించడానికి స్వామీజీ సహాయంచేసి భవన నిర్మాణం పూర్తిచేశారు. “నల్ల జాతీయుల శ్రమ సహాయాలు, శరీర కష్టాలవల్లనే మన భారతీయులు చాల వృద్ధిలోనికి వచ్చారు. వారికి మనం ఋణపడి వున్నాం. వారికి సహాయ సంపదల నీయడం మన కనీస కర్తవ్యం.” అని భక్తులను స్వామీజీ హెచ్చరిస్తూ వుంటారు, శ్రీ సహజానందులీవిధంగా నీగ్రోజాతి వారికి సేవచేయడంచేత వీరంటే నల్లజాతి నాయకులకు యెనలేని గౌరవం అభిమానం ప్రేమ వున్నాయి. నల్లజాతీయులకు,టెక్నికల్ పాఠశాలా భవనాన్ని యెన్నో లక్షల ‘రేండు’ (ఒక రేండు=6రూ.) ల ఖర్చుతో నిర్మిస్తూ వున్నారు స్వామీజీ.

‘లామాసీ’ అనే ఊరిలో, ఊరికి దూరంగా కొండలపైన సుమారు 2,3 వందల యెకరాల్లో, సముద్రతీరంలో ‘అంతర్జాతీయ శివానంద బాలలకేంద్రం’ నిర్మాణంలో

వుంది. ఆ నిర్మాణంలో కేవలం కూలికి నలుగురు నల్లజాతీయులు తప్ప ఇంజనీర్లు, ఆర్కిటెక్స్, ఎలక్ట్రికల్ సూపర్‌వైజర్లు వంటి ఎందరో విద్యావిజ్ఞాన ధనులైన భక్తులు శ్రమదానం చేయుట చూచి ఎంతో ప్రేరణ కలిగెను.

**నేటాల్ దేవాలయాలు :** ముందుగా చిన్న కొండపైనవున్న నారాయణస్వామి దేవాలయానికి వెళ్ళాము. అది భారతీయులు దక్షిణ ఆఫ్రికా వచ్చిన సందర్భములో కట్టిన మొదటి దేవాలయం. దీనిని సుమారు 1820 ప్రాంతంలో నిర్మించారు. అందుచేతనే దీనిని ప్రాచీన జాతీయ చిహ్నంగా (నేషనల్ మాన్యుమెంట్)గా ప్రభుత్వం ప్రకటించి, పదిలపరుస్తూ వుంది. అంగానీ వీధిలో ఒకే ఆవర ణలో వున్న శ్రీదుర్గ, మురుగ, శివా, సీతారామ మందిరాలన్నీ చూచాము. కోయంబత్తూరు నుంచి వచ్చిన సెట్టి గారు వీటిని భక్తి శ్రద్ధలతో నిర్మించి దివంగతులయ్యారు. వీరి కుమారులు ధర్మకర్తలుగా ఉండి ప్రస్తుతము దేవాలయాన్ని సంరక్షిస్తున్నారు. వీరు తెలుగు వారు కావడం విశేషం. ఇక్కడ ముఖ్యమైన వ్యాపార కేంద్రమైన బజారు పేరు వెస్టు స్ట్రీట్. ఇక్కడ నుండి హైకోర్టు మరియు చాలా అంతస్థులున్న భవనాల్ని చూచాము. ఇక్కడికి సమీపంలో వున్న హనుమాన్, రామ, దుర్గా దేవాలయాన్ని ఉత్తర హిందూస్థానీయులు నిర్మించారు. దేవాలయంలో బిల్వ, ఉమ్మెత్త, తులసీ మొదలైన వృక్షాలున్నాయి. ఇచ్చట ఎంతో ప్రశాంతంగా వుంది. కొంచెంసేపు కూర్చుండి తిరిగి మధ్యాహ్నా భోజనానికి ఆశ్రమానికి వెళ్ళిపోయాము.

**ఆదివారం సత్సంగం :** ఆదివారం సత్సంగానికి ఐదారు వందల మంది హాజరౌతారు. అందరికీ శలవు దినం కావడంవల్ల దీనికి ప్రత్యేకత వుంది. స్వామీజీ ముందుగా కొంత ప్రసంగిస్తూ, "ఆశ్రమ నిర్వహణ చాలా కష్టసాధ్యం, సామాన్యుల వల్ల జరిగేది కాదు. కాంజ్ఞన్‌గాడ్‌లో వున్న ఆనందా శ్రమం కూడా,యిప్పుడు మాతా జ్ఞానేశ్వరిగారు నిర్వర్తిస్తున్న శాంతి ఆశ్రమం వంటిది. శాంత్యాశ్రమానికి మన సహాయ సంపత్తులు చాలా అవసరం. అచ్చటనున్న ఆశ్రమ బాలబాలికలకు దాతలిచ్చిన ధన సహాయంతో భోజన వసతులు కల్పిస్తున్నారు. మనం మూడువేల రూపాయలు విరాళం యిస్తే దీనిపైన వచ్చే వడ్డీతో వారు బిడ్డలకు భోజనం యిస్తున్నారు. మన భక్తులు సుమారు యాభై దినాలకు సరిపడా వారి భోజనానికి విరాళం ఈయ సంకల్పించడం మంచిది. శాంత్యాశ్రమానికి వెళ్ళేమార్గం కూడా సుగమంగా వుండదు. నేను అలాగే ప్రయాణం చేసి వెళ్ళాను. అలాగే వాల్టేరులో వున్న శాంత్యాశ్రమానికి వెళ్ళాను. పూజ్యగురుదేవులు శ్రీ శివానందులు ఓంకారుల్ని చూడ్డానికి అక్కడికి వెళ్ళారు. సముద్రతీరంలో ప్రశాంతంగా వున్న ఆ ఆశ్రమం చూడతగ్గది. ఓంకారస్వామి కూడా గురుదేవుల్ని చూడటానికి హృషీకేశం ఎన్నోమార్లు వచ్చారు. శ్రీ చిదానంద స్వామివారు శాంత్యాశ్రమ గౌరవధ్యక్షులు. ప్రతీ సంవత్సరం శ్రీ ఓంకారుల జన్మదినా నికి జనవరి నెలలో వెళ్ళడమేగాక ఆశ్రమాభివృద్ధి కెన్నో సూచనలు చేస్తూ వుంటారు. ఈనాటి ఆధునిక ప్రపంచంలో ఓంకారస్వామి ఒక మహత్తరయోగి. మహాత్ముడు,

జ్ఞాని, ఆనందాశ్రమం వెళ్ళినప్పుడు మాతా కృష్ణాబాయమ్మ నా ఆహార విషయంలో యెంతో శ్రద్ధ వహించేవారు. అలాగే మాతా జ్ఞానేశ్వరి, నా ఆహార విషయంలో ప్రతిరోజూ పర్యవేక్షించి రకరకాల వంటలు చేసిపెట్టమని వారి సహాయకులకు సూచనలిచ్చేవారు.” తరువాత మాతాజీ తన సందేశాన్ని యిస్తూ ఓంకారుల సందేశాన్ని కూడా చదివి వినిపించారు.

“పరమపూజ్య స్వామీ సహజానంద మహారాజ్, సోదర సోదరీమణు లారా! భగవంతుని మాయలు అనంతములు. నాకు స్వామీజీ, మరియు ఆత్మ స్వరూపులైన మీ మధ్యవున్నాననే నమ్మకము కలుగటలేదు. సాధు మహాత్ములు “శివునాజ్ఞలేనిదే చిన్న పూతికైనా కదలదు” అనేవాక్యం ఎంతో అర్థవంతమైనదిగా పలికారు. ఓంకారలు లెప్పుడూ యిదే వాక్యం నొక్కి నొక్కి చెప్పేవారు. దైవానుగ్రహంవల్లనే నేను సోదరి వివేకానందాదేవీ యీనాడిక్కడ వున్నాము. పూజ్య స్వామీజీ, ప్రేమ్‌సింగ్ సోదరుడు ఎన్నోసార్లు మమ్మల్ని రమ్మని కోరినా, పూజ్యఓంకారులు జీవించి వుండగా దక్షిణాఫ్రికా వెళ్ళడం మంచిదని చెప్పినా, మాకు ప్రయాణం చేయాలనే కోర్కె లేకపోవడం వల్ల యీ ప్రయాణం చేయలేకపోయాను. శ్రీ సహజానందులవారిక్కడ చేస్తున్న కృషి, వారి సాన్నిధ్యం పొందాలనీ మీ అందరి ఆదరాభిమానాల వల్ల యీనాడు యిచ్చటికి రావడమైనది. శాంత్యాశ్రమం, దివ్యజీవన సంఘం రెండుకావు ఒక్కటే. యివి రెండూ ఆధ్యాత్మిక సోదరులు, ఓంకారులు శ్రీ శివానందులవలె. శ్రీ సహజానందులు, వారి గురుదేవుల వారి అడుగు జాడల్లో నడుస్తున్నారు. శ్రీశివానందులవార్ని ఎన్నో పర్యాయములు దర్శించి వారి బోధలు విని వారిచేత ఆశీర్వదించబడిన అదృష్టం నాకు లభించినది. ఈ నాటికీ వారి ఆశీర్వచనం నాపైన వుందనే గాఢ విశ్వాసం నాకుంది. శ్రీ ఓంకారులు తమ కాలిలోని ఎనిమిది అంగుళాల ఎముకను, ఒక బాలిక కాలికి త్యాగం చేయడం విన్న శ్రీ శివానందులు, వారి దేశ పర్యటన నిల్పి స్వామీజీ వద్దకు విశాఖ హాస్పటలుకు వచ్చారు. “శ్రీ స్వామీజీ మేమంతా మాటలతో త్యాగాన్ని బోధిస్తాము. కాని మీరు స్వయంగా త్యాగం చేసి ధన్యులయ్యారని” వారి కాలు ఒత్తుతూ నామసంకీర్తన చేస్తు, 1950లో అన్నమాట లీనాటికీ నా చెవుల్లో ప్రతిధ్వనిస్తూవున్నాయి. ఈ విషయంలో కొంచెం కూడ అతిశయోక్తిలేదు. వారిరువురి ప్రేమానుబంధం అట్టిది. మీరెన్నో ఉపన్యాసాల వినే వున్నారు. ఇట్టి మహాత్ముల అడుగుజాడల్లో నడిచి, మీ జీవితధ్యేయాన్ని నిస్వార్థ త్యాగం, సేవవల్ల పొందమని కోరు తున్నాను. వివేకానందాదేవి మా ఆశ్రమ భక్తుల్లో ముఖ్యులు. వారెన్నో కళాశాలలు, పాఠశాలలు, స్థాపించిన సంఘసేవకులు. శ్రీ సహజానందులు బిడ్డలకు యిస్తున్న ఆధ్యాత్మిక ప్రోత్సాహం ఎన్నదగినసేవ. పిల్లలకు కామ క్రోధ మదమాత్సర్యా లుండవు. ఇట్టి చిన్న వయసులో వార్ని మలచడం చాలా సులభం. వీరు భావి సుపౌరులయ్యే అవకాశాలెన్నో వున్నాయి. అందరూ గొప్పవారు కాకపోయినా శ్రీ స్వామీజీ విత్తిన ఆధ్యాత్మిక బీజాలు చాలా మందిలో మొలకెత్తి వృక్షాలవుతాయి.

బాగాపక్వమైన కొబ్బరికాయ పై పెచ్చునుండి విడిపోయినట్లు వీరు పెద్దవారై కులం, మతం, జాతి వివక్షతలు అనే హద్దులు దాటిపోతారనే స్వామీజీ ఆశ తప్పక ఫలిస్తుంది. ఈనా నమ్మకం, వారి గురుదేవుల ఆశయం, వీరి ద్వారా తప్పక నెరవేరు తుంది. వీరిని గురించి నేను హెచ్చుగా ప్రస్తావించ పనిలేదు. "మాటలు తగ్గించి యోచనచేసి సేవచేయి" అని మా గురుదేవులు ఓంకారుల మాటలకు శ్రీ సహజానందులు ప్రతీకయని వేరే చెప్పనక్కరలేదు. ఇంతకన్నా నేను హెచ్చుగా చెప్పజాలను.

శ్రీ ప్రేమ్‌సింగ్ వారి కుటుంబం శాంతి ఆశ్రమంతో తాదాత్మ్యం జెందారు. ఎన్నో పర్యాయములు ఆశ్రమానికి వచ్చారు. ఎన్నో విధాల సహాయం అందించారు. వీరికి గురుకుల విద్యార్థులంటే ఎనలేని ప్రేమ. దైవం తనవారైన భక్తుల్ని కలుపుతాడు. వీరి కుమారుడు రామ్‌సింగ్ (9ఏళ్ళు) ను ఆశ్రమంలో తెచ్చి వదలి వెళ్లారు. ఆ బిడ్డ చక్కని ఆత్మ విశ్వాసాన్ని భక్తినీ పెంపొందించుకొన్నాడు. అలాగే మాతా నారాయణి, స్వామి ఆనందజీ ఆశ్రమంలో నివసించుతూ, ఎందరికో వారు హోమియో వైద్యం చేసితిరి నేర్పితిరి. ఈనాటికీ వారు మాకు సలహా సంపత్తులందిస్తూనే వున్నందుకు కృతజ్ఞులం. మీరందరికీ మా ఆశ్రమం తరపున స్వాగతం చెపుతున్నాను. ఒక్క పర్యాయం వచ్చి దర్శించమని కోరుతూ శ్రీ ఓంకారులు రచించిన "నా వారసత్వం" చదవమని ప్రార్థిస్తూ వున్నాను. వ్యక్తి శాంతియే దేశశాంతి, ప్రపంచశాంతికి నాంది. మీ స్వాగతానికి శ్రీ స్వామీజీకి, మీకందరికి ఎంతో ఋణపడి వున్నాను" అని ముగించారు.

మరొక సందర్భంలో మాతాజీ వారు–

సహజానంద స్వామీజీ ఈదేశంలో చేస్తున్న సేవ అనితరసాధ్యం. వారు మితభాషి, కార్యవాది. దివ్య జీవన సంఘము శాంత్యాశ్రమము స్థూలంగా వేరైనా ఆశయాలలో రెంటికీ బేధంలేదు. మహాత్ములంతా ఒక్క విధంగానే వుంటారు. కాని వారివద్దకు వచ్చే భక్తులు మాత్రం మూడు విధాలుగా వుంటారని చిన్న కథ చెప్పారు. మహారాజొకరు, తన సభాస్థలికి మూడు బంగారు విగ్రహాలు తెప్పించాడు. అన్నీ ఒకే రూపంలో వొకే బరువులో, వొకే మెరుపులో వున్నాయి. వీటిలో బేధాన్ని కనుగొన్నవారు జ్ఞానులు అని అన్నారు. చాలామంది వాటిని పై నుండి క్రింది వరకూ పరీక్షించి అన్నీ ఒకేలా వున్నాయి అని తిరిగి వెళ్ళిపోయారు. తెలివిగల మంత్రిలేచి ఆ విగ్రహాన్ని పరీక్షచేసి యిలా చెప్పాడు. ఒక విగ్రహానికి ఒక చెవినుండి రెండవ దానికి రంధ్రం వుంది. ఇంకొక విగ్రహానిక చెవి నుండి హృదయానికి అక్కడి నుండి నోటికి రంధ్రాలున్నాయి. మూడవ బొమ్మకు చెవి నుండి హృదయానికి మాత్రమే రంధ్రం వున్నది. ఇదేవిధంగా యీ ప్రపంచంలో మూడు రకాల మనుష్యులు వున్నారు. మొదటిరకంవారు అజ్ఞాని చెప్పినది అవగాహన చేసుకొనకుండా రెండవ చెవి నుండి విన్నదానిని వదలి వేస్తారు. రెండవ తరహావారు పెద్దలు చెప్పినది అవగాహన చేసుకొని దాన్ని తిరిగి యితరులకు చెప్పి ఆనందించి వూరుకుంటారు.

మూడవరకం మానవులు విన్నది అర్థంచేసుకుని మననంచేసి అభ్యసించి ధన్యులౌతారని జ్ఞానియైన మంత్రి చెప్పాడు. ఈకథనుండి మనం నేర్చుకోవలసిందే మంటే మనం పెద్దలు చెప్పిన విషయాలు విని, మననం చేసుకొని ముక్తిపొందాలి. అదే మన జీవిత ధ్యేయం కావాలి అని తమ ఉపన్యాసం ముగించారు.

**మీర్ బ్యాంకు ఆశ్రమం :** మీర్ బ్యాంకు, డర్బనుకు సుమారు అరవై మైళ్ళ దూరం వుంటుంది. ఈ ఆశ్రమమంను, జ్యోతి అనే ఆంగ్ల బ్రహ్మచారిణి, ఆమెకు సహాయురాలిగా రుక్మిణి అను ఆమె వుంటూ ఎన్నో కార్యక్రమాలు నిర్వర్తిస్తూ వున్నారు. చిన్న కొండపైన యీ ఆశ్రమం వుంది. దీనికి చుట్టు ప్రక్కలందు భారతీయులే నివసిస్తున్నారు. మన భారతదేశపు నదుల పేర్లు, పట్టణాలపేర్లు, వారి వీధులకు, యిండ్లకు పెట్టుకున్నారు. అక్కడి భక్తులు ఉపన్యాసానికి ముందు 18 రకాల వంటలు చేసి భోజనం పెట్టారు. భోజనం తర్వాత, సత్సంగములో మాతాజీ ఈ విషయం పైనే చక్కగా మాట్లాడారు.

మీ మధ్య ఈ రోజు గడపడం మాకెంతో ఆనందంగా వుంది. మీరు మాకు చాలా విధాలైన వంటకాలతో భోజనం పెట్టారు. మితంలేకుండా తింటే అజీర్ణం వచ్చినట్లుగానే, వివిధ రకాలైన, వుపన్యాసాలు వింటే కూడా మననం చేసే వ్యవధి లేక ఆధ్యాత్మిక అజీర్ణం వస్తుంది. అలాగే మీరు వివిధ రకాల గ్రంథాలు చదివినా, మనసు మరింత సంశయగతం కావడం తప్ప సత్యం అవగాహన కాదు. మీరంతా శ్రీ శివానందులవారి ఆశీస్సులు పొందిన ఆధ్యాత్మిక పుత్రీపుత్రులు, శ్రీ సహజానందుల వారి అనుగ్రహ ఆశీస్సులు పొంది రెండు విధాలుగా ధన్యులయ్యారు. మీరింకా కోరవలసిందే మున్నది. మీ గురువుల అడుగుజాడలలో నడవండి. వారి వుపన్యాసా లెన్నో వింటున్నారు, సత్సంగాలకు హాజరవుతున్నారు. వారుపదేశించిన, సత్యాల్ని అన్నీ పాటించలేకపోయినా, కొన్నిటినైనా అనుసరించడానికి నిజ జీవితంలో వాటి ఫలితం పొందడానికి ప్రయత్నించండి. ఈ సందర్భంలో శ్రీ స్వామి రామతీర్థుల వారు చెప్పిన చిన్న కథ గుర్తుకువస్తోంది.

ధనికుడొకడు తన భవనంలో నివసిస్తున్నాడు. ఆ ప్రక్కనే వున్న కాళీ స్థలంలోని కుటీరంలో వొక బీద దంపతులు వుంటున్నారు. వారెప్పుడూ ఆనందంగా, తృప్తిగా జీవిస్తూ వుండేవారు. ధనికుణ్ణి చూడడానికొక మహాత్ముడు వచ్చాడు. ధనికుడు కూడా మహాత్ముని చూచి నమస్కరించి సత్కరించిన తరువాత "స్వామీ! సమస్త సంపదలున్నా నాకు లేని తృప్తీ ఆనందం నా ప్రక్కనే కుటీరంలో నివసిస్తున్న బీద దంపతులకున్నది. ఇది చాలా ఆశ్చర్యంగా వుంది. వారెప్పుడు ఆడుతూ పాడుతూ వుంటారు. దీనికి కారణమేమి"టని ప్రశ్నించాడు. ఆ స్వామీజీ "వారింట్లో తొంభైతొమ్మిది రూపాయలు పెట్టు. తరువాత యేమి జరుగుతుందో చూడు" అన్నాడు. ఆయన వెళ్ళిపోయి కొన్నిరోజుల తరువాత తిరిగివచ్చాడు. ధనికుడు వార్నిచూడగానే, "ప్రభూ! ఆ దంపతుల్ని పరీక్షగా చూస్తున్నాను. వారిది వరకులా ఆనందంతో గెంతుతూ

త్రళ్ళుతూ కనబడడంలేదు. వారి కుటీర మంతా నిశ్శబ్ధం తాండవిస్తూంది” అన్నాడు. వారిరువువూ ఆ కుటీరానికి వెళ్ళి వార్ని దీనికి కారణం ఏమిటని ప్రశ్నించారు. ప్రభూ! స్వామీ ! మాకు దొరికిన తొంభై తొమ్మిది రూపాయలకు యింకొక రూపాయి ఏ విధంగా కలిపి హెచ్చు చేయాలనే ఆవేదనలో వున్నాము. మా చింతకు, అసంతృప్తికి యిదేకారణం అనిచెప్పారు. సంతృప్తి వున్నచోట ఆనందం, శాంతి వాటంతట అవే వచ్చి చేరుతాయి. కాని మనమంతా కోర్కెలతో, ధనాశతో తృప్తి లేకుండ వున్నాము. అందుచేతనే శాంతి, సౌఖ్యం లేవు. మీ గురుదేవుల అడుగు జాడల్లో నడవడానికి ప్రయత్నిస్తున్న మిమ్మల్ని చూస్తే చాలా ఆనందంగా వున్నది అని మాతాజీ చెప్పారు. తరువాత ఆశ్రమానికి తిరిగి వచ్చాము.

దర్బన్ ఆశ్రమంలో సాయంకాలం యధావిధిగా సత్సంగం జరిగింది. సాధారణంగా వారు సాయంకాలం సత్సంగంలో ఓంకారుల సందేశ తరం గిణి చదివి వినిపించేవారు. భక్తి మార్గంలో నడవదల్చిన వారు ముందు తమని తాము వుద్ధరించుకోవాలి. తరువాత యితరుల్ని వుద్ధరింపవచ్చునని ఆత్మ పరీక్షవల్ల ధైర్య స్థైర్యాలు, ఆత్మశక్తి పెంపొంది, శాంతి లభిస్తుంది అన్నది నాటి సందేశము.

అది గురువారం, ప్రెస్సులో పనిచేసే మహిళలు, అక్కడ సపర్యలు చేయడానికి వచ్చిన ఇతర గృహిణులు మాతాజీ వద్దకు పదిన్నర గంటలకు వచ్చారు. అందులో ఆంధ్ర మహాసభకు చెందిన కొందరు స్త్రీలు తెలుగులో చక్కగా భజన, సంకీర్తన చేశారు. వారి గృహ సమస్యల్ని ఇతర కష్టసుఖాల్ని మాతాజీకి విన్నవించుకున్నారు. చనిపోయిన పితరులకు, ఇతరులకు, శ్రాద్ధం ప్రతిసంవత్సరం పెట్టవలసిన అవసరం వుందా అని ప్రశ్నించారు. అంతేకాక గృహస్థుగా యెన్నో విధాలైన కార్యక్రమాలున్నాయి. అవన్నీ చేస్తూవుంటే గురుసేవా, ఆశ్రమ సేవా ఎప్పుడు చేయాలి అని ప్రశ్నించారు. మీరంతా గృహస్థులు, గృహంలో ఆనందంగా గడపవలసి వుంది. కావున గృహానికి సంబంధించి చేయవలసిన ధర్మం ముందు స్వధర్మంగా చేయవలసి వుం టుంది. తరువాత మీరు ఆశ్రమసేవ, గురుసేవ, దైవ సేవ చేయండి అని ఉద్బోధించారు. ఆ మధ్యాహ్నం వారంతా చేరి చక్కని విందు చేశారు. ఈ రోజు గురువారం కావడంచేత హనుమాన్ చాలీసా ఎంతో భక్తి ప్రపత్తులతో పద్దెనిమిదిమార్లు చదివారు. తరువాత ప్రార్ధనలతో సాయంకాలం సత్సంగం ముగిసింది.

**చాట్సువర్త్ ఆశ్రమం :** దర్బన్‌కు యించుమించు 60 మైళ్ళదూరంలో వున్న చాట్స్‌వర్తు ఆశ్రమమునకు వెళ్ళితిమి. ఇచ్చట సత్సంగం ఉదయమే పదిన్నరకు ఏర్పాటు చేశారు. చాలా మంది జనం వచ్చారు. మాతాజీకి స్వాగతం పలికిన తరువాత, “సోల్ ఆఫ్ ఓంకార్” నుండి “స్వామీజీ నుండి నేను ఏమి నేర్చుకున్నాను?” అనే విషయాన్ని చదివి వినిపించారు. ఆ తర్వాత మాతాజీ తమ సందేశాన్నిచ్చారు.

శ్రీ గురుదేవులైన శివానందుల ఆశీర్వచనము లభించిన మీరందరూ అదృష్టవంతులు. ఈ అదృష్టానికితోడు మీకు సహజానంద స్వామీజీ ఆదరాభిమా

నాలు, ప్రేమ లభించాయి. సేవ, ప్రేమ,త్యాగం, పవిత్రత, ధ్యానం, మోక్షం లేక ఆత్మజ్ఞానం అన్న ఆరు సూత్రాల్ని, లేక ధర్మాల్ని మీకు గురు దేవులు ప్రతిపాదించారు. ఈ సూత్రాల్ని నిజజీవితంలో అను సంధానం చేసుకుంటే మీరు ధన్యులౌతారు. స్వార్థ రహితమైన సేవ మనల్ని నిష్కళంకులుగా చేస్తుంది. దీనితో సమస్త జీవరాసుల్నీ, తోటి మానవుల్నీ ఒకే విధంగా ప్రేమించగల్గుతాము. ప్రేమ వున్నచోట త్యాగం అదే చోటు చేసుకుంటుంది. తల్లి బిడ్డలకై, భర్తకై భార్య యెవరు చెపితే త్యాగం చేస్తారు. ఆ సహజ ప్రేమే యీ త్యాగానికి కారణం. విశ్వప్రేమ కూడా అట్టిదే. ప్రేమించిన చోట స్వార్థరాహిత్యం వుండి తీరుతుంది. స్వార్థం లేని తావున పవిత్రత ఆవిర్భవించి, మనసు ఆర్ద్రతతో సువిశాలమైన మీ త్యాగంవల్ల మననం, ధ్యానం స్థిరపడి చివరకు, శాంత్యా నందాలు, విముక్తి లభిస్తాయి. గురువు అడుగుజాడల్లో నడవడమే వారికి మనం చేసే సేవ, శుశ్రూషలు. భజనలు, ప్రార్థనలు మనం పవిత్రమగుటకు ఆధారభూతాలు మాత్రమే. గురుసేవ, గురుప్రేమ, గురుభక్తే మనల్ని ఆవలి ఒడ్డుకు చేరుస్తాయి.

మనం కేవలం బాహ్యంలో దైవాన్ని వెతికి వేసారిపోతున్నాము. అంతర్ముఖులమై ఈశ్వరుణ్ణి అన్వేషించాలి. ప్రార్థనలు, భజనలు, ఉపన్యా సాలు, కొంత వరకు చేయుతగా మాత్రం వుపయోగపడతాయి. అందుచేత మన చిన్న శూన్య హృదయాల్లో, ధ్యానం, జరగాలనే జ్ఞానజ్యోతిని వెలిగించి ముక్తిని పొందుదాము. అని దివ్యజీవన సంఘ సభ్యులందరికీ కృతజ్ఞతలు చెపుతు యింకా యిలా చెప్పారు. వి.జె.నాయుడు గారు వారి సతీమణి సౌందర్యగారు చాలా మంచిభక్తులు. శాంతి ఆశ్రమానికి తరుచూ వచ్చేవారు. సోదరి సౌందర్య నిక్కడ చూడ్డం చాలా ఆనందంగా వుంది. మా ఆశ్రమం వేరు మీ ఆశ్రమం వేరు కావు. రెండూ గురుదేవుల కాలాన్నించి వొక్కటిగానే వున్నాయి. మిమ్మల్నందర్నీ ఆశ్రమానికి తప్పక రమ్మని ఆహ్వానిస్తున్నాను. అని వారి వుపన్యాసం ముగించారు. తరువాత వచ్చిన భక్తులందరికీ విందు చేశారు. ఆ పిదప పనదరా సోదర్లు చక్కగా భజన చేశారు.

తిరిగి వచ్చేటప్పుడు దయానందగార్డెన్స్ పేరుతో సేవాకార్యక్రమాల్ని నిర్వర్తిస్తున్న దయానంద సరస్వతి సమాజం వారి సంఘాన్ని దర్శించాము. అక్కడ అనాథ బాలబాలికల్ని ఎంతో ప్రేమగా యింట్లోకన్నా సురక్షితంగా పెంచుతున్నారు. ఇదేచోట వృద్ధులకు, మానసిక వ్యాధియుతులకు, రకరకాల రోగులకు కూడా ఆశ్రయం కల్పిస్తున్నారు. దయానంద సరస్వతి (ఆర్య సమాజం) పేర వారి శిష్యులు మానవ సేవయే మాధవసేవయని చక్కని సేవా కార్యక్రమాలు చేస్తున్నందుకు అందరం వారికి కృతజ్ఞతాభి వందన ములు చెప్పక తప్పదు.

**గృహస్థుల యిక్కట్లు :** మేము బయటకు వెళ్ళని రోజంతా మాతాజీ గార్ని దర్శించడానికి చాలామంది గృహస్థులు వస్తూవుండేవారు. సామా న్యంగా సంతుల్నీ, సత్పురుషులైన మహాత్ముల్నీ చూడ్డానికి సామాన్యులు ఎన్నో ఆశలతో, అభ్యర్థనలతో

వస్తుంటారు. అలాగే దక్షిణ ఆఫ్రికా గృహ స్థులు మాతాజీని దర్శించి వారి వారి కష్ట నిష్టురాల్ని చెప్పి ఎలాగైనా తమ కష్ట నివృత్తిచేయమని ప్రార్థిస్తుండేవారు. మాతాజీ వారికెన్నో ఉపశమన వాక్యాలు చెప్పి వూరడించి పంపేవారు.

గృహచిద్రాలతో బాధలు అనుభవిస్తూ మార్గమేమిటని తన ధర్మమేమి టని గృహిణులు అడగవచ్చేవారు. మాతాజీ చెప్పే విలువైన సలహాలు వారికెంతో మానసిక ధైర్యాన్ని యిచ్చేవి. వారెంతో శాంతితో యిళ్ళకు వెళ్ళే వారు. ఇంకొకరు తను త్రాగుడు వ్యసనానికి లోనైపోయాననీ, అది తప్పని తెలిసీ అసహాయుడై దానికి బానిసనై పోయాననే దిగులుతో వచ్చాడు. అతణ్ణి ఎంతో ప్రేమగా ఓదార్చి, రాముణ్ణి తలుచుకుంటూ తప్పనిసరి అయినప్పుడు మాత్రమే ఆ వ్యసనం జోలికి వెళ్ళమని ప్రోత్సహించారు. కొన్ని రోజుల తరువాత ఆతడు వచ్చి ఎంతో ఉత్సాహంగ తన ప్రయత్నం కొద్దిగా ఫలిస్తోందని మాతాజీని ఆశీర్వదించమని కోరాడు. ఇదేవిధంగా కొందరు వృద్ధులు తమ బిడ్డలు తమ ఆజ్ఞనుల్లంఘించి, యితర మతస్థుల్ని వివాహం చేసుకున్నారని విలపించేవారు. ఈ విధంగా ఎందరెందరో వచ్చి మాతాజీ, సలహా సంప్రదింపులు పొంది ఎంతో కొంత ఆనందంతో తిరిగి వెళ్ళిపోయేవారు. ప్రపంచంలో బాధలు దుఃఖము, అశాంతి లేనిదెక్కడ? చింతాక్రాంతులై ఆర్తులైతే తప్ప దైవ సాన్నిధ్యాన్ని కోరరు. కోరినా, ఆర్తితో ఆయన్ని ప్రార్థించి దరిచేరరు. వెయ్యికొకరు మాత్రమే జిజ్ఞాసువులు జ్ఞానులు వుంటారు.

**పీటర్ మేరీన్ ఆశ్రమశాఖ :** మేము భారతదేశం తిరిగివచ్చే రోజులు సమీపిస్తున్నాయి. అందుచేత దివ్యజీవన సంఘము యొక్క శాఖలవారు మాతాజీ దర్శనం కోసం ఆత్రుతపడజొచ్చారు. దివ్యజీవన శాఖల్లో ముఖ్య మైన వాటిలో పీటర్ మారీస్ బర్గు ఒక పట్టణం. ఇది నాటాల్ యొక్క ముఖ్యపట్టణం. ఇచ్చట చక్కని ప్రార్థనా మందిరం వుంది. వృద్ధులైన సింగ్ గారు, వారి కుమారులు, మిగిలిన భక్తులు యీ మందిరాన్ని సుందరంగా తీర్చి దిద్దారు. సింగ్‌గారి కుమారుడు సంగీతం నేర్చుకోడానికి భార్యా బిడ్డలతో పాటు ఢిల్లీలో రెండు సంవత్సరాలున్నారు. వారు చాలా మధురంగా హార్మోనియం పైన వాయిస్తూ పాడతారు. భార్యకూడా వెంట పాడుతారు.

మేము పీటర్ మేరీస్‌బర్గు వెళ్ళగానే చక్కని విందు ఏర్పాటుచేశారు. సుమారు వందమంది భక్తులు వారి కుటుంబాలు కలసి అక్కడకు సమీపంలో వున్న ఎలిజిబెత్ గార్డెన్స్‌లో పిక్‌నిక్ ఏర్పాటు చేశారు. ఈ ఎలిజిబెత్ గార్డెన్స్ చాలాపురాతన మైనది. ఇది సహజమైన అడవి. ఇందులో అడవి ఎనుముల్నీ, దుప్పుల్నీ మిగిలిన చిన్న జంతువుల్నీ పక్షుల్నీ చూడవచ్చు. హానిచేయని మనుష్యుల్ని చూచి యీ జంతువులు భయపడవు. ఇక్కడ చాలా పెద్ద తాబేళ్ళు వున్నాయి. భక్తులందరు భోజనానికి పూర్వం సంకీర్తన చేయ మొదలుపెట్టారు. మా పాటల మాధుర్యనికో, దైవనామం వినడానికో తెలియదు చాలా పెద్ద తాబేలు భక్తులు కూర్చున్న చెట్టుచుట్టూ ప్రదక్షిణం చేసింది.

భక్తులందరు తలా ఒక పిండివంట తెచ్చారు. తెలుగువారు కొందరు భక్తులున్నారు కాని వారికి తెలుగురాదు. అయినా మాధుర్యం వొలికే తెలుగు భజనలను చేశారు. మధ్యాహ్నం నాల్గుగంటల వరకు యిచ్చట గడిపి, మళ్ళీ ప్రార్ధనా మందిరానికి వెళ్ళాము. ఇక్కడ సాయంకాలం సత్సంగం జరిగింది. పిల్లలు రెండువందలమంది, పెద్దలు రెండు వందలమంది సత్సంగానికి హాజరయ్యారు.

మాతాజీని గురించి భక్తులు ముందు పరిచయంచేశారు. మాతాజీ తరువాత వుపన్యసించారు. మీరంతా శివానందుల్నీ, సహజానందుల్నీ నమ్మి భజిస్తున్నందున మహా భాగ్యవంతులు. గురువును గౌరవించడమంటే యాంత్రికంగా వారు చెప్పిన శ్లోకాలు వల్లించడం, సత్సంగాలకు వచ్చి వెళ్ళడం మాత్రం కాదు. వారి అడుగుజాడలలో నడవాలి. అంటే వారే విధంగా జీవిస్తున్నారో మనం గుర్తించి దాన్నే నిజ జీవితంలో లక్ష్యంగా పెట్టుకుని అలాగే జీవించడానికి ప్రయత్నశీలురం కావాలి. ఈ సందర్భంలో నాకొక చిన్న కథ గుర్తువస్తూంది.

పలువురు భక్తులు తుకారామ్ మహారాజ్వారి వద్దకు విచ్చేసిరి. భక్త లందరును కలసి స్వామీజీ మేమందరము తీర్థయాత్రలు చెయ్యాలని మాకు సంకల్పము కలిగినది. కావున మీరు కూడా మాతో యాత్రలకు వచ్చిన సంతోషమని తెల్పిరి. తుకారాము వారు నేనురావడానికి వ్యవధిలేదు. కాని ఒక చేదు దోసకాయను ఇస్తున్నాను. మీతోపాటు తీసుకొనివెళ్లి అన్ని తీర్థ స్థలములలో స్నానము చేయించి తీసుకురమ్మని చెప్పిరి. తుకారాము వారి ఆజ్ఞానుసారము భక్తులు తమవెంట చేదు దోసకాయను తీసుకువెళ్ళి పవిత్ర తీర్థ స్థలములో స్నానము చేయించి క్షేత్ర దర్శనము చేయించి యాత్ర లన్నియు ముగించుకొని తిరిగి తుకారాము వారి దర్శనమునకు వచ్చి దోసకాయను అప్పగించిరి.

తుకారామువారు మరుసటి దినమున యాత్రలు తిరిగివచ్చిన సందర్భ ముగా విందునకు ఆహ్వానించెను. అందరు విందు భోజనము చేయుటకు సిద్ధముగా నుండిరి. యాత్రలు చేసి తిరిగి వచ్చిన చేదు దోస కాయను ముక్కలుగా చేసి వచ్చిన భక్తులందరికి ప్రసాదముగా పంచిపెట్టిరి. అంద రును చేదు దోసకాయ ముక్కలను ప్రసాదముగా తీసుకొనిరి. చేదు దోస కాయ ముక్కలు ఏవిధంగా వున్నవని తుకారామువారు ప్రశ్నించిరి? స్వామీజీ మీ విందు భోజనము చాలా బావుంది కాని ప్రసాదంగా ఇచ్చిన చేదు దోసకాయ ముక్కలు మాత్రము ఏమి బాగులేవు చాలా చేదుగా వున్నదని చెప్పిరి. తుకారాము వారు భక్తులతో నిట్లనిరి! చూసారా మీతో పాటు అన్ని పవిత్ర తీర్థ స్థలములలో స్నానము చేయించిరి. అన్ని క్షేత్రాలలో క్షేత్ర దర్శనము చేయించిరి. అయినప్పటికి చేదు దోసకాయ తన చేదు పోగొట్టు కొనలేదు. చేదుదోసకాయ ఏదో కాదు, మనలోని చెడు సంస్కారములే. మహాత్ముల సన్నిధిలోవున్నా మనలోని దుష్ట సంస్కారములు మార్చుకొనని యెడల చేదు దోసకాయవలె ఎన్నిపవిత్ర తీర్థ స్థలములలో స్నానముచేసినా, బాహ్య మాలిన్యము

పోవును గాని అంతఃశౌచము కలుగదు. అయితే మనకు ఒక సందేహము రావచ్చును. పవిత్ర తీర్థ స్థలములో స్నానము తీర్థ యాత్రలు చేయుట వృధా అనిపించవచ్చును. ఇచ్చట తుకారాము వారు తీర్థస్నానములను క్షేత్రములను నిరిసించుటలేదు. తీర్థస్థానములలో స్నానముచేస్తూ, క్షేత్రదర్శనముచేస్తూ, మహాత్ములనుసేవిస్తూ చేదు దోసకాయ వలె కాకుండా మన సంస్కారములు మార్చుకొనుటకు ప్రయత్నించవలెను. సంస్కారములు మార్చుకొనని యెడల ఎంతకాలము మహాత్ముల వద్ద వున్న ప్పటికి చేదు దోసకాయవలె వుంటాము.

దక్షిణాఫ్రికా యాత్రలో లభించిన ప్రేరణ, తియ్యటి అనుభవాలను హృదయంలో పదిల పరచుకొని తేది 8-1-1990న స్వామి సమాజా నందులవారు మరియు వందల కొలది వారి భక్తుల నుండి వీడ్కోలు తీసుకొని భారతదేశానికి బయలుదేరాము. భగవంతుని దివ్యాశీస్సులతో తేది 9-1-1990న బొంబాయి చేరినాము.

ఓం శ్రీ ఓంకారాయ నమః

**(శాంతి జనవరి 1990-జూన్ 1991)**

# 3. మా హిమాలయ యాత్ర

## ( 2.10.1990 - 2.11.1990 )

-మామిడన్న రాజరాజేశ్వరి

### ముందుమాట

భరతమాతకు వెండి కిరీటమా అనునట్లు తోచుచూ ప్రాచీనకాలము నుండి శీతోష్ణ సుఖ దుఃఖములకు అతీతులైన మహర్షులకు, పరమ తపోధను లకు ఆలవాలమని ప్రఖ్యాతి గాంచిన పవిత్ర హిమాలయముల ప్రకృతి సౌందర్యము, అందుగల క్షేత్రముల మహిమ గురించి ఇంతవరకును చదువుట, విని ఆనందించుట జరిగినది. దైవానుగ్రహముచే అక్టోబర్‌లో ఆ పరమ పావనమైన హిమాలయ మంచు కొండలలో 15 రోజుల పాటు రమణీయమైన ఆ దివ్య ప్రకృతిలో సృష్టికర్తయొక్క చిత్ర విచిత్ర వ్యూహా నైపుణ్యములను తిలకించుచు ఆ శీతలమును గూడా స్వయముగ అనుభవిం చుట జరిగినది.

ఎంతటి చంచల మనస్సునకైనను ఆ హిమాలయ దర్శనముచేత మనస్సు భగవంతుని బాహ్యా రూపమైన ఆ ప్రకృతిలో లీనమగుట తప్పదు. స్వయముగా చూడవలెనేగాని అట్టి ఆనందానుభవము చిరకాలం నిలుపు కొనువారు ధన్యులు.

పతంజలి మహర్షి తన "పతంజలి యోగ సూత్రములు" నందు మనో జయము నకు కొన్ని సులభోపాయములను వరుసగా వివరిస్తూ-

"యథాభి మత ధ్యానాద్వా" (సమాధి పాదం సూ. 39)

తన కభిమతమైన ఏ విషయాన్నయినా ధ్యానించుట వల్ల స్థిరచిత్తత కలుగుతుంది. అనే సూత్రము ఈ సందర్భమున జ్ఞాపకమునకు వచ్చుచున్నది. జీవితములో మనస్సును ఆకర్షించి జీవితాంతము వరకు మరవలేని ప్రకృతి దృశ్యములను తిలకించి వున్నట్లయితే, మనస్సు చికాకుగానున్న సమయము లందు, దైవధ్యానము కుదరని సమయములందును ఆ పూర్వపు అపురూప ప్రకృతి సౌందర్యపు దృశ్యములను, దివ్యక్షేత్ర దృశ్యములను జ్ఞాపకము తెచ్చుకుని దానినే భగవంతుని బాహ్యరూపముగా దృఢపరచుకొని ధ్యానించి నట్లయిన మనస్సు శీఘ్రముగా నిశ్చలమయ్యి, నిర్మలమునయ్యి ఆత్మానందా మృతమును గ్రోలుటకు ఒకానొకప్పటికయినను అర్హనీయమైనది కావచ్చుననే భావమును శ్రీ వివేకానందులు వ్యక్తం చేసిరి.

అందువలన ఆ హిమాలయ ప్రకృతి సౌందర్యమును స్వయముగా జూచి తీరవలయునేగాని వర్ణించజాలము. అయినప్పటికీ నాతోపాటు ఈ యాత్రలో పాల్గొన్న వారిని వారి వారి అనుభూతిని వ్రాయమని ప్రోత్సహిం చగా, సోదరి రాజరాజేశ్వరి తనకున్న స్వల్ప జ్ఞానముతో తన అనుభూతిని ఈ వ్యాస రూపముగా రూపొందించి నది. "ఇతరుల ఆనందమే మన ఆనంద మని" మన పరమ పూజ్యులు ఓంకార స్వామీజీ అంటారు. అందువలన ఈ యాత్రా విశేషములను తగిన భాషలో వివరించలేక పోయినను కొంత వరకయినా యధాశక్తిని "శాంతి" పాఠకులతో పంచుకొనవలయునను ఉత్సుకతో మా హిమాలయ పర్యటన వివరములు ప్రచురించటమైనది.

లోకాసమస్తా సుఖినోభవంతు !

**– సోదరి జ్ఞానేశ్వరి**

అక్టోబరు 2వ తేది శ్రీ ఓంకారస్వామి ఆశీస్సులతో శ్రీ మాతా జ్ఞానేశ్వరీ దేవి, లక్ష్మీ, విజయ, రాజేశ్వరి శాంతి ఆశ్రమము నుండి బయలుదేరినాము. రాజమండ్రిలో, ఏలూరులో, విజయవాడలో ఆశ్రమభక్తులు స్టేషన్‌కు వచ్చి మాతాజీ ఆశీస్సులు పొంది ఫలహారములు, పండ్లు ఇచ్చినారు. 4వ తేది మధ్యాహ్నం హరిద్వారములో దిగి ఋషీకేశ్ టాక్సీలో చేరుకున్నాము. శ్రీరామస్వరూప్ గారు ముందు ఆశ్రమం దిగువనే విశ్రాంతి తీసుకొనమని చెప్పినారు. ఆ రాత్రి అక్కడ గెస్ట్‌హౌస్‌లోనే విశ్రాంతి తీసుకొన్నాము. పూజ్య గురుదేవులు శ్రీ చిదానందజీ మహరాజ్‌వారు, శ్రీ దేవానందజీ మహరాజ్‌కు, (రామస్వరూప్‌కి) శ్రీమాతా జ్ఞానేశ్వరిగారికి అన్ని సౌకర్యములు జాగ్రత్తగా చూడమని తెలియచేసినారు. 5వ తేదీ ఆనంద కుటీరము దగ్గర గంగలో స్నానం చేసినాము. శ్రీకృష్ణానందజీని, శ్రీ మాధవానందజీని దర్శించినాము. పైన గురుప్రసాద కుటీరమునకు మారినాము.

శ్రీపూజ్య శివానందుల సమాధి, శ్రీ విశ్వనాధ మందిరము, భజనహాలు చూచి, ఆ కార్యక్రమములో పాల్గొన్నాము. తెల్లవారురఝామున ధ్యానము, హారతులు, పాదపూజలతో రోజంతా ఆనందముగా గడిచినది.

స్వర్గాశ్రమము, గీతా ఆశ్రమము, పరమాత్మ నికేతన్, కాలీ చరణ్ ఆశ్రమం సందర్శించి, అచట ప్రార్ధన చేసినాము. అన్నిచోట్ల పాలరాతి విగ్రహములు అవతారములు, హరిశ్చంద్ర, చంద్రమతి, లోహితాసుడు, కర్ణుడు దంతములు తీసి ఇచ్చేది మొదలగు సన్నివేశములతో కూడిన ఎన్నిరకముల విగ్రహములో ! ముందు మామూలుగా రెండుకార్లలో బదరీ, కేదార్‌లు వెళ్దామనుకొన్నాము. దివ్యజీవన సంఘము వారికి శ్రీమాతాజీతో కలసి ప్రయాణము చయవలెనన్న కుతూహలముతో పరమాత్మ ప్రకాశ్‌గారు (జర్మనీవారు) ఢిల్లీనుండి వచ్చి కలసినారు. శ్రీమాతాజీకి వారిపై గల వాత్సల్యము వలన అందరమూ కలసి స్పెషల్ బస్సులో వెళ్దామని నిర్ణయం చేసుకొన్నారు. దేవానందజీ 8వ తేది ప్రొద్దున బస్సుఏర్పాటుచేసినారు. శ్రీ దేవానందులవారి ప్రార్ధన, భజన ఆశీస్సులతో జైజైజైలతో, బస్సు కదిలింది. సంతు, సాధువులు, జిజ్ఞాసువులు, స్థిత ప్రజ్ఞులు,భక్తులు, ఇద్దరు విద్యార్ధులు, శ్రీరామస్వరూప్, శివచైతన్య,దౌలత్ మరి ముగ్గురు బాలురతో బయలుదేరి నాము. 8వ తేది సాయంత్రమునకు హనుమాన్ చట్టీకి చేరినాము. ఆ రాత్రి అచ్చటనే విశ్రాంతిపొంది, 9వతేది ప్రొద్దున యమునోత్రికి గుర్రాలమీద బయలుదేరినాము. శ్రీమాతాజీ మరికొందరు భక్తులు మాత్రము కాలినడకన వచ్చినారు.

**యమునోత్రిలో విశేషము :** సూర్యుని భార్య రశ్మి. ఆమెకు ముగ్గురు బిడ్డలు. యమ యమున అనే కవలలు మరియు శని. సూర్యుని వేడి భరించలేక ఆమె యొక్క ఛాయను సూర్యునివద్దవదలి తన తండ్రి దగ్గరకు వెళ్ళగా, ఆయన మందలించి మరల భర్త దగ్గరకే వెళ్ళమంటాడు. ఆమె ఆడ గుర్రమై హిమాలయముల దగ్గర తిరుగుతుంది. శ్రీసూర్యుడు, ఛాయబిడ్డలను సరిగా చూడకపోవడంవలన అనుమాన పడి హిమాలయముల దగ్గరికి వస్తాడు. ఆయన మొగ గుర్రమై, భార్యను కలుసుకుం టాడు. వారికి పుట్టిన బిడ్డలే అశ్వనీకుమారులు. యమున తన సవతితల్లి ఛాయ ప్రేమ లోపమైనందున తపస్సు చేయుచుండగా యమున తండ్రి ఆమె దగ్గరకు వచ్చి ఏమికావాలని కోరగా ఈవిధముగా వరమడిగినది. ఎవరు సూర్య కుండములో స్నానం చేస్తారో వారికి మోక్షమొచ్చే విధముగా అను గ్రహించ మనగ, ప్రసాదిస్తాడు. ఆ స్నానం చేసేసరికి బడలికతీరి హాయికలిగి తిరుగు ప్రయాణమునకు శక్తివస్తుంది. గుర్రములమీద ప్రయాణమంటే చాలా ఒళ్ళునొప్పులు, భయముతో కూడినది. శ్రీ గురుదేవులు కృపజూపి ఆయన బిడ్డలను ఆయనే క్రిందికి చేర్చినారు. యమున తల్లి చల్లటిచలిలో వేడినీటి స్నానంతో బాధనివృత్తి చేస్తుంది. ఇది శారీరకముగా ప్రత్యక్షముగా జరిగేది కదా. మరి జన్మరాహిత్యం కూడా కలిగిస్తుందని నమ్మితీరాలి. ఒకటి నిజమయినపుడు రెండవది అయితీరాలి. శ్రీ గురుమంత్రము చేసుకుంటూ

వెళ్ళడమైనది. 10వ తేది శ్రీమాతాజీ నడచివచ్చినారు. ఆమె కుంకుమ నొసట ధరించి కర్ర చేతధరించి నిదానముగ రావడము చూస్తుంటే "మరాళీ మందగమనా మహా లావణ్యశేవధిః"(లలిత20శ్లో) అని పించినది. యమున సూర్యకుండం స్నానము చాలా ఆనందాన్నిచ్చినది. ఆధ్యాత్మికముగా, శారీరకముగా సేద దీరినది.

11వ తేది ఉత్తరకాశికి చేరుకున్నాము. కైలాస ఆశ్రమంలో భోజనం చేసినాము. 250 సంవత్సరముల క్రిందట అమర్ బహదూర్ గుడి కట్టించి నారు. ఆ విశ్వనాధ ఆలయం బాగుంది. అక్కడ ధ్వజస్తంభం దగ్గర నిలబడి స్థంభించిపోతిని. బాగా శక్తివంతముగా వున్నది. అందాకా అది ధ్వజస్థంభ మని తెలియలేదు. స్థంభం సగం వరకు గుడిలా అనిపించినది. అమ్మ ఆశీస్సులు పొంది ఎదురుగా శివదర్శనము చేసుకొన్నాము. ఆ ధ్వజస్థంభ మును నేపాల్‌రాజు తీసుకొని వెళ్ళుటకు చాలా ప్రయత్నములు జరిగినవట. క్రింద పాములు చుట్టుకొని కాపలా కాస్తున్నవని చెప్తారు. అందుకని కదలించలేక పోయినారు. అక్కడకు 18 కి.మీ. గోముఖపర్వతం, బిలంలో ధార, కైలాస ఆశ్రమము, స్వామిని దర్శనము చేసుకొని రాత్రి హారతికి అందుకున్నాము. అక్కడ పాడిన శివమహిమ్న స్తోత్రం బాగుంది. దేవాలయ ములో నాలుగు ప్రక్కల పార్వతి, విష్ణు, విఘ్నేశ్వరుడు, సూర్యదేవుడు ఉన్నారు. పైన సింహాసనేశ్వరి శివ, గంగ, పార్వతులు బాగున్నారు.

12వ తేది ప్రొద్దుటే గంగోత్రి బయలుదేరినాము. దారిలో "గంగా నానీ" లోని వేడినీరులో స్నానం చేసినాము. అక్కడ పరశురాముడు తపస్సు చేసినారు. క్రిందకు దిగగానే అక్కడ సద్గురు శివానందస్వామి ఆశ్రమము. అక్కడ ఏమి ఆధ్యాత్మిక తరంగములు! కాసేపు సంకీర్తన నామముచేసి మరల బయలుదేరినాము. 12న మధ్యాహ్నమే గంగోత్రికి చేరుకున్నాము. సామానులు పెట్టేసి, గంగాతీరమున గంగమ్మతల్లి సౌందర్యము ప్రకృతి అలంకారము చూచి ఆనందించి అడుగుతీసి అడుగు వేయలేకపోతిమి. అచటనే ఎన్నో సంవత్సరములుగా ఒక మహనీయుడు తపస్సు చేసిన తపోవనమది. ఇపుడు కూడా ఒక మహనీయుడు ఉన్నారు. చెట్టుకొమ్మలు, మానులతో రకరకాల బొమ్మలు. ముఖ్యముగా "ఓం" చాలా బాగుంది. మహనీయుడు తపస్సుచేసిన ప్రదేశము. ఆ శక్తి అక్కడి ఆధ్యాత్మిక తరంగ ములు మాటలతో చెప్పలేము. గంగోత్రి నుండి బయలుదేరి కలకత్తా మీదుగా వారణాశికి మరల వెనక్కి ఉత్తరకాశికి గంగ ప్రవహిస్తూ వుంటుంది. ఆ సాయంత్రము 6 1/2 గం॥కు గంగమ్మ గుడిలో పూజ, శ్రీమాతాజీ పరివారమునకు, ప్రత్యేక హారతినిచ్చే అవకాశం వచ్చింది. ప్రక్క హాలులో శ్రీ కాశీపండితుడు పౌరోహిత్యులు అక్కడి సంగతులన్నీ చెప్పినారు. గంగోత్రిలో చెక్కలతో కట్టిన ఇళ్ళు గలవు. చాలాచలి, అయినా అందరూ రగ్గులే శాలువలుగా ఉపయోగించుతూ, అంత చలిలోను ప్రతి దానిని త్వర త్వరగా చూడాలన్న ఆదుర్దామూలంగా ఎంతో సంతోషము కల్గింది.

13వ తేది మాతాజీ షష్ఠిపూర్తి మహోత్సవము. అందరమూ ప్రొద్దుటే సిద్ధమై అమ్మ కాళ్ళకి నమస్కారములు చెయ్యడమైనది. ఓంకార సమర్పణ, శాంతి ప్రార్ధన, సంకీర్తనలు చేయడమైనది. ఆమె ఎంతో నిరాడంబరముగా, ఏకాంతముగా చేసుకొనవలెనని అనేవారు. ఆమె ఆరోజు మౌనము. శ్రీరామ స్వరూప్‌జీ హారతి ఇప్పించడమైనది. తరువాత గంగ దగ్గర పూజ, హారతి వగైరాలు పండితులు దగ్గరుండి మాతీజీచే శాస్త్రోక్తముగ పూజలు చేయించి నారు. అందరినీ ఆశీర్వదించినారు. ఆమెను అంతా అనుసరించితిమి. అచట నుండి భగీరధి శిలను ముట్టుకొని నమస్కరించి, గంగమ్మ దేవా లయము దగ్గర పూజ ప్రత్యేకముగా చేసినారు. హారతులు, ప్రసాదములు, ఆశీర్వాదములు అందుకొన్నాము.అచట నుండి గంగ ఒడ్డుకు వెళ్ళినాము. ఆ కొండల వెనుక సుమేరు పర్వతము ఉన్నదట. "సుమేరు మధ్య శృంగస్థా శ్రీమన్నగర నాయికా"(లలిత22శ్లో.) శ్రీ శివానందులు అపుడపుడు నివసించే ఆశ్రమమునకు వెళ్ళినాము. శ్రీ శివానందుల పటం ముందు త్ర్యయంబక మంత్రము 108 సార్లు పరివారమంతా చేసే భాగ్యం కలిగింది. ఆ శబ్దములు శద్ధబ్రహ్మమయం ఏమి ఆనందమో! శ్రీచిదానందజీ వచ్చి కొంతకాలం ఇక్కడేవుంటూ వుంటారట.

ఆ తరువాత శివానంద గుహకి కాస్త క్రింద ధ్యానము చేసుకొంటిమి. షష్టిపూర్తి విందు చేసుకొన్నాము. చాలా ఆనందము కలిగినది. భోజనానంత రము తిరుగు ప్రయాణమైతిమి. ఎందుకో అమ్మగంగని మరియు శివానంద ఆశ్రమ ప్రకృతి, వాతావరణము చూశాక తిరిగి రావడము చాలా నిరుత్సాహమును, హృదయ భారమును కలిగించినది. ఆ రాత్రికి నామ సంకీర్తనము చేసుకుంటూ ఉత్తరకాశికి తిరిగి చేరుకున్నాము. హారతి ప్రసాద ములు తీసుకొని నిద్రపోయినాము. ఆరోజు శ్రీ శివానంద ఆశ్రమములో శ్రీమాతాజీ కోసము మృత్యుంజయ హోమము, విశ్వనాథ మందిరములో పూజ, గురుపూజ సాధు సంతర్పణ చేసినారు. ఇచట ప్రతిచోట పంచ పాండవులు పర్యటన చేసినారు. ఏకాదశి ప్రసాదములు తీసుకొని బజారు పనులు, శ్రీవిశ్వనాథ దర్శనము, పరశురాములు తపస్సు చేసినచోటు చూసినాము. శ్రీ తపోవన మహరాజ్ శ్రీచిన్మయానంద గురువులు, వారి ఆశ్రమము దర్శించితిమి. అక్కడ ధ్యానము చాలా హాయినిచ్చినది. అక్కడి స్వామి కాసేపు ప్రసంగించినారు. తరువాత శ్రీ ఆత్మానందస్వామిని, మైత్రేయి గారిని వారి ఆశ్రమంలో చూచినాము. శ్రీ ఆత్మానందగారితో సంభాషణ జరిగినది. వారు శ్రీశాంత్యాశ్రమ శ్రేయోభిలాషులు, వారిలో అద్భుత తేజస్సు తరంగములు గలవు. ఆ తరువాత శివానంద ఆశ్రమము చూచినాము. శ్రీగురుదేవుల ఆశీస్సులు తీసుకొని 6-30 గంటలకు హారతికి అందు కున్నాము.

15వ తేది గౌరీకుండ్‌లో బసచేసినాము. 16వ తేదిన కేదార్‌నాథ్ గుర్రములమీద 4 గంటలు రాను, 4 గంటలు పోను ప్రయాణం. కొందరు డోలీలు, కొందరు

గుర్రములు, బుట్టలు వీపు కట్టుకుందురు. శ్రీ కేదార్‌నాథ్ వెళ్తుంటే ఆ గుర్రము మీద చాలా ఆనందముగా వున్నది. మంచుకొండ, ఆ కొండపై సూర్యోదయము ఎంత చక్కని దృశ్యము. వెండికొండ, బంగారు సూర్యుడు, ఏ గ్రంథములలో వ్రాసినదో గాని కళ్లార మేముచూస్తూ మైమరచి నాము. ఏదో లోకములకు పోతున్నట్లుగా వున్నది. ఎట్టకేలకు శ్రీకేదార్‌నాథ్ దగ్గరకు చేరినాము. ముందు శ్రీ సుబ్రహ్మణ్యం గారి కుటుంబము. రాజేశ్వరి చేరుకున్నారు. మందాకినీ నదిచుట్టూ ఎత్తయిన కొండలు, కేదార్‌నాథ్ జ్యోతిర్లింగము, కేదార్, బదరీ, ఇవి జ్ఞాన భూములుకదా ! కేదారేశ్వరుని చూచి మానసపూజలో స్తుతించగా కేదారీశ్వరుడు దర్శన మిచ్చినట్లు అనిపించినది. ఆ అనుభూతి వ్యక్తంచేయలేను, అది అద్వితీయము. ఈలోగా మిగతా వాళ్ళంతా వచ్చి కలసినారు. శ్రీమాతాజీ వచ్చినారు. ఆమెతో ప్రత్యేక పూజలలోపాల్గొని ఆశీస్సులు పొందినాము. శ్రీశంకరాచార్యులు కేదార్‌నుండి అదృశ్యమైనారట. అక్కడ ఒక పెద్దగోడ. దాని మధ్యదండము, చేయి ఉన్నాయి. వేదములు, ఉపనిషత్తులు, శృతి, స్మృతులన్నీ పెట్టిలోపెట్టి, తాళం వేసివున్నట్లు, అవి మనకు బంగారు తాళంచెవి ఇస్తున్నట్లు ఉన్నది. అది ఆ తాళం తీసి అనుభవించమని హెచ్చరిస్తున్నట్లుగా ఉన్నది. ఆ తాళం తీసి వాడుకునే వారిదే అసలైన అదృష్టము. ఆ ప్రక్కనే చిన్న శంకరమఠం ఉంది అందరూ శంకరస్వామి సమాధి అని అంటారు. చాలా శక్తివంతముగా ఉన్నది, వదలి రాలేని స్థితి. గుర్రం పిల్లవాడు రామ్‌సింగ్‌ను అడుగడుగునా కాపాడుతూ వున్నాడు. వానిలో ఏశక్తి ప్రవేశపెట్టినారో గురుదేవులు. మెల్లగా తిరిగి గౌరికుండ్‌కి సాయంత్రానికి చేరినాము. దారిలో పూలవానలా జల్లు, మరల ఎండ, ఆ దృశ్యములన్నీ ఎంతో ఆహ్లాదకరముగా వున్నవి.

17వ తేది కేదార్ నుండి బయలుదేరి పిప్పలకోటలో ఆగినాము. 18 ప్రొద్దున్నే లేచి బదరీ ప్రయాణము. 2 గంటలకు బదరీనాధుని దర్శించి నాము. బదరీనారాయణ విగ్రహము నారద కుండ్‌లో వుండగా శ్రీశంకరులు చూచి వూరుకొన్నారట. ఆ రాత్రి కలలో బదరీనారాయణులు కనబడగా వెంటనే శ్రీ శంకరులు బదరీనారాయణ గుడి కట్టించి విగ్రహములు తెచ్చి ప్రతిష్ఠించినారట. నరుడు క్రిందగా నారాయణుడు ఎత్తుగా రెంటికిమధ్య నీలకంఠ పర్వతము కలదు. ఈ దేవాలయములోని దీపం సెమ్మెలో 10 కేజీల ఆవునెయ్యి పోస్తారట. స్వామికి పేరిన నెయ్యి పూస్తారట. ఈ ఆరు నెలలు గంటలు వినబడతవట. దేవతలు పూజచేసిన చిహ్నాములు వుంటా యట. గుడి తెరిచేవేళకు అధికారులు, లక్షలాది ప్రజలు అంతా వచ్చి ఆ జ్యోతిని దర్శిస్తారు. ఇక్కడ బదరీనారాయణ, కుబేర, నారద, ఉద్ధవ, గరుడ విగ్రహాలు కూడా కలవు. నర నారాయణులలో నారాయణుడు మొహం కొంచెం ప్రక్కకు తిప్పుకుంటారు. నర నారాయణులు తపస్సు చేస్తుండగా ఊర్వశి ఛాయ పడకుండా మొహం ప్రక్కకు తిప్పినారట. బైట లక్ష్మీదేవి గుడి, ఆమెకు పూజ జరుగును. అచట హనుమంతుడు బాగుంటాడు. బదరీలో 6 నెలలు, దేవతాపూజ, అర్చన

మరియు 6 నెలలు మనుష్యుల పూజ, అర్చన జరుగును. శ్రీ బదరీనారాయణుని అర్చన నంబూద్రి బ్రహ్మ చారులు చేస్తారు. దీనిని శ్రీ శంకరులు స్థాపించారు. కాబట్టి నంబూద్రిలే చెయ్యాలట. శ్రీ శంకరలు ఉదయం శ్రీ బదరీనారాయణ అర్చన చేసి సాయంత్రం కేదార్‌నాథ పూజ చేసేవారట. అక్కడ ఏదో దగ్గర దారి వున్నదట. గగనమార్గ గమన శక్తి కూడా వారికి ఉంది కదా!

19వ తేది ప్రొద్దుటే నారద గుండం స్నానం చేసి దైవదర్శనం చేసుకున్నాము.ఎందుకో విష్ణు సహస్రం స్వామి పాదాల దగ్గర చేసికొనవలెనని అనిపించినది. ఆ సాయంత్రం 4 గంటలకు మరల శంకరస్వామి దగ్గర భజన, విష్ణుసహస్రనామ పారాయణ, సంకీర్తన అనంతరం, ఒక స్వామి ప్రసంగం కూడ జరిగింది. సాయంత్రం ప్రత్యేకంగా మళ్ళీ పూజ, స్వామి పాదాల ముందు విష్ణు సహస్రనామ పారాయణ, హారతి, అమ్మవారి పూజ, నిజరూప దర్శనం సేవ చూచినాము.

20వ తేది నారద గుండంలో స్నానంచేసి,దైవదర్శనం చేసుకొని, అలక నంద, బ్రహ్మకపాలం దగ్గర కూర్చున్నాము. పితృదేవతల పూజ, అర్చన చేసుకుని ఆశీస్సులు పొందినాము. అటుపై దైవ దర్శనము చేసుకొనినాము. అన్నీ యధాతధముగా జరిగినవి. అచటనే శ్రీ జీయ్యరుస్వామి అష్టాక్షరీ స్థూపం ప్రతిష్టించినారు. రామానుజాచార్య, లక్ష్మీనారాయణ, గోదాదేవి దర్శనం చేసుకున్నాము. అక్కడ వారు అందరికీ భోజనములు ఏర్పాటు చేసినారు. శ్రీ బదరీ నారాయణుని గుడిని, ఆ చుట్టూ ప్రదేశాలన్ని కనులారా తిలకించి బసకు వచ్చినాము. 21న మానా అనే కొండలపైకి ఎక్కి వ్యాస గుహ, వినాయక గుడి చూచినాము. అచట బేరికాయలే అల్పాహారం. ఆ గుహల్లోనే భారతమును వ్యాసమహర్షి వ్రాసినారట సరస్వతీనది లేత నీలంగా సూర్యకిరణాలతో మెరుస్తూ ఆ తల్లి జ్ఞానదానం చేస్తున్నట్లుగా భావన కల్గును. భీముని వంతెన అని ఒకటి ఇచట గలదు. అరణ్యవాసం చేస్తున్నపుడు ఈ కొండ మీద నుండి ఆ కొండపైకి దాటడానికి పెద్దరాయి భీముడు వేసినాడని అంటారు. అది భీముని వంతెన. దారి చాలాకష్టతరముగా వున్నది. అటు నుండి స్వర్గారోహణము చేసినారట. ఆ వ్యాసగుహలో నుండి తిరిగి రాబుద్ధి గాలేదు. తరువాత జ్యోషిమఠ్, శ్రీశంకరస్వామి స్థాపించిన ఒక పీఠం. చాలా శక్తివంతముగా వున్నది. అమ్మ రాజరాజేశ్వరీదేవి గుడి, శివాలయం, ఒకటిని మించి ఒకటి ఆహ్లాదం కలిగించాయి. రుద్ర ప్రయాగ, కర్ణ ప్రయాగ, దేవ ప్రయాగ, నంద ప్రయాగ మొదలయినవి దారిలో కనిపిస్తాయి. రాత్రి పిప్పలకోటలో ఆగినాము. మాతాజీ అందరినీ ఒకేచోట సమావేశ పరచి ప్రార్థనలు, సంకీర్తన, మూడు భాషలలో లోకశాంతి ప్రార్థన చేయించిన తదుపరి, ఎవరికి ఎలాంటి అనుభవము కలిగిందో చెప్పమని కోరినారు. కొందరు ఎవరి అభిప్రాయములు వారు చెప్పి చాలా ఆనందం కలిగించినారు. శ్రీరమణగారు ఆయన జీవితం గురించి చెబుతూ, దైవము తప్ప

వేరే ఆధారము లేదనే నమ్మకము, ఆయనను చాలా ఉన్నతుణ్ణి చేసినట్లు వివరించినారు. అది విన్నాక మా కళ్ళు చెమర్చినవి.

22వ తేది ఉదయం ఋషీకేశ్‌కు బయలుదేరినాము. దేవ ప్రయాగ భగీరథ, అలకనంద కలసిన ప్రదేశము. అక్కడ రామ మందిరము గలదు, అది శ్రీరాముడు తపస్సు చేసిన స్థలము. దూరం నుండే మేము చూచినాము. ఈ ప్రాంతములోనే కొడియాల అనే గ్రామము గలదు. అక్కడ చిన్న ఆశ్రమము కూడా గలదు. అక్కడే శ్రీ చిదానందులు అపుడపుడు వెళ్ళి ఏకాంతముగా గడుపుతారట. దానిని చిదానందకాశి అని అంటారు. అక్కడ ఏమి ఆధ్యాత్మిక తరంగములు! ఆ రాత్రి ఋషీకేశ్ చేరినాము.

23 శ్రీ మాతాజీ కొందరు భక్తులతో బ్రహ్మపురి కాలనీలో కుష్టురోగు లకు మిఠాయిలు, పండ్లు పంచి వచ్చినారు. మిగతా వాళ్ళు ఆశ్రమములో కార్యక్రమములలోపాల్గొన్నారు. 24 న బొంబాయి భక్తులు వెళ్ళిపోయినారు. మేము ఆశ్రమములోని కార్యక్రమములకు హాజరైతిమి. 25న స్కందషష్ఠి. ఊరేగింపుగా భజన హాలు నుండి వెళ్ళి గంగ దగ్గర సుబ్రహ్మణ్యం, దత్తుని గుడిలో పూజచేసి అటునుండి నామ సంకీర్తనలతో ఎంతో ఆనందముగా వూరేగుతూ కొండపైకి వచ్చినాము. ఆ స్వాములు పూర్ణ కలశముతో ఒకరు గంగ, నలుగురు పాలు పట్టుకొని వచ్చి సమాధి దగ్గరకు వెళ్లగా అక్కడ హారతులు ఇచ్చినారు. అటునుండి విశ్వనాథ ఆలయమునకువెళ్ళి అక్కడ హారతి, భజన హాలులో స్కందునికి పంచామృతములు, గంగ అభిషేకము దృశ్యము చూచి దేహం పులకరించినది. శ్రీకృష్ణానందస్వామి శ్రీమాధవా నందస్వామి అభిషేకము, పూజకువచ్చి పాల్గొన్నారు. ప్రతిఒక్కరూ స్కందునికి అభిషేకము చేసినారు. ఆ రోజు మాకు చాలా సంతోషముగా గడచినది.

26న లక్ష్మణ ఝూలా చూసితిమి, అక్కడ లక్ష్మణస్వామి గుడి వుంది. ఇది లక్ష్మణుడు తపస్సు చేసినచోటు. ఝూలా దాటగానే 14 అంతస్థుల భవనం వున్నది. ప్రతి అంతస్తులో మహాఋషులు, దేవతామూర్తులు, మహా భక్తులు, నవగ్రహములు వగైరా అన్నీ చాలా బాగున్నవి. ఇచట దధీచి మహర్షిని, చూడగానే ఓంకార స్వామి (కలియుగ దధీచి) గుర్తువచ్చి కళ్లు చెమ్మగిల్లినవి. సహస్ర లింగములు కలసి ఒకే లింగం, అమ్మరాజరాజేశ్వరి, రామ లక్ష్మణులు శివలింగమునకు పూజ చేయుట చూస్తూ హనుమంతుడు వినయముగా కూర్చున్న దృశ్యము, అమర్‌నాథ్ చివరిది. అక్కడి నుండి చుట్టూ హిమపర్వత పంక్తులు, గంగ, ఝూలా, క్రింద ఆలయములు, ఆశ్రమ ములు చూచి చాల తన్మయత్వము కలిగింది. అప్పుడు మాకు చాలా ఆహ్లాద కరముగా వున్నది. క్రింద సాయి మందిరమునకు వెళ్ళినాము. చాలా ప్రశాంతముగా వున్నది. అటునుండి ఆంధ్ర ఆశ్రమమునకు వెళ్ళినాము. చంద్రభాగానది వంతెన మీదుగా భారత మందిరమునకు వెళ్ళినాము. ఇది భరతుడు తపస్సు చేసినచోటు,

ఆయన రామభక్తిని వ్యక్తం చేస్తున్నట్లే అనిపించింది. ఆంధ్ర ఆశ్రమములో శ్రీ శివానందుల భజనకు అందు కొన్నాము, సమీపములో శ్రీ వేంకటేశ్వర ఆలయము కూడ కలదు.

27న ఋషికేశ్‌లో ప్రొద్దుట 8 గంటలకు బయలుదేరి హరిద్వార్ వెళ్ళినాము. శాంతి కుంజ్ చూచినాము. ఇక్కడ ఎంతమందికో వృత్తి విద్యలు నేర్పుతారు. పండిట్ శ్రీరామశర్మ ఆచార్య పుణ్యదంపతులు శాంతికుంజ్ ఏర్పాటు చేసినారు. ఎవరికి ఏ వృత్తిలో ప్రావీణ్యత వున్నదో ఆ వృత్తినే ప్రోత్సహిస్తూ నేర్పిస్తూ ఉపయోగించుకుంటారు. చాలామంది కుటుంబము లతో వచ్చి వుంటూ వుంటారట. అక్కడ ప్రచారానికిగాను సైకిళ్ళు, మైకు, క్యాసెట్ అమర్చినారు. ఈ మధ్య గాయత్రీ యజ్ఞం చేసి లక్షలాది ప్రజలకు సకల సౌకర్య ములు కలిగించినారుట. భారత్ మందిరము చూస్తే దేశభక్తి ప్రతివాళ్ళకు కలుగుతుంది. భారతమాత దేశపటము చాలాబాగుంది. దైవ విగ్రహములు, దేశనాయకులు, భక్తుల శిల్పములు, అన్నిరాష్ట్రముల చిహ్నా ములు ఒకచోట చుట్టూ వున్నవి. మహాత్మాగాంధీ, ఆంధ్రప్రదేశ్ చిహ్నాముగా చార్‌మినార్, వేంకటేశ్వరస్వామి గుడి ఉన్నాయి. దక్షయజ్ఞము, యజ్ఞకుండ్ ఈశ్వరుని గుడి, పార్వతీదేవి, విఘ్నేశ్వర్ గుడి అన్ని వున్నవి. ఇచ్చట పాదరస ముతో శివలింగం చాలా ధనం వెచ్చించి కట్టించినారు. అక్కడ శక్తి తరంగ ములు ఎంతగానో వున్నవి. శ్రీ జైల్‌సింగ్‌చే ప్రతిష్ఠా మహోత్సవము చేయించి నారట. ఇక్కడున్న రుద్రాక్ష చెట్టు చుట్టూ జ్యోతిర్లింగములు వున్నవి. ఆనందమయి ఆశ్రమము. శ్రీపూజ్య చిదానందస్వామికి ఆమెపై గల మాతృ భక్తి వ్యక్తమగును. అమ్మ ఆనందము బిడ్డల నందరినీ లాలిస్తున్నట్లుగ చక్కని వీనుల విందైన సంకీర్తనతో ఆనందముగా వుంటుంది. ఆమె సమాధి మందిరము యొక్క గోడపైచుట్టూ ఆమె జీవితచిత్రములు (బాల్యము, వివాహము, భర్త దేవిగా గ్రహించుట,సాక్షాత్కారము, మొదలగునవి) ఎంతో అద్భుతముగా వున్నవి. ఏవన్‌ధామ్, అద్దాల బొమ్మలు ఎంతో విలువైనవి. దేవతామూర్తులు, ముఖ్యంగా కృష్ణార్జునుల గీతోపదేశము ఎంతో బాగుంది, చుట్టూ అద్దాలవల్ల అద్దాల బొమ్మలు, వెనక్కి చూస్తే మన బొమ్మలు, దేవతామూర్తులు ఏదో వేరుకాదు. అంతా ఒకటే నని వెన్ను చరిచినట్లుం టుంది. ప్రసాదంగా అందరూ ఎవరికి నచ్చినవి వారు కొని తెచ్చుకున్నారు. గంగ హారతులు, కన్నుల పండుగ గొలిపింది. ఆ గంగమ్మ తల్లి ప్రశాంత ప్రవాహము, ఆ దీపములు, హారతులు జేగంటలు కన్నుల విందుగా వున్నవి. హరిద్వారమైనందున వైకుంఠమే కళ్ళముందు కదలు తున్నట్లనిపించింది. నిజముగా వైకుంఠ ద్వారమే అది. కేబుల్ కార్ మీద మానసాదేవి గుడికి వెళ్ళినాము. ఆమె మహిషాసుర మర్ధనం తరువాత మానసాదేవిగా విశ్రాంతి తీసుకొంటుంది. శివాలయం, వైష్ణవీ దేవి, ప్రతిచోట హరిహరులు వున్నారు. హరిహర భేదం లేదు కదా! విఘ్నేశ్వర, ఆంజ నేయులు కూడ వున్నారు. 28న శివానంద ఆశ్రమములో కార్యక్రమములలో పూర్తిగా పాల్గొన్నాము. 29న శతృఘ్నుడు

తపస్సు చేసిన నారాయణ సమేత శతృఘ్నుడి గుడిని దర్శించాము. అవి చూచివచ్చి, ఆవిరి పడవమీద గంగలో బయలు దేరినాము. స్వాముల దర్శనము, గుహలు ఎందరో మహనీయులు తపస్సు చేసిన ప్రదేశములు చూచి వచ్చినాము. రాళ్ళు, గుట్టలు ఎక్కుతూ భజనలు చేసుకుంటూ వెళ్ళినాము. తిరిగివచ్చి హారతి, ఆశ్రమ కార్యక్రమ ములో పాల్గొన్నాము. 30న వశిష్ట గుహ దర్శించాము. ఒకొప్పుడు శ్రీ శివానందులు, మరిద్దరు స్వాములు అచటొకచోట తపస్సు చేసిరి. ఒకప్పుడు ఒక మహ నీయుడికి ఏమి అద్భుతము తోచిందో గంగ మీదుగా నడచివచ్చి వశిష్టుని గుహగా గ్రహించి ఆ గుహలో తపమాచరించినారుట. ఆ గుహలో రెండు మార్గములు వున్నవట. దానిలోపల మహాఋషులు సూక్ష్మ శరీరాలతో వుంటారట. అక్కడ దానికి అడ్డుగా బండవేసి మూసినారు. అక్కడ నుండి విశ్వామిత్రుడు వశిష్టుని కామధేనువును తీసుకెళ్ళిన ప్రదేశము చూచినాము. శ్రీ స్వామీజీ సమాధి సజీవముగా వున్నట్లున్నది. వశిష్ట గుహలో చాలా ఆత్మశక్తి తరంగములు గలవు. ఏసుక్రీస్తు ఈ గుహలోనే దర్శనమిచ్చి నట్లు చెప్తూతారు. నేనురామజన్మభూమి సమస్య గూర్చి త్ర్యయంబక మంత్రము, ధ్యానము చేస్తుండగా ఏసుక్రీస్తు మెదలినారు. బైటకు రాగానే అక్కడ క్రీస్తుకి మూడు రోజులలో ఆత్మ దర్శనమైనదని అక్కడ స్వామి చెప్పగా ఆ భగవత్ లీలకు అబ్బురపడ్డాను. అరుంధతి గుహ చూశాము. ఆమె తపస్సు చేసిన చోటుఅది. ఆ గంగాతీరాన సూర్యభగవానునికి అర్ఘ్యమిస్తుంటే అదే సత్యంగా గోచరించింది. తర్వాత శివానంద మ్యూజియంలో శివానందులు ఉయ్యా లలో శిశువుగా నున్నపుడు తండ్రి పూజచేస్తున్నది, తల్లి ఊయల ఊపుతున్నది దీన నారాయణులపై జాలి, జంతువుల మీద జాలి, డాక్టరుగా విద్యార్థిగా సన్యాసిగా అక్షరాస్యునకు పుస్తకమివ్వడం, మొదలగు శిల్పములు చూచివచ్చి నాము. ఎంతో బాగున్నవి. ఆ సాయంత్రమే కైలాస ఆశ్రమము చూచి వచ్చినాము. అక్కడ జీవన్ముక్తులు హరిహర తీర్థానందస్వామి, అపరశంక రులా, నారాయణులా అన్నట్లున్నారు. శరీర ధ్యాసలేదు, ఆత్మానందము కల్గినది. కనులు కూడా తెరవ లేకపోతిని. అక్కడ గోశాల చాలా బాగుంది. పెద్ద పెద్ద గోవులు, వాటి సంరక్షణ బావుంది.

31న శ్రీ ప్రేమానంద దర్శనము చేసుకున్నాము. చాలా ఆదరించి ఆశీర్వదించి ప్రసాదమిచ్చినారు. నాద బ్రహ్మానందస్వామి దర్శనము కూడ అయినది. నాద బ్రహ్మానందులు తన శరీరములో ప్రతీ భాగంతో నాదము పలికిస్తారు. అన్ని దేశములు తిరిగి ఆయన ప్రావీణ్యత నిరూపించుకున్నారు. ఎంతమంది వైద్య నిపుణులో ఆయన నాదం ఎక్కడి నుండి ఎలా తెప్పిస్తు న్నారో పరీక్షించి ఆశ్చర్య పడ్డారట. ఆయన ఏ దేశమైనా ఎపుడైనా వెళ్ళ వచ్చునట, చాలా ధనం ఆయనకు ప్రదర్శనలకిచ్చినారట. వారు ఆ ధనం ఆశ్రమములకు ఇచ్చినారట. ఎన్ని రకముల చిత్రములో చూపించినారు. చంద్ర మండలములోని చంద్రశిల ఆయన కిచ్చినది చూపినారు. ముట్టుకొని చూచి చాలా సంతోషపడ్డాము. చెట్టు తొర్రలో కారు పార్కింగు చాలా

బాగుంది. సాయంత్రం క్రింద భజన, గంగ హారతులు, మధ్యాహ్నం శ్రీ మాధవానంద దర్శనము, విందు భోజనం, సాయంత్రం విష్ణుసహస్రము, భజన,రాత్రి ప్రేమానందస్వామి రామాయణము చెపుతుంటే (సమాధి మందిరములో) వాల్మీకి చెప్తున్నట్లుగానే వున్నది. తరువాత మాతాజీకి సన్మానం చేసినారు. అందరికీ ఆశీస్సులు లభించినవి.

ఋషీకేశ్‌లో పరమపూజ్య శ్రీ శివానందుల ఆశ్రమములో వున్నంత కాలం ధ్యానము, విశ్వనాధ మందిరము హారతి, గురుపూజ, భజన హాలులో కార్యక్రమములు అన్నింటికి హాజరైనాము. ఆనంద కుటీరములో శ్రీ శివా నంద పటములు, శిల్పములు, వారు వాడిన వస్తువులు, వారికి దర్శన మిచ్చిన శ్రీకృష్ణుడు, గంగమ్మతల్లి పూజ, ప్రార్థనలు మరువరానివి. అక్కడ ప్రతి ఒక్క స్వామి ఎంతో దయతో అన్ని సంగతులు వివరించారు. అక్కడ వుండే రాజుగారు చుట్టు ప్రక్కల వున్న ఆశ్రమములు అన్నింటినీ ఎంతో ఓపికతో చూపించినారు. అక్కడ వున్నప్పుడు గాని ప్రయాణములోగాని శ్రీ మాతా జ్ఞానేశ్వరి ఆధ్వర్యములో ప్రతీరోజు హనుమాన్ చాలీసా, ప్రార్థన, సంకీర్తనలు జరిగేవి. మాతాజీతో జ్ఞాన యాత్ర చేసే భాగ్యం కలిగిందని అందరమూ ఎనలేని సంతోషముగా వున్నాము.

2వ తేది ప్రొద్దున్న ధ్యానము క్లాసు కాగానే విశ్వనాధుని అభిషేకము, అమ్మవారి అర్చన హారతి తీసికొన్నాము. అక్కడ శ్రీ కృష్ణుడు మురళి వాయిస్తూ ఎన్నెన్నో బోధలు చేస్తున్నట్లు వుంటాడు. ఆ నల్లనయ్య ఆశీస్సులు కూడా తీసుకొని కుటీరమునకు వచ్చినాము. రెండు కార్లలో పాత ఢిల్లీ వచ్చి చేరినాము. రాత్రి భక్తులు మా అందరికీ భోజనములు తెచ్చినారు. మాతాజీ ఆశీస్సులు పొంది వెళ్ళినారు.

3వ తేది రాత్రి నాగపూర్ భక్తులు కలసి మాతాజీకి స్టేషనులోనే సన్మానం చేసి మా అందరికీ ప్రసాదములు ఇచ్చి మాతాజీ ఆశీస్సులు పొంది వెళ్ళినారు. 4వ తేది ఎవరి గూటికి వారు సత్సాంగత్యము వదల లేక బరువైన గుండెలతో గత స్మృతులు నెమరు వేసుకొంటూ చేరుకున్నారు. ఆ భగవంతుడు, శ్రీ సద్గురుదేవులు, ఆ స్మృతులు అలాగే ఎల్లకాలము నిలిచేటట్లు అనుగ్రహించమని వేడుకుంటున్నాను.

హరిఓం శివోహం శివోహం శివోహం

**(శాంతి నవంబర్ & డిసెంబర్ 1990–జనవరి1992)**

పవిత్ర హిందూ ధర్మంలో మహమ్మదీయ క్రిష్టియన్ మతములలో చెప్పబడినట్లు శాశ్వత నరకము లేదు. అట్లున్న యెడల మహాపాపియైన రత్నాకరుడు రామనామ స్మరణచే వాల్మీకి మహర్షియై యుండువారు కాదు. మనకు శ్రీ మద్రామాయణమను ఆది కావ్యము లభించేది కాదు.

## 4. మా బెంగుళూరు పర్యటన

భగవంతుని లీలలు అనూహ్యము అద్భుతము. ఎప్పుడు ఎటులు ఏమి జరుగునో, మనము ఎప్పుడు ఎచ్చటకు వెళ్ళవలసియుండునో మన కోరికలు ఎట్లు సఫలమగునో మన ఊహకు అందనవి. అంతా పరమేశ్వ రుని అనుగ్రహం ప్రకారము జరుగుచుండును.

కోటగిరి శాంతి కేంద్రమునకు ప్రతిసంవత్సరంవలె ఈ సంవత్సరం కూడా అచ్చటి భక్తుల కోరికపై ఏప్రిల్ మాసములో వెళ్ళుట జరిగెను. ఒకరోజు ఉదయం సత్సంగం ముగిసిన వెంటనే బయట ఒక కారు ఆగుటచూచి జి.నాగేశ్వరావు గారిని ఎవరో వచ్చినట్లుయున్నది చూడమని పంపి మరల వెంటనే నేను గుమ్మం వద్దకు వెళ్ళగ ఒక భక్తుడైన యువకుడు నన్ను చూచి చిరునవ్వుతో "నన్ను గుర్తించితిరా?" అని అడుగగా, వెంటనే గుర్తించలేకపోయినను మరల ఒక్క క్షణంలో మెరుపువలె జ్ఞప్తికి వచ్చి "నీవు శ్రీనివాస్" అనిపలుకగ ఆయనను గుర్తించినందుకు ఎంతో ఆశ్చర్యము ఆనందము పొందెను. ఆయన ఎవరోకాదు, మనశాంతి ఆశ్రమమునకు చిరకాల భక్తులు, పూజ్య స్వామీజీ హృదయమునకు అతి సన్నిహితులేగాక అందరి శ్రేయోభివృద్ధి కోరుచు మిత్రులుగ మెలగిన శ్రీ సి.రాఘవేంద్రరావు, డా. శ్రీమతి రాజేశ్వరి గార్ల ప్రియ తనయుడు ఈ శ్రీనివాస్. శ్రీ రాఘవేంద్ర రావుగారు ఐ.జి ఆఫ్ పోలీస్‌గా పనిచేసిరి. శ్రీమతి రాజేశ్వరిగారు ప్రముఖ వైద్యులు. వారిరువురు శాంతి ఆశ్రమాన్ని సందర్శించుటకు వచ్చినప్పుడల్లను చిన్నవయస్సులో చి. శ్రీనివాస్ వారితో వచ్చుచుండెడివాడు. చిన్నతనములో చూచుటయేగాని ఇంతవరకు మరల అతనిని చూడలేదు. అయినను అతని తండ్రిగారి రూపమును అతనిలో చూచుట జరిగెను.

చిన్నతనంలోనే శ్రీనివాస్‌యొక్క తల్లి తండ్రులు విద్యాభ్యాసమునకు ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన "శ్రీ సత్యసాయిబాబా"గారి సన్నిధికి పంపిరి. డా. రాజేశ్వరిగారు పదవీ విరమణ అయిన తరువాత,శ్రీ బాబాగారు, బెంగుళూరు సమీపంలో యున్న వైట్ ఫీల్డ్‌లో నిర్మించిన వైద్యశాలయందు బాధ్యతలను స్వీకరింపజేసిరి. వారు వైద్యశాలను అభివృద్ధిచేసి యెనలేని సేవచేసిరి. శ్రీనివాస్ బాబాగారి పవిత్ర న్నిధిలో పెరుగుచు విద్యాబుద్ధులు, ఆత్మ వికాసం చెంది పెద్దవాడై తన జీవితము బాబాగారి సేవకు అంకితము చేసి వారి అడుగుజాడలలో నడచుచు వారికి ప్రీతిపాత్రు డయ్యెను. ఇది పరమేశ్వరుని అనుగ్రహము మరియు అతని అదృష్టము. శ్రీనివాస్ తల్లిదండ్రులు శారీరకముగ లేరు. కాని వారి నిస్వార్థ సేవలు భక్తి ప్రేమల ఫలితముగ వారు భగవంతుని సాన్నిధ్యములో శాంతిగ యున్నారనియే తలచవచ్చును.

శ్రీనివాస్‌కు శాంతి ఆశ్రమంపై భక్తి ప్రేమలు గలవు. గత సంవత్సరం కోటగిరి శాంతి కేంద్రమునకు వచ్చెను. కాని అప్పటికి నేను అచ్చటకు వెళ్ళలేదు. అందుచే

నాకు ఒక చీటీ వ్రాసి వారి విరాళముతో శక్రటరీ గురు స్వామిగార్కి ఇచ్చి వెళ్ళిరి. ఈ సంవత్సరము కూడా శ్రీనివాస్ ఆయన భార్య శాలిని వారి బిడ్డ శ్రీమాయి ఉదకమండలంవచ్చి, అచ్చటినుండి కోటగిరి శాంతి కేంద్రానికి నన్ను చూడాలన్న కోరికతో వచ్చిరి. మా మాటల సందర్భములో శ్రీనివాస్, శాంతి ఆశ్రమమునకు వారికి యున్న అవినాభావ సంబంధమును ఎన్నటికి మరువకుండా ఉండవలెననియే నా కోరిక అని శ్రీనివాస్ పల్కిన మాటలు హృదయమునకు ఎంతో ఆనందము చేగూర్చెను. నేను తిరిగి మాతృ ఆశ్రమానికి వెళ్ళేలోపు బెంగుళూరువచ్చి కొన్ని రోజు లుండి వెళ్ళవలసినదిగా కోరెను. దైవాజ్ఞయున్న అటులనే వచ్చుటకు ప్రయత్నించెదను అనగా, బాబాగారు కొడైకెనాల్‌లో యున్నారని మే15,16 తేదీలలో వైట్ ఫీల్డ్‌కు వచ్చెదరనియు అచ్చట 20వ తేది నుండి వారం పదిరోజులు ఒక సమావేశము జరుగనున్నదనియు ఆ సమయానికి వచ్చిన బాగుండునని కోరెను. కాని ఆ సమయములో వచ్చుటకు వీలుపడదేమో ననియు ఎప్పుడు అనుకూలముగ యుంటే అప్పుడు వచ్చెదమని చెప్పతిని. మీకు ఎప్పుడు అనుకూలముగ యుంటే అప్పుడు రమ్మని, ఈ సారి తప్పక వచ్చి వెళ్ళవలయును. కారు కూడ బెంగుళూరు నుండి కోటగిరికి పంపెద మని వారు ప్రేమతో పల్కినమాటలు మా హృదయమును కదిలింప చేసినవి. మీరు ఎంతమాత్రము కారు పంపవలదు. అనుకూలమునుబట్టి మేము వచ్చెదమని చెప్పుట జరిగెను. కాని శ్రీనివాస్ వారి సతీమణి కోరికను నిరాకరించలేక బెంగుళూరు వెళ్ళుటకు నిశ్చయించుట జరిగెను. ఇచ్చట ఒక ముఖ్యవిషయం, శాంతి ఆశ్రమమునకు వచ్చు కొందరు భక్తులు నన్ను "పుట్టపర్తి వెళ్ళిరా ? బాబాగారి దర్శనం చేసితిరా?" అని ప్రశ్నించుచుందురు. నాకు అట్టి అవకాశము అదృష్టము కలుగలేదు. గాని బాబాగార్ని స్థూల ముగ దర్శించకపోయిన వారి అమూల్య సందేశములను భక్తుల ద్వారా వినుచు వారి పవిత్ర సన్నిధి అనుభవించుచు ఆనందించుట జరుగుచున్నది. దైవానుగ్రహం ఎప్పుడు కల్గిన అప్పుడు బాబాగారి దర్శనభాగ్యం కల్గునని చెప్పుట జరుగుచుండెడిది.

మే 8వ తేదిన బెంగుళూరు వెళ్ళుటకు నిశ్చియింతిమి. నాతో ఆధ్యాత్మిక చింతనలో సేవాభావంతో తన జీవితం శాంతి ఆశ్రమంలో గడుపుటకు నిశ్చయించి వచ్చిన ఫ్రాన్స్ సోదరి సుశీలాదేవి, శ్రీ నాగేశ్వరరావుగారు, ఆశ్రమ బాలిక చి॥ సుధ వచ్చిరి. 8వ తేదిన సాయంత్రం బెంగుళూరు చేరి శ్రీనివాస్‌కు ఫోన్ చేయగ అచ్చటలేరని తెలిసినది. వారికి మేము ఇచ్చిన టెలిగ్రాం చేరలేదు. మరొక నెంబరుకు ప్రయత్నం చేయగ అచ్చట పల్కిరి. అది వైట్ ఫీల్డ్. వారు అచ్చట యుండుటకు కారణం ముఖ్యవిషయం చెప్పిరి. బాబా గారు 15,16 తేదిలలో వైట్‌పీల్డ్‌కు వచ్చెదమని చెప్పిరి. కాని మే 4వ తేదినే వైట్‌ఫీల్డ్‌కు వచ్చిరని అందుచే వారు అచ్చట యుండిరని చెప్పి వెంటనే మమ్ములను అందుకొని వైట్‌ఫీల్డ్‌కు తీసుకొనివెళ్ళిరి. అంతా ఆ పరమేశ్వరుని విలాసమేగదా!

శ్రీ బాబాగారు ప్రతిరోజు ఉదయం 8-30 గంటలకు సాయంత్రం 4-30 గం॥లకు వారి దర్శనార్థం వచ్చిన అసంఖ్యాక భక్తులకు దర్శనం ఇచ్చెదరు. 9వ తేదిన ఉదయం మేముగూడా ఆ భక్తులతోపాటు బాబాగారి దర్శనమునకు వెళ్ళితిమి. అచ్చట మమ్ములను ముందువరసలో కూర్చో బెట్టిరి. బాబాగారు వచ్చి అందరకు దర్శనం ఇచ్చి ఆశీర్వదించిరి. అనుకొనని రీతిగ ఆశ్చర్యముగ వారు నా దగ్గరకు వచ్చుట గమనించి లేచి నిలబడితిని. "ఎప్పుడు వచ్చితిరి? మీతో ఎవరెవరు వచ్చితిరి?" అని అడిగి మరల వెంటనే "నాకు అన్నీ తెలుసు మీరు రాత్రి వచ్చితిరి గదా?" అని నవ్వుతూ విభూతి ఇచ్చి ఆశీర్వదించిరి. వేలకొలది భక్తులు నిరీక్షించి చూచుచుండగ బాబాగారు ప్రత్యేకంగ నావద్దకు వచ్చి పలుకరించి ఆశీర్వదించిరి. అంతా భగవంతుని లీలయేగదా! అనుకోని మరువరాని సంఘటన. మేము అనుకొన్న 3 రోజులు ఉదయం,సాయంత్రం, వారి దర్శనము చేసుకొంటిమి. 11వ తేదిన ఉదయం తిరిగి బయలుదేరుటకు నిశ్చయించితిమి. కాని బాబాగారు ఇంకా రెండు రోజులు యుండమన్నారు. అందుచే తప్పక యుండవలసి వచ్చినది. ఆ రెండురోజులు గూడ ముగిసినవి. 13వ తేదిన ఉదయం వెళ్ళుట తప్పదని శ్రీనివాస్‌తో చెప్పి సిద్ధమైతిమి. కాని 12వ తేది రాత్రి శ్రీనివాస్‌వచ్చి బాబా మీకు ప్రత్యేక దర్శనము 13వ తేది ఉదయం ఇచ్చెదరని చెప్పుటచే మరల ఉదయం ప్రయాణం ఆగెను. బాబా గారి ఆజ్ఞప్రకారం 13వ తేది ఉదయం వారి దర్శనార్థం వెళ్ళితిమి. సుమారు గంటపైగా మాతో మాట్లాడుచు ఎన్నో అమూల్యమైన విషయములు చెప్పి ఆశ్రమ అభివృద్ధికోరి ఎన్నో సలహాలు ఇచ్చిరి. ఆ సన్నివేశం గూడా ఒక అపూర్వమైన దైవ సంఘటనయే. వారా రోజు సత్సంగములో ఇచ్చిన దివ్య సందేశము అమూల్యమైనది. ఆ సందేశ సారాంశం, జీవితం, సత్య, ధర్మ, ప్రేమ,సేవ అను నాల్గు సూత్రములపై ఆధారపడియున్నది. ఈ నాల్గు సూత్రములు మానవుడు ఆచరణలో పెట్టిననాడే జీవితగమ్యం చేరుటకు అర్హుడగును. అచ్చట భక్తులు, ముఖ్యముగ విద్యార్థులు వారికి బాబాగారితో గల్గిన అనుభవాలను అనుభూతులను, వారి ఔన్నత్యమును గూర్చి దివ్య సందేశాలను గూర్చి, ఉన్నతస్థాయికి ఎదుగుటకు వారు చేసిన సేవను ప్రశంసించిరి. బాబాగారు పలుచోట్ల ఉన్నత ఆధ్యాత్మిక విద్యాబోధనలకు ఎన్నో శాఖలు స్థాపించిన విషయము అందరకు విదితమే. విద్యార్థులు వారి అనుభవపూర్వకముగ తెలిపిన విషయములు మాకు ఎంతో ఆనందము చేకూర్చెను. ప్రత్యేక దర్శన మిచ్చునపుడు బాబాగారు వివరముగ మాట్లాడి మమ్ములను ఆనందపరచుటయేగాక, ఆశ్చర్యచకితులను చేసిరి. వారిని శాంతి ఆశ్రమమునకు ఆహ్వానించి వారి సన్నిధితో ఆశ్రమాన్ని పునీతము చేయవలసినదిగా కోరగా తప్పక వచ్చెదమని ప్రేమతో పలికిన మాటలు ఎంతో ఆనందము కలిగించెను. "నేను చాలా సంవత్సరాల క్రిందట కోటగిరి శాంతి కేంద్రమునకు వెళ్ళితిని ఎవరికీ తెలియచేయలేదు. మరల వచ్చెదను" అని పలికిరి. వారు ఇంకా ఇచ్చిన ముఖ్య

సందేశ సారాంశము మానవులను నమ్మవలదు. మన బాధ్యతలను అన్నియు దైవమునకు వదిలిన ఆయనయే దైవకార్యములను చేసుకొనును. మనుజులు ముఖ ప్రీతికొరకు ఎన్నో వాగ్దా నాలు చేయుచుందురు. కాని ఆచరణలో పెట్టుట అరుదు. భగవంతుని నమ్మినవారికి ఆశాభంగములు ఏమియు చేయజాలవని వారి దివ్య సందేశ ముతో ఆశీర్వదించిరి. ఆ మధురానుభూతులతో బాబా గారి వద్ద శెలవు తీసుకొని బయటకు వచ్చుసరికి 11 గంటలు అయినది.

తిరుగు ప్రయాణం పెట్టుకొనుటచే వెంటనే మైసూర్‌నకు బయలు దేరితిమి. అక్కడ నుండి శ్రీనివాస్ కోరికపై ఐ.జి.ఆఫ్ పోలీస్ భాస్కర్‌గారు బస్టాండుకు వచ్చి మమ్ములను ఆహ్వానించి తీసుకొనివెళ్ళి అన్ని ఏర్పాట్లు చేసిరి. ఆ సాయంత్రం ప్రఖ్యాతి గాంచిన బృందావన్ గార్డెన్స్‌కు వెళ్ళితిమి. భాస్కర్ గారు వారి సతీమణి మాకు ఆ రాత్రి ఆతిధ్యమిచ్చిరి. మరునాడు 14వ తేదిన ఉదయం చాముండేశ్వర దేవాలయం, మైసూర్ మహారాజావారి పేలస్‌లో ప్రసిద్ధిగాంచిన మ్యూజియం సందర్శించితిమి. ఆ మ్యూజియంలో ముఖ్యంగా మైసూర్ మహారాజా వారు వేటాడిన వన్య మృగములను చూసి తీరవలెను. అవి చూడగానే సజీవమయిన జంతువులవలె కన్పించును.  మానవుని మేధాశక్తియే అంత అద్భుతమయినప్పుడు ఆ మేధావిని సృష్టించిన సృష్టికర్త మేధాశక్తిని ఎవరు వర్ణించగలరు? మా సుశీలాదేవికి మూగజీవు లంటే ఎడతెగని ప్రేమ. మైసూర్‌లో వన్యమృగశాల యున్నదని విని అచ్చటికి వెళ్ళి ఆమె అచ్చట మృగాలతో కొంత సమయం సంతోషంగా గడిపిరి. ఆ మధ్యాహ్నం 2 గంటలకు బయలుదేరి రాత్రి 10 గంటలకు కోటగిరి చేరితిమి. అచ్చట భక్తులంతా మా కొరకు ఆతృతపడుచుండిరి. కారణం, మేము మూడు రోజులలో తిరిగి వస్తామని చెప్పి వారం వరకు రాకపోవు టయే! కాని దైవనిర్ణయమును ఎవరు నిర్ణయించగలరు? అంతా ఆ భగవం తుని కృపచే మా ప్రయాణం విజయవంతమగుటకు కారకులైన శ్రీనివాస్ దంపతులను వారి బిడ్డ శ్రీమాయిని దైవము ఆయురారోగ్యములతో సుఖ శాంతులతో బ్రోచుగాక!

నా హృదయం నుండి వచ్చిన ఈ చిన్న అనుభూతులను మా శాంతి పాఠకులతో పంచుకోవలెనని ఆకాంక్షించితిని. శ్రీ పరమేశ్వరుడు మా శాంతి పాఠకులను తదితర సోదర, సోదరీ మణులను ఆయురారోగ్యము, నిత్య శాంతి ఆత్మ జ్ఞానాభివృద్ధితో బ్రోచవలెనని కోరుతూ....

– మీ సోదరి జ్ఞానేశ్వరి

**(శాంతి ఆగస్టు 1991)**

# 5. పవిత్ర హిమాలయాలలో మా మండల నివాసం
# (19.10.1991 - 27.11.1991)

దైవాజ్ఞలేనిదే గడ్డిపరక అయినను కదలదని, చీమైన కుట్టదని పెద్దల వాక్కు గదా ! దీనినే పూజ్య శ్రీ స్వామీజీ (స్వామీ ఓంకారులు) పదే పదే నొక్కి చెప్పుచుండెడివారు. వారి జీవితమంతయు ఆ అనుగ్రహము మీదనే ఆధారపడెను. ఆ ఆనందములోనే జీవించెడివారు. "హే భగవాన్! నా ఇచ్ఛ యేదీలేదు. నీ ఇచ్ఛప్రకారమే జరుగుగాక!" అని ఎవరు చెప్పగలరో, అట్టివారే దైవానుగ్రహము మీద పూర్తి నమ్మకముకల్గి ఆ ఆనందానుభవ మును అనుభవించగలరు. కాని అది అంత సులభముగాదు. కాని దైవా న్వేషకులకు దుర్లభమయినది ఏదియును లేదు. దేనికైననూ ఆ భగవంతుని ఆజ్ఞ, అనుగ్రహము యుండవలెను. దానికొరకై పరిపూర్ణ విశ్వాసముతో దైవమునకు సర్వార్పణము గావించవలసియుండును.

పవిత్ర హిమాలయములు మహర్షులకు, యోగులకు, మునిపుంగవు లకు, మహాత్ములకు ఆలవాలములై అలరారుచున్నవి అని చదువుటయు, వినుటయు జరుగుచున్నది. మన స్వామిఓంకారులు, ప్రపంచఖ్యాతి గాంచిన స్వామి శివానందులు ఇంకను ఎందరో మహాత్ములు ఈ పవిత్ర హిమాలయ శ్రేణులలో సంచరించినవారే. ఋషీకేశ్‌లో ప్రఖ్యాతిగాంచిన స్వర్గాశ్రమ ములో శ్రీస్వామీజీ ఆరుసంవత్సరములు తపముచేసిరి. ఆనాటి పరిచయమే శ్రీ శివానందుల ఓంకారుల సంబంధము. ఈనాటి వరకు ఆ సన్నిహితము, ఆత్మీయత నిలిచియుండుట కూడా దైవానుగ్రహమే, ఆనాటి స్వర్గాశ్రమము, ఋషీకేశ్ కీకారణ్యముగ యుండి కేవలము తపస్సు చేసుకొను వారికి మాత్రమే ప్రశాంతతో అనుకూలముగయుండి విరాజిల్లు చుండెడిది. రాను రాను ప్రకృతి, మానవులు మార్పు చెందుచున్న కొలది తపో భూములుగూడా యాత్రా స్థలములుగా, వినోద స్థలములుగా మార్పు చెందుట సహజము, వీటి అన్నింటికి మనస్సు ప్రధానమయినది. ఎవరు ఏఏ మనస్తత్వముతో ఏఏ భావనలతో వెళ్ళిన అవియే గోచరించును అనుటలో సందేహము లేదు.

పూజ్య శ్రీ స్వామీజీ క్రీ.శ. 1968వ సంవత్సరములో శివానందాశ్రమ మునకు వెళ్ళుట జరిగెను. అప్పుడు వారితో నేను మరియు మరి కొంత మంది ఆశ్రమ భక్తులు వెళ్ళు అదృష్టము కలిగినది. అచ్చటయుండగ ఒక రోజు స్వామీజీ పూర్వము స్వర్గాశ్రమములో ఎచ్చట తపస్సు చేసిరో ఆ తావునకు తీసుకొని వెళ్ళి చూపించిరి. అది అంతయు ఒక దట్టమయిన కీకరారణ్యముగాను, ఏకాంత స్థలముగానుయున్నది. అప్పటిలో వాటియొక్క విలువ తెలియకపోయినను రాను రాను పవిత్రమైన ఏకాంతస్థలము యొక్క ఉపయోగము, అనుభవము తెలియుటచేత మదియందు ఒక కోర్కె జనించి నది. అది యేమనగ, సంవత్సరాల తరబడి అటువంటి పవిత్ర తావులలో యుండు భాగ్యము లేకపోయినను మహాత్ములు సంచరించిన తావులలో

కనీసము 40 రోజులైనను గడిపిన బాగుండును అన్పించెను. అవ్విధము గానే సంవత్సరములు దొర్లిపోవుచున్నవి. కాలము పరిగెడుచున్నది. కాని కోరిక కోరికగానే యుండిపోయెను. ఈ మధ్య ఉత్తరకాశీలో ప్రసిద్ధిగాంచిన స్వామీ తపోవన్ మహరాజ్ వారు రచించిన “హిమగిరి విహారము” అను గ్రంథమును, చిన్మయానందులు రచించిన అమూల్య గ్రంథములను ఆశ్రమ భక్తులు, స్వామీ చిన్మయానందుల శిష్యులైన శ్రీ జె. వేమయ్యగారు ఆశ్రమమునకు బహూకరించుట జరిగినది. దానిలో పై గ్రంథమును అదృష్టముచే చదువుట జరిగెను. శ్రీస్వామి తపోవనులు నాలుగైదు పర్యాయములు హిమా లయపర్వత ప్రాంతమునంతయు పాదయాత్రచేసి, మానస సరోవరము గూడా దర్శించిన మహనీయులు. ఆ హిమగిరుల యొక్క వర్ణన ఆయన పొందిన ఆనందానుభూతులు, వారు అనుభవించిన, కష్టనష్టములను అపూర్వమైన ఉత్తేజకరమైన అనుభవములతో ఆ గ్రంథం అంతయు నిండి యున్నది. ఆ అమూల్య గ్రంథము చదివినంతసేపు ఆ హిమాలయ ప్రాంతములలో సంచరించుచున్నట్లు తోచెడిది. ఆ గ్రంథమును చదివిన పిదప నాలో కలిగిన కోరిక మరింత బలపడినది.“నేడే మనది రేపు మనది గాదు” అనెడి స్వామీజీ సూక్తిని జ్ఞప్తికి తెచ్చుకొని 1990వ సంవత్సరము అక్టోబరులో వెళ్ళి నా కోర్కె నెరవేర్చుకొన వలెనని వెళ్ళుట జరిగెను. అంతలో ముఖ్యమైన ఆశ్రమ భక్తులు కొంతమంది మాకు గూడా ఆ పవిత్ర హిమాలయములను దర్శించు భాగ్యము కల్గించవలెను. మీతోవచ్చెదమని కోరగా “ఇతరుల ఆనందమే మన ఆనందము” అనెడి స్వామీజీ యొక్క సూక్తి ననుసరించి వారితో ప్రయాణము జరిగెను.

అక్టోబరు 2వ తేదిన బయలుదేరి ఋషీకేశ్‌లో శివానందా శ్రమమునకు (డివైన్ లైఫ్ సొసైటి) చేరితిమి. పూజ్య స్వామి చిదానందులు ఆసమయ ములో ఆశ్రమములో లేరు. ఐననూ వారి ఆశీస్సులతోను, శ్రీస్వామి దేవానం దులు, శ్రీస్వామి హంసానందులు, శ్రీ బ్రహ్మచారి రాం స్వరూప్‌గారి ప్రేమాభి మానములు ప్రార్థనలచే మా యాత్రకు ప్రయత్నములు జరిగెను. మాతో బ్రహ్మచారి శ్రీరాం స్వరూప్‌జీ వచ్చిరి. ఆయనే మాసారథి. ప్రత్యేకమైన బస్సులో 21 మందితో ప్రయాణం సాగెను. ఋషీకేశ్ నుండి ఉత్తరకాశీ మీదుగా యమునోత్రి, గంగోత్రి, కేదార్‌నాథ్ బదరీనాథ్ మున్నగు నాల్గు ధామాల ప్రదక్షణ అయినది. సుమారు 20 రోజులు. ఆ ఎత్తైన మంచు పర్వతములలో సంచరించుట జరిగెను. ఆ ప్రాంతంలో యున్నంతకాలము స్వామీ తపోవన్ మహరాజ్ వారు వ్రాసిన అనుభవాలు, ప్రకృతి వర్ణన,కష్ట నష్టములన్నియు గుర్తుకువచ్చి మనము బస్సులో తిరుగుచునే కష్టపడుచుం టిమి. కానీ ఆ మహానుభావులు అన్నాహారాలు లేక విపరీతమైన చలిలో ఎటులు సందర్శించిరో అన్న భావన మనస్సునకు వచ్చినప్పుడల్లా ఏదోతెలి యని ఆనందము బాధ కూడా కలిగేది. జితేంద్రియములగు మహాను భావులకు తప్ప సామాన్యులకు ఆ ప్రాంతములో యుండుట సాధ్యముగాదు. అట్టి మహానుభావులు జీవించి

ఆచరించగలరు. ఋషీకేశ్ నుంచి బయలు దేరునపుడు శ్రీ రాం స్వరూప్‌జీ అందరికి నొకచక్కని చిన్న సందేశమునిచ్చిరి. హిమాలయ యాత్రకు వచ్చేవారందరు శారీరకముగ మానసికముగ ఆధ్యా త్మికముగ తయారై ప్రయాణం చేయవలెనని చెప్పిరి. నిజముగ ఆ మూడు సత్యములు దృఢముగ యున్ననాడే అటువంటి ప్రాంతములలో ప్రయాణించుటకు ఉత్సాహముగ, ఆనందముగ యుండునుగదా! దైవకృపచే అప్పటి ఆ యాత్ర జయప్రదముగ ముగిసెను. కానీ నా మండల దినములు గడుపవలెననెడి కోర్కె మాత్రం అటులనే యుండిపోయినదని, మరల రాబోవు సంవత్సరం అయినను పూర్తి చేసుకొనవలయును అని సంకల్పించి తిని.

ఇంతలో సోదరి సుశీలగారు (ఫ్రాన్స్‌సోదరి) క్రిందటిసారే మాతో హిమాలయాకు వచ్చు ప్రయత్నంలో యుండెను. కాని ఆమె ఫ్రాన్స్ నుండి వచ్చుటకు కుదరలేదు. ఈ సార తప్పక వచ్చెదనని ప్రయాణ మయ్యెను. ఇదిగూడా ఒక దైవాజ్ఞయే యని తలచితిని. నేనుగూడా మీతో బాటు 40 రోజులు మౌనముగ యుండి ధ్యానము చేసుకొందునని కోరుటచే ఆమెతో ఈ సంవత్సరము అక్టోబర్ 5వ తేదిన మాతృ ఆశ్రమం నుండి బయలుదేరి 7వ తేదికి ఋషీకేశ్ శివానందాశ్రమమునకు చేరితిమి. ఎచ్చుట ఫ్రాన్స్‌దేశము? ఎచ్చుటతోటపల్లి కొండలు? ఎచ్చుట ఋషీకేశ్ హిమాలయాలు! ఎవరు, ఎప్పుడు ఎచ్చుట యుండవలెనో అంతా దైవానుగ్రహమే గదా! భగవంతుని సంఘటనలు తలచిన చాలా ఆశ్చర్యముగ యుండును. మేము ఇటునుండి ఆశ్రమము చేరుసరికి పూజ్యులు చిదానందులు ఆశ్రమంలో లేరు. వారు 17వ తేది నాటికి వచ్చెదరని తెలిపినది. ఈలోగ మా సోదరి సుశీల బదరీవెళ్ళి వచ్చెదమని కోరెను. అక్టోబరు 13వ తేదిన ఆమె జన్మ దినము, ఆరోజు బదరీలో గుడపవలెనని ఆమె కోర్కె, ఈ శరీరం యొక్క జన్మదినముగూడా అక్టోబర్ 13వ తేదియే. ఇరువురి జన్మదినములు ఒకేరోజు అగుట అత్యాశ్చర్యము. శివానందాశ్రమంలోని మహాత్ములు అందరిని దర్శించి వారి ఆశీస్సులు పూజ్య స్వామి దేవానందుల ప్రార్ధనలతో 10వ తేదీకి బదరీకి బయలుదేరితిమి. మాకు తెలియకుండగనే 5రోజులు ఆ పవిత్రమయిన చల్లని అపూర్వమైన ప్రకృతికి నిలయమైన ఆ వాతావర ణంలో గడచిపోయినవి. 13వ తేదిన ఇరువురము ఉపవాస,మౌనములతో గడుపుట జరిగెను. అచ్చుట యుండగ ఏలనో, ధర్మరాజు స్వర్గారోహణము వెళ్ళిన తావు ఇదియేననెడి ఆలోచన పదేపదే వచ్చుచుండెడిది. ఆ మార్గము స్వర్గమునకు చేరువలో యున్నట్లనిపించెను. ధర్మరాజు సోదరులతో, భార్యతో స్వర్గమునకు బయలుదేరగా ఇక నడువలేక దారిలో సోదరులు, భార్యయు యుండిపోయిరి. ధర్మరాజు మాత్రము ముందు వెనుక చూడకుండగా స్వర్గమునకు జేరుట, ఆయనతో ఒక కుక్క మాత్రము అనుసరించుట, స్వర్గంలోనీకు, (ధర్మరాజుకు) ప్రవేశంయున్నది కాని నీతోవచ్చిన కుక్కకు ప్రవేశము లేదు అని చెప్పుటచే నాకు స్వర్గసుఖము అక్ఖరలేదు. అని ధర్మరాజు పల్కినట్లు ఎప్పుడో చదువుటయు, వినుటయు, జరిగెను. కాని ఆ దృశ్యము ఇప్పుడు ఈ

తావుల్లో జ్ఞప్తికి వచ్చుచు ఏదో తెలియని ఆనందము గల్గినది. ధర్మరాజు యొక్క స్వర్గారోహణ గూర్చి శాస్త్రరీత్య వేరే భావనలు యుండవచ్చు కాని నా భావప్రపంచ ములో ధర్మరాజు ఎంతోమనో విగ్రహపరుడు, తన సొంత సోదరులు, భార్యనుగూడా లెక్కచేయకుండగ, ఏ గమ్యమునకు తాను చేరుకొనవలయునో అది చేరు నంతవరకు వెనుతిరిగి చూడకుండా యుండుట, మరియు ఎంతో విశ్వాస ముతో తనను అనుసరించిన కుక్కకు స్వర్గములో స్థానము లేదనిన, తనకు గూడా ఆ స్థానము అవసరములేదనుట అటువంటి పట్టుదలతో కార్యదీక్ష సాధించుట. ఎంత సన్నిహితులు అయి నప్పటికి సమస్త ప్రపంచమను వదిలి మనము ఒంటరిగానే మన స్థానము నకు చేరవలసినవారముగదా! అనెడి ధర్మరాజు ప్రబోధముతోను ఏదో భావనలతో ఐదురోజులు గడిచెను. 15వ తేదిన తెల్లవారుఝామున బదరీ నారాయణులకు మనస్సులోనే నమస్కరించుకొని బయలుదేరితిమి. ఆ రాత్రి 8 గం॥లకు ఋషీకేశ్ శివానందా శ్రమమునకు దైవకృపచే క్షేమముగ చేరితిమి.

17.18 తేదిలలో పూజ్యశ్రీ స్వామి విద్యానందులవారి దర్శనము చేసుకొంటిమి. వారు ఎంతో పవిత్రమైన దివ్య ప్రేమతో ఆశీర్వదించిరి. అంతకు ముందు మా 40 రోజుల మౌనదీక్ష గూర్చి వారు వినుట జరిగెను. మా దేవానందస్వామి వగైరాలు మా దీక్షను ఋషీకేశ్‌లోనే పూర్తి చేయమని దానికి తగినఏర్పాట్లను చేయుదుమని ఎంతో ప్రేమాభిమానములతో చెప్పిరి. కాని నా మనస్సు ఏకాంతమైన స్థలమును కోరినది. ఋషీకేశ్‌నకు 38కి.మీ. దూరములో ఒకచక్కని ప్రదేశము గలదు. అది ఒకచిన్న గ్రామము దానిపేరు "కొడియాలా" గ్రామ మనగ పెద్దదిగాదు, సుమారు 10,12 ఇండ్లు యుండ వచ్చును. ఆ గ్రామము ఒక ఎత్తైన పర్వతము మీద యుండును.రోడ్డుకు ఒకవైపున ఎత్తైన పర్వతములు మరొకవైపు లోయలు యుండును. ఆ ప్రక్కనే గంగా మాత ప్రశాంతముగ ప్రవహించుచున్నది. ఈ లోయలో ఒక చిన్నకుటీరము యున్నది. ఇది శివానందాశ్రమమునకు సంబంధించినది. క్రిందటి సారి మా యాత్రలో బదరీనుండి ఋషీకేశ్ వెళ్ళుచున్నప్పుడు మమ్ము లను శ్రీరాం స్వరూప్‌జీ ఇచ్చట ఆపి ఆ ప్రదేశమును చూపించెను. ఆ తావుపేరు చిదానంద కాశీ అని గూడా చెప్పిరి. దానిని చూడగానే మనస్సును ఎందుకో ఆకర్షించినది. ఎప్పటికైనా నా 40 రోజులు మౌనదీక్షను ఈ తావులోనే గడిపెదను. ఆ అవకాశం ఇప్పించవలయునని రాం స్వరూప్‌జీని అప్పుడే కోరితిని. మీరు యుండగల్గిన అట్లే యుండవచ్చును. ఏమీ అభ్యంతరములేదని జెప్పెను. అచ్చటనే యుండుటకు నిశ్చయించుకొంటిని. కానీ మా సుశీల గూడా యున్నది గదా ! ఆమె ఈ తావులను చూడటం ఇదియే ప్రథమం. అందులోను ఈ ప్రాంతం అరణ్య ప్రాంతంగ యున్నది. ఋషీ కేశ్‌లో మనవారు మీరు ఆ ప్రదేశంలో ఏమియుండగలరు ? అచ్చట ఏమీ దొరకవు. కావున ఋషీకేశ్‌లోనే యుండవలెనని ఎంతగానో కోరిరి. కాని మొదటనే ఒక నిశ్చయం తీసుకొంటిని గాన ఆ విధముగానే గడుపవలెనని నా కోరిక, అయినను

దైవాజ్ఞ ఎటులుయుండునో అనుకొంటిని. అందుకే సుశీలకు ఆ ప్రాంతం చూపించి ఆమె గూడా అచ్చట యుండుటకు ఇష్టపడిన యుండవచ్చు లేదా ఋషీకేశ్‌లోనే యుండుటకు నిశ్చయించితిని. మాఅదృష్టముచే పూజ్యులు శ్రీచిదానందులు ఆశ్రమములోనే యుండుటచే ఈ విషయం వార్కి మనవి చేయగ తప్పక అట్లే చేయుడనిరి. 18వ తేది ఉదయమే వారి కారులో మమ్ములను ఒక బ్రహ్మచారి, ఒక స్వామీజీని తోడిచ్చి పంపిరి. సోదరి సుశీలకు గూడా ఈ ప్రశాంతమైన జనసమర్ధంలేని చక్కని ప్రదేశము నచ్చినది. అచ్చట యుండుట ఆమెకు గూడా ఆనందమని చెప్పుటచే యిచ్చట 40 రోజులు యుండుటకుస్థిరము చేసుకొం టిమి. పూజ్యశ్రీ చిదానందుల వార్కి ఈ విషయం మనవి చేసుకొని వారి అనుమతిని పొంది 19వ తేది ఉదయం ఏకాదశి రోజున మౌనముతో ఈ ప్రదేశములో ఈ పర్ణకుటీరంలో అడుగిడితిమి. పగటిపూటయే మానవసంచారము కన్పించదు. ఇకరాత్రి సంగతి వేరే చెప్పనవసరము లేదు. మేము మాతో మరొకరు కరుణామయుడైన దేవుడుండెననెడి ఆనందంలో యుండ గల్గుదుమన్న ధైర్యముతో మా కార్యక్రమమును, దీక్షను ప్రారంభించితిమి.

19వ తేది మొదటిరాత్రి సుఖముగ గడిచెను. 2వతేది రాత్రి గూడా గడుచు చున్నది. హఠాత్తుగా అర్ధరాత్రి 1,2 గంటల ప్రాంతములో మేమున్న కుటీరం అందులోయున్న సామాను శబ్దముతో ఊగుట ప్రారంభించెను. అటులు రెండుమూడు నిముషములు యుండి తగ్గినది. మేము మౌనము గావున మాట్లాడలేదు. సుశీల నాచెయ్యి గట్టిగ పట్టుకొనినది. నాకు ఇంతకు పూర్వము ఈవిషయము అనుభవములో లేదు. భయమన్నది గూడా కల్గలేదు. తెల్లవారగనే సుశీల కాగితము మీద ఈ విధముగ వ్రాసి చూపించినది. భూకంపం వచ్చినది. ఋషీకేశ్‌లో గూడా యుండవచ్చు అని వ్రాసెను. భూకంపం అయినను ఆ రాత్రి దైవానుగ్రహంచే సుఖముగ గడిచెను. ఇది గూడా ఒక దైవపరీక్షయని తలచి అంతా ఆయన అనుగ్రహం మీదనే ఆధారపడి యున్నదిగదా, అనేటటువంటి మనోబలముతో శాంతిగ, ఆనం దంగ రోజులు గడిపితిమి. మేమున్న కుటీరమునకు అన్ని సదుపాయములు గలవు. కానీ ఎవరు ఇచ్చుట నివశించుటలేని కారణముగ విద్యుత్ యున్నను దీపములు వెలుగుట లేదు, పైపులున్నవి గాని నీళ్ళురావు. అయినను గంగా ప్రవాహం చేరువలో ప్రక్కనే యున్నది గదా! నీళ్ళకు కొరత ఏమున్నది? పగలు అంతయు సూర్యభగవానుడు ప్రకాశించు చుండును. ఇక రాత్రంతయు నక్షత్రములకాంతి విరాజిల్లుచుండెను. ఇక లోటు ఏమున్నది? దీపము బాహ్యకాంతి లేదన్న భ్రాంతి కూడా కలుగులేదు. రాత్రులు అవసరమైనపుడు క్రొవ్వొత్తులతో ఈ40రోజులు గడిపితిమి? ఇక ఎత్తైన పర్వతము లను, నిత్యము విసుగు, విరామము లేకుండా ప్రవహించుచున్న గంగా ప్రవాహ మును, మృదు మధుర కూతలతో పలుకరించు రకరకముల పక్షులను, అప్పుడప్పుడు కొండల పొదలలో నుండి గంగ ఒడ్డుకు వచ్చి నీటిని త్రాగుచున్న లేళ్ళను, జింకలను చూచుచూ ఈ రమణీయమైన ప్రకృతిని గాంచుచున్న ఎంత నాస్తికునకైన హృదయము

పులకరించక మానదు. ఈ అద్వితీయమైన ప్రకృతి మనకు ఎంతో విలువైన ప్రబోధమును చేయుచుండును.కాని మన జ్ఞానమునకు బుద్ధికి అందుకొనుట కష్టము."ఎన్ని బీభత్స మైన తుఫానులు, పెనుగాలులు వచ్చినను మాకు చలనము లేదు. మమ్ము చలింపజేయలేవు" అని పర్వతములు పల్కుతున్నట్లున్నది. అట్లే జీవితములో ఎన్ని పరీక్షలు, అవాంతరములు వచ్చినను దేనిని లెక్క జేయక ధైర్యముగ నిర్భయత్వముతో యుండగల్గిననాడే జీవిత సార్ధకత అగును కదా! ఆ నిర్మలమైన స్వచ్ఛమైన గంగా ప్రవాహము బోధించేది 'మనస్సులను, హృదయ ములను పవిత్రము చేసికొని నిర్మలమైన నిష్కలంకమైన బుద్ధితో జీవితమును గడుపుచు మీకున్న దానిని మీకొరకై దాచుకొనక ఇతరులతో పంచుకున్న నాడే జీవితమునకు సార్ధకత, "ఇక పక్షులు ఇట్లు పల్కు చున్నవి. "మానవుల జీవితముల కన్న మా జీవితములే పరమ పవిత్రమైన స్వేచ్ఛా జీవితములు. మమ్ము సృష్టించిన సృష్టికర్త మీదనే మేము ఆధారపడి యుంటిమి. మాకు చింత,బాధ అనునవిలేవు. ఏపూటకు ఆపూట ఆహారమునకు గూడా ఆలోచించ నవసరములేదు. ఆ సర్వజ్ఞుడే మాకు సమకూర్చుటలేదా?" ఈ విధముగ ఎవరి జీవితములు దైవము మీద ఆధారపడి స్వార్ధమనునది వదిలిననాడే జీవితమునకు ఒక సార్ధకత యుండును. పక్షుల యొక్క కూతలు వినుచున్న చాలా విచిత్రముగ యుండును. అవి కూతలుగ యుం డవు. ఏవో మాటలుగ రకరకములైన ధ్వనులతో పిలచు నట్లు వినిపించుట ఆశ్చర్యము. పక్షులకు కూడా ఒక భాషయున్న దని మన ఋషులు గూడా వాటితో సంభాషించెడివారని వినుచుందుము. ఆ విధముగ వాటితో సంభాషించెడి అదృష్టము లేకపోయినను ఆ పక్షుల యొక్క మధురమైన గానము చెవులార విని ఆనందించవలసిన విషయమే కాని, వర్ణించుట కష్టము. ఈ 40రోజులు దివ్యమైన పవిత్ర హిమాలయ ప్రకృతిని గాంచుచు మా 40 రోజుల మౌనదీక్ష 40 గంటలుగ గడచిపోవుట మాకే ఆశ్చర్యమును కల్గించు చున్నది. 40వ రోజు దగ్గరపడుచున్న కొలది అపుడే పూర్తి అగు చున్నదా? అనెడి భావన కలుగలేదు. జీవితములో ఏమిసాధించితిమో, ఏమి అనుభవములను పొందితిమో, ఆ దైవమునకే తెలియును. కాని 40 రోజులయొక్క ఏకాంతవాసము, మౌనము యొక్క ఫలితము 40 రోజులే గాదు, జీవితాంతము ఈ విధముగ గడుపుట సాధ్యమే. కష్టమైన పనికాదు. కాని మనస్సును నిగ్రహించి నోటితో మాట్లాడకుండా యుండముగదా, మనస్సు మాట్లాడకుండగ యుంచిననాడే మౌనము యొక్క ఫలితముగదా! కానీ ఆ అదృష్టము యుండవలెనుగదా! అభ్యాసము వైరాగ్యముచే దేనినైనను సాధించవచ్చునని భగవానుడు గీతలో నుడివెనుగదా! అన్నింటికి మూల మైనది మనస్సే. ఇది నిగ్రహమైన దేనినైనను సాధించవచ్చు. కాని ఇది అంత సులభమా? దానికి గూడా దైవానుగ్రహము యుండవలెను. కావున ఆ అనుగ్రహము నకే మన ప్రార్ధనలు, ధ్యానములు గదా! దైవానుగ్రహంచే నవంబరు 27వ తేదిన మా 40వ రోజు పూర్తి అయ్యెను.

ఈ సదవకాశమును అనుగ్రహించి జయప్రదము గావించిన ఆ పరమాత్మకు మా కృతజ్ఞత ఈ మాటలలో ఎటులు తెలుపుట? అసలు దైవమునకు నిజమైన కృతజ్ఞత చెప్పుటనగా ఆయనను సర్వకాల సర్వావస్థల యందును స్మరించుటయే, ఆయనకు మనము అర్పించు నిజమైన కృతజ్ఞత. కావున అటువంటి పవిత్ర స్మరణను మనకు గల్గించుగాక ! యని భక్తి పూర్వకముగ ప్రార్ధించుచుంటిమి. తిరిగి నవంబరు 28, 29తేదిలు ఋషీకేశ్‌లో గడిపితిమి. అచ్చటయున్న మహాత్ములనందరినీ దర్శనము చేసుకొని వారి శుభాశీస్సులతో 30వ తేదిన బయలుదేరి మాతృ ఆశ్రమము నకు 2వ తేదిన దైవానుగ్రహముచే క్షేమముగ చేరితిమి.

ఆశ్రమ భక్తులు సన్నిహితులు కొంతమంది మా 40 రోజుల యొక్క విశేషములు అడుగుట సహజముగాన వారి కోర్కెప్రకారం మా శాంతిపాఠ కులు కూడా చదువుదు రన్న ఆనందముతో తెలిసి తెలియని జ్ఞానముతో, వచ్చీరాని భాషతో కేవలము నా తృప్తికొరకు ఈ 40 రోజుల భావనలు వ్రాయుట గాన ఇందులో మంచి ఏమన్న యున్న తీసుకొని తక్కినవి వదిలి దైవానుగ్రహము పొందుటకు ఈ జీవితము ఇంకా అర్హతగ యుండేటట్లు మీ అందరి ప్రార్ధనలతో ఆశీర్వదించెదరు గాక ! యని కోరుచూ ముగించు చుంటిని.

## అర్పణ

కేవలము దైవానుగ్రహముచే పూజ్యశ్రీ స్వామి ఓంకారుల ప్రేరణచే కల్గిన ఈ నలుబది రోజుల మౌనదీక్ష జయప్రదముగ జరిగినందులకు ఆ కరుణామయుని ప్రస్తుతించుచూ ఈ "పవిత్ర హిమాలయ పర్వతములలో మా (40 రోజుల) మండల నివాసం అను సందేశమును శ్రీ స్వామీజీ" 98వ జన్మదిన సందర్భముగ వారి పాదపద్మములకు పూజా పుష్పముగ సమర్పించుకొనుచు సదా వారిలో జీవించుచున్న-

మీ సోదరి - జ్ఞానేశ్వరి

**(శాంతి జనవరి 1992)**

"సంసార సాగరం దుఃఖం" అని తెలుసుకున్న వారికి శ్రీపూజ్య శంకర భగవత్పాదుల వారు వారి గీతాభాష్య ప్రారంభములో చెప్పినట్లు ఈ గీతాసారం తెలుసు కున్న వారికి దుఃఖ నివృత్తి కాగలదు, ధన్యమైన మానవజన్మ గమ్యస్థానమును చేర్చ గలదు. వేదం పుట్టిన ఈ పుణ్య దేశంలో జన్మించినవారు, గీతాను బాగుగా అర్థం చేసుకొన గలిగిన పుణ్యాత్ములు ఈ కర్మ దేశము విడిచి భోగదేశమునకు ధన సంపాదనా మోహములో పడుటకు వెళ్లరు. సాక్షాత్ పరమేశ్వరుడు బోధించిన దగుటచే యీ గ్రంథము చాలా విలువైనది. మోక్షమొసగు పవిత్ర గ్రంథ రాజమగుటచే దీనికి మాత్రము ప్రతి సంవత్సరము జయంతి జరుగును. ఈ ప్రపంచములో మరి ఏ యితర గ్రంథము లకు జయంతి జరుగదు.

# ౬. పూజ్యశ్రీ మాతాజీ వారితో బొంబాయి ప్రయాణం

- ఆదర్శ భక్తురాలు

మేము 27-3-1995న మాతృ కేంద్రమైన శాంతి ఆశ్రమము నుండి బయలుదేరి బొంబాయి పట్టణం చేరినాము. బొంబాయి పట్టణం ఆకాశం తాకే ఎత్తైన సౌధాలతో, ప్రజావాహినితో, ఆధునిక వాహనాల ధ్వని తరంగా లతో నిండి వున్నది. మొదట మేము అనారోగ్యంతో బాధపడ్తున్న "దీను" అనే భక్తురాలు వద్ద దిగినాము. ఆమె 30సం॥గా మాతృ ఆశ్రమానికి చిరపరచితురాలు. ఆమె ప్రేమ, సేవ, భక్తిభావము, అమృత హృదయంతో మమ్మల్ని సాదరంగా ఆహ్వానించింది. ఆమె ప్రతి సంవత్సరం పూజ్యశ్రీ ఓంకారస్వామివారి జన్మదిన వేడుకలకు విచ్చేయు చుండెడిది. పూజ్యశ్రీ స్వామివారి అఖండమైన ప్రేమ,వాత్సల్యము, జ్ఞానప్రాప్తి పొందిన ధన్యురాలు. దీను కొన్ని సంవత్సరాలనుండి స్వామివారి జన్మదిన వేడుకలలో అస్వస్థత వల్ల పాల్గొనలేకపోయింది. దీను గారిని పరామర్శించి, వారికి ధైర్యము, ప్రేమ, వాత్సల్యము అందించటానికి శ్రీమాతాజీవారు ఈ సుదీర్ఘ ప్రయాణం చేసినారు. శ్రీమాతాజీ వారిని చూచిన తోడనే దీనుగారు అస్వస్థత అనేమాట మరచి మాతో ఆనందోత్సాహాలతో గడిపిరి. శాంతికి ఔదర్యానికి వాత్సల్యా నికి మారు పేరైన శ్రీమాతాజీ వారి పాదస్పర్శతో అచట పుడమి, ప్రకృతి పులకరించినట్లు అయింది. వారి కుటుంబం అంతా ఎంతో శ్రద్ధా భక్తులతో మాకు ఉపచారములు చేసినారు. వారితో గడిపిన సమయము ఎంతో మధురం. శ్రీమాతాజీ ప్రేమ, వాత్సల్యము బహు దొడ్డవి. పవిత్రమైన మూడు దినముల తర్వాత పూజ్యశ్రీ స్వామి ఓంకారుల వారి పరిపూర్ణ భక్తురాలు, చిరకాలం ఆశ్రమంతో అనుబంధం వున్న శ్రీమతి సుశీలశెట్టిగారు (ఖార్‌వెస్టు)లో మాకు రాత్రి, పగలు అనుకోకుండా సేవలు అందించి నారు. వారి సేవ అమోఘము, మాకు అన్ని విధములుగా ఆతిధ్యం అందించిన గొప్ప భక్తు రాలు. అచట మా ప్రయాణాలలో అతిముఖ్యమైనది. గణేషుపురి దర్శించుట, అక్కడికి బొంబాయి నుండి రెండు గంటల ప్రయాణం. ఈ పవిత్ర స్థలంలో కేరళ నుంచి విచ్చేసిన అవధూత నిత్యానంద భగవాన్, వీరి శిష్యవరేణ్యులైన శ్రీస్వామి ముక్తానంద దివ్య సమాధులు దర్శించాము. ధార్మిక సిద్ధాంతానికి ప్రతీకగా నిల్చిన బొంబాయి పట్టణంలో, శ్రీమహాలక్ష్మి, శ్రీగణపతి, మరియు శ్రీదేవి ఆలయాలు ఎంతో దివ్యానుభూతులను కల్గిస్తాయి. ఇవియే కాకుండా శ్రీస్వామి చిన్మయానంద వారి ఆశ్రమము, మరియు హరేకృష్ణ వారి సంస్థాన ములు దర్శించినప్పుడు పూర్ణ ఓంకార తన్మయత చెందినాము. ఈ ప్రదేశా లలో ఎంతోశాంతి, భక్తిభావము, భగవన్నామం ప్రతి ధ్వనిస్తున్నాయి. తర్వాత మణిభవనం వెళ్ళాము. మహాత్మాగాంధీ గారు బొంబాయి వచ్చినపుడు ఈ మణి భవనములో విశ్రాంతి, కార్యకలాపాలు చేస్తూవుండేవారు. ఆ భవన ములో మహాత్మాగాంధీ గారి చిత్రపటాలు, బొమ్మలు మరి ఇతర సామాగ్రి వారి సాహసిక కృత్యాలకు ప్రత్యక్ష ప్రతినిధిగా వున్నవి.

శ్రీమతి సుశీలాశెట్టిగారి ఇంట్లో మేమున్న రోజుల్లో వచ్చే పోయే భక్త బృందాలతో ఎంతో ఆహ్లాదకరముగా వుండెడిది. పూజ్యశ్రీ మాతాజీ వారు విసుగు విరామము లేకుండా అందరితో ఎంతోప్రేమ, వాత్సల్యంతో మాట్లాడి నారు. వారి చిరునవ్వులు, అమృత దృక్కులు, శాంతి వుట్టిపడే ముఖారవిం దంతో అక్కడ విచ్చేసిన ప్రతివారి మనస్సులో శాంతిని ప్రాప్తింప చేసినారు. పూజ్యశ్రీ ఓంకార స్వామివారి దివ్యసందేశాలను, వారు ప్రాప్తింపచేసిన ధార్మిక సిద్ధాంతాలను, మౌనపు ఘడియల మూల సారమును, ఆధ్యాత్మిక మెరుపులలో సులువైన మెళకువలను ప్రతి ఒక్కరి హృదయంలో నాటు కొనేటట్లు ప్రభోదనము చేసినారు.

మేము గడిపిన మరొక శుభదినము, మధుర గాయకురాలు శ్రీమతి సుశీలారాణి పాటిల్ విచ్చేసి వారి గృహమునకు ఆహ్వానించినారు. వారి ఇంటిలో ఆవిడ 'శుక్లాంబరధరం' శ్లోకాన్ని అతిమధురంగా ఆలపించినారు. వారి సోదరి చిరకాల ఆశ్రమ సభ్యురాలు అయిన శ్రీమతి మనోరమ గారిని కలిసాము. ఆవిడ మనుమరాలు మధురాతి మధురంగా ఆలపించిన పాటలు విని ఆనందించాము. మేము ఆశ్రమ చిరపరిచితులు శ్రీమతి మరియు శ్రీ మల్కాని గారిని కలసినాము. శ్రీమాతాజీ గారిని దర్శించగానే కోటగిరి ఆశ్రమములో పూజ్యశ్రీ ఓంకారస్వామి వారితో గడిపిన కాలం గురించి వారు మాట్లాడిరి. అనంతమైన ప్రకృతి అనుభవాలతో, గురుదేవుల చిరస్మరణ, భక్తులప్రేమ, వాత్సల్యంతో మరువలేని దివ్యానుభూతులతో మా ప్రయాణము ముగిసింది.

**(శాంతి మే 1995)**

## 7. కెనడా యాత్ర

## (10.9.2..4 - 21.10.2004)

పుణ్యక్షేత్రములు, దేవాలయములు దర్శించునప్పుడే యాత్రనుకొం దుము. తక్కిన దేశవిదేశ ప్రదేశములు సందర్శించునప్పుడు పర్యటన అను కొనుట సహజము. గాని ఈ కెనడా యాత్ర ఏమిటని కొందరికి సందేహము గలుగవచ్చును.

భగవంతుడు సర్వవ్యాపి, సర్వజ్ఞుడు, సర్వశక్తిమయుడుగదా! ఆయన లేనిప్రదేశము ఉన్నదా? ఒక అఖండమైన దివ్యశక్తియే ఈ విశాల ప్రపంచ మును నడిపించుచుండెను. దేశ ఆచారములు, వేషభాషలు వేరుకావచ్చును గాని భగవంతుని సృష్టిలో ప్రకృతి అంతయు ఒక్కటియేగదా! మానవుని మనోభావనలు బట్టి ప్రవృత్తి, నివృత్తి గానవచ్చుచుండును.

అసలు ఈ కెనడాయాత్ర ఎలా లభించినదని కొంత తెలియవల యునుగదా! కెనడా సోదరి ఎలోయిస్ పూజ్యశ్రీ స్వామి చిదానందుల వారిచే ఉపదేశము పొంది దివ్యప్రకాశ్ అనే నామకరణము పొందెను. శ్రీస్వాములవారు శాంతి ఆశ్రమమునకు వచ్చినప్పుడల్లా ఆమె ఆశ్రమానికి వచ్చుచుండెడివారు. ఆ విధముగా శ్రీశాంతి

ఆశ్రమమే గాక నేను కూడా ఆమెకు చాలా సన్నిహితమయ్యేను. ఆమె ఆశ్రమానికి వచ్చినప్పుడల్లా ఆమే ఆశ్రమము, ఆశ్రమమే ఆమె అన్నట్లుగ జీవించుచుండును. నన్ను కెనడాకు రావలసినదిగా 2,3 సంవత్సరముల నుండి ఆహ్వానించుచుండెను. కెనడాకు వచ్చి ఏమి జేయవలయును? అయినా దైవాజ్ఞతో ఎప్పటికైనా మీ కోరిక ప్రకారము రావలసియున్న నయాగరా జలపాతములు జూడవలయును ఏలనన, పూజ్యశ్రీ స్వామీజీవారి విదేశపర్యటనలో 1926సం॥లో నయాగరా జలపాతములు సందర్శించి, ఆ జలపాతాల వద్ద కూర్చుని నయాగరా సందేశము వ్రాసిరి. అప్పటిలో ఆసందేశము చదివినవారు అమెరికా భక్తులు ఆ సందేశమును ఫోటోలు కట్టించుకొని పెద్దపెద్ద చర్చిలలో పెట్టిరని వినుట జరిగెను. ఆ సందేశ సారంశము "భగవంతుని శక్తి ఎచ్చటనో లేదు. ఆ ప్రవాహములో కూడ అనుభవించవచ్చు. స్వార్థమనునది లేకుండా వున్నదానినంతా యిచ్చివేయుచుండును. ఇచ్చిన కొలది వచ్చుచునే వుండును." ఎప్పటికైనా అటువంటి దృశ్యము జూడవలయునన్న సంకల్పము సోదరి ఎలో యిస్‌కు చెప్పుట జరిగెను. అప్పటి నుండి ఆమె నన్ను ఎటులైనా కెనడా తీసుకొని వెళ్ళి నయాగరా దర్శనము చేయించవలయునని సంకల్పించెను. ఆమె జూలై నెలలో ఆశ్రమానికి వచ్చిరి. దైవ కృపచే ఆమె సంకల్పము, నా కోరిక నెరవేరెను.

9వ తేది ఉదయం హైదరాబాదు చేరితిమి. శ్రీ ఆర్. నర్శింహరాజు గారి గృహములో 2,3గంటలు గడిపి వారి ఆతిధ్యమును స్వీకరించి భక్తుల ప్రేమాభిమాన ములు అందుకొంటిమి. ఢిల్లీలో పరమహంస యోగానందుల వారి భక్తులైన ఎస్.కె. సేథీ గారి గృహమునకు జేరితిమి. ఆ గృహము సత్సంగ మందిరముతో చక్కని ఉద్యానవనముతో నిండియున్నది. ఆ దంపతుల భక్తి ప్రేమలతో 9,10వతేదిలు చక్కని ఆతిధ్యము యిచ్చుటయేగాక 10వ తేది ఉదయం సత్సంగము ఏర్పరచిరి. నాలుగు మాటలు చెప్పవలసి నదిగా కోరిరి. అంతా దైవసన్నిధితో నిండియున్నప్పుడు ఆ దివ్య సన్నిధిని అనుభవించుట తప్ప చెప్పుటకేమున్నది? ఆ రోజు చెప్పిన సారాంశము శ్రీ పరమహంస యోగానందులకు పూజ్యశ్రీ స్వామీజీకి యున్న సన్నిహిత సంబంధ కారణమే. ఈరోజు ఆయన అనుగ్రహముచే ఆయన భక్తులను కలుసు కొనుట జరిగెను. ఈ సత్సంగములో పాల్గొను అదృష్టము గల్గుట కేవలము ఆయన కృపయేగదా ! ఆయన కరుణ ఎప్పుడు ఏవిధముగ పొందగల్గుదుమో తెలియదు గదా ! భగవంతుడు ఆ దంపతులను, అందరినీ శాంతి సుఖములతో బ్రోచుగాక !

ఆ రాత్రి శ్రీఎస్.కె. సేథీ దంపతుల ప్రార్థనలు, ఆశీస్సులతో విమానాశ్రయము నకు బయలుదేరితిమి. ఆ తర్వాత విమానము బయలు దేరెను. ఆ విమానములో వున్నంతసేపు ఏదో ఆకాశములో విహరించు చున్నట్లుగానే వున్నదిగాని వేరేమియు అనిపించలేదు. నిజముగ విమానము నడిపించే పైలెట్ యొక్క చాకచక్యములకు నమస్కరించవలయునుగదా! ధ్యానము ఏకాగ్రతయే గదా కావలసినది. ఆపైలెట్‌కు ఎంత ఏకాగ్రతలేనిదే రాత్రి పగలు ఏకధాటిగ 17,18 గం॥లు నడిపించగల శక్తి

ఎచ్చట నుండి వచ్చెను? శ్రద్ధ, అభ్యాసమే గదా కారణము. దానికి దైవకృప గూడ వుండ వలయును. ఆ రాత్రి ప్రయాణము జరుగుచుండగ ఇక 2,3 గం॥లో టొరెంటో కెనడాకు జేరవలసిన సమయంలో ఒక విచిత్రమైన సంఘటన జరిగెను. ఢిల్లీలోనే ఒక ఆమె వీలుఛైర్‌లోనే ఆమె కూర్చునే సీటు వరకు విమానములో ప్రవేశించి కూర్చుండెను. స్థూల శరీరము,కొంచెము సుస్తీగా వున్నట్లు కనిపించెను.

నేను ఎచ్చటవున్నా సోదరి ఎలోయిస్ నా సౌకర్యము కొరకే ప్రయ త్నించు చుండును. మేము కూర్చున్నచోట 2 సీట్లు ఖాళీగా వుండుటచే ఆమె వేరేచోట కూర్చుని నాకు పరుండుటకు ఏర్పరచెను. నేను బాగా నిద్రించితిని. ఈలోగ వీలుచైరులో వచ్చిన ఆమెకు ఏదో సుస్తీ చేసినట్లు విమానములో వున్న సిబ్బంది హడావిడిగా ఆమెకు పరిచర్యలు చేయుట, ఎవరైనా డాక్టరు ఈ విమానములో వున్న రావలసినదిగ ప్రకటన చేయుట అప్పుడు మా దగ్గరగానే కూర్చొని యున్న ఒక లేడీ డాక్టరు వెళ్ళుట జరిగెను. సోదరి ఎలోయిస్‌గారు గూడ అటు యిటు తిరుగుచునే వుండిరి. ఈలోగ ఆ సుస్తీగా వున్న ఆమె బంధువులకు ఫోన్ ద్వారా తెలియపర్చుట యివన్నీ విమానము ప్రయాణించుచుండగనే జరుగుచున్నవి. ఐస్‌లాండ్ అనేది ఒక దేశమట. ఆ రాత్రి సమయము విమానమును ఐస్‌లాండ్‌కు మళ్లించి అచ్చట దించిరి. ఆమెను అచ్చట దింపించి ఆసుపత్రిలో చేర్చే ఏర్పాటు చేసిరి. ఆమె ఆరోగ్యమునకై ప్రార్థించితిమి. అంతకన్న మనము చేయవలసినది ఏమిలేదుగదా ! దైవలీలలు విచిత్రమైనవి. ఈ సంఘటన వల్ల ఐస్‌లాండ్ దర్శనము విమానము నుండియే అయినది. తిరిగి మా కెనడా విమానము ప్రయాణము సాగుచున్నది. 11వతేది ఉదయం సుమారు10,11 గం॥లకు టొరెంటో విమానాశ్ర యంలో దిగి అచ్చటనుండి చక్కనైన చిన్న బస్సులో తనిఖీ వద్దకు వచ్చితిమి. మేము ఎక్కిన బస్సులోనే విమానం నడిపిన పైలెట్ తక్కిన సిబ్బంది ఎక్కిరి. మన ఎలోయిస్‌గారు రాత్రి జరిగిన సంఘటన గురించి ఆరాత్రి సమయం ఐస్‌లాండ్‌లో దింపుట చాలాకష్టమైన, ఆశ్చర్యకరమైన విషయము అని పైలెట్‌గారిని అభినందిం చుచూ, చెప్పగ ఆయన 17,18సంవత్సరములుగ పనిచేయుచుంటిని ఇటువంటి సంఘటన ఎప్పుడూ జరుగులేదు. ఇదే ప్రథమమనిరి. ఎప్పుడు ఏది ఎటుల జరుగ నున్నదో తెలియదుగదా ! భగవంతుడు పైలెట్‌గారిని, తక్కిన సిబ్బందిని ఆయురారోగ్య ములతో, నిత్య శాంతితో సదా బ్రోచుగాక !

తిరిగి మా తనిఖీ వగైరాలు పూర్తిచేసుకొని మా సామాను తీసుకొని బైటకు రాగా శ్రీకరుణా ప్రేమానందగారు మాకై వేచివుండి, స్వాగతము పలికిరి. ఈమె గూడ పూజ్యశ్రీ చిదానందస్వామివారి శిష్యులు, మన శాంతి ఆశ్రమానికి గూడ 2,3 సార్లు వచ్చిరి. ఈమె ప్రత్యేకముగా మాకొరకై అమెరికా నుండి వచ్చిరి. ఎలోయిస్ గారు ముందుగ విమానాశ్రయంలోనే ఒక కారు ఏర్పరచిరి. అవసరమైన ప్రయాణికు లకు ఎన్ని రోజులకు కావలసిన అన్నిరోజులకు ఏర్పరచెదరు. మాకై ఏర్పరచిన

కారు శ్రీ కరుణా ప్రేమానందగారు నడుపగా టొరంటో నుండి 2,3 గంటలలో నయాగరా చేరితిమి. అచ్చట హోటల్సు చాల వున్నవి. అవి కాకుండా 'బెడ్ & బ్రేక్‌ఫాస్ట్' అని చిన్న చిన్న చక్కని కాటేజీలుండును. ముందుగ ఒక కాటేజ్ బుక్ చేయుటచే వెళ్లగానే ఆ కాటేజిలో ప్రవేశించి స్నానము వగైరాలు పూర్తిచేసు కొని కొంత విశ్రాంతి పొంది,ఎట్టకేలకు ఆశించిన నయాగరా జలపాతముల దర్శనము అయినది. ఆ అద్భుతమును స్వయముగ అనుభవించి ఆనందించ వలసినదేగాని మాటలతో వర్ణించుట కష్టము. వినేది వేరు చూసి స్వయముగ అనుభవించేది వేరు గదా ! భగవంతుడు సర్వశక్తిమయుడు గాన ప్రతీ దృశ్యములో ప్రతీ అణువులో ఆ శక్తి గాన వచ్చును. ఈ జలపాతములు అఖండమైన అద్భుతమైన శక్తితో ఓంకార ధ్వని నినదించుచున్నట్లుండును. ఈ అపూర్వమైన జలపాతములు సందర్శించుటకు ప్రపంచములో నలు మూలల నుండి వేలాదిమంది వచ్చుచుండుట ఆశ్చర్యము. నయాగరా జలపాతముల దగ్గర నుండి ఒక వంతెన వున్నది. ఆ వంతెన అవతల నుండి అమెరికా దేశమట. నయగరా నుండి 40,50 నిమిషముల ప్రయాణమట గాని, అది దాటుటకు ఎన్నో ఏర్పాట్లు వీసా వగైరాలు వుండ వలయునట. ఈ జలపాతములలో అమెరికా జలపాతములు ఒక ప్రక్క, కెనడా జలపాతములు ఒక ప్రక్క ప్రవహించుచుండును. ఈ పావనమైన జలపాతములను 4 రోజుల పాటు దర్శించుచూ అచ్చటనే ప్రార్థన, ధ్యానము లతో గడుపు అవకాశము అదృష్టము గల్గించిన భగవంతునికి, సోదరి ఎలోయిస్ గార్కి కృతజ్ఞతలను తెలుపుకొనుట జరిగెను.

మానవుడు గూడ ఎన్నో అద్భుతమైన చిత్ర విచిత్రమైన దృశ్యములను సృష్టించుచుండెను గదా ! ఈ నయాగరా జలపాతములను రాత్రుల యందు చూచిన పంచరంగులతో ఆ జలపాత దృశ్యము చాలా ఆకర్షణీయముగ, ఎంతో ఆహ్లాదకరముగ వుండును. మానవుని మేధస్సే యింత అద్భుతముగ వున్నప్పుడు ఈ మేధస్సును సృష్టించిన కర్త ఎంత ఘననీయుడో వేరుగ వ్రాయనవసరము లేదు. అటువంటి సృష్టికర్తకు సర్వదా ప్రణామములు.

మేము తిరిగి 15వ తేదిని నయగరా నుండి బయలుదేరి టొరెంటో వచ్చి (ఈసారి డ్రైవింగ్ మన ఎలోయిస్‌గారు) కారు అచ్చట అప్పజెప్పి మరల విమానములో వాన్‌కోవర్‌కు ప్రయాణించితిమి. టొరెంటో నుండి వాన్‌కోవరు 4,5 గం॥ల ప్రయాణము. ఆ సాయంత్రమునకు దైవకృపచే ఎలోయిస్‌గారి గృహమునకు సురక్షితముగ చేరితిమి. విశాలమైన ప్లాటు. నాకై ముందుగానే ఏర్పరచిన గది, అందులో మహాత్ములు, దేవతామూర్తుల ఆల్టరుతో శాంతిగవున్నది.వారం, పదిరోజులు విశ్రాంతిగ వుండి మధ్య మధ్య చక్కనై ప్రకృతితో నిండిన తావులకు వాహ్యాళి వెళ్ళుచూ గడుపుట జరిగెను. ఎలోయిస్ గారి ముఖ్య స్నేహితులు మా రాకను విని వచ్చుచూ వెళ్ళుచుండెడివారు. ఈ వాన్‌కోవర్ అనేది చాలా పెద్ద నగరము అన్ని జాతుల

వారు వుండిరి. రాజస్థానములో వున్న మౌంట్ అబూలో బ్రహ్మకుమారిస్ అనే దేశ ప్రసిద్ధికెక్కిన సంస్థ. ఆ సంస్థ అధ్యక్షురాలు దాది జానకి ఆమె వాన్‌కోవర్‌కు వచ్చిరని 23వ తేదిని (సెప్టెంబర్) క్వీన్ ఎలిజబెత్ థియేటరులో ఆమె ఉపన్యాసమున్నదని పేపరులో పడినది. వెళ్ళుదమా యని ఎలోయిస్ అడిగిరి. దైవకృపచే దాది జానకిగారి దర్శనము వాన్‌కోర్‌లో అయ్యే అదృష్టము గల్గుచున్నది గదా యని ఆ సమావేశమునకు వెళ్లితిమి. ఆమె 60 నిమిషములు హిందీలో ప్రసంగించగ మరొక ఆమె ఆంగ్లంలో తర్జుమా చేసిరి. ఆమె ముఖ్యముగ చెప్పి సారంశము జ్ఞానము, శాంతి, ప్రేమ గురించి ఏ మహాత్ములు చెప్పినా సత్యము ఒకటియే గదా ! వారి వారి అనుభవము లతో చెప్పుచుందురు. ఎచ్చట నిస్వార్థమైన జీవితముండునో అచ్చట శాంతి, ప్రేమ వుండును. జ్ఞానముదయించును. అదే మన గమ్యము. భగవంతుడు అందరికీ అటువంటి శాంతి ప్రేమలను నొసంగుగాక!

సర్రే అనే నగరమునకు వాన్‌కోవరు నుండి 24తేదిని బస్సులో వైట్‌రాక్ చేరితిమి. అచ్చటకు ఎలోయిస్‌గారి స్నేహితులు కారు తీసుకొని వచ్చి మమ్ములను అందుకొని వారి గృహమునకు తీసుకొని వెళ్ళిరి. అచ్చట భోజనము ముగించుకొని సముద్రమునకు వెళ్ళితిమి. అది పసిఫిక్ మహా సముద్రము. సముద్రమనగా అలలతో నిండి ఉండునుగదా! గాని ఈ సాగరుడు అతి నిర్మలముగ సరస్సువలె వున్నాడు. అద్భుతమైన దృశ్యము. అందులో రకరకములైన పక్షులు జీవించుచుండెను. చిన్న చిన్న కొండరాళ్లు తెల్లగా వున్నవి. ఈ సముద్రము మీద గూడ ఒక వంతెన వున్నది. ఇచ్చట నుండి అమెరికాలో వున్న మంచుకొండలు,కొన్నిఎత్తైన కట్టడాలు గానవచ్చు చుండును. ఈ సముద్రము అవతల యునైటెడ్ స్టేట్స్ అట. ఇచ్చటకు గూడ వేలాది మంది పర్యాటకులు వచ్చుచుందురు. శ్రీ పరమేశ్వరుడు ఈ నిర్మలమైన సాగరునివలె మన అందరి హృదయములు నిర్మలముగ ప్రశాంత ముగ వుండేలాగున అనుగ్రహించుగాక ! ఓమ్.

22 సెప్టెంబర్–కెనడాలో శివానంద రాధ అని కెనడా ఆమె. శ్రీస్వామి శివానంద శిష్యురాలు. ఈమె కెనడా దేశములో చాల సంవత్సరములుగ యోగ ప్రచారము చాలాచేసి 2 సం॥లు క్రిందటనే శరీరము చాలించిరట. ఆమె పేరున రాధ హౌస్‌అని. 22 తేదీని (సెప్టెంబరు) ఆమె సన్నిహితులు స్వామిని రాధ, స్వామి లలితానంద ప్రారంభించిరి.ఆ ప్రారంభోత్సవమునకు ఆహ్వానించగ వెళ్ళి అచ్చట కార్యక్రమములో పాల్గొని ఆనందించితిమి. ఈ ప్రాంతములో వివిధ రకములైన శారీరక, మానసిక, ఆధ్యాత్మిక యోగ ప్రచార కేంద్రములు చాలా వుండుట ఆనందమైన విషయము. "యోగచిత్త వృత్తినిరోధః" అని మన శాస్త్రములు నుడువుచున్నవి. ఎవరికి మనస్సు స్వాధీన మవునో అదే నిజమయిన యోగమని మహాత్ములు నుడువుచుండిరి. "మనస్సు స్వాధీనమైన ఘనునకు మరి మంత్ర తంత్రములేల" యని త్యాగ రాజు నుడివిరి.

భగవంతుడు అటువంటి యోగమును ప్రసాదించుగాక. వాన్‌కోవర్‌లో మహాలక్ష్మి దేవాలయమున్నది. శ్రీ ప్రేమజీ అనే ఆయన దేవాలయమును స్థాపించిరి. 25 సం॥ల క్రిందట ఇచ్చటకు వచ్చిరట. హిందువులు అన్ని జాతులవారు ఈ దేవాలయమునకు వచ్చుచుందురు. ప్రతీ ఆదివారము, శుక్రవారము సత్సంగము జరుగుచుండును. పర్వదినములతో విశేష పూజలు వగైరాలు జరుపుచుందురు. 26వ తేది ఆదివారము మమ్ములను ఆహ్వానించిరి. చాలమంది వచ్చిరి. ఒక అరగంట మాట్లాడమని కోరిరి. భగవంతుడు తోపించినది మాట్లాడుట జరిగెను. శ్రీప్రేమ్‌జీకి శాంతి ఆశ్ర మము గురించి, పూజ్య స్వామీజీ గురించి బాగా తెలుసును. 1975వ సం॥లో పూజ్యశ్రీ స్వామీజీని ఋషీకేశ్‌లో శ్రీ శివానంద ఆశ్రమములో దర్శించిరట. దైవము అందరికీ శాంతి కల్గించుగాక !

28వ తేదిని వాన్‌కోవర్ నుండి విమానములో కేలగేరీ అనే నగర మునకు వెళ్ళితిమి. ఈ ప్రయాణము ఒక గంటే. ఆ విమానాశ్రయమునకు మమ్మ లను అందుకొనుటకు బాన్ఫ్ అనే నగరం నుండి సోదరి రోజలి వచ్చి మమ్ములను ఆనందముతో అందుకొనిరి. ఈ బాన్ఫ్ నగరమునకు కారు ప్రయాణము 2,3 గంటలు పట్టినది. సోదరి రోజలియే కారునడిపిరి. ఆమె, భర్త జార్జి ఇరువురు చాలా భక్తి, ఆప్యాయత గలవారు. వారి చక్కనైన భవనములో 5 రోజులు శాంతిగ గడిచినవి. ఈ అయిదురోజులలో కెనాడలో ప్రసిద్ధికెక్కిన కెనడియన్ రాకీస్, లేక్ లూయిజ్, ఐస్ ఫీల్డ్స్ వగైరా ప్రాంత ములు దర్శించితిమి. ఆ అకర్షణీయమైన, అద్భుతమైన ప్రకృతి దృశ్యములను స్వయముగ జూచి అనుభవించి ఆనందించవలసినదేగాని నావంటి వారికి వర్ణించి వ్రాయుట కష్టము.

ఐస్ ఫీల్డ్ దృశ్యము మహా అద్భుతమైనది. మనవైపు వరి పొలములు, మడులు ఎటులుండునో ఆ విధముగ యిరు ప్రక్కల,రోడ్లు, ఖాళీ స్థలములన్నీ మంచుతో కప్పబడి తెల్లగా వుండును. కొంతదూరము ఈ మంచుమీద నడచు అవకాశము గూడ గల్గినది. ఇక మంచు పర్వతముల సంగతి చెప్పనవసరము లేదు. ఆ మంచు అంతా కరుగుచూ నదులు, సరస్సులు క్రిందగా ప్రవహించుచుండును. అటువంటి సరస్సే లేక్ లూయిజ్. ఇక ఎటువైపు చూచినా పచ్చని తోటలు, చెట్లు, ఆ చెట్లకు చుట్టుకొని తెల్లని మంచుగడ్డలు. భగవంతుని యొక్క అద్భుత సృష్టిని స్మరించు కొనుచూ, ఆ తెల్లని మంచు గడ్డలలో ఎటువంటి మాలిన్యము లేదు! ఎప్పటికైనా అటువంటి మాలిన్యము లేని తెల్లని మనస్సును, నిర్మలమైన హృదయమును ప్రసాదించ మని ప్రార్థించుట జరిగెను.

ఈ పర్వతములలో ఒక పర్వతము పేరు మౌంట్ టెంపుల్. చాలాఎత్తైన మంచు పర్వతము ఈ పేరు ఎట్లు వచ్చినదో చాల ఆశ్చర్యముగానే వుండును. ఈ పర్వతమునకు దగ్గరగా లేక్ లూయిస్ ప్రవహించుతావులో రోజలీ దంపతుల పోర్ట్

హోటల్ వున్నది. ఈ భోజనశాల 25 సం॥లపై నుండి వున్నదట. శ్రీజార్జి ఆయన సోదరుడు ఆర్టెన్ నడుపు చుండిరి. భోజనశాల అయినా నిత్యము అగ్నిహోత్రము, ఫియోనా వాయిద్యముతో ఆకర్షణీయ ముగ వుండును. ఒక సాయంత్రము మాకు అచ్చట ఫలహారము ఏర్పాటు చేసిరి. ఆశ్చర్యము గల్గించినది ఏది అనగా ఫలహారము చేయుట ముగిసిన తరువాత జన్మదినము అని ఒక కేకును అలంకరించి తెచ్చిరి. వారి భక్తి ప్రేమలకు కృతజ్ఞతను తెలుపుచూ కేకు కోయుట జరిగెను. ఆ దంపతుల యొక్క ఆయురారోగ్యములను, నిత్య శాంతిని కోరుచూ, ప్రతిరోజు జన్మదినము చేసుకొను వారి జీవితములు ధన్యమైనవిగదా!

శ్రీపరమేశ్వరుడు అటువంటి జన్మను గల్గించుగాక !

తిరిగి అక్టోబరు 2వ తేదిని సోదరి రోజలి మరల 2,3 గం॥లు కారు నడిపి మమ్ములను లెహరీ విమానాశ్రయమునకు తీసుకొనివచ్చిరి. అచ్చట నుండి మధ్యాహ్నమునకు వాన్‌కోవర్ చేరితిమి.

భగవంతుడు రోజలీ దంపతులను సదా బ్రోచుగాక !

అక్టోబరు 8వ తేదీని సముద్రము మీద బోటులో కారుతో సహా గంట న్నర ప్రయాణముచేసి మైనీఐలాండ్ చేరితిమి. సోదరుడు జాన్ వచ్చి మమ్ము లను అందుకొని ఆయన గృహమునకు తీసుకొని వెళ్ళిరి. ఈ ప్రాంతములో చాలా దీప్వములు వున్నవి. సముద్రము మధ్యలో చక్కని తోటలతో చిన్నపెద్ద గృహములతో ప్రశాంతమైన నిర్మల వాతావరణము కల్గివుండును. నాలుగు రోజులు సోదరుడు జాన్ యొక్క ఆతిధ్యమును స్వీకరించుచూ సాయంత్రము సత్యంగము, ధ్యానములతో శాంతిగా గడచినది. జాన్ స్నేహితులు గూడ సత్సంగంలో పాల్గొనేవారు. పట్నములలో రాత్రి పగళ్ళు పని చేసి చేసి అలసట చెంది విశ్రాంతిగ గడపవలయునన్నవారు ఈ ద్వీపములకు వచ్చు చుందురు. నిజముగ శాంతిని పొందవలయునన్న వార్కి ఈ ద్వీపముల వాతావరణము ఎంతో శక్తినిచ్చును. చుట్టుసముద్రజలము, సూర్యాస్తమయ ముల దృశ్యములను గాంచుచూ ఆనంద ముగ గడుపువారి జీవితములే జీవితములు గదా ! అటువంటి నిర్మలమైన ప్రకృతి దృశ్యములను కొద్దిరోజు లైనా జూచు అవకాశము,అదృష్టము గల్గించిన భగవంతుని రూపములో యున్న సోదరి ఎలోయిస్‌గార్కి, జాన్‌కు కృతజ్ఞతలను తెలుపుకొనుచూ, తిరిగి మరల పడవలో 11వ తేదీని మా ప్రయాణము సాగించి వాన్‌కోవరు చేరితిమి. బోట్ అనగా పడవ అనుకొనుట సహజము. గాని ఈ బోటు స్టీమరువలె ఉండును. క్రింద భాగములో వందల కొలది ప్రయాణికుల కార్లు పెట్టుదురు. పైభాగములో చక్కనైన మెత్తని సీట్లమీద కూర్చుని సాగరుని దర్శించుచూ ఆనందముగ ప్రయాణము చేయుదురు. భగవంతుని సృష్టిలో ఈ ద్వీపములు ఒక అద్భుతమైన సృష్టికదా! ఆ అఖండమైన సృష్టికి సర్వదా ప్రణామములు.

అక్టోబరు 12వ తేదిని కెనడాలో థ్యాంక్స్ గివింగ్ వీకెండ్ అని ప్రతీ వారు ఒక శుభకార్యము చేసుకొందురట. దీని భావన సంవత్సరమంతా భూదేవి ఎన్నో విధములుగ మానవులకు కావలసిన వస్తువులు అనగా ఆహార పదార్థాములు వగైరా సదుపాయములన్ని ఇచ్చుచుండెను. అందుచే భూదేవికి కృతజ్ఞతను తెలుపుకొనుచు ఆనందముగ ఒకరికొకరు అభినంద నలు చెప్పుకొనుచూ గడుపుట ఆ దేశ ఆచారమట. అటువంటి ఆచారము, భావన ఉండుట సంతోషకరమైన విషయమేగదా ! నిజముగ సర్వశక్తిగల భూమాతవల్లనేగదా సర్వజీవులు పోషింపబడుచున్నవి. అటు వంటి భూమాతకు ప్రణామములు అర్పించు కెనడా దేశస్తులకు భూదేవి అనుగ్రహము సదా ఉండుగాక !

13 వతేది జన్మదినము. యధాప్రకారము ఉపవాసము మౌనముతో ప్రారంభమయ్యెను. గాని మౌనము సాయంత్రము 4 గంటలకే ముగించుట జరిగెను. కారణము సోదరి ఎలోయిస్ ముఖ్యమైన వారితో ముందుగ చెప్పినట్లున్నది. కొంతమంది సాయంత్రము నాలుగు గంటలకు వచ్చెదమని ఫోను చేసిరి. వారు వచ్చిన మాట్లాడకుండా ఉండుట బాగుండదు. చాలా దూరము నుండి వచ్చెదరనియు, శ్రీ ప్రేమ్‌జీ (మహాలక్ష్మిదేవాలయ స్థాపకులు) రాత్రి 7 గం॥లకు వారి గృహమునకు భోజనమునకు ఆహ్వానిం చిరి. వెళ్ళుట తప్పదు అనుటచే ఇతరుల ఆనందమే మన ఆనందముగదా యన్న సూక్తిని జ్ఞప్తికి తెచ్చుకొని సరే అంటిని. అనుకొన్నట్లుగ కొందరు 4 గం॥కు రాగా, ఓంకారము, శాంతి ప్రార్థన స్మరణతో మౌనము విరమించుట జరిగెను. రాత్రి 7 గం॥లకు ప్రేమ్‌జీ ఆహ్వానము ప్రకారము వారి గృహము నకు వెళ్ళు సరికి అచ్చట సుమారు 20 మంది వరకు భక్తులు వేచివుండిరి. అందరూ భారతీయులే. గుజరాతి, మళయాళి, తమిళ వగైరా భాషలవారు. శ్రీ ప్రేమ్‌జీ ఆశీస్సులతోను చిరంజీవి ఐశ్వర్య (ప్రేమ్‌జీ కుమార్తె) ఫిడేలు వాయిద్యముతో రామభక్తి సామ్రాజ్యమన్న శ్రీ త్యాగరాజ కీర్తనతో సత్సంగం ప్రారంభమయ్యెను. చివరగ శాంతి ప్రార్థన స్మరణతో ముగిసెను. అటుపై ప్రేమ్‌జీ దంపతులు వచ్చిన భక్తులందరికీ విందు భోజనము ఏర్పాటుచేసిరి. భోజనములు అయిన తరువాత శ్రీఎలోయిస్‌గారు ఏర్పరచిన కేకును కోసి అందరకూ యిచ్చుట జరిగెను. ఆరోజు ఎచ్చట ఉన్నా అందరి ఆనందమును పంచుకొనుచూ శాంతిగా సంతోషముగా గడిచెను. శ్రీ ప్రేమ్‌జీ భక్తి ప్రేమలకు, భక్తులందరి ప్రేమానురాగాలకు కృతజ్ఞతను తెలుపు కొనుచూ, శ్రీ పరమేశ్వరుని కృప అందరి యందు సదా ఉండుగాక యని ప్రార్థించుట జరిగెను. శ్రీ ప్రేమ్‌జీ దేవి నవరాత్రుల పూజాకార్యక్రమము 14వతేది నుండి ప్రారంభించిరి. చివరి రోజు 22వ తేదిని కన్యలపూజ కార్యక్రమముతో చాల ఆనందముగ జరిగినది.

దైవ సంఘటనలు అమోఘమైనవిగదా ! ఎప్పుడు, ఏ విధముగ పనిచేయునో తెలియదు. చాల విచిత్రమైన సంఘటన దాదా జె.పి.వాస్వాని గారికి శ్రీస్వామీజీ,

శ్రీశాంతి ఆశ్రమముతో 40 సం॥లుగ సన్నిహిత సంబంధమున్నది. వారితో ఉత్తర ప్రత్యుత్తరములు జరుపు అదృష్టము గలదు. గాని వారిని నేరుగా దర్శించ లేదు. దైవాను గ్రహముచే 3 సం॥ల క్రిందట వారిని హైదరాబాదులో దర్శించు భాగ్యము గల్గినది. వారు అపారమైన ప్రేమతో నిండిన సాధు స్వరూపులు. ఎంతో కాలముగ వారిని దర్శించి ఆశీస్సులు పొందవలయునన్న సంకల్పం పూర్తి అయినదని మనస్సు తృప్తి పడెను. ఇప్పుడు మరోవిచిత్రమైన సంఘటన శ్రీ జె.పి వాస్వానిగారు సిరియా యను నగరమునకు వచ్చుచుండిరి. 3 రోజులే వుందురు. బహుశ 17వ తేదికి ప్రేమ్‌జీ ఆహ్వానముపై మహాలక్ష్మిదేవాలయమునకు వాన్‌కోవరు రావచ్చు నన్న ఆనందవార్త వింటిమి. ఆ ఆనందమైన రోజుకై వేచియుండగ 17వ తేది ఉదయం 11 గం॥లకు దేవాలయమునకు వచ్చిరి. వారి సన్నిధికి వెళ్లగానే ఎంతో ఆప్యాయతతో పలుకరించి, శ్రీ స్వామీజీ శాంతి ఆశ్రమము గురించి మాట్లాడుచూ ఆశీర్వదించిరి. వారిని ఈ కెనడాలో దర్శించెదమని ఎన్నడూ తలచలేదు, ఊహించను లేదు. వారు కెనడాకు వచ్చుట ఆ సమయమునకు యిచ్చట వుండగల్గి వారి దర్శనము జేయుట ఇది ఊహించలేని విచిత్రమైన సంఘటనే గదా ! ఎప్పుడు ఎవరు, ఏ విధముగ కలుసుకొనవలసి వున్నదో అంతా దైవాజ్ఞయే గదా !

ఉదయం 11 గం॥ల నుండి సుమారు 2 గం॥ల వరకు వారి సమా వేశము జరిగినది. భక్తులు వేసిన ప్రశ్నలకు అమూల్యమైన, హృదయము నకు హత్తుకొనేలాగున జవాబులు యిచ్చిరి. ప్రశ్నల సారాంశము, శాంతి ఎటుల గల్గును, సమస్యలు ఎటుల దీరును, మనస్సు ఎటుల స్వాధీనము అగును? వారు ముఖ్యముగ యిచ్చిన జవాబుల సారాంశము మీరు ఎన్ని పనులలో యున్ననూ కనీసము ఒక అరగంట అయినా అన్నీ వదలి ఏకాంతముగ కూర్చున్న, మీ ప్రశ్నలకు మీకే జవాబులు దొరుకును. ఏవీ బయట నుండిరావు. అన్నీ మన నుండియే వచ్చును. అరగంట గూడ మీకు వీలులేకపోయినా కనీసం 15 నిమిషములైనా ఏకాంతముగ ఉండి ధ్యానిం చుడు. మీకు కావలసినవి భగవంతునినే అడుగుచుండవలయును. ఒకసారి, రెండుసార్లు గాదు. మీకోరిక నెరవేరు వరకు ఆయననే అడుగు చుండవల యును. కొందరికి వెంటనే ఫలితముండును. కొందరికి కొన్ని రోజులు పట్టవచ్చును. మరి కొందరికి చాలా కాలము పట్టవచ్చును. వారి వారి మనోపరిపక్వమును బట్టి వుండును. ఏదైనప్పటికి మీరు కొంత సమయము దైవమునకై వినియోగించిననాడే మీ ధ్యానస్థితికి తోడ్పడును. ఒకసారి ప్రారంభించిన దానిని నియమము తప్పకుండా సాధన చేయవలయును. అప్పుడే మన గమ్యానికి చేరగలమన్న అమూల్య సలహాలతో ముగించిరి. భగవంతుడు శ్రీ జె.పి వాస్వాని గారిని ఆయురారోగ్యములతో భక్తులంద రినీ నిత్యమూ ఆశీర్వదించుచూ వుండేలాగున సదా బ్రోచుగాక యనియే ప్రార్థన.

తిరుగు ప్రయాణము దగ్గర పడుచుండుటచే 24వ తేదిన సోదరి ఎలోయిస్‌గారు ఆమె స్నేహితులందరినీ ఆహ్వానించి చిన్నపార్టీ యిచ్చిరి. సుమారు 20మందికిపైగా

వచ్చిరి. కొందరు చాల దూరప్రాంతముల నుండి వచ్చిరి. చిన్న సత్సంగము జరిగినది. ఎంతోకాలము నుండి ఎలోయిస్‌గారిని చూడనివారు గూడ ఆ రోజువచ్చి చాలాసంతోషించిరి. ఒకే ఊరిలో వున్నా ఉదయం నుండి సాయంత్రం వరకు అందరూ తీరిక లేకుండా ఉందురు. ఇక ఒకరి నొకరు జూచుకొనుటకు సమయము ఎటుల వుండును? ఏదైనా అవసరము వున్నప్పుడు ఫోనుల ద్వారానే మాట్లాడు కొనుట జరుగును. మధ్యాహ్నము 2 గం||ల నుండి 5 గం||ల వరకు అందరూ సంతోషముగ గడిపివెళ్ళిరి. భగవంతుడు అందరినీ సుఖశాంతులతో సదా బ్రోచుగాక !

ఈ కెనడాయాత్ర అనుకోని విధముగ జయప్రదముగ జరిపించిన పరమాత్మకు ప్రణమిల్లుచూ, సోదరి ఎలోయిస్‌గార్కి అన్ని విధములా సహాయ పడిన దగ్గర, దూర ప్రాంతములో గల సోదర సోదరీమణులకు,తక్కిన భక్తులందరకు మరల మరల హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుకొనుచూ ముఖ్యముగ అద్భుతమైన ప్రకృతి దృశ్యములను సృష్టించిన సృష్టికర్తకు మరల మరల ధన్యవాదములు అర్పించుకొనుచుంటిని.

## అర్పణ

దైవాజ్ఞచే ఈ కెనడా యాత్రకు కారకురాలైన సోదరి ఎలోయిస్ గారు కంటికి రెప్పవలె కాపాడుచూ అహర్నిశలు నా ఆనందమే తన ఆనంద ముగ భావించి సేవచేసిరి. నా మనోభావనలు ఆమెకు అర్పించుకొనుచూ భగవంతుడు ఆమెకు ఆయురారోగ్యములతో, నిత్యశాంతితో సదాబ్రోచుగాక యనియే నా నిత్య ప్రార్థన.

లోకాసమస్తా సుఖినోభవంతు.

**(శాంతి జనవరి 2005)**

ఇతర మతస్తులు శ్రీకృష్ణుడు జారుడు, చోరుడు అని అజ్ఞానముతో తెలివి తక్కువ విమర్శలు చేయుచుండ మనవారు కూడ అట్టి విమర్శలకు తగిన సమాధానములు చెప్ప లేక అంగీకరించి ఊరకుండుట కడు శోచనీయము. ఆయన శిశుప్రాయుడుగా నుండి గోకులములో చూపించిన అద్భుత సంఘటనలు, గోపికా వస్త్రాపహరణము, రాసక్రీడలు సల్పినదంతయు పదునొకండు సంవత్సరముల వయస్సునే యని మన వారే చాలామంది గ్రహించుట లేదు. స్త్రీలు దిగంబరులుగా కొలనులోదిగి స్నానములు చేయుట తప్పని గోపికల చీరలు దాచి, వారి పొరపాటు గ్రహించి పశ్చాత్తాప పడునట్లు చేయుటే గోపికా వస్త్రాపహరణ లక్ష్యము. అట్లే ఆయన బాల్య జీవిత సంఘటనలు వివేకముతో చూచిన వారికి జ్ఞాన సుబోధకములు.

# 8. మా మారిషస్ పర్యటన

(19.9.2001 - 30.9.2001)

-స్వామిని వినమ్రానంద

శ్లో॥ యోదేవః సర్వరూపేణ సర్వోభవతి సర్వదా ।

నమస్తస్మై నమస్తస్మై నమస్తస్మై నమో నమః॥

తా. ఏ దేవుడు అన్ని ప్రదేశాలలో, అన్ని కాలాలలో, అన్నిరూపాలను ధరించి అన్ని తానే అయ్యాడో ఆ దేవునకు నా నమస్కారం. ఆయనకు నా నమస్కారం. నమస్కారం. పునః పునః ప్రణమాలు.

అని శ్రీ తపోవన్ మహరాజ్ వారు అన్ని రూపాలలో అన్ని ప్రదేశాలలో భగవంతుని దర్శించినట్లు పూజ్య మాతాజీ వారు మారిషస్ ప్రకృతిలో భగవంతుని దర్శించి తన్మయత్వమును పొందిరి. వారు పొందిన అనుభవ ములను, మారిషస్‌లో దర్శించిన విశేషములను మీముందు వుంచుటకు నా శక్తి కొలది ప్రయత్నిస్తున్నాను. ఇందులో తప్పులను పాఠకులు మన్నించ గలరని నా విన్నపము. మారిషస్ ఒక అత్యద్భుతమైన, రమణీయమైన ద్వీపకల్పము. ఇది ఆఫ్రికా ఖండమునకు సమీప మున వున్నది. చెరుకు తోటలతో, చక్కని పూల వృక్షములతో, చక్కని పక్షులతో, పచ్చదనముతో పవిత్రమైన సముద్రతీరమున మనోహరమైన సూర్యోదయముతో, సూర్యాస్త మయముతో బహు శోభాయమానముగా మనోరంజకమై మనస్సునకు ఆహ్లాదము నందించు సౌందర్యమైన పవిత్రమైన ద్వీపకల్పము.

దివ్య జీవన సంఘ భక్తుల ప్రేమపూర్వక ఆహ్వానమునకు పూజ్య మాతాజీ వారు దయతో మారిషస్ వెళ్లుటకు అంగీకరించిరి. వారు ప్రేమ స్వరూపిణి కనుక మమ్ములను (వినమ్ర, లక్ష్మి, కుమారి, దివ్యప్రకాశ్) వారితోపాటు మారిషస్ ప్రకృతి సౌందర్యమును ఆస్వాదన చేయుటకు సిద్ధము కావించిరి.

దాదా జె.పి. వాస్వానిగారి ఆహ్వానముపై మారిషస్ వెళ్లుటకు ముందు 14-9-2001 తేదిన సికింద్రాబాదులో పూజ్య మాతాజీ వారిని దర్శించి సంభాషణ కావించిరి. అచ్చట నుండి మేమందరము 14వ తేదిన బయలు దేరి 16వ తేదిన ముంబాయి నగరము చేరితిమి. ఆశ్రమ భక్తులైన శ్రీమతి మోహినిగారు, సుశీలగారు, రామానందగారు తదితర భక్తులు ఘనమైన స్వాగతము పలికిరి. 16,17,18 తేదిలలో మోహినిగారి స్వగృహమునందు సత్సంగము, ప్రార్థనలు, భజనలు నిర్వహించితిమి. శాంతి మనలోనే వున్నది బాహ్యమున లేదు అనే విషయముపై మాతాజీ వారు ప్రవచించిరి. సత్సంగము ద్వారా నిస్సంగము,నిస్సంగము ద్వారా నిర్మోహత్వము, నిర్మోహ త్వము చేత నిశ్చయాత్మకమైన తత్త్వము, నిశ్చలమైన తత్త్వముచే జీవన్ముక్తి పొందవచ్చునని ప్రవచించిరి. తదుపరి ముంబాయి భక్తులు మాతాజీ వారిని దర్శించి

ప్రసాదములను స్వీకరించి శాంతిని పొందిరి. శ్రీమతి మోహిని గారు చూపించిన అపారమైన ప్రేమ, వాత్సల్యమునకు మా ధన్యవాదములు. 19వ తేది ఉదయం7 గం॥లకు ముంబాయి విమానాశ్రయమునకు వెళ్లి మారిషస్ వెళ్లే విమానమును ఆశ్రయించి మధ్యాహ్నము 1 గం॥లకు మారిషస్ విమానాశ్రయమునకు చేరితిమి. అచ్చట దివ్య జీవన సంఘాధ్యక్షులైన శ్రీ గోపాల్ జానకిగారు, ఉపాధ్యక్షులు అయిన శ్రీమతి దమయంతి గారు, కార్యదర్శి ప్రవీణ్‌గారు, కమలగారు తదితర భక్తులు ఘనమైన స్వాగతం పలికి పూర్ణకుంభముతో మంగళశాసనములు పలికిరి.

పూజ్యశ్రీ శివానందజీ శిష్యులైన శ్రీ వెంకటేశానంద గారు అపూర్వ కృషిచే శ్రీ శివానందశ్రమ శాఖను స్థాపించిరి. వారు ప్రస్తుతము భౌతికముగా లేనప్పటికి వారి శిష్యులు, తదితర భక్తులు గురుదేవుల ఆజ్ఞ ప్రకారము తూచ తప్పకుండ ఉదయం 5.30 గం॥లకు ఆశ్రమములో నెలకొని వున్న శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి సుప్రభాతసేవ, 6గం॥లకు అష్టోత్తర శతనామ ములచే అర్చన కావించెదరు. మధ్యాహ్నం 3 గం॥లకు శ్రీవెంకటేశానంద గారు రచించిన బుద్ధా డైలీ రీడింగ్స్, భగవద్గీత, జీసస్ ప్రభువు గురించి, వశిష్ఠగీత, వాల్మీకి రామాయణము తదితర గ్రంథములు ఆశ్రమ భక్తులందరు కలసి పఠించెదరు. సాయంత్రం 6-30గం॥ల నుండి 7-30 గం॥ల వరకు సత్సంగము చేయుదురు. ప్రతీ దినము యోగ శిక్షణకూడ ఇవ్వబడు తుంది.

ఈ ద్వీపమునందు 50శాతం హిందువులు వున్నారు. ఇచ్చట ఫ్రెంచ్, ఆంగ్లం కలిపి క్రియాల్‌యని ప్రాంతీయ భాషగా మాట్లాడుతారు. వీరు పాశ్చాత్య నాగరికతలో వున్నప్పటికి, భారతీయసంస్కృతిని మరిచిపోకుండా భక్తిశ్రద్ధలు కలిగి వుండడమనేది చాల ప్రశంసనీయమైనది, గర్వ కారణ మైనది. 19-9-2001 తేదిన హిందు మహాసభవారు నిర్మించిన కాశీవిశ్వ నాథాలయము, అచ్చటకు కొంత దూరములో వున్న గంగాతీలావ్ అనే సరస్సు కలదు. దానిచుట్టూ రమణీయమైన కొండచరియలు, జలపాత ములు, నీటివాగులు, దట్టమైన అడవులు ఆ మధ్యలో నెలకొని వున్న లక్ష్మీనారాయణుల, సీతారామలక్ష్మణుల, హనుమంతుని మున్నగు మందిర ములను దర్శించితిమి. ఈ ప్రకృతియే ఇంత శోభాయమానముగా వున్న ప్పుడు ఈ ప్రకృతి సృష్టికర్తయైన భగవంతుడు ఎంత సౌందర్యముగా వుంటాడో! ఆ సౌందర్య రూపములోనున్న భగవంతునకు మనసా నమస్క రించితిమి. పిమ్మట ఒక అగాధమైన లోయను, వ్యూపాయింట్‌ను దర్శించి తిమి. తదుపరి అగ్నిపర్వతములు బ్రద్దలయి లావాఏర్పడి కొన్నివేల సం॥లకు ఏర్పడిన భూభాగమును దర్శించితిమి. ఆ భూభాగము ఏడు రంగులతో మట్టి అంతయు మిక్కిలి ప్రశాశవంతముగా మెరుస్తూ వుంటుంది. శ్రీ శివానంద జన్మదిన సందర్భముగా 21-9-2001 తేదిన శివానంద విద్యాలయము వారు మాతాజీ వారిని ఆహ్వానించిరి. వారి ఆహ్వానముపై మాతాజీ వారు విద్యార్థులకు ఆశీస్సులనందించుటకు విద్యాలయమును దర్శించితిరి. శ్రీ

శివానంద గారు ఉపదేశించిన Serve, Love, Give, Purity, Meditate, Realise అనే విషయముపై సరళమైన ఆంగ్లభాషలో సందేశమునిచ్చిరి. ఇవి చిన్నమాటలైనను, జీవితములో అనుసరించినచో నేటి బాలురే రేపటి మహాత్ములగుదురని మాతాజీ వారు ఆశీస్సులు నందించిరి. బీ గుడ్, డూ గుడ్ అనే విషయమును బాలబాలికలకు చెప్పిరి. అచ్చట విద్యార్థులు ఫ్రెంచ్‌లో శాంతి ప్రార్థన చేసిరి. దివ్య ప్రకాశ్‌గారు ఆంగ్లంలో శాంతి ప్రార్థన చేసిరి. ముగింపుగా విద్యార్థులు భారతీయ కథక్ నృత్యము, జ్యోతు లతో నృత్యముచేసి ప్రేక్షకులను రంజింపజేసిరి. పిమ్మట విద్యార్థులకు మాతాజీ వారు బహుమతులను అందజేసిరి. సాయంత్రం 6గం॥లకు శివానంద్ హీలింగ్ సెంటర్‌వారి ఆహ్వానముపై మాతాజీ వారు సమావేశ ములో పాల్గొనిరి. శివానంద హీలింగ్ సెంటర్‌నకు కారకులైన శ్రీ స్వామి వెంకటేశానందగారు చేసిన కృషి, అపారమైన సేవ, మదర్ నారాయణిగారు, ఆనంద్‌గారు శ్రమించిన అపూర్వమైన సేవాఫలితముగా ఈనాడు చుట్టు ప్రక్కల గ్రామ ప్రజలు హోమియో వైద్యము మరియు హీలింగ్ శక్తిని పొందుతున్నారు. స్వామి వెంకటేశానందగారు, మదర్ నారాయణి గారు భౌతికముగా లేనప్పటికిని మీ అందరి మధ్యలో వారు వుండి మీ సేవా కార్యక్రమములను ఫలింపచేయుచున్నారని నుడివిరి. మదర్ నారాయణి గారు కేవలము మారిషస్ ప్రాంతమునే కాక ఆఫ్రికా మానవాళికి కూడా వారు చేసిన సేవ చిరస్మరణీయమైనది. ఇంతకు మదర్ నారాయణి, ఆనంద్‌గారు ఎవరో తెలుసు కుందాం. వీరు స్వామి వెంకటేశానంద గారి ప్రముఖ శిష్యులు. స్వామి వెంకటేశానంద గారి ఆజ్ఞ ప్రకారముగా స్వామి ఓంకార్‌జీ వారి దగ్గర సన్యాస ఆశ్రమమును స్వీకరించిరి. స్వామి ఆనంద్ గారు ఇప్పటికిని ఆఫ్రికా ప్రజలకు సేవ అందిస్తూ వున్నారు. సేవ ఎప్పుడు చెయ్య గలుగుతారంటే ప్రేమతత్త్వము వున్నప్పుడే ! కనుక పూజ్య ఓంకార స్వామీజీ వారు "ప్రేమగల హృదయమే భగవన్నిలయము-ప్రేమలేని హృదయము స్మశానము" వంటిదని చెప్తూ వారి నిజజీవితములో ప్రేమతత్త్వ మును అందించెడివారు. మదర్‌నారాయణి గారు శాంతి ఆశ్రమములో హోమియో వైద్యమును నెలకొలిపిరి. వారు ప్రారంభించిన హోమియో వైద్యము ఇప్పటికి కొనసాగుచున్నది. ప్రేమ స్వరూపులైన మదర్ నారాయణి గారికి శ్రద్ధాంజలి నర్పించిరి. బాలబాలికలచే సాంస్కృతిక కార్యక్రమములు ప్రదర్శింపబడినవి.

22-9-2001 తేదిన మారిషస్‌కు 20కిలోమీటర్ల దూరమున వున్న లల్లోరా అనే ప్రదేశములో శ్రీ వెంకటేశానంద గారి సంకల్పముచే, కృషిచే నిర్మించబడిన శ్రీ వెంకటేశ్వర ఆలయమును దర్శించితిమి. తిరుపతిలో వెంకటేశ్వరస్వామి వారికి జరిగినట్లే, అన్ని పూజా కార్యక్రమములు ఇచ్చట కూడ జరుగుచున్నవి. దేవస్థాన అర్చకులు తీర్థప్రసాదములు సమర్పించిరి. శివానంద డే సందర్భముగా 23-9-2001 తేది అన్ని మతముల వారిని కూడా ఆహ్వానించిరి. బౌద్ధులు విశ్వశాంతి విషయముపై ప్రార్థన చేసిరి. మహమ్మదీయులు ఖురాను పఠించిరి. అన్ని మతముల

వారి సమ్మేళనమే విశ్వశాంతి దాయకమని, స్వామి వెంకటేశానంద గారు చేసిన నిష్కామసేవ అకుంఠిత కృషి ఈ ఆశ్రమము దర్శించినచో అనుభవము కలుగుతుందని, వారు భౌతికముగా లేనప్పటికిని వారి శిష్యులు శ్రీమతి దమయంతి గారు, శ్రీ ప్రవీణ్‌గారు, కమలగారు, గోపాల్ జానకి గారు, బృంద, శైలి తదితర భక్తులు వారు చేస్తున్న సేవ, వారి శ్రద్ధ భక్తి ప్రశంసనీయమైనదని మాతాజీ వారు కొనియాడిరి. ఆశ్రమము ఎదురుగా వున్న కొండచరియలే హిమాలయ ములు, మధ్యలో వున్న నదియే గంగా నదియని ఈ ఆశ్రమమే శివానందాశ్ర మని, ఇదియే ఋషీకేశ్‌యని, మీరు ఎచ్చటకు వెళ్ళనవసరం లేదని పలికిరి. సోదరి దివ్య ప్రకాశ్ గారు శాంతి ఆశ్రమము గురించి, పూజ్య ఓంకార స్వామీజీ వారి గురించి కళ్లకు కట్టినట్లుగా ఆశ్రమ భక్తులకు వివరించిరి. సాయంత్రం 4 గం॥లకు సముద్ర తీరమున సత్‌గురు శైవ సుబ్రహ్మణ్య స్వామి వారిచే స్థాపించబడిన ఆధ్యాత్మిక శైవ సిద్ధాంత ఉద్యానవనము నందు వినాయకుడు, దక్షిణామూర్తి, దత్తాత్రేయుడు మొదలగు మూర్తులను దర్శించితిమి.

పూజ్యస్వామి శివానంద వారి జన్మదిన సందర్భముగా 24-9-2001 తేదీన సామూహికముగా అష్టోత్తర శతనామములచే అర్చన గావించబడి నది. సాయంత్రం 7 గం॥ల నుండి 8 గం॥ లవరకు సత్సంగము జరిగినది. 25-9-2001 ఉదయం 10 గం॥లకు ఆంధ్రా అసోసియేషన్ వారు మాతాజీ వారిని దర్శించిరి. సాయంత్రం 4 గం॥లకు రేడియో ప్రొడ్యూసర్ అయిన గీతాంజలి గారు మాతాజీవారిని ఆహ్వానించి, మానవుని ప్రవృత్తి అంటే ఏమిటి? అని ప్రశ్నించిరి. ప్రతీవ్యక్తి శాంతినే కోరుతాడు. కనుక శాంతి పొందాలి, అంటే మానవుడు కోరికలను తగ్గించుకుంటే శాంతి లభిస్తుందని చెప్పిరి. గీతాంజలి గారు శాంతి ప్రార్థనను రేడియో ద్వారా ప్రసారము కావించిరి. స్వామి ఓంకార్ వారి గురించి, ఆశ్రమ కార్యక్రమ ముల గురించి ప్రశ్నించి మాతాజీ వారిచే రేడియో ప్రసారము గావించిరి. వారికి మా ధన్యవాదములు అర్పిస్తున్నామ. సాయంత్రం 7 గం॥లకు చిన్మయా మిషను సందర్శించితిమి. స్వామి ప్రణవానంద గారు విశేషమైన ప్రేమను, ఆతిథ్యమును అందించిరి.

27-9-2001 నౌకాయానముచే సముద్ర మధ్యమునకు వెళ్లితిమి. అచ్చట నుండి సముద్రగర్భములో వున్న అనేక జాతులైన సుందరమైన, సుందరాతి సుందరమైన మత్స్యములను, అనేక జలచరములను, కొండ లను, పుష్పములను, వృక్షములను దర్శించి రత్నగర్భుడైన సముద్రునకు మనసా సముద్ర రూపములో వున్న భగవంతునకు వందనమాచరించితిమి. బొటానికల్ గార్డెన్‌ను చూచితిమి. 29-9-2001 తేదిన మదర్‌థెరీసా వారు స్థాపించిన శరణాలయమునకు మాతాజీ వారు వెళ్లిరి. మదర్ థెరీసా అనుచరులు, వృద్ధులకు, మానసిక వికలాంగులకు అందిస్తున్న సేవ ప్రశంస నీయమైనది. భగవంతుడు ఎక్కడో లేడు, వీరందరిలో

వున్నాడు, వీరి సేవయే భగవంతుని సేవ అని అభినందనలను అందిస్తూ వృద్ధులకు, మానసిక వికలాంగులకు స్వీట్లు, బిస్కట్లు, కూల్ డ్రింకులు అందించిరి.

30-9-2001 మధ్యాహ్నం ఆశ్రమమునందు సత్సంగము జరిగినది. సాయంత్రం 7 గం॥లకు మారిషస్ విమానాశ్రయమునకు చేరితిమి. ఆశ్రమ భక్తులందరూ వీడ్కోలు నిచ్చిరి. తెల్లవారుఝామున 4గం॥లకు (1వతేది) ముంబాయి విమానాశ్రయమును చేరితిమి. ముంబాయి భక్తులు స్వాగతం పలికిరి. 1,2,3, తేదిలలో ముంబాయిలో సత్సంగము, ప్రార్థనలు, ఆలయ దర్శనములు చేసితిమి. ఆశ్రమ భక్తులైన పూనాశర్మగారి ఆహ్వానముచే 4-10-2001 తేదిన పూనా చేరితిమి. ఆ దినమున మాతా ఆనందమాయి ఆశ్రమము సందర్శించితిమి. 5-10-2001 తేదిన ఇంద్రుడు తపస్సు చేసిన స్థలము, ఇంద్రాణి నది, చైతన్య ఆశ్రమము, వేద పాఠశాలలు చూసితిమి. సంత్ జ్ఞానేశ్వర్ మహరాజ్ వారి సమాధిని, చాన్దేవ్ సింహము మీద వచ్చిన స్థలమును, జ్ఞానేశ్వర్ గోడను నడిపించిన స్థలమగు "ఆళంది" క్షేత్రదర్శనము గావించితిమి. 6-10-2001 తేది ఉపాసిని బాబా వారు స్థాపించిన కన్యా గురుకులమును,షిరిడిబాబా మందిరము దర్శించితిమి. 8-10-2001 తేదిన పండరినాథుని దర్శించితిమి. తొమ్మిదవ తేదిన పూనా నుండి బయలుదేరి స్వామీజీ అనుగ్రహముతో శాంతియుతముగా తోటపల్లి శాంతి ఆశ్రమమునకు చేరితిమి.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

**(శాంతి నవంబరు 2001)**

భగవంతుడు మనందరి హృదయ నివాసిగా నున్నాడని ఎవరు మరువరాదనియు ప్రపంచములో ఎవరినైనను మోసము చేయవచ్చును గాని సర్వాంతర్యామి, సర్వశక్తి మంతుడు, సర్వజ్ఞుడు, సర్వసాక్షియగు పరమేశ్వరుని ఎవరు మోసగించలేరనియు మనము ఎవరిమీద ఆధారపడినను ఆశాభంగము కావచ్చును గాని, శాశ్వతుడైన పరమేశ్వరుని పైననే సదా ఆధారపడి, ఆయననే తమ జీవిత సర్వస్వముగా నమ్మిన వారికి ఎన్నడూ ఆశాభంగము కలుగదనియు మానవ శరీరము అశాశ్వతం, అది ఎప్పుడు, ఎట్లు, ఎచ్చట పడిపోవునో ఎవరూ ముందుగా తెలుసుకొనలేరు. కనుక నిత్యం భగవంతుని స్మరించుటలో, మన అమూల్య కాలమును వినియోగించ వలె ననియు అందరిలో భగవంతుని చూచుచు ప్రేమించుట కలవాటు చేసుకొనవలయు నని సర్వదా జ్ఞాపకం చేయుచున్నారు. ఇవియే ముక్తికి తగిన మార్గములు.

## పూజ్య జ్ఞానేశ్వరి మాతాజీ

పాండిచ్చేరి అరవిందాశ్రమానికి మాతృశ్రీ (Mother), కాంజగన్ గాడు రామదాసు గారి ఆనందాశ్రమానికి మాతాజీ కృష్ణాబాయి గారలు ఎటులనో; ఓంకార స్వామివారి శాంతి ఆశ్రమానికి సోదరి జ్ఞానేశ్వరి అటుల....

స్వామీజీ వ్రాసిన 'నాచెల్లి పునర్జన్మ' (Reincarnation of my sister) అనే పుస్తకంలో కుమారి జ్ఞానేశ్వరి, గత జన్మలో తన ఏకైక ప్రియతమ సోదరి అని, విశేష దైవభక్తి, సోదరాభిమానం కలిగియుంటూ 12వ ఏటనే మరణించి, దైవభక్తులైన తమ దగ్గర బంధువులింట జన్మించి, బహు చిన్న తనంలోనే (పదవ ఏట) శాంతి ఆశ్రమమునకు చేరి, బాధ్యతగల పెద్దఅక్కవలె అన్నిపనులు చూచుకొనుట ప్రారంభించెనని వివరించేరు.

ఆశ్రమ ప్రాంగణములోనే అక్షరాభ్యాసం, ఆశ్రమం పనులు, విసుగు విరామం లేకుండా చూచుకుంటూనే, బహు శ్రద్ధతో, స్వయం కృషి ద్వారా తెలుగు, ఇంగ్లీషు భాషలలో చదువుట, వ్రాయుట, చక్కగా మాట్లాడుటే గాకుండ; ఉభయ భాషలలోను టైపింగు; దేశీయులతో, విదేశీయులతో ఉత్తర ప్రత్యుత్తరాలు సాగించుట, రిపోర్టులు, వ్యాసాలు, వ్రాయగల విద్య నార్జించెను. ఆధ్యాత్మిక ఆశ్రమ బాధ్యురాలు కుండవలసిన సహృదయం, సభ్యత, సంస్కారములు ఆమెలో మూర్తీభవించాయి.

ఆశ్రమాభివృద్ధికై చేయు ప్రయత్నాలలో, నాలో ఇంకను కొద్దిపాటి అహంకారం ఉంటూందిగాని; జ్ఞానేశ్వరి మాత్రము నిరంతరం, నిస్వార్థం, నిరహంకారంతో వర్తించుట నన్నాశ్చర్య చకితుణ్ణి చేసిందని స్వామీజీయే ఆమె జన్మదినోత్సవ సందర్భములో వెల్లడించారు.

శాంతి ఆశ్రమ వాసులైన స్త్రీలు ధ్యానము చేసుకొనుటకై ఏర్పాటు చేయబడిన మైత్రేయ ఆశ్రమమను విభాగమును ప్రారంభిస్తూ శ్రీ స్వామి రామానందతీర్థ ఇలా అన్నారు. "స్వామి ఓంకార్‌జీ, మానవాళి కిచ్చిన గొప్ప బహుమానం, కుమారి జ్ఞానేశ్వరి. ఆమె సర్వవిధముల సాక్షాత్తు యోగిని. ఆమె సందర్శనం సంతోష దాయకం ఆత్మ సంస్మరణను కల్గించును. స్వామీజీ యొక్క దివ్యశాంతి మహోద్యమ నిర్వహణకు ఆమెయే ఆయన పరమోత్తమ వారసురాలు."

ప్రాపంచిక ఆకర్షణలకు ఏకోశంలోను లోనుగాక, సదా సత్య చైతన్యముతో సాక్షాత్తు జ్ఞానేశ్వరిగా, నిరంతరం నిష్కామ కర్మలో నిమగ్నమై నిరాడంబరంగా, వినమ్రతతో విద్యుక్త ధర్మాన్ని నిర్వహించు చున్న నిజమైన ఆధ్యాత్మికాధిపతి, మాతా జ్ఞానేశ్వరి వారు.

ఓం ఓం ఓం

| | |
|---|---|
| 13-10-1931 | : జననం |
| 1940 (సుమారు) | : స్వామి ఓంకార్ చెంతకు వచ్చి చేరారు. (తోటపల్లి కొండలు) |
| 1950 | : పూజ్యశ్రీ స్వామి శివానందవారి దర్శనము |
| 1955(సుమారు) | : పూజ్యశ్రీ మలయాలస్వామివారి దర్శనం-ఏర్పేడు ఆశ్రమంలో |
| 1951-1957 | : స్వామి ఓంకార్ కైలాసగిరిలో ఏకాంతంగా మౌనములో వున్నప్పుడు ఆయనకు విశేష సేవలందిస్తూ, ఆయనతో పాటు ధ్యానంచేస్తూ, ఆశ్రమ నిర్వహణ పాత్రకూడ వహించారు. |
| 15-03-1968 | : బీహారు రాణిపత్రలో పూజ్యశ్రీ వినోబాభావేజీ, తర్వాత ఢిల్లీలో శ్రీ వి.వి.గిరి గారిని, శ్రీ మర్రి చెన్నారెడ్డిగారిని, దర్శించారు.(పూజ్యశ్రీ రామానంద తీర్థులవారి సహకారంతో) |
| 1970 | : బొబ్బిలియాత్ర - చారిత్రాత్మకమైన బొబ్బిలి రాజమహల్‌లో రాజవంశస్థులతో |
| 10-06-1982 | : ఆశ్రమ ఆధ్యాత్మిక అధిపతిగా బాధ్యతను స్వీకరించిరి. అనేక స్మారక చిహ్నాములకు, నూతన కట్టడాలకు నాంది పలికారు. |
| 07-12-1989 | : దక్షిణాఫ్రికా యాత్ర |
| 02-10-1990 | : హిమాలయ యాత్ర |
| 13-10-1990 | : షష్ఠిపూర్తి మహోత్సవము |
| 09-05-1991 | : పూజ్యశ్రీ సత్యసాయిబాబా వారి దర్శనము (వైట్‌ఫీల్డ్, బెంగుళూరులో) |
| 19-10-1991 | : పవిత్ర హిమాలయాలలో మండల నివాసం (కొడియాలా, ఋషికేష్‌కు 38 కి.మీ.దూరం) |
| 09-07-1998 | : గురుపూర్ణిమ సందర్భంగా భక్తులకు మంత్రోపదేశం |
| 21-01-2000 | : విశ్వశాంతి క్షేత్రం, కైలాసగిరి ప్రారంభోత్సవం |
| 13-10-2000 | : "పూజ్యమాతాజీ జన్మదినం కప్" వాలీబాల్ టోర్నమెంట్, విశ్వశాంతి విద్యాలయం, కోటగిరిలో ప్రారంభం. |
| 19-09-2001 | : మారిషస్ యాత్ర |
| 10-09-2004 | : కెనడా యాత్ర |
| 23-09-2005 | : పూజ్యశ్రీ దాది జానకి, (బ్రహ్మకుమారీ, మౌంట్‌అబూ) వారి దర్శన వాన్‌కోవర్, కెనడా |
| 13-10-2005 | : అమృతోత్సవాలు |
| 13-10-2010 | : సహస్ర చంద్రదర్శనము |
| 21-01-2016 | : వీరి ఆధ్వర్యంలో శ్రీశాంతిఆశ్రమ శతాబ్ధిఉత్సవాలు ప్రారంభం. |




**విశ్వశాంతి విద్యాలయం - కోటగిరి**

**విశ్వరూప సందర్శన సారమేమి ?**

అంతయు మనమే చేయుచుంటిమను అహంభావముగల మానవులకు గుణపాఠ ముగా అంతయు భగవంతుడే చేయుచుండెను, మనము ఆయన చేతిలో పనిముట్లము, కేవలము కీలు బొమ్మలము మాత్రమే, అను సత్యమును మనము సదా దృష్టిలో నుంచుకొనగల్గిన యెడల ఇక గర్వాహంకారములకు తావెక్కడుండును? గీతలో స్పష్ట ముగ అసూయ లేనివారికే పాపములు లేనివారికే ఈపవిత్రబోధ అర్థమగునని చెప్పబడి నది. అందుచేతనే ప్రతివారు గీతను చదువలేరు. చదివినను అర్థము చేసుకొనలేరు. అర్థము చేసికొనినను ఆచరణలో పెట్టడం కష్టం.

మనుష్యానాం సహస్రేషు కశ్చిద్యతతిసిద్ధయే
యత తామసి సిద్ధానాం కశ్చిన్మాం వేత్తి తత్త్వతః భ.గీ. 7-3

వేలకొలది మనుష్యులలో ఎవడో ఒకడు మాత్రమే నన్ను గూర్చి తెలిసికొనుటకు ప్రయత్నించును. అట్లు ప్రయత్నించిన వారిలో గూడ ఒకానొకడు మాత్రమే మత్పరాయణుడై నా తత్త్వమును అనగా నా యదార్థ స్వరూపమును ఎరుంగును.



**నిర్వాణ మందిరం ముందు మాతాజీ**

ప్రవక్తల పుట్టుకవల్లనే ఈ ప్రపంచములోని మతము లన్నియ ఉద్భవించినవి. పవిత్ర భారతదేశములో హిందూ మతమని పిలువబడుచున్నది, నిజముగ ఇది మతము గాదు, అతి పవిత్రమైన సనాతన ధర్మము. ఈ ధర్మమునకుపుట్టుక, ప్రారంభం లేదు. చావు, అంత్యము కూడ లేదు. శాశ్వతమైన పవిత్ర ధర్మమని బాగా తెలుసు కొని దీని ననుష్టించుటకు ప్రజలెల్లరు ముఖ్యముగా భారతీయులందరు సదా ప్రయత్నించ వలసి యున్నది.

కాళీయమర్ధనమునకు మంచిఅంతరార్ధమున్నది. కాళీయుడను పాము పడగల పైన నృత్యముచేసి దాని దుష్టవిషమును కక్కించినట్లు మన మనస్సులలో నున్న కామ క్రోధ, లోభ,మోహ,మదమాత్సర్యములను అంతర శత్రువులను తుదముట్ట అణగద్రొక్కాలి బాహ్య శత్రువులను జయించుటకు ఇతరుల సహాయమవసరము. గాని ఆంతర శతృవులను జయించుటకు మనకు ఇతరులెవరూ సహాయం చేయలేరు. మనమే దైవానుగ్రహ మునపేక్షించి నిరంతర సాధనచేసి ముఖ్యముగ శ్రీస్వామీజీ నిరంతరము శలవిచ్చుచున్నట్లు నిరంతర భగవజ్ఞప్తితో తైలధారవలె భగవన్నామ జపము చేయుటకలవాటు చేసికొనినచో మనస్సు పరిశుద్ధమై, ఈ ఆంతర శతృవులు మనలో నిలుచుటకు తావుండదు.కామ క్రోధాలను జయించిన మానవుడు చేయజాలని దేముండును.

## శాంతి ఆశ్రమ ప్రచురణలు

| | | |
|---|---|---|
| 1. | శాంతి ప్రదాత శ్రీస్వామి ఓంకార్ ఆత్మకథ | 100/- |
| 2. | ఓంకార సద్బోధామృతము | 70/- |
| 3. | సోహం | 10/- |
| 4. | ఓం జపం | 10/- |
| 5. | మౌనపు ఘడియలు | 10/- |
| 6. | ప్రేమయే దైవము | 10/- |
| 7. | భగత్సాక్షాత్కారము ఇప్పుడు ఇక్కడే | 10/- |
| 8. | శాంతి దళములు | 10/- |
| 9. | ఆధ్యాత్మిక మెరుపులు | 10/- |
| 10. | సత్సంగ సందేశములు | 50/- |
| 11. | శ్రీమద్భగ్వద్గీత (మూలము-పారాయణ ప్రతి) | 15/- |
| 12. | ఓంకార సూక్తులు | 10/- |
| 13. | ఓంకార స్తోత్ర కదంబం | 10/- |
| 14. | శాంతి సూక్తులు | 10/- |
| 15. | శాంతి ప్రార్ధన | 15/- |
| 16. | శ్రీశాంతి స్తోత్రమాల | 25/- |
| 17. | స్వామి ఓంకార్ ఆత్మదర్శిని | 20/- |
| 18. | సందేశ తరంగిణి | 20/- |
| 19. | నా చెల్లి పునర్జన్మ | 10/- |
| 20. | నేను ఆంగ్లము ఎలా నేర్చుకొన్నాను | 10/- |
| 21. | శ్రీ శ్రీ శ్రీ ఓంకారస్వామి స్తోత్రము | 15/- |
| 22. | శాంతి దూత స్వామి ఓంకార్ | 25/- |
| 23. | స్వామి ఓంకార్ జీవిత విశేషాలు | 10/- |
| 24. | శ్రీ శాంతి ఆశ్రమ చరిత్ర | ........... |
| 25. | శ్రీ శాంతి ఆశ్రమ పాఠశాల ప్రార్థనలు | ........... |
| 26. | ధ్యానము | 30/- |
| 27. | పూజ్యశ్రీ జ్ఞానేశ్వరి మాతాజీ వారి దివ్యసందేశములు దేశ విదేశీయ పర్యటనలు | 50/- |
| 28. | ప్రార్థనలు - ధ్యానములు | 15/- |

| | | |
|---|---|---|
| 1. | Auto Biography of Swami Omkar | Under Print |
| 2. | Life and Teachings of Swami Omkar | Rs. 10/- |
| 3. | Soham | Rs. 10/- |
| 4. | Cosmic Fast | Rs. 20/- |
| 5. | Meditation of Swami Omkar | Rs. 10/- |
| 6. | Om Japa | Rs. 10/- |
| 7. | Control of Mind | Rs. 10/- |
| 8. | Cosmic Flashes | Rs. 30/- |
| 9. | In the Hours of Silence | Rs. 10/- |
| 10. | The Soul of Omkar | Rs. 20/- |
| 11. | How I Learned English | Rs. 10/- |
| 12. | Reincarnation of my Little Sister | Rs. 10/- |
| 13. | God Realization now and here | Rs. 10/- |
| 14. | Mystic prayers and poems | Rs. 15/- |

## శ్రీ శాంతి ఆశ్రమము - ఆశ్రమ శాఖల చిరునామాలు

పూజ్యశ్రీ ఓంకార స్వాములవారు తరుణ ప్రాయముననే సన్యసించి చాలా సంవత్సరములు హిమాలయములలో తపమాచరించి తపఃసిద్ధులై ఆంధ్రదేశ మునకు తిరిగివచ్చి, తూర్పుగోదావరిజిల్లా, ప్రత్తిపాడు మండలము నందు తోటపల్లి కొండల మధ్యనున్న రమణీయమైన అరణ్యములో కొంత కాలము తపమాచరించిన పిమ్మట దైవప్రేరణచే 1917వ సంవత్స రంలో శాంతి ఆశ్రమమును స్థాపించిరి.

ఆనాటి నుండియు ఆశ్రమము దినదిన ప్రవర్ధమానమగుచు నేటికి సువిశాలమైన (100 ఎకరములు) ఫల, పుష్ప, వృక్ష సముదాయములతో నేత్రానంద కరమై యొప్పుచు, అనేకమంది నిరాశ్రయులకు, అనాథ బాలబాలిక లకు ఆశ్రయమై నిరంతరము అన్న, వస్త్ర, విద్య, వైద్యదానము లొనర్చుచు శాంతికాముకులకు, దైవపిపాసులకు ప్రశాంతి నిలయముగా అలరారు చున్నది. పూజ్యశ్రీ స్వామీజీ పవిత్రాశీస్సులతో “పీస్”, “శాంతి” పత్రికల ద్వారా ఆధ్యాత్మిక సందేశములు అందించుచున్నది.

సర్వమత సామరస్యము, దీనజనోద్ధరణ, నిస్వార్థ, ప్రేమయుత సేవా జీవితము, ఆశ్రమము చూడవచ్చిన వారిని దైవోన్ముఖముగా జేయుట-శ్రీ స్వామీజీ జీవిత ధ్యేయము. జాతి,మత,కుల,వివక్ష లేక సర్వులకు జ్ఞానగృహ ముగా నిరంతరాశ్రయమిచ్చుటే శ్రీ శాంతి ఆశ్రమ లక్ష్యము.

ఈ మాతృ ఆశ్రమము, వివిధరీతుల అభివృద్ధి నొందుటయే గాక వాల్తేరు కాకినాడ, పిఠాపురం (ఆం.ప్ర) కోటగిరి (తమిళనాడు) మొదలగు అనేక తావులలో ఈ ఆశ్రమశాఖలు అభివృద్ధి చెందుతూ ఆయా ప్రాంతపు భక్తుల ఆధ్యాత్మికాభివృద్ధికి తోడ్పడుచున్నది. దేశ విదేశములందలి శాంతి కోరు భక్తులందరు మాతృ ఆశ్రమ శాఖలను దర్శించుచు, శాంతిని బడసి వెళ్ళు చుండిరి. ఇంతకుముందు దర్శించని భక్తులకు, ఆశ్రమమునకు, దైవసన్ని ధికి హృదయ పూర్వక సుస్వాగతము.

**1.మాతృ ఆశ్రమం : శాంతి ఆశ్రమము**

తోటపల్లి కొండలు, వయా శంఖవరం పిన్ : 533 446;
తూ॥గో॥జిల్లా. ఫోన్ : 7382009962

**2. విశాఖపట్నంశాఖ :**

లాసన్స్‌బే , పెద్దవాల్తేరు-530 017 - విశాఖపట్నం
ఫోన్ : 0891-2538689

**3. విశ్వశాంతి క్షేత్రం :**

కైలాసగిరి, విశాఖపట్నం.

**4. కోటగిరి శాఖ :**

Peace Centre, Darmona Rd, KOTAGIRI - 643217
Nilagiri Dist., Tamil Nadu
Ph : 04266-271945

**5. కాకినాడ శాఖ :**

శాంతిఆశ్రమము, అశోక్‌నగర్, కాకినాడ-533 004. తూ॥గో॥జిల్లా

**6. పిఠాపురం శాఖ :**

స్టువార్టుపేట, పిఠాపురం-533 450



